బుధవారం 27-12-2023

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 276



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



'ఖేల్‌రత్న.. అర్జున' వెనక్కి..

భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రకటన - 14లో




లాభాల్లో మార్కెట్లు

21,450 పాయింట్ల చేరువలో నిఫ్టీ

సెన్సెక్స్ లాభం 230 పాయింట్లు - 15లో

SIMULTANEOUSLY PRINTED AT VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL



జనవరి 1న ఎక్స్‌పోశాట్

జంట కృష్ణబిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల రహస్యాలు కనుగొనే లక్ష్యంతో ఇస్రో జనవరి 1న 'ఎక్స్‌పోశాట్'ను ప్రయోగించనుంది.

వివరాలు 6లో ▸



కశ్మీర్‌కూ గాజా గతే

కశ్మీర్‌పై భారత్, పాక్ చర్చించాలని.. లేదంటే కశ్మీర్‌కూ గాజా గతే పడుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ నేత ఫరూక్ అబ్దుల్లా అన్నారు.

వివరాలు 6లో ▸



పాక్‌లో హిందూ మహిళ పోటీ

పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా హిందూ మహిళ (సవీరా పర్కాశ్) పోటీ చేస్తున్నారు.

వివరాలు 6లో ▸



A టు Z... 2023

కరువులు.. కల్లోలాలు.. కష్టాలు.. కన్నీళ్లు.. ప్రపంచానికి 2023 మిగిల్చిన గుర్తులివే! ఆయా సంఘటనలపై విహంగ వీక్షణం..

వివరాలు 6లో ▸

మెగా టోర్నీ మొదలైంది

ఆటలతో ఆరోగ్యం.. ఆణిముత్యాలు వెలికితీస్తాం

గ్రామీణ యువ క్రీడాకారుల ప్రతిభకు సానపట్టి దేశానికి అందిస్తాం: సీఎం జగన్

- ప్రతి ఒక్కరికీ వ్యాయామం ఎంత అవసరమో అవగాహన కల్పిస్తాం
- ఇక ప్రతి సంవత్సరం 'ఆడుదాం.. ఆంధ్రా' టోర్నీ
- టాలెంట్ హంట్‌లో అందరూ భాగస్వాములే.. 47 రోజుల పాటు 5 దశల్లో క్రీడాపోటీల నిర్వహణ
- దేశ చరిత్రలోనే ఇది మైలురాయి
- మెగా టోర్నీని గుంటూరులో ప్రారంభించిన ముఖ్యమంత్రి



గుంటూరు జిల్లా నల్లపాడులో క్రీడా జ్యోతిని వెలిగించి 'ఆడుదాం ఆంధ్రా'ను ప్రారంభిస్తున్న సీఎం జగన్. చిత్రంలో మంత్రి రోజా, బ్యాడ్మింటన్ ప్లేయర్ కిదాంబి శ్రీకాంత్ తదితరులు

సాక్షి ప్రతినిధి, గుంటూరు: 'ఆడుదాం ఆంధ్రా' ఆటల పోటీల ద్వారా గ్రామీణ ఆణిముత్యాలను వెలికి తీసి సానపట్టి వజ్రాలుగా మార్చి దేశానికి అందిస్తామని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. దేశంలోనే అతిపెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా'ను మంగళవారం గుంటూరు జిల్లా నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో సీఎం జగన్ లాంఛనంగా ప్రారంభించారు. క్రీడాకారులకు కిట్లను పంపిణీ చేశారు. ఇవాళ మొదలవుతున్న ఈ క్రీడా సంబరాలు దేశ చరిత్రలోనే మైలురాయిగా నిలుస్తాయని, 47 రోజుల పాటు ఫిబ్రవరి 10వతేదీ దాకా ఊరూరా పండుగ వాతావరణంలో వీటిని నిర్వహిస్తామని చెప్పారు. అందరూ పాల్గొనే ఒక గొప్ప పండుగగా ఇది చరిత్రలో నిలుస్తుందన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

రెండు ప్రధాన లక్ష్యాలు..

'ఆడుదాం.. ఆంధ్రా' కార్యక్రమం వెనుక ప్రభుత్వానికి రెండు ప్రధాన ఉద్దేశాలున్నాయి. ఒకటి.. గ్రామ స్థాయిలోని ఆణిముత్యాలను వెలికితీసి ప్రపంచానికి పరిచయం చేయడం. రెండోది.. వ్యాయామం, క్రీడల వల్ల అనారోగ్య సమస్యలను దూరం చేయవచ్చు. ఇవి రెండూ సాధించే దిశగా రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. వ్యాయామం, క్రీడల వల్ల ప్రతి మనిషికి ఆరోగ్యపరంగా

మిగతా 10వ పేజీలో ▶

వేడుకగా 'ఆట'

- ప్రారంభించిన సీఎం జగన్
- కొద్దిసేపు క్రికెట్ బ్యాటింగ్
- క్రీడాకారులకు కిట్లు పంపిణీ

సంబరంలా.. 'ఆడుదాం ఆంధ్రా'

- రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటిన క్రీడాకారుల ఉత్సాహం

10 లో

ఫ్యాక్ట్‌చెక్

వాస్తవాలు దాచిపెట్టి ట్యాబ్‌లపై విష ప్రచారం

- ఆన్‌లైన్‌లో కంటే ఎక్కువ ధరకు కొన్నారంటూ దుష్ప్రచారం
- రెండేళ్లలో ట్యాబ్‌ల కొనుగోలుకు చేసిన ఖర్చు రూ.1,305.74 కోట్లు
- కానీ.. రూ.2,500 కోట్ల అక్రమాలు అంటూ తప్పుడు ప్రచారం
- ఆరోపణలను ఖండించిన పాఠశాల విద్యాశాఖ

11 లో

'ఫ్యూచర్ స్కిల్స్'లో ఏపీకి అగ్రాసనం

- ఇంటర్న్‌షిప్‌పై ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థుల్లోనూ ఏపీదే అగ్రస్థానం
- స్పష్టం చేసిన 'ఇండియా స్కిల్స్ రిపోర్టు-2024'
- ఆంధ్రప్రదేశ్‌ను 'గొప్ప టాలెంట్ రిజర్వాయర్'గా అభివర్ణించిన నివేదిక

12 లో

నెల్లూరు జిల్లా నార్తురాజుపాలెంలో జరిగిన సాధికార సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



కోవూరులో సాధికార ప్రదర్శన

నెల్లూరు జిల్లా నార్తురాజుపాలేనికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర

బ్రహ్మరథం పట్టిన ప్రజలు.. జై జగన్ నినాదాలతో హోరెత్తిన రాజుపాలెం

2 లో

సమ్మె విరమించండి

బెదిరించడం లేదు.. అభ్యర్థిస్తున్నాం

ప్రభుత్వం సానుకూలంగా ఉంది

- అంగన్‌వాడీల 11 డిమాండ్లలో ప్రభుత్వం పది పరిష్కరించింది
- వాటి జీవోలు కూడా వచ్చాయి
- వేతనాల పెంపు ఒక్కటే మిగిలింది
- సంక్రాంతి తర్వాత దానిపైనా సానుకూల నిర్ణయం
- 5 నుంచి బాలింతలకు కిట్లు ఇవ్వాలి.. సహకరించండి
- సంక్రాంతి తర్వాత మరోసారి చర్చిస్తాం.. అంగన్‌వాడీ యూనియన్ నేతలతో ప్రభుత్వ బృందం

11 లో

వలంటీర్ల సమ్మె అవాస్తవం

- సమ్మె ప్రచారాన్ని ఖండించిన వలంటీర్ల సంఘాలు
- నిన్నటి దాకా వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులతో పోల్చుతూ ప్రతిపక్షాలు, పచ్చ మీడియా విషప్రచారం
- ఇప్పుడు ఆ వలంటీర్లలో కొందరినైనా చీల్చి రెచ్చగొట్టేందుకు నానాపాట్లు
- ఇదంతా పచ్చబ్యాచ్ కుట్రేనంటున్న వలంటీర్లు

2 లో

ఇవిగో నవరత్నాల వెలుగులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బతుకుపై ఆశ పెంచిన పింఛన్



నాకు నలుగురు సంతానం. ఒక అబ్బాయి. ముగ్గురు అమ్మాయిలు. అందరికీ వివాహం చేశాం. ఆడపిల్లలంతా వేరేగా కాపురం ఉంటున్నారు. నా బాగోగులన్నీ చూస్తున్నది కొడుకు హేమనాథ్‌రావు, అతని భార్య దేవి. మాది శ్రీకాకుళం 50వ డివిజన్‌లోని బైరివానిపేట గ్రామం. నా భర్త చనిపోయాక కొన్నేళ్లపాటు వితంతు పెన్షన్ వచ్చింది. అప్పటికే నాకు కిడ్నీ వ్యాధి సోకింది. మందులు, ఇతరత్రా ఖర్చులకు వచ్చే పెన్షన్ సరిపోయేది కాదు. ఆర్థికంగా చాలా ఇబ్బంది పడేదాన్ని. నా కొడుకు కార్పెంటర్‌గా పనిచేస్తూ వచ్చిన డబ్బుల్లోంచి కూడా మందులకు ఖర్చు చేసేవాడు. డయాలసిస్ చేయించుకోవడానికి చాలా ఇబ్బంది పడేవాళ్లం. 2019లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా బాధ్యతలు తీసుకున్నాక నాకు రూ.10,000 పెన్షన్ మంజూరైంది. ఈ పెన్షన్ నాకు ధైర్యాన్ని ఇవ్వడమే కాదు. బతుకుపై ఆశను కూడా కల్పించింది. ఒక్కోసారి తీవ్ర స్థాయిలో అనారోగ్యానికి గురైతే చేతిలో చిల్లిగవ్వ లేకపోయినప్పటికీ 108 అంబులెన్స్‌లో మాకు నచ్చిన ఆస్పత్రికి తీసుకెళ్లే వెసులుబాటు కూడా ప్రభుత్వం కల్పించింది. ఆరోగ్యశ్రీ ద్వారా మాకు దగ్గర్లో గల కిమ్స్ ఆస్పత్రిలో వారానికి రెండుసార్లు, నెలకు పదిసార్లు డయాలసిస్ చేయించుకుంటున్నాను. ఇప్పుడు ఆరోగ్య పరిస్థితి బాగుంది.

– ఆర్.గన్నమ్మ, బైరివానిపేట, శ్రీకాకుళం
(రాకోటి జగదీష్, విలేకరి, శ్రీకాకుళం రూరల్)

మేం నిలదొక్కుకున్నాం



మాది సాధారణ మధ్యతరగతి కుటుంబం. నా భర్త శ్రీనివాసులు పురుగు మందుల కంపెనీలో పని చేస్తున్నారు. ఆయన కొచ్చే వేతనం మా జీవనానికే సరిపోవడం లేదు. ఇక పిల్లల చదువులు, ఇతర అవసరాలు ఎలా తీర్చాలో తెలియక సతమతమయ్యే వాళ్లం. ఇదే తరుణంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. మాకు వివిధ రకాలుగా ఆర్థిక సాయం అందడంతో ఇప్పుడు మా బతుకు మారింది. నాకు వైఎస్సార్ చేయూత ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున అందుతోంది. గతంలో తీసుకున్న డ్వాక్రా రుణాన్ని ఈ ప్రభుత్వం మాఫీ చేయడంతో వైఎస్సార్ ఆసరా కింద కొంత మొత్తం నా ఖాతాలో జమ అయింది. ఆ మొత్తంతో నెల్లూరు జిల్లా పొదలకూరు మండలం ఇనుకుర్తి గ్రామంలో ఇంటి వద్ద చీరల అమ్మకాన్ని ప్రారంభించా. ఆదాయం అంతంత మాత్రమే వస్తుండడంతో పొదుపు సంఘం ద్వారా ఉమెన్ లెడ్ ఎంటర్‌ప్రైజెస్ కింద పొదలకూరు కెనరా బ్యాంకులో రూ.2.30 లక్షలు లింకేజీ రుణం తీసుకున్నా. ఆ నగదుతో వ్యాపారాన్ని మరింతగా పెంచి అదనపు ఆదాయం పొందుతున్నా. మా పెద్దబ్బాయికి అమ్మ ఒడి పథకం కింద రూ.15 వేల వంతున మూడేళ్లుగా నా ఖాతాలో జమ అవుతోంది. ఇప్పుడు పిల్లలను బాగా చదివించుకుంటున్నాం. వ్యాపారం బాగా సాగితే నెలకు రూ.15 వేల వరకు ఆదాయం వస్తోంది. బ్యాంకు రుణం సులభంగా తీర్చేస్తున్నా. ఈ ప్రభుత్వ ప్రోత్సాహం వల్లే మేము జీవితంలో నిలదొక్కుకోగలిగాం.

– జి.లక్ష్మీదుర్గ, పొదలకూరు, నెల్లూరు జిల్లా
(కె.మధుసూదన్, విలేకరి, పొదలకూరు)

నాడు బీడు.. నేడు కళకళ



మాకు అనకాపల్లి జిల్లా రోలుగుంట మండలం కొమరవోలు గ్రామంలో రెండున్నర ఎకరాల భూమి ఉంది. దానికి సరైన నీటి సదుపాయం లేకపోవడం వల్ల పంటలు దైవాధీనంగా మారాయి. జలయజ్ఞం కొనసాగింపుగా ఈ ప్రభుత్వం ప్రవేశపెట్టిన జలకళ పథకం కింద ఉచితంగా రిగ్గు వేసేందుకు మా మండలంలో 31 మందిని ఎంపిక చేశారు. అందులో నేనూ ఒకడిని. మూడేళ్ల క్రితం నా భూమిలో లక్ష రూపాయల ఖర్చుతో బోరు రిగ్గు పనులు చేశారు. మరో లక్ష రూపాయల వ్యయంతో విద్యుత్ లైను ఏర్పాటు చేశారు. రూ.30 వేల విలువ గల మోటారు సమకూర్చారు. ఒకప్పుడు బీడుగా ఉన్న మా భూమి పరిస్థితి ఇప్పుడు మారిపోయింది. పూటుగా సాగునీరు అందడంతో రెండున్నర ఎకరాల్లో జీడి మొక్కలు వేశాను. ఇప్పుడు అక్కడ పచ్చదనం సంతరించుకుంది. హైబ్రీడు మొక్కలు కావడంతో మరో రెండేళ్లలో పంట చేతికి వస్తుంది. నాకు ఇద్దరు పిల్లలు. అమ్మాయికి వివాహం చేశాను. అబ్బాయి లారీ డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అతనికి పెళ్లి చేయాల్సి ఉంది. మాకు సొంత ఇల్లు ఉంది. మేమంతా సంతోషంగా ఉన్నాం.

– బీమారపు అప్పలనాయుడు, కొమరవోలు
(బి.ఎ.ఆనందం, విలేకరి, రోలుగుంట)

కోవూరులో బడుగుల 'సాధికార' ప్రదర్శన




సభలో మాట్లాడుతున్న సినీ నటుడు, ఎలక్ట్రానిక్ మీడియా సలహాదారు అలీ, నెల్లూరు జిల్లా నార్తు రాజుపాళెంలో సామాజిక సాధికార బస్సు యాత్ర సభకు భారీగా హాజరైన జనసందోహంలో ఒక భాగం

రాజుపాళేనికి తరలివచ్చిన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు

- ఘనంగా వైఎస్సార్‌సీపీ సామాజిక సాధికార బస్సు యాత్ర
- వీధివీధిలో ఘనస్వాగతం పలికిన ప్రజలు
- జై జగన్ నినాదాలతో హోరెత్తిన రాజుపాళెం

సాక్షి ప్రతినిధి, నెల్లూరు: శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా కోవూరు నియోజకవర్గం నలుమూలల నుంచి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ కుటుంబాలన్నీ నార్తురాజుపాళేనికి కదలి వచ్చాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అందించిన చేయూతతో తాము సాధించిన సాధికారతను ప్రదర్శించాయి. మంగళవారం వైఎస్సార్‌సీపీ రాజుపాళెంలో నిర్వహించిన సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేశాయి. వారికి రాజుపాళెంలో వీధివీధినా ఘనస్వాగతం లభించింది. జై జగన్ నినాదాలతో రాజుపాళెం హోరెత్తింది. యాత్ర అనంతరం జరిగిన బహిరంగ సభలో వేలాదిగా ప్రజలు పాల్గొన్నారు. పలువురు నేతలు రాష్ట్రానికి సీఎం వైఎస్ జగన్ చేస్తున్న మేలును, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అగ్రపథంలో నిలుపుతున్న తీరును వివరించారు. నేతలు సీఎం జగన్ పేరు పలికిన ప్రతిసారీ ప్రజలు పెద్ద ఎత్తున హర్షధ్వానాలు చేశారు.

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను అగ్రస్థానంలో నిలిపిన సీఎం జగన్: డిప్యూటీ సీఎం రాజన్నదొర

రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమాన్ని అందిస్తున్నారని డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర చెప్పారు. లంచాలు, రికమెండేషన్లు లేకుండా నేరుగా మన ఖాతాల్లోకి పథకాల డబ్బు జమ చేస్తున్నారని, ఇంతటి పారదర్శకమైన ప్రభుత్వం దేశంలో మరొకటి లేదని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా అగ్రస్థానంలో నిలుపుతూ ఆ వర్గాలు సాధికారత సాధించేందుకు దోహదపడిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అని చెప్పారు. చంద్రబాబు ప్రభుత్వంలో గిరిజనులకు ఒక్క మంత్రి పదవీ ఇవ్వలేదని, సీఎం జగన్ ఇద్దరికి మంత్రి పదవులే కాదు, ఉప ముఖ్యమంత్రి పదవీ ఇచ్చారన్నారు. సీఎం జగన్ 2 లక్షల మంది గిరిజనులకు 3 లక్షల ఎకరాలకుపైగా భూమి ఇచ్చారని వివరించారు. పోడు భూములకు రైతు భరోసా అమలు చేసి 3.45 లక్షల మంది రైతులకు అందిస్తున్నారన్నారు.

జగనన్నతోనే సామాజిక విప్లవం: మంత్రి మేరుగు నాగార్జున

సామాజిక విప్లవం దేశంలో ఒక్క సీఎం వైఎస్ జగన్‌తోనే సాధ్యమైందని మంత్రి మేరుగు నాగార్జున తెలిపారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కుటుంబాలు బాగుండాలని, మిగిలిన వారితో సమానంగా బతకాలనే ఉద్దేశంతో సీఎం జగన్ అనేక పథకాలు ప్రవేశ పెట్టారని తెలిపారు. పేద పిల్లలు ఉన్నత శిఖరాలకు వెళ్లాలని ఇంగ్లిష్ మీడియం తెచ్చారన్నారు. పేదవాళ్ల పిల్లలు బాగు పడటం ఇష్టం లేని చంద్రబాబు కోర్టుకెళ్లాడన్నారు. రామోజీరావు మనవళ్లు, రాధాకృష్ణ చుట్టాలు ఇంగ్లిష్ మీడియం చదవొచ్చు కానీ, ఎస్సీ, ఎస్టీల పిల్లలు చదవొద్దన్నది వారి భావమన్నారు. సీఎం జగన్ 31 లక్షలమంది పేదలకు ఇంటి పట్టాలిచ్చి, ఇళ్లు కట్టిస్తున్నారని తెలిపారు. 4 లక్షల మందికి ఉద్యోగాలిచ్చారని, వారిలో 80 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలేనని అన్నారు.

జగనన్న పేదోడి కడుపు చూస్తారు: సినీ నటుడు అలీ

సీఎం జగన్ ప్యాలెస్‌లో ఉన్నా పేదవాడి కడుపు చూస్తారని సినీ నటుడు అలీ చెప్పారు. అందుకే ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల కోసం అనేక పథకాలు తీసుకొచ్చారని అన్నారు. మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిలో డబ్బున్న వ్యక్తి ఒక బెడ్డుపై పడుకుంటే పక్క బెడ్డుపై పడుకొని పేదవాడు కూడా ఆపరేషన్ చేయించుకుంటున్నాడని, ఇది సీఎం జగన్ వల్లే సాధ్యపడిందని చెప్పారు. 2024లో జగనన్న వన్స్‌మోర్ అంటూ మనమంతా వైఎస్సార్‌సీపీకి ఓటు వేయాలని పిలుపునిచ్చారు.

బడుగు బలహీన వర్గాల ఆత్మగౌరవం పెంచారు: ఎమ్మెల్యే అనిల్ కుమార్


రాష్ట్రంలో బీసీలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనార్టీలను గుండెల్లో పెట్టుకున్న సీఎం వైఎస్ జగన్ అని ఎమ్మెల్యే అనిల్‌కుమార్ యాదవ్ అన్నారు. సీఎం జగన్ బడుగు, బలహీన వర్గాల ఆత్మగౌరవం పెంచారని తెలిపారు. జగన్ సీఎం అయ్యాక నేరుగా వలంటీర్లనే ఇంటికి పంపి మనకు కావల్సినవన్నీ అందిస్తున్నారని తెలిపారు. టీడీపీ వస్తే వలంటీర్లను పీకేస్తామని లోకేశ్, చంద్రబాబు చెబుతున్నారని, ఇలాంటి వారు మనకు అవసరంలేదని చెప్పారు.

కోవూరు అభివృద్ధికి సీఎం జగన్ కృషి : ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి

కోవూరు నియోజకవర్గం అభివృద్ధికి సీఎం జగన్ ఎంతగానో కృషి చేశారని ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్నకుమార్ రెడ్డి చెప్పారు. 1.28 లక్షల కుటుంబాలకు రూ.981 కోట్లు నేరుగా ఖాతాల్లో వేశారన్నారు. నాన్ డీబీటీ ద్వారా రూ.394 కోట్లు ఖర్చు చేశారని తెలిపారు. ఇంతటి సంక్షేమం ఇప్పటివరకు ఏ ముఖ్యమంత్రీ అందించలేదని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య, ఎమ్మెల్సీ పోతుల సునీత తదితరులు పాల్గొన్నారు.

ఏపీ బాటలో కర్ణాటక

- తమ విద్యార్థులకు కూడా పిక్టోరియల్ డిక్షనరీలు ఇచ్చేందుకు కర్ణాటక ప్రభుత్వం నిర్ణయం
- ఏపీ ఎస్సీఈఆర్టీ సహకారంతో డిక్షనరీల రూపకల్పన
- కర్ణాటక అధికారులను ఆకర్షించిన ఏపీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ఇంగ్లిష్ నైపుణ్యం

ఏపీ ప్రభుత్వం విద్యార్థులకు అందజేసిన పిక్టోరియల్ డిక్షనరీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల్లో ఇంగ్లిష్ భాషా సామర్థ్యాన్ని మెరుగుపరిచేందుకు వైఎస్ జగన్ సర్కార్ ప్రవేశపెట్టిన పిక్టోరియల్(బొమ్మలతో కూడిన) డిక్షనరీల విధానాన్ని కర్ణాటక ప్రభుత్వం కూడా అమలు చేయబోతోంది. ఏపీ ప్రభుత్వ స్కూళ్ల విద్యార్థుల ఇంగ్లిష్ నైపుణ్యాన్ని పరిశీలించిన కర్ణాటక రాష్ట్ర అధికారులు తమ విద్యార్థులకు కూడా ఇదే తరహా డిక్షనరీలు ఇవ్వాలని నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ స్టేట్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్(ఏపీ ఎస్సీఈఆర్టీ) సాయంతో కన్నడ-ఇంగ్లిష్ భాషల్లో డిక్షనరీల తయారీని చేపట్టింది. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఈ డిక్షనరీలను తమ విద్యార్థులకు అందించాలని భావిస్తోంది.

పాఠాల్లోని పదాలతోనే డిక్షనరీ..

ఏపీలోని ప్రభుత్వ స్కూళ్లల్లో ఇంగ్లిష్ మీడియం అమలుతో పాటు ప్రాథమిక స్థాయి విద్యార్థుల కోసం ఎస్సీఈఆర్టీ ఇంగ్లిష్-తెలుగు పిక్టోరియల్ డిక్షనరీని రూపొందించింది. 2021-22లో జగనన్న విద్యా కానుకలో భాగంగా ఒకటి నుంచి 5వ తరగతి వరకు చదువుతున్న 23,72,560 మంది విద్యార్థులకు ఈ డిక్షనరీలను ప్రభుత్వం అందించింది. అలాగే 2022-23లో ఒకటో తరగతిలో 3,55,280 మందికి, ఈ ఏడాది కేవీకే-4లో 3,08,676 మందికి కలిపి మొత్తం 30,36,516 డిక్షనరీలను ప్రభుత్వం పంపిణీ చేసింది. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు ఉన్న పాఠాల ఆధారంగానే ఏపీ ఎస్సీఈఆర్టీ రంగురంగుల బొమ్మలతో పిక్టోరియల్ డిక్షనరీని రూపొందించింది. దీంతో పాటు 'లెర్న్ ఏ వర్డ్' పేరుతో విద్యార్థులకు కొత్త ఇంగ్లిష్ పదాలు నేర్పేలా చర్యలు తీసుకుంది. వాటిని ఎలా పలకాలో, ఎప్పుడు వాడాలో కూడా ఉపాధ్యాయులు శిక్షణ ఇస్తున్నారు. ఈ విధానం కర్ణాటక అధికారులను ఆకర్షించింది. దీంతో వారు కూడా ఏపీఎస్సీఈఆర్టీ సహకారంతో తమ రాష్ట్రంలో కూడా పిక్టోరియల్ డిక్షనరీ రూపకల్పనకు చర్యలు చేపట్టారు.

పూర్తి శాస్త్రీయంగా తయారీ



ప్రాథమిక స్థాయి విద్యార్థులు సులభంగా ఇంగ్లిష్ నేర్చుకునేలా తగిన చర్యలు తీసుకున్నాం. ఒకటి నుంచి ఐదు తరగతులకు సంబంధించిన పాఠాల్లోని పదాలతోనే పిక్టోరియల్ డిక్షనరీని ఇంగ్లిష్-తెలుగు భాషల్లో పూర్తి శాస్త్రీయంగా రూపొందించాం. ప్రతిరోజు ఒక పదం నేర్పేలా స్కూళ్లకు ప్రణాళిక ఇచ్చాం. ఈ విధానం కర్ణాటక అధికారులకు నచ్చింది. తమ రాష్ట్రంలో కూడా అమలు చేస్తామన్నారు. డిక్షనరీ రూపకల్పనకు తగిన సహకారం అందిస్తున్నాం.

– డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, ఏపీ ఎస్సీఈఆర్టీ డైరెక్టర్

సత్యదేవుని కార్తీక ఆదాయం రూ.20.60 కోట్లు



అన్నవరం దేవస్థానం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరంలోని శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానానికి గడచిన కార్తీకమాసంలో రూ.20.60 కోట్ల ఆదాయం సమకూరిందని దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ కె.రామచంద్ర మోహన్ మంగళవారం తెలిపారు. 2022 కార్తీకమాసంలో వచ్చిన రూ.19.95 కోట్లతో పోల్చితే ఈసారి సుమారు రూ.65 లక్షలు అధికంగా వచ్చిందని వివరించారు. గడచిన ఐదేళ్లగా కార్తీకంలో వచ్చిన ఆదాయం కన్నా ఈ ఏడాది అధికంగా ఆదాయం వచ్చిందని వారు తెలిపారు. కరోనాకు ముందు 2019 కార్తీకంలో వచ్చిన ఆదాయం రూ.16,24,96,735 కాగా, కరోనా అనంతరం 2021లో రూ.18,95,63,603 వచ్చిందని చెప్పారు. కరోనా ఉధృతి కారణంగా 2020లో రూ.10,86,13,566 మాత్రమే ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఈ ఏడాది కార్తీకంలో అత్యధికంగా స్వామివారి వ్రతాల నిర్వహణ ద్వారా రూ.7.03 కోట్లు, ప్రసాద విక్రయాల ద్వారా 4.39 కోట్లు, హుండీల ద్వారా రూ.2.93 కోట్లు, అంతరాలయ దర్శనం టిక్కెట్ల ద్వారా రూ.67 లక్షలు, గదుల అద్దెల ద్వారా రూ.90 లక్షల చొప్పున ఆదాయం సమకూరిందని వివరించారు.

వలంటీర్ల సమ్మె అవాస్తవం



పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టంలో ఈనాడు ప్రతులను దహనం చేస్తున్న వలంటీర్లు

సమ్మె ప్రచారాన్ని ఖండించిన వలంటీర్ల సంఘాలు

- కొందరినైనా రెచ్చగొట్టి సమ్మెలోకి దించాలన్న విపక్షాల కుట్రలు విఫలం
- నిన్నటి దాకా వలంటీర్లను సంఘవిద్రోహ శక్తులతో పోల్చుతూ ప్రతిపక్షాలు, పచ్చ మీడియా విషప్రచారం
- ఇప్పుడు ఆ వలంటీర్లలో కొందరినైనా చీల్చి ప్రభుత్వానికి వ్యతిరేకంగా రెచ్చగొట్టేందుకు నానాపాట్లు
- వలంటీర్ల సోషల్ మీడియా గ్రూపుల్లో పచ్చబ్యాచ్ దూరి సమ్మెపై పోస్టులు
- ఇదంతా కొన్ని పచ్చబ్యాచ్‌ల కుట్రేనంటున్న వలంటీర్లు
- యథావిధిగా వలంటీర్ల కార్యకలాపాలు : అధికారులు
- పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలో ఈనాడు ప్రతుల దహనం



మాట్లాడుతున్న చిత్తూరు జిల్లా డీఆర్ఓ రాజశేఖర్

సాక్షి, అమరావతి/చిత్తూరు కలెక్టరేట్/పటమట (విజయవాడ తూర్పు)/వీరఘట్టం: నిన్న మొన్నటి దాకా వలంటీర్లను సంఘ విద్రోహశక్తులుగా చిత్రీకరించిన విపక్ష పార్టీలు, వారి అనుకూల పచ్చ మీడియా ఇప్పుడు వలంటీర్లలో కొందరినైనా చీల్చి వారిలో ప్రభుత్వ విద్వేషాన్ని రగిల్చి సమ్మెబాట పట్టించాలన్న కుట్రలు పటాపంచలయ్యాయి. తామెలాంటి సమ్మెలో పాల్గొనడంలేదని వలంటీర్ల సంఘాలు తేల్చిచెప్పాయి. రాష్ట్రంలో మొత్తం 2.60 లక్షల మంది వలంటీర్లు పనిచేస్తుండగా.. ఆయా వలంటీర్లు తమ వృత్తి సంబంధిత అంశాలపై తలెత్తే సందేహాలు నివృత్తి చేసుకునేందుకు జిల్లాల వారీగా లేదా ఎక్కడికక్కడ అనధికారికంగా సోషల్ మీడియా గ్రూపులు ఏర్పాటుచేసుకున్నారు. కొన్నింటిలో ఎవరికి వారే ఆ గ్రూపుల్లో చేరే అవకాశం ఉండడంతో.. వివిధ ప్రతిపక్ష పార్టీల సానుభూతిపరులు కొందరు వలంటీర్ల ముసుగులో ఆ గ్రూపుల్లోకి దూరి వలంటీర్లను రెచ్చగొట్టాలన్న లక్ష్యంతో ప్రభుత్వంపై రెచ్చగొట్టే పోస్టులు పెడుతూ వచ్చారని వలంటీర్లు చెప్పారు. ఆ తర్వాత వీరే ప్రభుత్వం జీతాలు అప్పుడు పెంచబోతోంది, ఇప్పుడు పెంచబోతోందని అంటూ గ్రూపుల్లో అనవసర చర్చ పెట్టి, అనంతరం సమ్మె అంశాన్ని ప్రస్తావించి ప్రభుత్వంపై రెచ్చగొట్టేలా పోస్టులు పెడుతూ వచ్చేవారని వారు చెప్పారు. కానీ, అసలైన వలంటీర్లు వాటిని ఎప్పటికప్పుడు ఖండించడమో లేదంటే వాటిని అసలు పట్టించుకోకపోవడం చేసేవారన్నారు. నిజానికి.. వలంటీర్లకుగానీ, వలంటీర్ల సంఘాల ప్రతినిధులకు గానీ సమ్మె చేయాలని ఎలాంటి ఆలోచన లేకపోయినా ప్రేరేపిత పోస్టులకు స్పందించే ఇద్దరు ముగ్గురు వ్యక్తులతో కలిసి రాష్ట్రవ్యాప్తంగా వలంటీర్లు సమ్మెకు దిగుతున్నారని మిగిలిన వలంటీర్లను రెచ్చగొట్టి వారితో సమ్మె ముసుగులో ఆందోళన చేపట్టేందుకు తెలుగుదేశం సహా మరికొన్ని రాజకీయ పక్షాలు యత్నిస్తున్నాయి.

మేమెలాంటి సమ్మెలో పాల్గొనడంలేదు..

వలంటీర్ల సమ్మె నోటీసులు అంటూ కొన్ని దినపత్రికల్లో, సోషల్ మీడియాలో జరుగుతున్న ప్రచారం పూర్తిగా అవాస్తవం. చిత్తూరు జిల్లాలోని వలంటీర్లు అందరం ఎలాంటి ఆందోళనలను కానీ, సమ్మెలోగానీ పాల్గొనడం లేదు. చిత్తూరు జిల్లా వలంటీర్ల సంఘం తరపున మేమందరం సీఎం ఆదేశాల మేరకు ప్రతి ప్రభుత్వ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నాం. మేం ఎలాంటి సమ్మెలో పాల్గొనడంలేదు.

– చిత్తూరు జిల్లా గ్రామ, వార్డు వలంటీర్ల సంఘం

ఎక్కడా ఎవ్వరూ విధులు బహిష్కరించలేదు..

వలంటీర్ల సమ్మెను గ్రామ, వార్డు సచివాలయాల శాఖ అధికారులు కొట్టిపారేశారు. రాష్ట్రంలో వలంటీర్లు ఎక్కడా విధులు బహిష్కరించినట్లుగానీ, ఆందోళనలు చేపట్టినట్లుగానీ ఎలాంటి సమాచారం లేదని వారు పేర్కొంటున్నారు. ఇక.. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా ప్రారంభమైన 'ఆడుదాం ఆంధ్రా' కార్యక్రమంలో వలంటీర్లు పూర్తిస్థాయిలో పాల్గొన్నారని వారు స్పష్టంచేశారు. మరోవైపు.. సమ్మె ప్రచారంపై చాలాచోట్ల వలంటీర్లు ఆశ్చర్యం వ్యక్తంచేస్తున్నారు. జిల్లాల్లోని వివిధ వలంటీర్ల సంఘాల నాయకులు కూడా సమ్మె ప్రచారాన్ని పూర్తిగా కొట్టిపారేశారు. తాము సమ్మె చేస్తున్నట్లు వస్తున్న వార్తలు పూర్తి సత్యదూరమని విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ వార్డు వలంటీర్ల ప్రతినిధులు బి. మల్లికాదేవీ, బి. రాజకల్పన మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఈనాడులో వచ్చిన వార్త అసత్యమని, తాము పూర్తి చిత్తశుద్ధితో ప్రభుత్వ పథకాలను లబ్ధిదారులకు చేరవేసేందుకు పనిచేస్తున్నామని, ఇలాంటి వార్తలకు తాము ప్రభావితం కాలేమని వారు స్పష్టంచేశారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పట్ల తాము సంతృప్తిగా ఉన్నామని వారు తేల్చిచెప్పారు.

ఈనాడు తప్పుడు రాతలపై వలంటీర్ల ఆగ్రహజ్వాల

సీఎం జగన్ ప్రభుత్వానికి, వలంటీర్లకు మధ్య చిచ్చుపెట్టి చంద్రబాబుకు లబ్ధి చేకూర్చాలన్న దురుద్దేశంతో ఈనాడులో ప్రచురించిన తప్పుడు కథనంపై వలంటీర్లు మండిపడ్డారు. ఆడుదాం-ఆంధ్రా కార్యక్రమానికి వచ్చిన వారు పార్వతీపురం మన్యం జిల్లా వీరఘట్టం మండలంలోని సీపీఎస్ రోడ్డులో మంగళవారం ఈనాడు ప్రతులతో ఆందోళన చేశారు. రామోజీరావు డౌన్‌డౌన్ అంటూ నినదిస్తూ ఈనాడు ప్రతులను దగ్ధంచేశారు. వలంటీర్లు మాట్లాడుతూ.. గత టీడీపీ పాలనలో పింఛన్ తీసుకోవాలంటే వృద్ధులు, దివ్యాంగులు, మహిళలు నానా కష్టాలు పడేవారని.. సీఎం జగన్ ప్రవేశపెట్టిన వలంటీర్ వ్యవస్థతో ఆ కష్టాలన్నీ దూరమై ప్రభుత్వ సేవలు, పథకాలు ప్రజలకు చేరువయ్యాయన్నారు. వలంటీర్ వ్యవస్థకు ప్రజల్లో మంచి ఆదరణ లభిస్తుండడంతో ఈనాడు కుళ్లుకుంటోందని.. ఈ వ్యవస్థను చూసి ఈనాడు, టీడీపీ, జనసేన భయపడుతున్నాయని, అందుకే మా మీద కుట్రలు చేస్తున్నాయని వలంటీర్లు అన్నారు.

ఎలాంటి ఆందోళనలు చేపట్టడంలేదు

తామెలాంటి ఆందోళనలు చేపట్టడంలేదని.. సమ్మెలోనూ పాల్గొనడంలేదని చిత్తూరు జిల్లా వలంటీర్లు ఆ జిల్లా కలెక్టర్ షణ్మోహన్, డీఆర్ఓ రాజశేఖర్‌లకు లిఖితపూర్వకంగా తెలిపారు. అనంతరం డీఆర్ఓ మీడియాతో మాట్లాడుతూ.. వలంటీర్లపై సామాజిక మాధ్యమాలు, పత్రికల్లో వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవమన్నారు. ఇక మంగళవారం జరిగిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో, ఇతర కార్యక్రమాల్లో వలంటీర్లు పాల్గొన్నారన్నారు. వలంటీర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు వేణు మాట్లాడుతూ.. వలంటీర్ల సమ్మెబాట వార్త అవాస్తవమన్నారు. తప్పుడు ప్రచారాలను ఖండిస్తున్నామన్నారు.

– విధుల్లోనే ఉన్నామని కలెక్టర్‌కు చిత్తూరు జిల్లా వలంటీర్లు వెల్లడి

వలంటీర్ వ్యవస్థతో జరిగే మంచిని జీర్ణించుకోలేకే..

సీఎం వైఎస్ జగన్ అధికారం చేపట్టిన వెంటనే ప్రతిష్టాత్మకంగా ఏర్పాటుచేసిన గ్రామ, వార్డు వలంటీర్ వ్యవస్థ నేడు దేశానికే ఆదర్శంగా నిలిచింది. ఈ వ్యవస్థ వలన జరుగుతున్న మంచిని కొంతమంది రాజకీయ పార్టీలు జీర్ణించుకోలేక తమ ఉనికికోసం ప్రభుత్వంపై బురదజల్లుతున్నాయి. ఇందులో భాగంగానే.. వలంటీర్లు ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా సమ్మెకు దిగుతున్నారని, విధులు బహిష్కరిస్తున్నారని కొన్ని పత్రికలు, సోషల్ మీడియా గ్రూపుల్లో దుష్ప్రచారం చేపట్టాయి. ఇవన్నీ పూర్తిగా నిరాధారమైనవి. ఇలాంటి వార్తల్లో నిజంలేదు. రాష్ట్ర వలంటీర్ల అసోసియేషన్ తరపున మేం దీనిని పూర్తిగా ఖండిస్తున్నాం. సమ్మెబాట పట్టిన వలంటీర్లు అని.. జగన్‌తో వలంటీర్లు యుద్ధం అని కొన్ని పత్రికల్లో వస్తున్న వార్తలను పూర్తిగా ఖండిస్తున్నాం.

– పీటా నాగమల్లేశ్వరరావు (వలంటీర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు),
– మద్దిలి కాళిదాసు (రాష్ట్ర ప్రధాన కార్యదర్శి), – కొమ్ము సురేష్‌బాబు (జాయింట్ సెక్రటరీ),
– పూజారి ఉదయ్‌కుమార్ (రాష్ట్ర ఉపాధ్యక్షుడు)

క్లుప్తంగా...

29న డిప్లొమా ఇన్ జర్నలిజం అభ్యర్థులకు సర్టిఫికెట్లు

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): ఆచార్య నాగార్జున యూనివర్సిటీ, సి.రాఘవాచారి మీడియా అకాడమీ సంయుక్తంగా నిర్వహించిన డిప్లొమా ఇన్ జర్నలిజం కోర్సులో ఉత్తీర్ణులైన అభ్యర్థులకు ఈ నెల 29వ తేదీన సర్టిఫికెట్లు అందజేయనున్నట్లు సి.రాఘవాచారి ఆంధ్రప్రదేశ్ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. గుంటూరు నాగార్జున యూనివర్సిటీ క్యాంపస్‌లోని ప్రొఫెసర్ బాల మోహన్ దాస్ సెమినార్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి వర్సిటీ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్ ముఖ్య అతిథిగా హాజరుకానున్నట్లు పేర్కొన్నారు.

అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ టూల్స్‌పై శిక్షణ

సర్టిఫికెట్ల పంపిణీ తర్వాత అదే హాలులో 'అడ్వాన్స్‌డ్ సాఫ్ట్‌వేర్ టూల్స్ ఫర్ ఈ-పబ్లిషింగ్' కోర్సులో శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా రంగాల్లో ఆధునిక సాంకేతికతపై వర్కింగ్ జర్నలిస్టులకు వర్సిటీ ఇంజినీరింగ్ కళాశాల డీన్ డాక్టర్ ఈ.శ్రీనివాసరెడ్డి శిక్షణ ఇస్తారని పేర్కొన్నారు. ఈ శిక్షణలో పాల్గొనాలనుకునే వర్కింగ్ జర్నలిస్టులు, చిన్న పత్రికల, డిజిటల్ మాధ్యమాల యాజమాన్యాల ప్రతినిధులు గురువారం సాయంత్రంలోగా తమ వివరాలను 91541 04393 నంబర్‌కు వాట్సాప్ ద్వారా పంపాలని విజ్ఞప్తి చేశారు.

పీసీబీలో ఏఈఈ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలి (ఏపీపీసీబీ)లో అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పోస్టులకు ఏపీపీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేసింది. మొత్తం 21 పోస్టులను భర్తీ చేయనున్నట్టు ప్రకటించింది. అర్హత గల అభ్యర్థులు ఈనెల 30 నుంచి జనవరి 19వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని కార్యదర్శి ప్రదీప్ కుమార్ తెలిపారు. పూర్తి వివరాలకు https://psc.ap.gov.inలో చూడవచ్చునని పేర్కొన్నారు.

ఏపీ సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా గడువు పెంపు

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ సహా 12 రాష్ట్రాల్లో ఓటర్ల తుది జాబితా గడువును పెంచుతూ కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు జారీచేసింది. ప్రత్యేక సంక్షిప్త సవరణ-2024 తేదీని జనవరి 5వ తేదీకి బదులుగా జనవరి 22వ తేదీకి పెంచింది. అభ్యంతరాల స్వీకరణ గడువును జనవరి 12 వరకు పొడిగించింది. జనవరి 17లోగా అభ్యంతరాలను పరిష్కరించి, జనవరి 22న ఓటర్ల జాబితా విడుదల చేయనుంది.

తిరుపతిలో 2 వసతి సముదాయాలు

- రూ.419.3 కోట్లతో గోవిందరాజ స్వామి రెండు, మూడు సత్రాల స్థానంలో అచ్యుతం, శ్రీపథం సముదాయాల నిర్మాణం
- 28న టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాల పంపిణీ
- పోటు కార్మికుల వేతనం మరో రూ.10 వేలు పెంపు
- కళ్యాణకట్టలో పనిచేస్తున్న పీస్ రేట్ క్షురకులకు రూ.20 వేల కనీస వేతనం
- వెల్లడించిన చైర్మన్ భూమన


గోవింద కోటి పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టీటీడీ బోర్డు సభ్యులు

తిరుమల: తిరుమల శ్రీవారి భక్తుల సౌకర్యార్థం తిరుపతిలో రెండు వసతి సముదాయాలను నిర్మించనున్నట్లు టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి చెప్పారు. ఇందుకోసం జీఎస్టీ కాకుండా రూ.419.30 కోట్లతో టెండర్లను టీటీడీ పాలకమండలి ఆమోదించినట్లు తెలిపారు. తిరుమలలో మంగళవారం టీటీడీ పాలకమండలి సమావేశం జరిగింది. టీటీడీ ఈవో ధర్మారెడ్డి, జేఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, పాలకమండలి సభ్యులు పాల్గొన్న ఈ సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను కరుణాకర్ రెడ్డి వెల్లడించారు. తిరుపతిలోని శ్రీగోవింద రాజస్వామి సత్రం (రెండోసత్రం) స్థానంలో జీఎస్టీ కాకుండా రూ.209.65 కోట్లతో అచ్యుతం వసతి సముదాయం, శ్రీకోదండరామస్వామి సత్రం (మూడోసత్రం) స్థానంలో జీఎస్టీ కాకుండా రూ.209.65 కోట్లతో శ్రీపథం వసతి సముదాయం నిర్మాణానికి టెండర్లను ఆమోదించినట్లు వివరించారు. రూ.14.47 కోట్లతో తిరుమలలోని ఔటర్ రింగ్ రోడ్డులో గోగర్భం డ్యామ్ సర్కిల్ వరకు శాశ్వత క్యూలైన్ల నిర్మాణానికి టెండరు ఖరారు చేసినట్లు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు పాలకమండలి తీసుకున్న ముఖ్య నిర్ణయాలు..

- టీటీడీ ఉద్యోగులకు సంబంధించి మొదటిదఫా డిసెంబరు 28న 3,518 మందికి, రెండోదఫా జనవరి మొదటి వారంలో 1,500 మందికి ఇళ్లస్థలాల పంపిణీ.
- మూడోదఫా ఫిబ్రవరిలో 5 వేల మందికి లబ్ధి చేకూరేలా ఏర్పేడు సమీపంలోని పాగాలి వద్ద 350 ఎకరాల భూమి సేకరణకు కలెక్టర్‌కు ప్రతిపాదన.
- ఇళ్లస్థలాలను ప్రభుత్వం నుంచి టీటీడీ కొనుగోలు చేసి అభివృద్ధి చేసి ఉద్యోగులకు అందిస్తుంది. ఈ మొత్తాన్ని ఉద్యోగులు తిరిగి టీటీడీకి చెల్లిస్తారు.
- శ్రీవారి పోటు కార్మికులకు వేతనం మరో రూ.10 వేలు పెంపు
- వాహన బేరర్లు, ఉగ్రాణం కార్మికులను స్కిల్డ్ కేటగిరీగా గుర్తించి తగిన వేతనం పెంపు.
- టీటీడీలోని పలు విభాగాల్లో వర్క్ కాంట్రాక్టు పద్ధతిలో సేవలందిస్తున్న కార్మికులకు వేతనాలు పెంపు.
- ఇప్పటికే స్కిల్డ్ కార్మికులకు రూ.15 వేల నుంచి రూ.18,500 , సెమీస్కిల్డ్ కార్మికులకు రూ.12 వేల నుంచి రూ.15 వేలకు, అన్‌స్కిల్డ్ కార్మికులకు రూ.10,340 నుంచి రూ.15 వేలకు పెంపు.
- కల్యాణకట్టలో విధులు నిర్వర్తిస్తున్న పీస్‌రేట్ క్షురకులకు నెలకు రూ.20 వేల కనీస వేతనం.
- ఫిబ్రవరిలో తిరుమలలో పీఠాధిపతులు, మఠాధిపతుల సదస్సు
- వందల సంవత్సరాలుగా శ్రీవారి ఆలయ అర్చక కైంకర్యాలను పర్యవేక్షిస్తున్న పెద్దజీయర్ మఠానికి రూ.60 లక్షలు, చిన్నజీయర్ మఠానికి రూ.40 లక్షల ఆర్థిక సహకారం పెంపు.

భగవద్గీత, గోవింద కోటి పుస్తకాల ఆవిష్కరణ

శ్రీ భగవద్గీత, స్థానిక ఆలయాల క్యాలెండర్లు, గోవింద కోటి పుస్తకాలను టీటీడీ చైర్మన్ కరుణాకర్‌రెడ్డి ఈవో ధర్మారెడ్డితో కలిసి ఆవిష్కరించారు. సనాతన ధర్మం పట్ల, మానవీయ, నైతిక విలువల పట్ల విద్యార్థుల్లో అవగాహన కల్పించేందుకు సరళమైన భాషలో సులభంగా అర్థమయ్యేలా 20 పేజీలతో కూడిన భగవద్గీత లక్ష పుస్తకాలను టీటీడీ ముద్రించింది. టీటీడీ హిందూ ధార్మిక ప్రాజెక్టుల ఆధ్వర్యంలో తెలుగు, ఇంగ్లిష్, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో 20 వేల పుస్తకాల వంతున ముద్రించిన భగవద్గీతను ఆయా రాష్ట్రాల్లో విద్యార్థులకు ఉచితంగా ఇవ్వనున్నారు.

7, 10 తరగతులకు 'ఈఈఎంటీ' ప్రతిభా పరీక్ష

- నేటి నుంచి జనవరి 8వ తేదీ వరకు ఉచిత రిజిస్ట్రేషన్
- ఆన్‌లైన్‌లో జనవరి 23న ప్రిలిమనరీ, 31న మెయిన్స్
- విజేతలకు రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులు
- పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ వెల్లడి


పరీక్ష షెడ్యూల్ విడుదల చేస్తున్న సురేష్ కుమార్, ఎడ్యుకేషనల్ ఎపిఫనీ సంస్థ ప్రతినిధులు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు ఎడ్యుకేషనల్ ఎపిఫనీ స్వచ్ఛంద సంస్థ నిర్వహిస్తున్న 'ఈఈఎంటీ-2024' (ఎడ్యుకేషనల్ ఎపిఫనీ మెరిట్ టెస్ట్) పరీక్ష తోడ్పడుతుందని పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. విజయవాడలోని సమగ్ర శిక్ష రాష్ట్ర కార్యాలయంలో ఈఈఎంటీ షెడ్యూల్‌ను మంగళవారం ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 7, 10 తరగతి విద్యార్థులకు గత 11 సంవత్సరాలుగా ఆన్‌లైన్‌లో ఈ ఉచిత టెస్ట్ నిర్వహిస్తున్నారని తెలిపారు. పిల్లల్లో ప్రతిభా పాటవాలను వెలికి తీసేలా ఈ పోటీలు ఉంటాయన్నారు. జనవరి 23న ప్రిలిమనరీ, 31న మెయిన్స్ పరీక్ష 'కోడ్ తంత్ర' సాఫ్ట్‌వేర్ ద్వారా ఈ పరీక్ష నిర్వహిస్తారని తెలిపారు. ఎక్కువ మంది విద్యార్థులు పరీక్షకు రిజిస్ట్రేషన్ చేసుకునేలా జిల్లా విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బుధవారం నుంచి జనవరి 8వ తేదీ వరకు ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించారు.

162 మంది విజేతలకు రూ.9 లక్షల బహుమతులు

7, 10 తరగతుల్లో డిసెంబర్ వరకు పూర్తయిన సిలబస్‌పై 80 శాతం ప్రశ్నలు, జనరల్ నాలెడ్జిపై మరో 20 శాతం ప్రశ్నలు ఉంటాయి. కాగా, ఈ పోటీల్లో మొత్తం 162 మంది విజేతలకు దాదాపు రూ.9 లక్షల విలువైన నగదు బహుమతులు అందించనున్నారు. మరో 1,752 మందికి మెడల్స్, ప్రశంసాపత్రాలు అందజేస్తారు. రాష్ట్రస్థాయిలో పదో తరగతిలో ప్రథమ బహుమతిగా రూ.30 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.25 వేలు, తృతీయ బహుమతి రూ.20 వేలు ప్రకటించారు. ఏడో తరగతిలో రాష్ట్ర స్థాయి మొదటి విజేతకు రూ.20 వేలు, రెండో విజేతకు రూ.15 వేలు, మూడో విజేతకు రూ.10 వేలు బహుమతిగా అందిస్తారు. ఈ పరీక్షకు ఎస్సీఈఆర్టీ డైరెక్టర్ డాక్టర్ బి.ప్రతాప్‌రెడ్డి, ఎపిఫనీ సంస్థ ప్రతినిధి డి.నబీ కోఆర్డినేటర్లుగాను, వి.ఎస్.సుబ్బారావు పరీక్షా కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. https:// educationalepiphany.org/eemt2024/registration.php లింక్ ద్వారా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి వివరాలకు https:// educationalepiphany.org/ వెబ్‌సైట్‌లో గాని, 96667 47996 నంబర్‌లోగాని సంప్రదించి తెలుసుకోవచ్చు. ఈ సమావేశంలో ఎడ్యుకేషనల్ ఎపిఫనీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ తవనం వెంకటరావు, ఉపాధ్యక్షుడు హేమచంద్ర, కన్వీనర్ పుట్టంరాజు శ్రీరామచంద్రమూర్తి పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే కురబల సమగ్రాభివృద్ధి

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ ఆర్.కృష్ణయ్య


శ్రీ కనకదాస చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ ఆర్.కృష్ణయ్య తదితరులు

మదనపల్లె: గత ప్రభుత్వాల హయాంలో ఎలాంటి అభివృద్ధికి నోచుకోని కురబ, కురుమ, కురవ కులాలు సీఎం జగన్ నేతృత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలతో సమగ్రాభివృద్ధి దిశగా దూసుకెళ్తున్నారని రాష్ట్ర అటవీ, విద్యుత్, మైనింగ్‌శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని రామతులసమ్మ కల్యాణ మండపంలో రాష్ట్ర కురబ, కురవ, కురువ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన శ్రీ కనకదాస 536వ జయంతి వేడుక, సంఘం ఎనిమిదో వార్షికోత్సవాలకు మంత్రి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ కురబ, కురుమ, కురువ కులాలతో పాటు అన్ని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీవర్గాల అభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిరంతర కృషి చేస్తున్నారన్నారు. 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా చేసిన చంద్రబాబు కురబ, కురుమ, కురవ కులాల అభివృద్ధి చేశాడా?అండగా నిలిచాడా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో తొలిసారిగా చంద్రబాబు సొంత నియోజకవర్గమైన కుప్పంలో ప్రభుత్వ సహాయ, సహకారాలతో శ్రీ కనకదాస విగ్రహం ఏర్పాటు చేశామన్నారు. అలాగే మదనపల్లిలో ఏర్పాటు చేస్తామన్నారు. రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య,తంబళ్లపల్లె ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, రాష్ట్ర కురబ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జబ్బల శ్రీనివాసులు మాట్లాడారు. ముఖ్య అతిథులను ఘనంగా సన్మానించారు.

మార్గదర్శి ఎదుట చందాదారుడు ధర్నా

- తాను కట్టిన చిట్‌కు పాడుకునే అవకాశం ఇవ్వకపోవడంపై నిరసన
- ఇప్పటివరకు రూ.7.90 లక్షలు చెల్లించిన బాధితుడు
- కట్టిన నగదు కూడా వాపసు ఇవ్వని మార్గదర్శి యాజమాన్యం
- విజయవాడలో ఘటన

విజయవాడ స్పోర్ట్స్: ఈనాడు సంస్థల అధినేత రామోజీరావుకు చెందిన మార్గదర్శి చిట్‌ఫండ్స్ అక్రమాలు వెలుగులోకి వస్తూనే ఉన్నాయి. తాజాగా విజయవాడలో తాను కట్టిన చిట్‌కు పాడుకునే అవకాశం ఇవ్వకపోవడంతో ఒక చందాదారుడు మార్గదర్శి చిట్‌ఫండ్స్ కార్యాలయం ఎదుట ధర్నాకు దిగాడు. వివరాల్లోకి వెళ్తే.. జి.కృష్ణహేమంత్ అనే చందాదారుడు 2022 జూలైలో కోటి రూపాయల చిట్ వేశాడు. దీనికి సంబంధించి ఇప్పటివరకు మార్గదర్శికి రూ.7.90 లక్షలు చెల్లించాడు. ఈ క్రమంలో తాను కట్టిన చిట్‌కు పాడుకునే అవకాశం ఇవ్వకపోగా, కట్టిన డబ్బులు సైతం వాపసు ఇవ్వడం లేదంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశాడు. నగదు తిరిగి ఇవ్వకపోవడంతో విజయవాడ ఎంజీ రోడ్డులోని చిట్‌ఫండ్ కార్యాలయం ముందు మంగళవారం రాత్రి తన ఇద్దరు స్నేహితులతో కలిసి ధర్నాకు దిగాడు. రాత్రి 10.30 గంటలకు వరకు బాధితుడి ధర్నా కొనసాగింది. ఆ తర్వాత అక్కడకు వచ్చిన కార్యాలయ సిబ్బంది.. ఈ నెల 30న నగదు పూర్తిగా చెల్లిస్తామని హామీ ఇచ్చారు. దీంతో తన ఆందోళనను తాత్కాలికంగా విరమిస్తున్నట్టు బాధితుడు కృష్ణహేమంత్ తెలిపాడు.

జాతీయ స్కూల్ గేమ్స్‌లో ఏపీ క్రీడాకారుల ప్రతిభ



భువనేశ్వర్‌లో జరిగిన 67వ జాతీయ స్కూల్ గేమ్స్‌లో వాలీబాల్ అండర్-14 బాలుర విభాగంలో ఆంధ్రప్రదేశ్ జట్టు ప్రతిభ చూపిందని స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి జి.భానుమూర్తిరాజు తెలిపారు. మంగళవారం జరిగిన పోటీలో కాంస్య పతకం అందుకుందని పేర్కొన్నారు. ఏపీ వాలీబాల్ జట్టుకు అల్లా మాధవ కోచ్‌గా, కిల్లో లైకోన్ టీం మేనేజర్‌గా వ్యవహరించారని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పాఠశాల విద్యాశాఖ కమిషనర్ ఎస్.సురేష్‌కుమార్, సమగ్ర శిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు అభినందించారు.

- సాక్షి, అమరావతి



ఒకరి జీవనోపాధిని దూరం చేయవద్దు. అది పాపపు ధోరణి.
- వర్ధమాన మహావీరుడు

సాక్షి

బుధవారం, 27 డిసెంబర్ 2023

పాత మూస... కొత్త చట్టం

మారుతున్న కాలానికీ, అవసరాలకూ తగ్గట్టు అన్నీ మారాల్సిందే. ఆ దృష్టితో చూసినప్పుడు బ్రిటిషు కాలపు పాత చట్టాల స్థానంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా మూడు నేర సంబంధ చట్టాలను తీసుకురావడం అభిలషణీయమే. అయితే, ప్రతిపక్షాలకు చెందిన 140 మందికి పైగా సభ్యులను వివిధ కారణాలతో సస్పెండ్ చేసిన అనంతరం పెద్దగా చర్చ లేకుండానే గత వారం పార్లమెంట్ ఈ కొత్త చట్టాలను ఆమోదించడంపై సహజంగానే విమర్శలు వచ్చాయి. ఎవరేమన్నా కొత్త చట్టాలకు భారత రాష్ట్రపతి ఈ సోమవారం ఆమోదముద్ర వేయడంతో ఒక తతంగం ముగిసింది. కేంద్ర హోమ్ శాఖ ప్రభుత్వ రాజపత్రంలో నోటిఫై కూడా చేయడంతో, ఇక ఈ సరికొత్త నేర శిక్షాస్మృతులు ఎప్పటి నుంచి అమలులోకి వస్తాయో ప్రకటించడమే లాంఛనంగా మిగిలింది. వెరసి, బ్రిటీషు కాలం నాటి 'ఇండియన్ పీనల్ కోడ్', 'కోడ్ ఆఫ్ క్రిమినల్ ప్రొసీజర్', 'ఇండియన్ ఎవిడెన్స్ యాక్ట్ - 1872' స్థానంలో కొత్తగా 'భారతీయ న్యాయ సంహిత (బీఎన్ఎస్)', 'భారతీయ నాగరిక్ సురక్షా సంహిత', 'భారతీయ సాక్ష్య చట్టం' ప్రవేశించాయి. తెచ్చిన మార్పులేమిటి, వీటి ప్రభావం ఎలాంటిదన్నదే ఇప్పుడిక ప్రజాక్షేత్రంలో వివిధ వర్గాలలో చర్చగా మారింది.

భారతీయుల కొరకు, భారతీయుల చేత, భారతీయ పార్లమెంట్ తెచ్చిన చట్టాలంటూ హోమ్ మంత్రి ప్రకటించారు. బ్రిటిషు వలసవాద అవశేషాలను తొలగించే చర్యగా అధికార పక్షం వీటిని అభివర్ణించింది. అయితే, పేరుకు ఇవి కొత్త క్రిమినల్ చట్టాలే కానీ, బ్రిటిషు కాలపు పాత చట్టాలలోని భాష, అంశాలే ఎక్కువగా వీటిలో ఉన్నాయని నిపుణులు పెదవి విరుస్తున్నారు. పాత చట్టాల్లోని సెక్షన్లనే వరుస మార్చడం తప్ప ఈ కొత్త వాటిల్లో చేసినది తక్కువనే విమర్శలూ ఉన్నాయి. అంతే కాక, అరెస్టు, పోలీస్ కస్టడీలకు సంబంధించి కొత్త చట్టాల్లోని అంశాల పట్ల అభ్యంతరాలూ వినిపిస్తున్నాయి. కొత్త చట్టాల ఫలితంగా కస్టడీని 60 నుంచి 90 రోజుల దాకా పొడిగించే వీలుండడం లాంటివి అందుకు కారణం. ఇలాంటి అంశాలు పౌరహక్కులకు భంగకరంగా పరిణమించే ప్రమాదం ఉంది. నిజానికి, కొత్త చట్టాలు పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలన తర్వాతే సభ ముందుకొచ్చాయి. అయితే, శతకోటి భారతీయుల జీవితాలను శాసించే చట్టాలు గనక వీటిపై సభ క్షుణ్ణంగా చర్చించడం విధాయకం. అది లేకుండానే అవి చట్టం కావడం విషాదం.

అలాగని ఈ చట్టాల్లో అసలంటూ ఆహ్వానించదగినవి ఏమీ లేవనలేం. వివాహ వ్యవస్థను దెబ్బ తీస్తుందనే మిషతో వ్యభిచారాన్ని మళ్ళీ శిక్షార్హంగా మార్చాలని స్థాయీ సంఘం సిఫార్సు చేసినా, ప్రభుత్వం అందుకు తలూపలేదు. లింగమనే నిర్వచనంలో ట్రాన్స్‌జెండర్లను కూడా చేర్చడమూ మంచి నిర్ణయమే. మూకదాడి హత్యలను మరణశిక్షకు అర్హమైనవిగా చేర్చడమూ మంచి పనే. అయితే, 2017 తర్వాత మూకదాడి హత్యల డేటాను క్రైమ్ రికార్డ్స్ బ్యూరో ప్రచురించడం మానేసింది. అలాంటి దాడుల లెక్కలే లేకుండా కొత్త చట్టాన్ని ఎలా అమలు చేస్తారు? ప్రయోజనం ఏమిటనేది సందేహం. ఇక, రాజద్రోహానికి సంబంధించిన సెక్షన్‌ను రద్దు చేస్తున్నట్టు ప్రభుత్వం గొప్పగా ప్రకటించింది. వాస్తవంలో పేరు మార్చారే తప్ప, అది మరింత కర్కశంగా మారిందని నిపుణుల ఆందోళన. దేశ సార్వభౌమాధికారం, సమైక్యత, సమగ్రతలకు ప్రమాదం కలిగించేలా ప్రవర్తించినట్టు భావిస్తే చాలు, సెక్షన్ 150 కింద యావజ్జీవ కారాగారవాస శిక్ష వేసే వీలుండడం భయపెడుతోంది.

కొత్త చట్టాల్లో అసలు సిసలు మార్పులు కేవలం 20 శాతమేనని ఒక అంచనా. అదే గనక నిజమైతే, ఈ మొత్తం ప్రక్రియ ప్రచారానికే తప్ప, ప్రయోజనకరం అనిపించుకోదు. అలాగే, ప్రభుత్వానికీ, పోలీసులకూ మరిన్ని అధికారాలు కట్టబెడుతున్న ఈ చట్టాల్లో జవాబుదారీతనం ఆ మేరకు కనిపించట్లేదు. ప్రజాస్వామ్యంలో అది సమర్థనీయం కాదు. వలసవాద చట్టాల్లో లాగానే ఇప్పుడూ ఉంటే జనాన్ని ఏమార్చడమే తప్ప ఏం మార్చినట్టు అన్నది ప్రశ్న. క్రిమినల్ చట్టాల్లో సంస్కరణలంటే ఆశించేది ఇది కాదు. నిజానికి, సమాజంలోనూ, సాంకేతికంగానూ అనేక మార్పులు వస్తున్నవేళ... నేర చట్టాలను సవరించడం, నవీకరించడం చట్టబద్ధ పాలన అందించే ఏ దేశానికైనా తప్పనిసరి. అయితే, ఆ మార్పులు నిర్దేశిత సామాజిక ప్రయోజనాన్ని నెరవేర్చడం కీలకం. అలాగే, ఆ సవరించిన చట్టాలు రాజ్యాంగ స్ఫూర్తికి తగ్గట్టుండడం అత్యవసరం. 150 ఏళ్ళ పాత వలసవాద చట్టాలను వదిలించుకుంటున్నామని ప్రచారం చేసుకుంటున్నప్పుడు, ఆపాటి ఆశలు, చర్చ ముఖ్యమైనవి. కానీ, వాస్తవంలో కొత్త చట్టాలు అలా లేవంటే నిరాశ మిగులుతుంది.

చట్టాల్లో అవసరమైన అనేక ప్రాథమిక సవరణలు చేసే చరిత్రాత్మక అవకాశం చేజారిపోయింది. ఐపీసీ స్థానంలో తెచ్చిన బీఎన్ఎస్ లాంటివి శిక్షలతో భయపెట్టేదిగా కాక, సంస్కరించేదిగా ఉండాలి. 1975 నుంచి 2013 మధ్యకాలంలో ప్రభుత్వాలు ప్రవేశపెట్టిన దాదాపు 33 ప్రభుత్వ పథకాలనే ప్రస్తుత పాలకులు కొత్త పేర్లతో తమవిగా చెప్పుకుంటున్నారనీ, కొత్త పేర్లతో కొత్త నేర చట్టాలు కూడా ఆ కోవలోవే అనీ కాంగ్రెస్ ఆరోపిస్తోంది. నిందారోపణల మాటెలా ఉన్నా, ఇప్పటికీ మించిపోయింది లేదు. ప్రతిపక్షాలు, పౌరసమాజం తాలూకు భయాందోళనలను పోగొట్టేందుకు ప్రభుత్వం ప్రయత్నించాలి. అన్ని వర్గాల అనుమానాలనూ నివృత్తి చేయాలి. చట్టాలు తేవడంలో లేకున్నా, కనీసం అమలులోనైనా సర్వజనామోద వైఖరి శోభనిస్తుంది. అవసరమైతే ప్రజాభిప్రాయానికి తగ్గట్టు సరికొత్త చట్టాల్లోనూ ఎప్పటికప్పుడు సవరణలు చేయాల్సిందే. రాజ్యాంగబద్ధ ప్రజాస్వామ్య మూలమే అది. ఒక్కమాటలో... కొత్త చట్టాలతో దేశంలోని 17.5 వేల పోలీస్ స్టేషన్లు బలోపేతమవడం సరే కానీ, 140 కోట్ల జనాభా నిస్సహాయులుగా మారిపోతేనే కష్టం.

సామాన్యులను వేధించే ప్రశ్నలెన్నో!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

ఐదు రాష్ట్రాల శాసనసభల ఎన్నికలు అలా ముగిశాయో లేదో... 2024 సాధారణ ఎన్నికల ఫలితాల గురించిన ఊహాగానాలు అప్పుడే మొదలైనాయి. ఈ ఫలితాల ఊపుతో బీజేపీనే తిరిగి కేంద్రంలో అధికారంలోకి వస్తుందని కొందరు చెబుతున్న విషయం ఆశ్చర్యానికి గురిచేస్తోంది. అసలు ముస్లిమ్‌లకు సీట్లు ఇవ్వని బీజేపీ మళ్ళీ ఎలా అధికారంలోకి వస్తుందనే ప్రశ్న వేధిస్తోంది. అంకెలకు ఉద్వేగాలు ఉండవు. నిరావేశంగా ఎన్నికల ఫలితాలను విశ్లేషిస్తే, వాస్తవాలు నిగ్గుదేలుతాయి. అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ ఓట్ల శాతంలో తేడా అతి తక్కువ. ఆ ఎన్నికల ఫలితాలకు ముందూ, తరువాతా ఆయా పార్టీల బలాబలాల్లో పెద్ద మార్పు లేదు. మరి 2024లో ప్రతిపక్షాల విజయం ఒక ఎండమావి అని ఎలా నిర్ణయిస్తారు?

ఈనాడు భారతదేశం మొత్తం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, తెలంగాణ ఎన్నికల గురించే ఆలోచిస్తోంది. అయితే ఈ ఎన్నికల కంటే కూడా 2024 సాధారణ ఎన్నికలలో బీజేపీ మళ్లీ గెలుస్తుందా లేక కాంగ్రెస్‌తో కూడిన 'ఇండియా' కూటమి వస్తుందా అనే దాని గురించి ప్రజలు మరింత ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. నిజానికి 'ఇండియా' కూటమికి సంబంధించి ఈ నాలుగు రాష్ట్రాల సీట్ల ఎంపిక విషయంలో కాంగ్రెస్ అలసత్వం చేసింది. ఈ ఎన్నికలలో బీజేపీకీ, కాంగ్రెస్‌కూ వచ్చిన ఉన్న ఓట్ల శాతంలో తేడా అతి తక్కువ. అసలు ముస్లిమ్‌లకు సీట్లు ఇవ్వని బీజేపీ, మళ్ళీ 2024 లోక్‌సభ ఎన్నికల్లో ఎలా అధికారంలోకి వస్తుంది అనే ప్రశ్న అందరినీ వేధిస్తోంది.

మొన్న తెలంగాణ ఎన్నికలలో గెలిచాక ప్రోటెమ్ స్పీకర్‌గా అక్బరుద్దీన్‌ను కాంగ్రెస్ నియమించినందుకు అసెంబ్లీలో ఆయన సారథ్యంలో సభ్యులుగా ప్రమాణ స్వీకారం చేయకుండా బీజేపీ బాయ్‌కాట్ చేసింది. ఇది అప్రజాస్వామిక చర్య. ఎందుకంటే ముస్లిమ్‌ల పాత్ర లేకుండా హైదరాబాద్ జీవితమే లేదు. ప్రపంచ మొత్తం పర్యాటకులు హైదరాబాద్ బిర్యానీని ఇష్టపడతారు. చార్మినార్ దగ్గర సెంటు, గాజులు కొనుక్కొనని హిందూ స్త్రీలు లేరు. వారి ఉత్పత్తులను అనుభవిస్తూనే వారిని శత్రువులుగా చూడడం ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. వారి సంగీతాన్ని ఆస్వాదిస్తూ, వారి హీరోలతో సినిమాలు నిర్మించి వందల కోట్లు సంపాదిస్తూ, రాజకీయంగా వచ్చేటప్పటికి మాత్రం వారిని నిరోధించడం అప్రజాస్వామికం కాదా!

మరో పక్క సామాజిక రాజకీయ విశ్లేషకులు చెబుతున్న మాటలు ఏంటంటే, ఈ ఎన్నికలలో వచ్చిన సీట్ల సంఖ్య మనకు అంత ప్రధానం కాదు. ఓట్ల శాతమే మనకు నమూనా. మూడు ఉత్తరాది రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్‌కు ఎదురు దెబ్బేననడం సందేహం లేదు. అంతేకాదు 2024లో ప్రజాస్వామ్య పునరుద్ధరణ జరుగుతుందని ఆశిస్తున్న వారికి ఆ ఫలితాలు తీవ్ర ఆశాభంగం కలిగించాయని కూడా చెప్పొచ్చు. తెలంగాణలో కాంగ్రెస్ చరిత్రాత్మక పునరాగమనంతో నెలకొన్న ఉత్సాహాన్ని ఉత్తరాది అపజయాలు ఒక విధంగా తగ్గించివేశాయి. తదుపరి లోక్‌సభ ఎన్నికలలో బీజేపీకి అవి అనేక అనుకూలతలను సృష్టించాయని కూడా అంటున్నారు. కానీ ఇదెంతవరకు నిజం? అంకెలకు ఉద్వేగాలుండవు. నిరావేశంగా ఆ నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలను విశ్లేషించండి, వాస్తవాలు నిగ్గు దేలుతాయి. ఆ ఎన్నికల ఫలితాలకు ముందూ, తరువాతా ఆ యా పార్టీల బలాబలాల్లో పెద్ద మార్పు లేదని స్పష్టమవుతుంది. మరి 2024లో ప్రతిపక్షాల విజయం ఒక ఎండమావి అని ఎలా నిర్ణయిస్తారు?



మూడు రాష్ట్రాలలో బీజేపీకి తిరుగులేని విజయం లభించడంతో, కేంద్రంలో ఆ పార్టీని మరోసారి అధికారంలోకి రావాలని ప్రజలు ప్రగాఢంగా కోరుకుంటున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. అదలా ఉంచి అసెంబ్లీ ఎన్నికలు జరిగిన ఐదు రాష్ట్రాలలో ప్రధాన రాజకీయ పక్షాలకు లభించిన ఓట్ల గణాంకాలను చూద్దాం. మిజోరం, తెలంగాణ, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్‌లలో మొత్తం 12.29 కోట్ల ఓట్లు పోల్ అయ్యాయి. ఇందులో బీజేపీకి 4.82 కోట్లు, కాంగ్రెస్‌కు 4.92 కోట్లు ('ఇండియా' కూటమి భాగస్వామ్య పక్షాలను కూడా కలుపుకొంటే 5.06 కోట్లు) లభించాయి. మధ్యప్రదేశ్‌లో మినహా, ఓట్ల పరంగా బీజేపీకి లభించిన ఆధిక్యత స్వల్ప స్థాయిలో మాత్రమే ఉంది. తెలంగాణాలో బీజేపీ కంటే కాంగ్రెస్‌కు పెద్ద మొత్తంలో ఓట్లు లభించాయి. మిగతా రాష్ట్రాలలో కాంగ్రెస్ ఓట్ల లోటును తెలంగాణ గణనీయంగా భర్తీ చేసింది. మీడియా ఊదరకు విరుద్ధంగా తాజా అసెంబ్లీ ఎన్నికలలో బీజేపీకి ప్రజల మద్దతు మరీ విశేషంగా ఏమీ లభించలేదని చెప్పొచ్చు.

అసలు బీజేపీ ప్రాతినిధ్యం వహించే హిందూ ధార్మిక వ్యవస్థ గురించి అంబేడ్కర్ విశ్లేషించారు. హిందూమతం ధర్మవ్యాపక సంస్థ (మిషనరీ మతం) అవునా, కాదా అనేది చర్చనీయాంశం. హిందూ మతం ఏనాడూ ప్రచారక మతంగా లేదని కొందరంటారు. ఒకానొక కాలంలో హిందూ మతం ప్రచారక మతంగా ఉన్నదనడమే సరియైన వాదంగా కన్పిస్తుంది. అది ప్రచారక మతం కాకపోతే భారత భూభాగంలో ఇంతగా వ్యాపించి ఉండేది కాదు. ఈనాడు అది ప్రచారక మతం కాదనేది కూడా సత్యమే. ఒకప్పుడు ప్రచారక మతంగా ఉన్న హిందూమతం ఇప్పుడెందుకు దానికి వ్యతిరేకంగా మారింది? ఈ ప్రశ్నకు నా జవాబు ఇది: హిందూమతం ప్రచారక మతంగా ఎప్పుడాగి పోయిందంటే, హిందువులలో కులవ్యవస్థ ఏర్పడినప్పుడు! కుల వ్యవస్థకూ, మతం మార్పునకూ పొసగదు. మతం మార్పునకు కావలసింది విశ్వాసాలూ ,సిద్ధాంతాలూ స్వీకరించడం మాత్రమే కాదు; ఈ మతం మార్పులో అంతకంటే ముఖ్యమైన మరొక విషయం ఉంది. అది - మతం మార్చుకొన్న వారికి సంఘ జీవనంలో లభించే స్థానం. ఈనాడు ఇతరుడెవరైనా హిందూ మతాన్ని స్వీకరించదలిస్తే, హిందూ మతంలో అతని స్థానమెక్కడ? ఏ కులంలో చేర్చుకోవడం? అన్యులెవ్వైన వారిని తన మతంలో చేర్చుకోవాలనుకునే ప్రతీ హిందువునీ తికమకపరిచే సమస్య ఇది. ఏదో ఒక క్లబ్బులో చేరినట్టు ఒక కులంలో అందరూ చేరడానికి వీలు లేదు. క్లబ్బు సభ్యత్వం వలే కుల సభ్యత్వం స్వేచ్ఛాయుతమైంది కాదు. ఆ కులంలో పుట్టిన వారికే ఆ కులంలో సభ్యత్వం. అది కుల న్యాయం. ఈ న్యాయం కింద ఏ కులానికి ఆ కులమే స్వయం స్వతంత్రం. ఎవరైనా కొత్త వారిని ఏ కులంలోనైనా చేర్పించే అధికారం ఈ భూమి మీద ఎవ్వరికీ లేదు. నిజానికి అంబేడ్కర్ హిందూ భారతాన్ని ఆశించ లేదు. లౌకిక, ప్రజాస్వామిక, సామ్యవాద భారతాన్ని ఆశించాడు. ఆయన మార్గంలో నడవకపోతే భారతదేశం ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, విద్య, తాత్విక రంగాలలో అణగారిపోతుంది.

వ్యాసకర్త దళితోద్యమ నాయకుడు | 98497 41695

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

సోషల్ మీడియా

గుండెల్లో లేడన్నానా!



రామ మందిర నిర్మాణాన్ని వ్యతిరేకించిన 25 మంది లాయర్లలో కపిల్ సిబాల్ కూడా ఉన్నారు. అసలు శ్రీరాముడి ఉనికినే ప్రశ్నిస్తూ ఆయన సుప్రీంకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. ఇప్పుడు 'మేరే దిల్ మే తో రామ్ హై' అంటున్నారు. పరాకాష్ఠకు చేరిన కాపట్యం.

- నూపుర్ జె శర్మ, సంపాదకురాలు

ఉన్నవి సరిపోవు



ఫిలాసఫీ, దానితో పాటుగా ప్రాథమిక తర్కం, విలువలు, మెటాఫిజిక్స్ వంటివి పాఠశాల స్థాయిలోనే పిల్లలకు తెలియాలి. రాయడం, చదవడం, లెక్కలు వెయ్యడం నేర్పించినట్లుగానే వీటినీ బోధించాలి. ఇందువల్ల పిల్లల్లో ప్రశ్నించే గుణం అలవడుతుంది. ప్రపంచాన్ని తెలుసుకోవాలన్న జిజ్ఞాస మరింతగా ఏర్పడుతుంది.

- కౌశిక్ బసు, ఆర్థికవేత్త

నోరెందుకు రాదు!



యుద్ధాలలో చిన్నారుల మరణాలు: ఇరాక్‌లో 14 ఏళ్లలో 3,100, సిరియాలో 11 ఏళ్లలో 12,000, యెమెన్‌లో 7 ఏళ్లలో 3,700, ఉక్రెయిన్‌లో 21 నెలల్లో 520, పాలస్తీనాలో 2 నెలల్లో 12,000. బాలల యుద్ధ మరణాలను ప్రపంచం పట్టించుకోవడం లేదా? లేక మధ్యప్రాచ్య బాలల మరణాలను ఖండించడం కష్టంగా ఉంటోందా?

- ఛాన్ జైబ్ ఖాన్, రాజకీయ విశ్లేషకుడు

ప్లీజ్, వదిలేద్దురూ!



ముస్లిమ్‌లు ఈద్, బక్రీద్ మొదలైనవి ఆనందంగా జరుపుకొంటారు. అలాగే క్రిస్టియన్లు, సిక్కులు, జైనులు, బౌద్ధులు తమ పండుగలను ఆనందంగా జరుపుకొంటారు. నా ఏకైక సమస్య ఏమిటంటే - హిందూ పండుగల సమయంలోనే అనవసరమైన వాదనలు, ప్రసంగాలు వినిపిస్తాయెందుకని?

- మిస్టర్ సిన్హా, పొలిటికల్ కామెంటేటర్

వింత మనుషులు



ఆస్ట్రేలియన్ క్రికెట్ ఆటగాడు ప్రపంచ కప్పుపై తన పాదాలను ఆన్చినప్పుడు మాత్రమే భారతీయులు తమ ఆగ్రహాన్ని ప్రదర్శిస్తారు. కానీ భారతీయ క్రికెటర్లు ఒక నిస్సహాయ ఖడ్గమృగం మీదకు వాలి ఫొటోకు పోజులిచ్చినప్పుడు ఏమీ మాట్లాడరు. వావ్! (ఆ ఫొటోను తన ట్వీట్‌కు ట్యాగ్ చేస్తూ). ఖడ్గమృగం అంతరించిపోతున్న ప్రాణుల జాబితాలో ఉన్న అరుదైన జంతువని కూడా మనం మరిచిపోయినట్లున్నాం?

- ఐశ్వర్య, వైద్య సహాయకురాలు

విపత్తు వాహకాలు



రోహ్‌తంగ్ కనుమ కింద అటల్ సొరంగం 2020 అక్టోబర్‌లో ప్రారంభం అయింది. అంతకు ముందు డిసెంబరులో రోహ్‌తంగ్ దారి గుండా వెళ్లిన వాహనాల సంఖ్య సున్నా. 2023 డిసెంబర్ 24-25 మధ్య సొరంగాన్ని దాటిన వాహనాలు 42 వేలకు పైగానే! హిమాలయ పర్యావరణానికి విపత్తు పొంచి ఉందని చెప్పడానికి ఇంతకంటే మేల్కొలుపు అవసరమా?!

- ఆనంద్ శంకర్, పారిశ్రామికవేత్త

సమ-ఉజ్జీలు



నకిలీ నెయ్యి విక్రయిస్తున్న రామ్‌దేవ్ బాబా కల్తీ వ్యాపారుల రారాజు అని బ్రిజ్ భూషణ్ సింగ్ అన్నారు. లైంగిక వేధింపుల కేసులో బ్రిజ్ భూషణ్‌ను అరెస్టు చేయాలని రామ్‌దేవ్ బాబా అంటున్నారు. ఇప్పుడు మన రెజ్లర్లు నిష్క్రమించారు కనుక నేను వీరిద్దరి మ్యాచ్ చూడాలనుకుంటున్నాను. బరిలో రామ్‌దేవ్-బ్రిజ్‌భూషణ్. యోగా-చెయ్యి మెలితిప్పుడు.

- కాజోల్ శ్రీనివాసన్, స్టాండప్ కమెడియన్

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఎక్కడా పరిశీలనలో లేనట్టు హామీపత్రం జతచేయాలి. ఈ-మెయిల్: editpage@sakshi.com

బాంబేలో జిన్నా హౌస్

బ్రిటిష్ కాలం నుండి ముంబయ్‌లోని మలబార్ హిల్ ప్రాంతం వీఐపీల స్థావరం. ఇక్కడే మహారాష్ట్ర గవర్నర్ 'రాజ్ భవన్', ముఖ్యమంత్రి బంగ్లా 'వర్ష', మరాఠా యోధుడు శరద్ పవార్ నివాసం 'సిల్వర్ ఓక్' ఉన్నాయి. రాజ్ భవన్‌కు కూతవేటు దూరంలో, అరేబియా సముద్రం అలలను తాకుతూ, మరో చారిత్రక నిర్మాణం కూడా ఉంది. అది పాకిస్తాన్ వ్యవస్థాపకుడు మహమ్మద్ అలీ జిన్నా (జననం: 1876 డిసెంబర్ 25) 'దిల్'తో నిర్మించుకున్న 'జిన్నా హౌస్'.

1905 నుండి 1947 వరకు బాంబే ప్రెసిడెన్సీలో జిన్నా న్యాయవాది వృత్తితో పాటు, కాంగ్రెస్ నేతగా వ్యవహరించారు. దక్షిణాఫ్రికాలో కార్మిక నేతగా పేరొంది బాంబే వచ్చిన గాంధీజీకి ఓవల్ మైదానంలో (1915 జనవరి 13) జరిగిన స్వాగత సభకు అధ్యక్షత వహించారు జిన్నా. వీరిద్దరూ గుజరాతీలు కావటం విశేషం. ఆ కాలంలోనే మలబార్ హిల్ లోని తన పాత ఇల్లు 'సౌత్ కోర్టు'ను కూల్చేసి, రెండున్నర ఎకరాల స్థలంలో ఈ బంగ్లాను నిర్మించారు. పాశ్చాత్య సంస్కృతి ఒంటపట్టించుకున్న జిన్నా - ఇటాలియన్ మార్బుల్, ఖరీదైన వాల్నెట్ వుడ్స్‌తో, బ్రిటిష్ పద్ధతిలో కట్టిన ఈ బంగ్లా పూర్తవ్వడానికి ఆరేళ్లు పట్టింది. ఖర్చు అంటారా? అప్పట్లోనే రెండు లక్షల రూపాయిల పై చిలుకు! 'ఈ భవనంలోని ఒక్కొక్క ఇటుక, నేను స్వతహాగా పర్యవేక్షించి ఉపయోగించింది' అని ఒక సందర్భంలో గర్వంగా చెప్పుకున్నారు. ముస్లిం లీగ్ సుప్రీం నేతగా 1944లో గాంధీజీతో దేశ విభజన ప్రాథమిక చర్చలు, ఆ తర్వాత 1946లో నెహ్రూ అధ్యక్షతన కాంగ్రెస్ నాయకులతో జరిగిన స్వాతంత్ర్య చర్చలు ఈ హవేలీలోనే జరిపారు జిన్నా. ప్రాణంతో సమానంగా చూసుకున్న సొంతింటిని వదిలి ఆగస్టు 1947లో కరాచీ వెళ్ళటానికి మనసొప్పలేదట పాపం జిన్నాకు. 'డియర్ జవహర్! ఇక నుండి జిన్నా హౌస్‌ను చూసుకునే బాధ్యత మీదే' అని నెహ్రూకు పాకిస్తాన్ నుండి రాసిన ఒక ఉత్తరంలో పేర్కొన్నారు. బాంబేతో తనకు ప్రత్యేక అనుబంధమనీ, తన సహచరులు చాలామంది ఇక్కడే ఉన్నారనీ, ప్రతి సంవత్సరం సెలవులకు వచ్చి ఇక్కడ కొన్ని రోజులు గడుపుతాననీ చెప్పి పాక్‌కు వెళ్లారు జిన్నా. కానీ విధి మరోలా నిర్ణయించింది. ఈ భవనం వదలి వెళ్ళాక 13 నెలలకే (11 సెప్టెంబర్ 1948న) క్షయ వ్యాధితో ఆయన మరణించారు.



జిన్నా హౌస్

తర్వాత కొన్నేళ్లు నెహ్రూ పర్యవేక్షణలో బ్రిటిష్ హైకమిషనర్ ఇందులో నివసించారు. ఎనిమీ ప్రాపర్టీ యాక్ట్ -1968 దరిమిలా ప్రస్తుతం జిన్నా హౌస్ భారత ప్రభుత్వ అధీనంలో ఉంది. 'కాయద్-ఎ-ఆజమ్' (గొప్ప నాయకుడు) స్మృతి దృష్ట్యా ఈ భవనాన్ని పాకిస్తాన్ కాన్సులేట్ కార్యాలయానికి (అద్దెకు) ఇవ్వాలని పాక్ పాలకులు అడపా దడపా కోరుతూ ఉంటారు.

- జిల్లా గోవర్ధన్, విశ్రాంత పీఎఫ్ అధికారి, ముంబై | 98190 96949

(భాజపా నేత జస్వంత్ సింగ్ రాసిన 'జిన్నా: ఇండియా, పార్టిషన్, ఇండిపెండెన్స్' ఆధారంగా)

మన అజ్ఞాత ఇంజినీర్లు

భారతదేశ అభివృద్ధి చేతివృత్తుల మీద జరిగింది. గౌండ్ల, కంసాలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి వంటి నైపుణ్యాలున్న కులాలు దేశమంతటా ఎన్నో ఉన్నాయి. పౌర సమాజంలో వీరి జనాభానే అధికం. ఈ చేతివృత్తుల కులాలే అనేక రంగాల్లో అద్భుతమైన ఇంజినీరింగ్ పరిజ్ఞానాన్ని సృష్టించాయి. ఉత్పత్తి సంస్కృతికి వీరు ప్రతినిధులు. ఆర్యులు, ముస్లింలు, బ్రిటిష్ వలసవాదులు గనక భారతదేశం మీదకు దండెత్తి వచ్చి ఉండకపోతే, ఈ భారతీయ ఇంజినీరింగ్ నైపుణ్యాలు ఒక ప్రత్యేక తాత్విక దృక్పథాన్ని సంతరించుకొని ఉండేవి. అయితే ఈ కులాలను ముస్లిం, బ్రిటిష్ దురాక్రమణదారుల కంటే బ్రాహ్మణ హిందూమతమే ఎక్కువగా దెబ్బతీసింది. వీరి నైపుణ్యాలకు ఆధ్యాత్మిక హోదా కల్పించలేదు. వీరిని సమాజంలో తక్కువ స్థాయిలోనే ఉంచింది. అయినా వాళ్లు సమాజ అభివృద్ధిలో నిరంతరం పాలుపంచుకుంటూనే వచ్చారు.

కల్లుగీత కార్మికులు వివిధ రాష్ట్రాల్లో వివిధ పేర్లతో పిలువబడుతున్నారు. వీళ్ళు మనుషులు తాగడానికీ, తద్వారా తమ ఆరోగ్యాన్ని సమతూలంగా ఉంచుకోవడానికీ పనికొచ్చే పానీయాన్ని అందించే చెట్లను కనుగొన్నారు. కనుగొనడమే కాదు, దానికి తగిన పనిముట్లను సిద్ధం చేశారు. ఇందులో వీరి గొప్ప ప్రతిభ దాగివుంది. అందుకే కల్లుగీత కోసం రూపొందించిన సాంకేతిక పరిజ్ఞానం మనిషికీ, ప్రకృతికీ మధ్య ఒక సజీవమైన అనుబంధంగా మారింది.

భారతదేశంలో అత్యంత గొప్ప ఇంజినీరింగ్ నైపుణ్యాలు మరో మూడు కులాల్లో కనిపిస్తాయి. అవి కమ్మరి (ఇనుముతో పనిముట్లు తయారు చేసేవాళ్లు), వడ్రంగి (కలపతో వివిధ పనులు చేసేవాళ్ళు), కంసాలి (బంగారం, వెండితో ఆభరణాలు చేసేవాళ్లు). కమ్మరి వృత్తి ఆర్యుల కాలం కంటే ముందు నుంచే ఉన్నట్టు కనపడుతుంది. వారి పనిముట్లు చరిత్రకు ఆనవాళ్లు పట్టిస్తాయి. ఈ వృత్తికి సంబంధించిన పరిజ్ఞానం ఇప్పటికీ మన గ్రామీణ, వ్యవసాయ ఆర్థిక వ్యవస్థలో అంతర్భాగం. కమ్మరి పని వ్యవసాయ ప్రక్రియలో అనేక విధాలుగా విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చింది. భారత దేశపు సామాజిక శక్తులు ఇనుము ఉపయోగాలను ఎలా కనుక్కొని ఉంటాయన్నది ఒక చారిత్రక అంశం. కమ్మరి కొలిమి ఇనుము సంబంధ పనుల్లో కీలకం. ఆ ప్రదేశం రెండు పైపులైన్లను తోలు తిత్తితో అనుసంధానించి ఉంటుంది. అది కొలిమిలోకి క్రమబద్ధంగా గాలిని సరఫరా చేస్తుంది. ఈ తిత్తి ఆవిష్కరణ ఒక అద్భుతం.



వడ్రంగి పనికి గొప్ప వృత్తి నైపుణ్యం అవసరం. వీరు సృష్టించిన అత్యంత విప్లవాత్మక సాధనం నాగలి. అలాగే వడ్రంగులు మానవ సమాజానికి అందించిన మరొక సేవ, ఇళ్ల నిర్మాణం. సమాజ ప్రధాన అవసరాలలో ఒకటైన ఇంటికి వాడే కర్రపనిలో వడ్రంగుల నైపుణ్యం మామూలుది కాదు. ఈనాటి ఇళ్ల నమూనాల మూలాలన్నీ వడ్రంగుల నైపుణ్యంలో దాగివున్నాయి.

ప్రపంచంలో తొలినాళ్ల కుండల తయారీ జ్ఞాన వ్యవస్థల్లో కొన్నింటికి భారతదేశం పుట్టినిల్లు అని చెప్పవచ్చు. సింధు నాగరికత నాటికి మన దేశంలో కుండల తయారీ ఎంతో ఉచ్చస్థితిలో ఉంది. కుండల తయారీని ఎలా అభివృద్ధి పరిచారు అన్నది ఒక ఆశ్చర్యం. భారతీయ గ్రామాల్లో కుండల తయారీలో అధునాతన పరిజ్ఞానం కలిగిన కులాలు ఉన్నాయి. వారిని తెలుగునాట కుమ్మరోళ్లని పిలుస్తారు. అసలు సింధు నాగరికత ఈ కుండలు తయారు చేసేవారి భుజస్కంధాలపై ఆధారపడే ఏర్పడినట్టు అనిపిస్తుంది. కుండల తయారీ పరిజ్ఞానం తొలుత మట్టికీ, చక్రానికీ మధ్య నుండే సంబంధాన్ని అర్థం చేసుకోవడంతో మొదలవుతుంది. ముడి కుండను మలిచేందుకు ముందు చక్రం తిప్పుతారు. మెత్తని బంక మట్టిని కుండగా మార్చవచ్చనీ, ఆ కుండలను వంటలకూ, నీళ్లు, ఇతర ద్రవ పదార్థాల నిల్వ ఉపయోగించవచ్చనీ వాళ్లకు ఎవరు చెప్పి ఉంటారు? మానవ జీవన పరిస్థితులను మెరుగుపరిచేందుకు భూవనరులతో నిరంతరం పోరాడేవాళ్ళే బంకమట్టి నుంచి రకరకాల కుండలు తయారు చేయ వచ్చని కనుగొని ఉంటారు. వేగంగా తిరిగే చక్రం మీద ఉంచిన బంకమట్టిని చేతివేళ్ల కొనలతో నొక్కుతూ ఒక ఆకారంలోకి తెస్తారు. ఈ దశలో కుమ్మరి చేతివేళ్ళు, గోళ్ళు కీలక పాత్ర పోషిస్తాయి. ఇవాళ గృహాల అంతర్గత అలంకరణకు వినియోగించేలా అనేక ఆకృతులను కూడా అద్భుతంగా తయారు చేస్తున్నారు.

ఇలా దేశంలోని ఎన్నో కులాలు భారతదేశ ఉత్పత్తి సంస్కృతికి ప్రాతినిధ్యం వహించాయి. దేశ నాగరకతను ముందుండి నడిపించాయి.

- కిరణ్ ఫిషర్
అడ్వకేట్ | 79893 81219

సిరి తలకెక్కితే పతనమే!

ఏ వ్యక్తినైనా విడిచి వెళ్ళేముందు సిరి ఆ వ్యక్తి తలకెక్కుతుందని ఎప్పటి నుంచో ప్రజలలో నమ్మకంగా స్థిరపడివున్నమాట! 'మేనంబురుషుని సప్త స్థానంబులు గడిచి, తలకు జని సిరి విడుచున్వాని' అని మార్కండేయ పురాణం, ద్వితీయాశ్వాసంలోని 236వ పద్యంలో పై విషయాన్నే మారన కవి చెప్పాడు.

ఒక సందర్భంలో అసురులకూ, అమరులకూ యుద్ధం జరుగుతుంది. ఆ యుద్ధంలో అమరులు పరాజయం పాలై భంగ పడి బాధలో ఉండగా, దేవ గురువైన బృహస్పతి, వెంటనే వెళ్ళి దత్తాత్రేయుడిని వేడుకొండని వారికి సలహా ఇస్తాడు. దత్తాత్రేయుడు విష్ణుమూర్తి అంశమున పుట్టిన వాడు గనుక, బృహస్పతి చెప్పినట్లుగానే దేవతలు వెళ్ళి జరిగినదంతా ఆయనకు విన్నవించుకొని ఆపద నుండి గట్టెక్కించమని ప్రాధేయపడతారు. అంతా విన్న దత్తాత్రేయుడు ఆలోచించి, మళ్ళీ వెళ్ళి అసురులను యుద్ధానికి ఆహ్వానించి తన ముందుకు తీసుకురమ్మని చెబుతాడు. దేవతలు అలాగే చేస్తారు. అమరులను తరుముతూ వచ్చిన అసురులు దత్తాత్రేయుడి ముందుకు రాగానే ఆయన పక్కనే కూర్చొని ఉండి, వెలుగులు చిమ్ముతున్న లక్ష్మీదేవి అందాన్ని చూసి, వచ్చిన సంగతి మరిచిపోయి, మోహంలో చిక్కుకుని, ఎలాగైనా సరే లక్ష్మీదేవిని దక్కించుకుని, తమతో తీసుకెళ్ళిపోవాలనే ఆలోచనలో పడతారు. వారి ఆలోచనను గ్రహించిన దత్తాత్రేయుడు ఏమీ అడ్డు చెప్పకుండా, అలాగే కానిండని చూస్తూ ఊరకుంటాడు. దానవులు లక్ష్మీదేవిని పట్టి శిబిక, అనగా పల్లకీలో కూర్చోబెట్టి, 'శిరంబుల మోచికొని' పోతుంటారు. అది చూసిన దత్తాత్రేయుడు నవ్వుతూ, 'సిరి దానవుల తలలకు ఎక్కి కూర్చుంది. అంటే వారి ప్రాభవం తగ్గడం మొదలైనట్లే, వారి పతనం ప్రారంభమైనట్లే. ఇక ఇప్పుడు వెళ్ళి వారితో యుద్ధం చేయండి. మీరే గెలుస్తారు. మీరు పోగొట్టుకున్నదంతా మీకు తిరిగి దక్కుతుంది' అంటాడు. అదే నిజమై, అప్పుడు జరిగిన సమరంలో అమరుల ధాటికి అసురులు తట్టుకోలేక ఓడిపోయి పారిపోతారు. సిరి తలకెక్కితే మనిషి ఆలోచన మారిపోయి ఉచ్చనీచాలను మరిచిపోతాడనీ, అలా మరిచిపోయి తన పతనాన్ని తానే కొని తెచ్చుకుంటాడనీ మార్కండేయ పురాణంలోని ఈ ఉదంతం మనకు చెబుతుంది.

జ్యోతిర్మయం

- భట్టు వెంకట రావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి: బ.పాడ్యమి తె.5.30 వరకు (తెల్లవారితే గురువారం), తదుపరి విదియ, నక్షత్రం: ఆరుద్ర రా.11.04 వరకు, తదుపరి పునర్వసు, వర్జ్యం: ఉ.6.54 నుండి 8.30 వరకు, దుర్ముహూర్తం: ఉ.11.39 నుండి 12.27 వరకు, అమృత ఘడియలు: ప.12.48 నుండి 2.27 వరకు. ; రాహుకాలం: ప.12.00 నుండి 1.30 వరకు, యమగండం: ఉ.7.30 నుండి 9.00 వరకు, సూర్యోదయం: 6.32, సూర్యాస్తమయం: 5.28.

ఏపీలో జనసేనతోనే పొత్తు: బీజేపీ

ఉయ్యూరు: రానున్న ఎన్నికల్లో పొత్తులపై తుది నిర్ణయం అధిష్టానానిదేనని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తెలిపారు. కృష్ణాజిల్లా, ఉయ్యూరు మండలం, కాటూరు శివారు రాజుపేటలో మంగళవారం ఆమె పర్యటించారు. పార్టీ జెండా ఆవిష్కరించారు. ఆకునూరు అక్కినేని కన్వెన్షన్‌లో జిల్లా స్థాయి బూత్ స్వశక్తీకరణ సమావేశానికి హాజరై దిశా నిర్దేశం చేశారు.

'పిండ మార్పిడి' విధానంలో గిర్‌జాతి కోడె దూడ జననం

- రాబోయే ఏడాది వంద దూడలు లక్ష్యం
- ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం శ్రీనివాసరావు



గిర్‌జాతి కోడె దూడను పరిశీలిస్తున్న ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో శ్రీనివాసరావు

చేబ్రోలు: పిండ మార్పిడి విధానంలో పశువులు, ఆవుల్లో గర్భం దాల్చడం ఇప్పటి వరకు పరిశోధనశాలలు, ఫామ్స్‌లో మాత్రమే ఉన్నాయని, ఆ దశదాటిన పరిశోధనలు క్షేత్ర స్థాయిలో సత్ఫలితాలను ఇస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో ఎం. శ్రీనివాసరావు తెలిపారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం కొత్తరెడ్డిపాలెం గ్రామానికి చెందిన గుంటూరు అనీల్ కుమార్‌రెడ్డికి సంబంధించిన జెర్సీ ఆవుకు పిండమార్పిడి ద్వారా గిర్‌జాతి కోడె దూడ జన్మించింది. మంగళవారం ఆంధ్రప్రదేశ్ పశుగణాభివృద్ధి సంస్థ సీఈవో శ్రీనివాసరావు, లాం ఫాం పశుపరిశోధనా కేంద్రం శాస్త్రవేత్త ఎం. ముత్తారావు, జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ ఈవో డి. బాలశంకరరావు తదితర బృందం గిర్‌జాతి కోడెదూడను పరిశీలించారు. జెర్సీ ఆవుకు గిర్‌జాతికి చెందిన పిండాన్ని ఈ ఏడాది మార్చి 13న ప్రవేశపెట్టారు. ఆ జెర్సీ ఆవు ఈనెల 22న గిర్‌జాతికి చెందిన కోడెదూడకు జన్మనిచ్చింది. ఈ సందర్భంగా సీఈవో ఎం శ్రీనివాసరావు విలేకర్లతో మాట్లాడుతూ పిండ మార్పిడి ద్వారా మేలు రకం జాతి లక్షణాలు ఉన్న సంతతితో పాటు, అంతరించి పోతున్న దేశవాళీ జాతులను కూడా వృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు 145 పిండాలను మార్పిడి చేయగా 45వరకు చూడి దశలో ఉన్నాయన్నారు. భవిష్యత్తులో మరిన్ని ప్రయోగాలు చేయనున్నట్లు తెలిపారు. ఇందుకోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.20 కోట్లు కేటాయించినట్లు వివరించారు. వచ్చే ఏడాది వంద దూడలు లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు.

ఏడీకి సీఈవో అభినందన

జిల్లాలో మొట్టమొదటి పిండమార్పిడిలో గిర్‌జాతి కోడె దూడ జన్మించింది. ఈ ప్రయోగాల కోసం కృషి చేసిన ఏడీ సాంబశివరావును సీఈవో ఎం శ్రీనివాసరావు, శాస్త్రవేత్త ముత్తారావు, ఉన్నతాధికారులు సన్మానించారు. పశుసంవర్థకశాఖ ఏడీలు, పశువైద్యాధికారులు తదితరులు పాల్గొన్నారు.

బ్లాక్ మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ దూండీ రాకేష్

- వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ

గాంధీనగర్ (విజయవాడ సెంట్రల్): టీడీపీ వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడు దూండీ రాకేష్ బ్లాక్‌మెయిల్ రాజకీయాలకు కేరాఫ్ అడ్రస్‌గా మారాడని, అతనొక పెద్దమోసగాడని వైఎస్సార్‌సీపీ వాణిజ్య విభాగం ఆరోపించింది. ఆయన హైదరాబాద్ నుంచి ఎందుకు పారిపోయివచ్చాడో.. ఆ బాగోతం అంతా బయటపెడతామని వాణిజ్య విభాగం నాయకులు హెచ్చరించారు. మంగళవారం విజయవాడ భవానీపురంలోని ఎన్టీఆర్ జిల్లా వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ వాణిజ్య విభాగం నాయకులు మీడియాతో మాట్లాడారు. మురళీకృష్ణ మాట్లాడుతూ దూండీ రాకేష్‌కు వెలంపల్లి శ్రీనివాసరావు ఫోబియో పట్టిందన్నారు. విజయవాడలో ఏం జరిగినా దానికి కారణం వెలంపల్లేనని విమర్శలు చేసి పబ్బం గడుపుకుంటున్నాడన్నారు. దూండీ రాకేష్ తన సొంత పట్టణం నంది గామ, హైదరాబాద్‌లో ఐపీ పెట్టి పారిపోయి విజయవాడ వచ్చి తల దాచుకుంటున్న మోసగాడని మండిపడ్డారు. ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షుడు కొనకళ్ల విద్యాధరరావు మాట్లాడుతూ దూండీ రాకేష్ లాంటి చీటర్‌ను వాణిజ్య విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా నియమించడం బాబుకు పట్టిన దుర్గతి అన్నారు.

రైల్లో నిషేధిత వస్తువులు తీసుకెళితే కఠిన చర్యలు: రైల్వేశాఖ




ప్రయాణికుల బ్యాగు తనిఖీ చేస్తున్న ఆర్‌పీఎఫ్ పోలీసు

రైల్వేస్టేషన్(విజయవాడ పశ్చిమ): సురక్షితమైన రైలు ప్రయాణం కోసం ప్రయాణికులు రైళ్లల్లో నిషేధిత వస్తువులు తీసుకువెళ్లరాదని విజయవాడ డివిజన్ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. రైలు ప్రయాణంలో కొంతమంది పూజల కోసం కర్పూరం, అగ్గిపుల్లలు, అగరబత్తీలు వెలిగిస్తున్నారని, దీనివల్ల రైల్లో మంటలు చెలరేగే అవకాశం ఉందన్నారు. అటువంటి చర్యలను రైల్వేశాఖ పూర్తిగా నిషేధించినట్లు తెలిపారు. వీటిని అతిక్రమించిన వారిపై రైల్వే చట్టం ప్రకారం తీవ్ర నేరంగా పరిగణిస్తామని, మూడేళ్ల జైలు, రూ.వెయ్యి జరిమానా లేదా రెండు విధించబడతాయన్నారు. దీనిపై ఆర్పీఎఫ్, కమర్షియల్ సిబ్బంది రైళ్లలో నిరంతరం ప్రత్యేక తనిఖీలు చేపడుతున్నట్లు వివరించారు.

కరువులు. కల్లోలాలు. కొట్లాటలు. కన్నీళ్లు...

క్లుప్తంగా చెప్పుకుంటే ప్రపంచానికి 2023 ప్రధానంగా మిగిల్చిన గుర్తులివే! 2022లో ఉక్రెయిన్‌పై రష్యా మొదలు పెట్టిన ఆక్రమణ 2023 పొడవునా పడుతూ లేస్తూ కొనసాగింది. ఇది చాలదన్నట్టు ఏడాది చివర్లో ఇజ్రాయెల్ దండయాత్ర పాలస్తీనాలో కనీవినీ ఎరగని మానవీయ సంక్షోభానికి కారణమైంది. లక్షలాది మంది ఆకలి కేకలు ఐరాస సామర్థ్యంపై మరోసారి ప్రశ్నలు లేవనెత్తాయి. అంతర్జాతీయ సమాజంలో మానవీయ స్పందన కరువైన తీరును కళ్లకు కట్టాయి. ఈ ఏడాది ప్రపంచవ్యాప్తంగా పలు దేశాలు అటు కరువు, ఇటు వరదలతో అతలాకుతలమయ్యాయి. భూతాపోన్నతి ఒకానొక దశలో 2 డిగ్రీల లక్ష్మణరేఖను దాటేసి ప్రపంచానికి పొంచి ఉన్న ముప్పును మరోసారి గుర్తు చేసింది. ఏదో ఒక రూపంలో అడపాదడపా తలెత్తుతున్న కరోనా ఏడాది ముగుస్తుండగా కొత్త వేరియంట్ రూపంలో మరోసారి గుబులు పుట్టిస్తోంది. చంద్రయాన్, జీ20 సదస్సు నిర్వహణ వంటివి భారత కీర్తి ప్రతిష్టలను అంతర్జాతీయ వేదికపై మరింతగా చాటాయి. 2023 త్వరలో కాలగర్భంలో కలిసిపోనున్న నేపథ్యంలో ఈ ఏడాది భారత్‌లోనూ, అంతర్జాతీయంగానూ జరిగిన ప్రధాన సంఘటనలపై విహంగ వీక్షణం. - సాక్షి, నేషనల్ డెస్క్



A ఆర్టికల్ 370



జమ్మూ కశ్మీర్‌కు పలు విషయాల్లో ప్రత్యేక హోదా కల్పించిన ఈ వివాదాస్పద ఆర్టికల్‌ను రద్దు చేస్తూ మోదీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సుప్రీంకోర్టు పూర్తిగా సమర్థించింది. ఏ రాష్ట్రానికీ విడిగా అంతర్గత ప్రజాస్వామ్యం అంటూ ఉండబోదని కుండబద్దలు కొట్టింది. సీజేఐ జస్టిస్ డి.వై.చంద్రచూడ్ సారథ్యంలోని ఐదుగురు న్యాయమూర్తుల రాజ్యాంగ ధర్మాసనం డిసెంబర్ 11న ఈ మేరకు ఏకగ్రీవంగా తీర్పు వెలువరించింది. దాంతో కశ్మీర్‌కు ప్రత్యేక పతాకం, రాజ్యాంగం, అంతర్గత వ్యవహారాల్లో పూర్తి స్వతంత్ర ప్రతిపత్తి కల్పించిన ఆర్టికల్ 370 శాశ్వతంగా కాలగర్భంలో కలిసిపోయింది.

B బైడెన్



అమెరికా చరిత్రలో అత్యంత వృద్ధ అధ్యక్షుడైన 81 ఏళ్ల బైడెన్.. 2024లో అధ్యక్ష ఎన్నికల్లో మళ్లీ నెగ్గి తన రికార్డును తానే మెరుగుపరచాలని ప్రయత్నిస్తున్నారు. రష్యాతో యుద్ధంలో ఉక్రెయిన్‌కు సాయుధ, ఆర్థిక మద్దతు కొనసాగింపుపై విమర్శలతో పాటు పాలస్తీనాలో మానవీయ సంక్షోభం ముదురుతున్నా యుద్ధం ఆపేలా ఇజ్రాయెల్‌ను ఒప్పించలేకపోతున్నారంటూ ఈ ఏడాది మరో అప్రతిష్ట కూడా మూటగట్టుకున్నారాయన. రిపబ్లికన్ పార్టీ తరఫున మరోసారి అధ్యక్ష బరిలో దిగేలా ఉన్న డొనాల్డ్ ట్రంప్ నుంచి బైడెన్‌కు గట్టి పోటీ తప్పకపోవచ్చంటున్నారు. కోర్టు కేసులు 77 ఏళ్ల ట్రంప్ ఆశలపై నీళ్లు చల్లని పక్షంలో 2020లో మాదిరే ఈసారి కూడా అధ్యక్ష పీఠం కోసం వీరిద్దరే పోటీ పడేలా ఉన్నారు.

C చంద్రయాన్-3



అంతరిక్ష రంగంలో భారత కీర్తి పతాకను సమున్నతంగా ఎగరేసిన కీలక ప్రయోగం. 2023 జూలై 14న శ్రీహరికోట నుంచి ఇస్రో చేపట్టిన ఈ ప్రయోగం దిగ్విజయం సాధించింది. ఆగస్టు 5న చంద్రుని కక్ష్యలోకి ప్రవేశించిన వ్యోమ నౌక 23న చంద్రుని దక్షిణ ధ్రువ సమీపంలో సురక్షితంగా దిగింది. ఈ విజయానికి గుర్తుగా ఆగస్టు 23న జాతీయ అంతరిక్ష దినోత్సవంగా ప్రధాని మోదీ ప్రకటించారు

D డొనాల్డ్ ట్రంప్



బహుశా అమెరికా చరిత్రలోనే అత్యంత వివాదాస్పదుడైన నేత. ఆ దేశంలో నేరాభియోగాలు ఎదుర్కొన్న తొలి మాజీ అధ్యక్షునిగా రికార్డు సృష్టించారు. నీలి చిత్రాల తారతో అఫైర్‌ను కప్పిపుచ్చేందుకు డబ్బుల చెల్లింపు వ్యవహారంలో గత ఏప్రిల్లో కోర్టు మెట్లెక్కిన సందర్భంగా సాంకేతికంగా అరెస్టు కూడా అయ్యారు! ఇదీ రికార్డే. దీంతోపాటు 2020 అధ్యక్ష ఎన్నికల ఫలితాలను సవాలు చేస్తూ క్యాపిటల్ భవనంపై తన సమర్థకులను దాడికి ఉసిగొల్పిన కేసులో ట్రంప్‌ను కొలరాడో సుప్రీంకోర్టు తాజాగా దోషిగా తేల్చింది. 2024 అధ్యక్ష ఎన్నికల్లో పోటీకి అనర్హుడిగా ప్రకటించింది! ఇలా అనర్హతకు గురైన తొలి మాజీ అధ్యక్షునిగా కూడా నిలిచారు. అయినా ఎన్నికల్లో పోటీకి సై అంటున్నారు!

E ఎలక్షన్స్



2024 లోక్‌సభ ఎన్నికలకు సెమీఫైనల్స్‌గా భావించిన ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు బీజేపీకి మరింత ఊపునిస్తే విపక్ష కాంగ్రెస్‌ను తీవ్ర నిరాశకు లోను చేశాయి. ఈ ఏడాది చివర్లో జరిగిన ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పాలిత రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్‌ల్లో బీజేపీ విజయబావుటా ఎగరేయడమే గాక మధ్యప్రదేశ్‌లోనూ ఘనవిజయం సాధించింది. ఎన్ని హామీలిచ్చినా రాజస్తాన్‌లో ఓటమి చవిచూడటమే గాక అధికారం నిలుపుకోవడం ఖాయమని భావించిన ఛత్తీస్‌గఢ్‌నూ కోల్పోవడంతో కాంగ్రెస్ తీవ్ర నైరాశ్యానికి లోనైంది. తెలంగాణలో సాధించిన అనూహ్య విజయం ఈ ఓటముల ముందు చిన్నబోయింది. ఈ నేపథ్యంలో విపక్ష ఇండియా కూటమి సారథిగా కాంగ్రెస్ ప్రాధాన్యం కూడా తగ్గుముఖం పట్టింది. లోక్‌సభ ఎన్నికల్లో తమకే ఎక్కువ సీట్లు కేటాయించాలంటూ భాగస్వాముల నుంచి డిమాండ్లు పెరుగుతున్నాయి!

F ఫారిన్ అఫైర్స్



విదేశీ వ్యవహారాల్లో 2023 భారత్‌కు మిశ్రమ ఫలితాలిచ్చింది. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం విషయంలో మాదిరిగానే గాజాపై ఇజ్రాయెల్ దాడి విషయంలో కూడా ఏ పక్షం వైపూ పూర్తిగా మొగ్గకుండా ఎప్పట్లాగే కేంద్రం ఆచితూచి స్పందిస్తూ వస్తోంది. అంతేగాక జీ20 సదస్సు నిర్వహణ వంటి పలు అంతర్జాతీయ విజయాలు మన ఖాతాలో పడ్డాయి. అయితే కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య వెనక భారత్ ఉందన్న ఆ దేశ ప్రధాని ఆరోపణలు ద్వైపాక్షిక సంబంధాలను తీవ్రంగా ప్రభావితం చేశాయి. ఒకరకంగా ఇరు దేశాల మధ్య నెలల తరబడి 'దౌత్య యుద్ధమే' జరిగింది. ఈ విషయంలో అమెరికా కూడా కెనడాకే దన్నుగా నిలవడం మనకు ఇబ్బందికరంగా మారింది.

G జి 20



ప్రతిష్టాత్మక జీ20 శిఖరాగ్ర సదస్సుకు భారత్ తొలిసారి ఆతిథ్యమిచ్చింది. సెప్టెంబర్లో ఢిల్లీలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచంలోని అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ తదితర ప్రముఖ దేశాల అధినేతలు తరలివచ్చారు. ప్రధాని మోదీ ప్రతిపాదించిన న్యూఢిల్లీ డిక్లరేషన్‌ను సదస్సు ఏకగ్రీవంగా ఆమోదించింది. ఈ మూడు రోజుల శిఖరాగ్రం ఘనవిజయం సాధించి అంతర్జాతీయ వేదికపై భారత కీర్తి ప్రతష్టలను మరింతగా పెంచింది.

H హెచ్1బీ రెన్యువల్స్



వేలాది భారతీయ టెకీలకు అమెరికాలో ఉద్యోగాలు చేసుకునేందుకు అవకాశం కల్పిస్తున్న కీలకమైన హెచ్1బీ వీసాల విషయంలో అగ్ర రాజ్యం ఈ ఏడాది కీలక నిర్ణయం తీసుకుంది. వాటిని ఇకపై అమెరికాలోనే రెన్యువల్ చేసుకునేందుకు వీలు కల్పిస్తున్నట్టు ప్రకటించింది. తొలి విడతగా 20 వేల దరఖాస్తుల ప్రాసెసింగ్ ప్రక్రియను మొదలు పెట్టింది కూడా. దాంతో రెన్యువల్స్‌కు భారత్‌కో, మరో దేశానికో వెళ్లాల్సిన అవస్థ తప్పనుంది.

I ఇమ్రాన్ ఖాన్



గతేడాది పాకిస్తాన్ ప్రధాని పదవి పోగొట్టుకుని, హత్యాయత్నం నుంచి తూటా గాయాలతో బయట పడ్డ ఇమ్రాన్ ఖాన్ ఈ ఏడాది ఏకంగా జైలుపాలయ్యారు! భూ వివాదం కేసులో తొలుత మే 9న హైకోర్టు ప్రాంగణంలోనే అరెస్టయ్యారు. తర్వాత విడుదలైనా తోషాఖానా కానుకల కేసులో ఆగస్టు 6న మళ్లీ అరెస్టయ్యారు. అప్పటినుంచీ జైల్లోనే మగ్గుతున్నారు. ఆయనపై 140కి పైగా కేసులు దాఖలయ్యాయి! ఫిబ్రవరిలో జరిగే సాధారణ ఎన్నికల్లో పోటీ చేయకుండా ఇమ్రాన్‌ను అడ్డుకోవడమే లక్ష్యంగా పాకిస్తాన్ ముస్లిం లీగ్ పావులు కదుపుతోంది. పాక్‌లో సర్వశక్తిమంతమైన సైన్యం కూడా అందుకు పూర్తిగా సాయపడుతున్నట్టు కన్పిస్తోంది.

J జిన్‌పింగ్



మావో అనంతరం చైనాలో అత్యంత శక్తిమంతుడైన నాయకునిగా అవతరించారు. 2023 మార్చిలో ఏకంగా వరుసగా మూడోసారి దేశ అధ్యక్షునిగా ఎన్నికై చరిత్ర సృష్టించారు. చైనా చరిత్రలో ఈ ఘనత సాధించిన ఏకైక నాయకునిగా రికార్డులకెక్కారు. పార్టీలోని ప్రత్యర్థులను ఉక్కుపాదంతో అణచివేస్తూ ఎదురులేని నాయకునిగా మారారు. అయితే కరోనా కల్లోలాన్ని సమర్థంగా ఎదుర్కోలేకపోయారన్న అప్రతిష్టను మూటగట్టుకున్నారు. లాక్‌డౌన్‌ను భరించలేక జనం భారీగా తిరుగుబాటుకు దిగడంతో నిబంధనలను సడలించాల్సి రావడం జిన్‌పింగ్ ప్రతిష్టకు మచ్చగా మిగిలింది. రియల్టీ భారీ పతనం, ఆర్థిక ఒడిదుడుకులు ఆయనకు సవాలుగా మారాయి.

K కింగ్ చార్లెస్-3



బ్రిటన్ రాజుగా చార్లెస్-3 పట్టాభిషేకం జరుపుకున్నారు. మే 6న అట్టహాసంగా జరిగిన ఈ కార్యక్రమానికి ప్రపంచ దేశాధినేతలంతా హాజరయ్యారు. 73 ఏళ్ల చార్లెస్-3 2022 సెప్టెంబర్ 8న తన తల్లి క్వీన్ ఎలిజబెత్-2 మరణంతో గద్దెనెక్కారు. అత్యంత పెద్ద వయసులో ఆ బాధ్యతలు చేపట్టి రికార్డులకెక్కారు. 8 నెలల తర్వాత లాంఛనంగా పట్టాభిషిక్తుడయ్యారు.

L ఎల్‌జీబీటీక్యూఐ



స్వలింగ సంపర్కం ఈ ఏడాదీ తరచూ వార్తల్లో నిలిచింది. స్వలింగ వివాహాలకు చట్టబద్ధత కల్పించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. అది పార్లమెంటు పరిధిలోని అంశమంటూ అక్టోబర్ 17న తీర్పు వెలువరించింది. అయితే స్వలింగ సంపర్కులకూ ఇతరుల మాదిరిగానే అన్ని హక్కులూ ఉంటాయని స్పష్టం చేసింది. వాటిని కాపాడాలని, వారిని ఎవరూ చిన్నచూపు చూడకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలూ తీసుకోవాలని కేంద్రాన్ని, రాష్ట్రాలను ఆదేశించింది.

M మణిపూర్ కల్లోలం



ఈశాన్య రాష్ట్రమైన మణిపూర్ ఈ ఏడాది జాతుల హింసతో అట్టుడికింది. సంఖ్యాధికులైన మెయితీ తెగవారు తమను గిరిజనేతరులుగా గుర్తించాలంటూ డిమాండ్ చేస్తున్నారు. దాన్ని వ్యతిరేకిస్తూ గిరిజన కుకీలు మే 3న జరిపిన ర్యాలీ హింసాత్మకంగా మారింది. కుకీ మహిళను దారుణంగా హింసించి నగ్నంగా ఊరేగించడమే గాక అత్యాచారానికి పాల్పడటంతో రాష్ట్రం భగ్గుమంది. అలా చెలరేగిన హింసాకాండ నేటికీ కొనసాగుతూనే ఉంది. వందలాది మంది మరణించగా కనీసం 40 వేల మందికి పైగా కుకీలు పొరుగు రాష్ట్రాలకు వలస బాట పట్టారు. కేంద్రం మెయితీల పట్ల పక్షపాతం చూపుతూ సమస్య పరిష్కారంపై మీనమేషాలు లెక్కిస్తోందంటూ విమర్శలపాలైంది.

N నార్త్ కొరియా



ఉత్తర కొరియా 2023 పొడవునా వరుస క్షిపణి పరీక్షలతో హోరెత్తిస్తూనే ఉంది. పొరుగు దేశం దక్షిణ కొరియానూ, అమెరికానూ హడలెత్తిస్తూనే ఉంది. మొత్తమ్మీద ఈ ఏడాది అది 36కు పైగా క్షిపణి పరీక్షలు జరిపింది. వీటిలో రెండు ఖండాంతర బాలిస్టిక్ క్షిపణి పరీక్షలు కూడా ఉన్నాయి! దాంతో ఉద్రిక్తతల తగ్గింపుకు ఇరు దేశాల మధ్య 2018లో కుదిరిన ఒప్పందాన్ని దక్షిణ కొరియా రద్దు చేసుకునే దాకా వెళ్లింది.

O అపోజిషన్



కాంగ్రెస్‌తో పాటు 28 విపక్షాలు ఒక్క వేదికపైకి రావడం 2023లో జరిగిన ముఖ్య రాజకీయ పరిణామం. 2024 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ సారథ్యంలోని ఎన్డీయే కూటమిని ఓడించడమే లక్ష్యంగా కాంగ్రెస్ చొరవతో ఈ కూటమి తెరపైకి వచ్చింది. జూలై 18న బెంగళూరులో జరిగిన రెండో భేటీలో కూటమికి ఇండియా పేరును ఖరారు చేశారు. కూటమి నాలుగుసార్లు సమావేశమై భావి కార్యాచరణపై చర్చించింది. ఎన్నికలు ముంచుకొస్తున్నందున జనవరి రెండో వారంలోగా సీట్ల సర్దుబాటును ఖరారు చేసుకునే పనిలో ఉంది.

P పాకిస్తాన్ దివాలా



2023లో పాకిస్తాన్ ఆర్థిక కష్టాలు మరింతగా పెరిగాయి. నిత్యావసరాలకు కూడా కటకటలాడే పరిస్థితి తలెత్తింది. బియ్యం, గోధుమ పిండి తదితరాల కోసం జనం కొట్టుకుంటున్న దృశ్యాలు పరిపాటిగా మారాయి. విదేశీ మారకద్రవ్య నిల్వలు అట్టడుగుకు చేరాయి. ఏడాది చివరికి వచ్చేసరికి పాస్‌పోర్టుల ముద్రణకు కావాల్సిన పేపర్ దిగుమతికి కూడా చెల్లింపులు చేయలేని పరిస్థితికి చేరింది. దాంతో ఒక దశలో పాస్‌పోర్టుల జారీయే నిలిచిపోయింది.

Q క్వేక్స్



ఈ ఏడాది భారీ భూకంపాలతో పలు దేశాలు అతలాకుతలమయ్యాయి. ఫిబ్రవరి 6న 7.8 తీవ్రతతో సంభవించిన భూకంపం తుర్కియే, సిరియాల్లో పెను విధ్వంసమే సృష్టించింది. 50 వేల మందికి పైగా దీనికి బలయ్యారు. వీరిలో 44 వేలకు పైగా మరణాలు తుర్కియేలోనే సంభవించాయి! అనంతరం సెప్టెంబర్ 8న మొరాకోలో వచ్చిన 6.8 తీవ్రతతో కూడిన భూకంపానికి 3,000 మందికి పైగా బలయ్యారు. డిసెంబర్ 19న వాయవ్య చైనాలో వచ్చిన భూకంపం 150 మందిని బలి తీసుకుంది. ఉత్తరాఖండ్‌లోని జోషీ మఠ్‌లో నేల కుంగుబాట పట్టిన వైనమూ కలకలం రేపింది. వందలాది ఇళ్లు నిలువునా పగుళ్లిచ్చాయి!

R ఆర్ఆర్ఆర్‌కు ఆస్కార్



ఈ ఏడాది తెలుగు సినిమా అంతర్జాతీయ వేదికపై దేశ గౌరవాన్ని రెట్టింపు చేసింది. ఆస్కార్ అవార్డు సాధించిన తొలి భారతీయ చిత్రంగా రాజమౌళి దర్శకత్వంలో రూపొందిన ఆర్ఆర్ఆర్ చరిత్ర సృష్టించింది. బెస్ట్ ఒరిజినల్ సాంగ్ విభాగంలో నాటు నాటుకు ఉత్తమ పాట అవార్డు దక్కింది. మార్చిలో జరిగిన ఆస్కార్ వేడుకలో గీత రచయిత చంద్రబోస్, సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి అవార్డును అందుకున్నారు. 2009లో భారతీయ సినిమా 'స్లమ్ డాగ్ మిలియనీర్'లో ఏఆర్ రెహ్మాన్ స్వరపరిచిన జై హో పాటకూ ఆస్కార్ వచ్చినా ఆ సినిమాను యూకే ప్రొడక్షన్స్ పతాకంపై హాలీవుడ్ దర్శకుడు డానీ బోయల్ రూపొందించారు.

S సస్పెన్షన్లు



2023 ముగింపుకు వచ్చిన వేళ విపక్ష ఎంపీల భారీ సస్పెన్షన్లు పార్లమెంటు శీతాకాల సమావేశాలను వేడెక్కించాయి. డిసెంబర్ 13న లోక్‌సభలో జరిగిన భద్రతా వైఫల్యంపై కేంద్రాన్ని నిలదీస్తూ విపక్ష ఎంపీలు ఉభయ సభలనూ రోజుల తరబడి హోరెత్తించారు. దాంతో లోక్‌సభ, రాజ్యసభ రెండింటి నుంచీ కలిపి వారం రోజుల వ్యవధిలో ఏకంగా 149 మంది విపక్ష ఎంపీలను సస్పెండ్ చేశారు. ఇంతమంది ఎంపీలను సస్పెండ్ చేయడం పార్లమెంటు చరిత్రలో ఇదే తొలిసారి. ఈ వరుస సస్పెన్షన్లు రాజకీయంగా దుమారం రేపాయి.

T టన్నెల్



మనిషి సంకల్పం ముందు మంచు శిఖరం తలొంచింది. ఉత్తరాఖండ్‌లో సిల్క్‌యారా సొరంగం కుప్పకూలి లోన చిక్కుబడ్డ 41 మంది కార్మికులు 16 రోజుల ఉత్కంఠ తర్వాత సురక్షితంగా బయట పడ్డారు. హైవే పనుల్లో భాగంగా నిర్మాణంలో ఉన్న ఈ సొరంగం నవంబర్ 12న పాక్షికంగా కూలిపోయింది. రెస్క్యూ ఆపరేషన్లో రోజుకో సమస్యలతో నిత్యం సస్పెన్సు నెలకొంటూ వచ్చింది. కీలకమైన చివరి అంకం సినిమా క్లైమాక్స్‌నే తలపించింది. యంత్ర బలం చేతులెత్తేసిన వేళ ర్యాట్ హోల్ కార్మికులు చివరి 12 మీటర్ల మేరకు శిథిలాలను జాగ్రత్తగా తవ్వేసి కార్మికులను బయటికి తీసుకొచ్చారు.

U యూసీసీ



ఉమ్మడి పౌర స్మృతి (యూసీసీ) ఈ ఏడాది కూడా వార్తల్లో నిలిచింది. కులమత తదితర విభేదాలకు అతీతంగా దేశ ప్రజలందరికీ ఒకే రకమైన వ్యక్తిగత చట్టాలను వర్తింపజేసేందుకు ఉద్దేశించిన యూసీసీని అమలు చేసే దిశగా ఉత్తరాఖండ్ బీజేపీ ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. దీనిపై ఏర్పాటైన దేశాయ్ కమిటీ నవంబర్లో ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఈ నేపథ్యంలో కొత్త ఏడాదిలో యూసీసీ విషయమై దేశవ్యాప్తంగా ఆసక్తికర పరిణామాలు జరగవచ్చు.

V వెనెజులా



పొరుగున ఉన్న బుల్లి దేశమైన గయానాలోని ఎసిక్విబో ప్రాంతంలో అపార చమురు నిక్షేపాలపై వెనెజులా కన్నేయడం ఉద్రిక్తతలకు కారణమైంది. అవసరమైతే సైనిక చర్యకు దిగైనా దాన్ని దక్కించుకునే దిశగా పావులు కదుపుతుండటంతో దక్షిణ అమెరికాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్నాయి.

W వార్స్



2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై రష్యా మొదలు పెట్టిన యుద్ధం ఈ ఏడాదంతా కొనసాగుతూనే ఉంది. హమాస్ మెరుపుదాడి కారణంగా అక్టోబర్లో పాలస్తీనాపై ఇజ్రాయెల్ తలపెట్టిన యుద్ధమూ భీకరంగా సాగుతూనే ఉంది. ఇలా 2023 యుద్ధ సంవత్సరంగా గుర్తుండిపోనుంది.

X ఎక్స్



ప్రముఖ సోషల్ సైట్ ట్విట్టర్‌ను సుదీర్ఘ కాలయాపన, వివాదాల తర్వాత 2022 చివర్లో సొంతం చేసుకున్న ఎలాన్ మస్క్, గత జూలైలో దాని పేరును ఎక్స్‌గా మార్చి మరో సంచలనం సృష్టించారు. బ్లూ టిక్ తీసేయడం మొదలుకుని ఆయన తీసుకున్న పలు నిర్ణయాలతో సంస్థ విలువ సగానికి సగం పడిపోయింది.

Y యెవగనీ ప్రిగోజిన్



రష్యా అధ్యక్షుడు పుతిన్ సన్నిహితుడు. వాగ్నర్ ప్రైవేట్ సైనిక మూక చీఫ్. పుతిన్‌తో విభేదాల నేపథ్యంలో ఆగస్టు 23న 'విమాన ప్రమాదం'లో ప్రిగోజిన్ మరణించాడు. రష్యాలో ఇలా అనుమానాస్పదంగా కాలగర్భంలో కలిసిపోయిన వారి జాబితాలో చేరిపోయాడు.

Z జియోనిజం



పశ్చిమాసియాలో ప్రత్యేక యూదు రాజ్య స్థాపనకు పుట్టుకొచ్చిన ఉద్యమం. గాజాపై ఇజ్రాయెల్ యుద్ధంతో ఇది మరోసారి తెరపైకి వచ్చింది. తాను జియోనిస్టునని అమెరికా అధ్యక్షుడు బైడెన్ తాజాగా ప్రకటించడంతో మరోసారి వార్తల్లో నిలిచింది.

భారత్, పాక్ చర్చలు జరపకుంటే
కశ్మీర్‌కూ గాజా గతే: ఫరూక్

శ్రీనగర్: దశాబ్దాలుగా ఎటూ తేలని కశ్మీర్ అంశంపై భారత్, పాకిస్తాన్‌లు చర్చిస్తేనే పరిష్కారం లభిస్తుందని, లేదంటే కశ్మీర్‌కు సైతం గాజాకు పట్టిన గతే పడుతుందని నేషనల్ కాన్ఫరెన్స్ పార్టీ అధ్యక్షుడు ఫరూక్ అబ్దుల్లా తీవ్ర వ్యాఖ్యలు చేశారు. మంగళవారం శ్రీనగర్‌లో మీడియాతో ఆయన మాట్లాడారు. '' ఇటీవల పూంఛ్‌లో అమాయక పౌరుల మరణాలపై వివరణ ఇవ్వకుండా ఇక్కడి సైన్యాధికారులను బదిలీచేసినంత మాత్రాన సమస్యకు పరిష్కారం దొరకదు. అమాయక కశ్మీరీలను సైన్యం చిత్రహింసలు పెట్టి చంపేసిన ఘటనపై సమగ్ర దర్యాప్తు జరపాల్సిందే. చనిపోయిన ముగ్గురిలో ఒకతని సోదరుడు భారత సైన్యంలో 24 ఏళ్లుగా పనిచేస్తున్నాడు. ఇన్నాళ్ల సేవకు ఆ సైనికుడికి దక్కిన ప్రతిఫలం ఇదేనా?. తాము శత్రువులమేమో అనేంతగా హిందూ, ముస్లింల మధ్య విద్వేషం పెంచారు. కశ్మీర్‌పై పాకిస్తాన్‌తో భారత్ చర్చలు జరిపి పరిష్కారం కనుగొనాలి. లేదంటే గాజాలో పాలస్తీనియన్లు ఎదుర్కొంటున్న దారుణ పరిస్థితులను కశ్మీరీలు చవిచూడాల్సి రావొచ్చు'' అని ఫరూక్ విమర్శలు గుప్పించారు.

జేఎన్1 వేరియంట్ కేసులు పైపైకి

న్యూఢిల్లీ: కరోనా జేఎన్1 ఉప వేరియంట్ వైరస్ పాజిటివ్ కేసులు దేశంలో నెమ్మదిగా పెరుగుతున్నాయి. నిన్నటితో పోలిస్తే మరో ఆరు జేఎన్1 కేసులు వెలుగుచూడటంతో జేఎన్1 రకం కేసుల సంఖ్య 69కి పెరిగిందని కేంద్రం మంగళవారం వెల్లడించింది. అయితే జేఎన్1 పాజిటివ్‌గా తేలిన రోగుల్లో 92 శాతం మంది తమ తమ ఇళ్లలోనే ఐసోలేషన్‌లో చికిత్స పొందుతున్నారని, భయపడాల్సిన పనిలేదని కేంద్రం స్పష్టం చేసింది.



నౌకాదళంలోకి ఐఎన్ఎస్ ఇంఫాల్

ముంబై: భారత నావికాదళ సామర్థ్యాన్ని మరింత పటిష్టంచేస్తూ అత్యాధునిక స్టెల్త్ గైడెడ్ క్షిపణి విధ్వంసక యుద్ధనౌక 'ఐఎన్ఎస్ ఇంఫాల్' మంగళవారం భారత నావికాదళంలో చేరింది. ముంబైలోని నేవల్ డాక్‌యార్డ్‌లో జరిగిన ఈ కార్యక్రమంలో రక్షణ మంత్రి రాజ్‌నాథ్ ఈ నౌకను ప్రారంభించారు. ముంబైలోని ప్రభుత్వరంగ మజగావ్ డాక్ లిమిటెడ్ దీన్ని తయారుచేసింది. ఈశాన్య రాష్ట్రాల్లోని ఒక నగరం పేరును యుద్ధనౌకకు పెట్టడం ఇదే తొలిసారి.

- 163 మీటర్ల పొడవైన నౌక బరువు ఏకంగా 7,400 టన్నులు. దీని తయారీకి వాడిన పరికరాల్లో 75 శాతం దేశీయంగా తయారైనవే.
- ఈ నౌకలో అత్యాధునిక సెన్సార్లు, నిఘా రాడార్లున్నాయి.
- అన్ని రకాల క్షిపణులు, యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ లాంచర్లు, టోర్పెడోలు, ఏఎస్‌డబ్ల్యూ హెలికాప్టర్లను దీనిపై మోహరించవచ్చు.

జనవరి ఒకటిన ఎక్స్‌పోశాట్ ప్రయోగం

బెంగళూరు: జంట కృష్ణబిలాలు, న్యూట్రాన్ నక్షత్రాల రహస్యాలు కనుగొనే లక్ష్యంతో ఇస్రో మరో ప్రయోగానికి సిద్ధమైంది. అంతరిక్ష వెలుగులీనే ప్రాంతాల నుంచి ప్రసరించే ఎక్స్‌రే కిరణాల మూలాలు, ఆవిర్భావం గురించి తెల్సుకునేందుకు 'ఎక్స్‌పోశాట్'ను వచ్చే ఏడాది జనవరి ఒకటో తేదీన ప్రయోగించాలని ఇస్రో నిర్ణయించింది. అమెరికా వారి నాసా తర్వాత ఇలా ఖగోళ అంశాలపై పరిశోధన కోసం వ్యోమనౌకను పంపుతున్న రెండో దేశంగా భారత్ పేరు రికార్డులకెక్కనుంది.

పాక్ ఎన్నికల్లో తొలిసారిగా హిందూ మహిళ



పెషావర్: ముస్లింల ఆధిపత్యముండే పాకిస్తాన్‌లో ఫిబ్రవరిలో జరగబోయే దేశ సార్వత్రిక ఎన్నికల సమరంలో తొలిసారిగా ఒక హిందూ మహిళ పోటీకి నిలబడింది. ఖైబర్ పఖ్తుంఖ్వా రాష్ట్రంలోని పీకే-25 పార్లమెంట్ స్థానం నుంచి సవీరా పర్కాశ్ అనే మహిళ పోటీచేస్తున్నారు. హిందువు అయిన సవీరా వృత్తి రీత్యా వైద్యురాలు. పాకిస్తాన్ పీపుల్స్ పార్టీ(పీపీపీ) తరఫున బునేర్ జిల్లాలో ఆమె నామినేషన్ దాఖలుచేశారు.

ప్రధాని మోదీ అరుదైన ఘనత

న్యూఢిల్లీ: అత్యంత ప్రజాదరణ ఉన్న నేతగా పలుమార్లు రికార్డు సృష్టించిన ప్రధాని మోదీ తాజాగా మరో ఘనతను తన ఖాతాలో వేసుకున్నారు. ప్రపంచంలో అత్యంత ఎక్కువ మంది యూట్యూబ్ సబ్‌స్క్రైబర్లను సాధించిన రాజకీయనేతగా మోదీ కొత్త రికార్డును లిఖించారు. ఆయన అధికారిక 'నరేంద్ర మోదీ' యూట్యూబ్ చానెల్‌ను 2 కోట్ల మంది సబ్‌స్క్రైబ్ చేసుకున్నారు.



గోడ మీద పులి!

పిలిభిత్(యూపీ): అడవి దాటి జనావాసాల్లో చొరబడిన పులిని చూస్తే జనానికి వణుకు. వాళ్లెక్కడ కొట్టిచంపేస్తారేమోనన్న భయంతో పులి దాడి చేయడం వినే వుంటాం. కానీ మంగళవారం యూపీలో ఓ గ్రామంలో అడుగుపెట్టిన ఆడ పులి అవేం పట్టించుకోకుండా హాయిగా గోడపై నిద్రపోయింది. తండోపతండాలుగా వచ్చిన జనాన్ని చూసి హడలిపోలేదు సరికదా నిద్రపోతూ, ఆవలిస్తూ అందరికీ ఫొటోలు, వీడియోలు తీసుకునే సువర్ణావకాశం ఇచ్చింది. పిలిభిత్ జిల్లాలోని పులుల అభయారణ్యం సమీపంలోని అట్కొనా గ్రామంలో జరిగిందీ వింత ఘటన. అటవీ సిబ్బంది పులికి మత్తు మందిచ్చి పట్టుకెళ్లారు.

సాక్షి
విజయవాడ సిటీ
ఎన్టీఆర్ జిల్లా
బుధవారం ׀ 27 ׀ డిసెంబర్ ׀ 2023



వైభవంగా ఆర్ద్రోత్సవాలు

నటరాజ స్వామి ఆర్ద్రోత్సవాలు దుర్గగుడిలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఉత్సవాలు జరుగుతాయి. -8లో▸



ఈవీఎంల గోడౌన్ తనిఖీ

విజయవాడ స్పోర్ట్స్: ఎన్టీఆర్ జిల్లాలోని గొల్లపూడి మార్కెట్ యార్డ్‌లో ఈవీఎంల గోడౌన్‌ను పోలీస్ కమిషనర్ టి.కె.రాణా మంగళవారం ఆకస్మిక తనిఖీ చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 522.80 అడుగులు ఉంది. జలవిద్యుత్ కేంద్రానికి 17,543, ఎస్‌ఎల్‌బీసీకి 900 క్యూసెక్కులు విడుదలవుతోంది.

న్యూస్‌రీల్

దుర్గమ్మ సేవలో స్పీకర్ తమ్మినేని



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): రాష్ట్ర శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం విజయవాడ ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులకు ఆలయ అధికారులు సాదర స్వాగతం పలికారు. పంచహారతుల సేవలో పాల్గొన్న అనంతరం అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేయించారు. వేద పండితులు ఆశీర్వచనం ఇవ్వగా, ఆలయ ఏఈవో ఎస్.రమేష్‌బాబు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

వంగవీటి రంగాకు నివాళి



పెడన: ఉమ్మడి కృష్ణా జిల్లాలో మంగళవారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని నిర్వహించారు. రంగా విగ్రహాల వద్ద, చిత్రపటాలకు నేతలు పూలమాలలు వేశారు. పెడనలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్, నేతలు రంగా చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన రంగా చిరస్మరణీయుడని పలువురు నేతలు కొనియాడారు. రాజకీయ నేతగా, కార్మిక నాయకుడిగా, పేదల మోములో వెలుగు నింపారని తెలిపారు.

డాక్టర్ వైఎస్సార్ హెల్త్ వర్సిటీ వాలీబాల్ జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం వాలీబాల్ మహిళల జట్టుకు కె.జయలక్ష్మీసాయిఅనీల(జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, రాజమండ్రి), ఆర్.సాయిసుష్మ(జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, రాజమండ్రి), ఎస్.సాయిశ్రీనిజ(జీఎస్ఎల్ మెడికల్ కాలేజీ, రాజమండ్రి), కె.కృష్ణప్రియ(ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, చినకాకాని), ఎస్.తిరుమల(సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ, ఏలూరు), కె.సుష్మ వెంకటసత్యలత(సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ, ఏలూరు), ఎల్.హర్షప్రియ(సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ, ఏలూరు), కె.రమ్యశ్రీ(సెయింట్ జోసఫ్ డెంటల్ కాలేజీ, ఏలూరు), ఎ.లతశ్రీకృష్ణభార్గవి(మహారాజ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హోమియోపతి సైన్సెస్, విజయనగరం), ఎస్.నేహా(మహారాజా కాలేజీ ఆఫ్ నర్సింగ్, విజయనగరం), డి.వర్ష(సిద్ధార్థ మెడికల్ కాలేజీ, విజయవాడ), కె.నందిని(కాటూరి మెడికల్ కాలేజీ, చిన్నకొండ్రుపాడు) ఎంపికైనట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ త్రిమూర్తి తెలిపారు. ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు తిరుపతిలోని శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో జరిగే దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయ పోటీలకు జట్టు ప్రాతినిధ్యం వహిస్తుందన్నారు. ఎంపికైన క్రీడాకారులను వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధిక మంగళవారం అభినందించారు.

ఆర్‌టీఈఏ ఆవిర్భావ సభ



విజయవాడ కల్చరల్: ఏపీ గురుకుల రెసిడెన్షియల్ టీచర్స్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్(ఆర్‌టీఈఏ) ఆవిర్భావ సభ గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథి ఎమ్మెల్సీ లక్ష్మణరావు మాట్లాడుతూ అసోసియేషన్ చిత్తశుద్ధితో పని చేయాలని అండగా ఉంటామని తెలిపారు. ఇండియన్ లాయర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు శాంతికుమార్ మాట్లాడుతూ సంస్థ న్యాయపరమైన సమస్యలకు సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్‌టీఈఏ అధ్యక్షుడు సూర్యతేజ, సెక్రటరీ చంగయ్య, వైస్ ప్రెసిడెంట్ మన్వర్, కోశాధికారి హుస్సేన్ జోన్ కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

జై భవానీ.. జైజై భవానీ



నేత్రపర్వం.. విజయవాడ సత్యనారాయణపురంలో బీఆర్టీఎస్ రోడ్డుపై కలశజ్యోతులతో భక్తులు

కనులపండువగా కలశజ్యోతుల ఉత్సవం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): భవానీ దీక్షల విరమణలో ప్రధాన ఘట్టం కలశజ్యోతుల ఉత్సవం ఘనంగా జరిగింది. మార్గశిర పౌర్ణమి పురస్కరించుకుని విజయవాడలో ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భవానీలు కలశ జ్యోతులను సమర్పించారు. భక్తులు జై భవానీ జైజై భవానీ నామస్మరణ చేస్తూ ఉత్సవంలో ముందుకు సాగారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రికి వరకు నిర్వహించిన కలశజ్యోతుల మహోత్సవంలో పెద్ద ఎత్తున భవానీలు పాల్గొన్నారు. తొలుత శివరామకృష్ణ క్షేత్రంలో శ్రీ గంగా పార్వతీ సమేత మల్లేశ్వరస్వామి వార్ల ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్యేలు వెలంపల్లి శ్రీనివాసరావు, మల్లాది విష్ణు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేకంగా అలంకరించిన వాహనంపై ఉత్సవమూర్తుల ఊరేగింపు ప్రారంభించారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, స్థానాచార్య శివప్రసాద్‌శర్మ, వైదిక కమిటీ సభ్యులు, ఈఈ కోటేశ్వరరావు, ఎల్. రమాదేవి, దేవస్థాన ఇంజినీరింగ్, ఫెస్టివల్ విభాగాల సిబ్బంది పాల్గొన్నారు.



కనకదుర్గ నగర్‌లో కలశజ్యోతులు

నగరంలోని ప్రధాన రోడ్ల ద్వారా కనకదుర్గ నగర్‌కు చేరుకున్న భవానీలు దేవస్థానం నిర్దేశించిన ప్రదేశంలో కలశజ్యోతులను సమర్పించారు. అనంతరం మహా మండపం మెట్ల మార్గం ద్వారా కొండపైకి చేరుకున్న భవానీలు అమ్మవారిని దర్శించుకుని మల్లేశ్వరస్వామి మెట్ల మార్గం ద్వారా దిగువకు చేరుకున్నారు. రాత్రి 11 గంటల వరకు భవానీలు, భక్తులకు దర్శనం కల్పించారు.

ప్రత్యేక ఆకర్షణగా సాంస్కృతిక ప్రదర్శనలు

ఈ ఏడాది కలశ జ్యోతుల మహోత్సవంలో సాంస్కృతిక కార్యక్రమాలు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. కొమ్ము బూరలు, డప్పు నృత్యాలు, చిన్నారుల కోలాట నృత్యాలు, కేరళ వాయిద్యాలు, కూచిపూడి, భరత నాట్య కళాకారులు తమ నృత్యాలను ప్రదర్శించారు. కలశ జ్యోతులతో పాటు ఆయా బృందాలు ముందుకు సాగగా, కలశ జ్యోతుల మార్గంలో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లివిరిసింది.



నమో జగజ్జనని.. బీఆర్టీఎస్ రోడ్డులో ఊరేగింపు

ఆరంభం అదిరింది



క్రీడాజ్యోతిని వెలిగించి అందజేస్తున్న కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే విష్ణు తదితరులు

- ఆడుదాం ఆంధ్రా క్రీడా సంబరాలు ప్రారంభం
- మట్టిలో మాణిక్యాలను వెలికితీసేందుకు గొప్ప వేదిక
- ఎన్టీఆర్ జిల్లాలో 1.17 లక్షల మంది రిజిస్ట్రేషన్
- కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే విష్ణు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఆడుదాం ఆంధ్రా జిల్లా స్థాయి క్రీడా సంబరాలు ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. వీటికి విజయవాడ అజిత్ సింగ్ నగర్‌లోని మాకినేని బసవ పున్నయ్య మునిసిపల్ కార్పొరేషన్ స్టేడియం వేదికైంది. ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు, సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు, నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి, డెప్యూటీ కలెక్టర్ వెన్నం జ్యోతి సురేఖ, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను ప్రారంభించారు. తొలుత ఎంకే బేగ్, శుభోదయ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మల్లాది విష్ణు జాతీయ పతాకాన్ని, జ్యోతి సురేఖ వీఎంసీ పతాకాన్ని ఎగరవేశారు. అనంతరం ఆడుదాం ఆంధ్రా మస్కట్‌ను ఆవిష్కరించారు. క్రీడాకారులు జ్యోతి సురేఖ, ఆర్.రాంబాబు తదితరులు క్రీడా జ్యోతిని వెలిగించారు. 2023 ఆడుదాం ఆంధ్రా క్రీడలు ప్రారంభమయ్యాయంటూ ప్రకటిస్తూ బెలూన్లు ఎగురవేశారు. జ్యోతి సురేఖ క్రీడాకారులతో క్రీడా స్ఫూర్తి ప్రతిజ్ఞ చేయించిన అనంతరం సచివాలయాలకు స్పోర్ట్స్ కిట్లను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఢిల్లీరావు మాట్లాడుతూ ప్రతిభను గుర్తించి మట్టిలో మాణిక్యాలను వెలికితీసి, ప్రోత్సహించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి ఆడుదాం ఆంధ్రా క్రీడా పండగను ప్రారంభించారని పేర్కొన్నారు. ఈ మెగా ఈవెంట్ ఫిబ్రవరి 10 వరకు జరుగుతుందన్నారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో దాదాపు 1.17 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారని వివరించారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో 11 వేలకు పైగా జట్లు ఆడనున్నాయని వెల్లడించారు. పోటీలకు రాష్ట్ర ప్రభుత్వం రూ. 12 కోట్లు ఖర్చు చేస్తోందన్నారు. ఎమ్మెల్యే మల్లాది విష్ణు మాట్లాడుతూ క్రీడలతో ఆరోగ్యంతోపాటు ప్రతిభ కనబరచిన వారు జాతీయ, అంతర్జాతీయ స్థాయికి ఎదగడానికి పోటీలు దోహదపడతాయన్నారు. అంతర్జాతీయ ఆర్చరీ క్రీడాకారిణి వన్నెం జ్యోతి సురేఖ మాట్లాడుతూ ఔత్సాహిక క్రీడాకారులు తమ ప్రతిభను చాటిచెప్పేందుకు ఆడుదాం ఆంధ్రా గొప్ప వేదిక అని పేర్కొన్నారు. మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ క్రీడల ద్వారా ఆరోగ్యకర జీవనశైలిని పెంపొందించుకోవచ్చని చెప్పారు. అనంతరం రూ. 32 లక్షలతో ఆధునీకరించిన బ్యాడ్మింటన్ ఇండోర్ మైదానాన్ని ప్రారంభించారు. ప్రారంభోత్సవ కార్యక్రమంలో డీఎస్‌డీఓ ఎస్‌ఏ అజీజ్, కేవీ సత్యవతి, డీఈవో సీవీ రేణుక, డీఎంహెచ్‌వో ఎం.సుహాసిని, కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.



సింగ్‌నగర్ బసవపున్నయ్య స్టేడియంలో విద్యార్థుల మార్చ్‌ఫాస్ట్

మగ్గం వర్క్‌లో శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ఉంగుటూరు(గన్నవరం): మండలంలోని ఆత్కూరులో ఉన్న స్వర్ణభారత్ ట్రస్ట్‌లో యూనియన్ బ్యాంక్, గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో మగ్గం వర్క్, జ్యూట్ బ్యాగుల తయారీలో శిక్షణ పొందేందుకు దరఖాస్తులను స్వీకరిస్తున్నట్లు డైరెక్టర్ మల్లికార్జున రెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మగ్గం వర్క్ 30 రోజులు, జ్యూట్ బ్యాగుల తయారీపై 13 రోజుల పాటు శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. తెలుగు రాయడం, చదవడం వచ్చిన 18 నుంచి 45 ఏళ్లలోపు యువత అర్హులని పేర్కొన్నారు. కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఉచిత భోజనం, వసతి కల్పిస్తామని తెలిపారు. నాలుగు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, విద్యార్హత జిరాక్స్ కాపీలతో సంప్రదించాలని సూచించారు. వివరాలకు 93988 04633, 99625 12337, 94407 72382 సెల్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఆలోచనలు.. ఆవిష్కరణలు..

- విద్యాబోధనలో మార్పులే కారణం
- పరిసరాల్లో లభించే వ్యర్థాలతో నూతన ఆవిష్కరణలు
- వైజ్ఞానిక ప్రదర్శనల్లో రాణిస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు
- రాష్ట్రస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైన పలు ప్రాజెక్టులు

కంకిపాడు: వినూత్న బోధనా పద్ధతుల ఫలితంగా విద్యార్థుల ఆలోచనలు చకచకా పరుగులు తీస్తున్నాయి. దీంతో ఇంటి పరిసరాల్లో లభించే వ్యర్థాలతో అద్భుత ఆవిష్కరణలు చేస్తూ అదరహో అనిపిస్తున్నారు. సమస్యకు పరిష్కారం చూపేలా విద్యార్థులు, ఉపాధ్యాయులు తయారు చేసిన ప్రాజెక్టు నమూనాలు రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాయి. డిజిటల్ విద్యతో విద్యార్థులు పాఠ్యాంశాలను అర్థం చేసుకుంటూ సందేహాలు నివృత్తి చేసుకుంటున్నారు. ఉపాధ్యాయులకు బోధనలో మెలకువలపై అవసరమైన శిక్షణను ప్రభుత్వం అందించింది. ఇటీవల నిర్వహించిన జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు, ఉపాధ్యాయులు ప్రతిభ చాటారు. కృష్ణా జిల్లా నుంచి వ్యక్తిగత, గ్రూపు, టీచర్స్ విభాగాల్లో మొత్తం తొమ్మిది ప్రాజెక్టు నమూనాలు రాష్ట్రస్థాయికి ఎంపిక కావడం విశేషం. ఈ నెల 28, 29 తేదీల్లో కడపలో జరగనున్న ప్రదర్శనకు సిద్ధమవుతున్నారు.



కాంతి ద్వారా పనిచేసే లై ఫై

లై ఫై. ఇది వై ఫైకి, సెల్యులర్ నెట్‌వర్క్‌కి ప్రత్యామ్నాయం. బైనరీ కోడ్స్ ద్వారా పని చేస్తుంది. కాంతి ద్వారా సమాచారాన్ని ప్రయాణింపజేస్తుంది. దీని గరిష్ట వేగం సెకనుకు 224 జీబీపీఎస్ వై ఫై కంటే చాలా వేగం. అన్ని ప్రాంతాల్లోనూ లై ఫైతో సమాచారం పంపొచ్చు. సమాచారం లీకవ్వదు. విజిబుల్ లైట్ కమ్యూనికేషన్ ద్వారా పని చేస్తుంది.

–ఎస్.గోపాలకృష్ణ, వి.జితేంద్ర పవన్‌కుమార్, మేడూరు జెడ్పీ పాఠశాల, గ్రూప్ కేటగిరీలో జిల్లా ప్రథమస్థానం

లిక్విడ్ ట్రీతో కాలుష్యానికి చెక్



నగరాల్లో కాలుష్య సమస్య అధికంగా ఉంది. రద్దీ ప్రాంతాల్లో ప్రత్యేకమైన ట్యాంకులను ఏర్పాటుచేసి వాటిలో ఆల్గే కల్చర్ చేయటం ఉత్తమం. వాతావరణంలోని కార్బన్ డయాక్సైడ్‌ను పీల్చుకుని ఆక్సిజన్‌ను ఆల్గే విడుదల చేస్తుంది. మొక్కల కంటే ఆల్గే 10 నుంచి 50 రెట్లు కాలుష్యాన్ని తగ్గిస్తుంది.

– సీహెచ్ విశ్వనాథ్, జెడ్పీ పాఠశాల, కంచదం, జిల్లా తృతీయ స్థానం

వృథా నీరు తిరిగి వినియోగం



రెయిన్ వాటర్ హార్వెస్టింగ్ ప్రాజెక్టు ఉద్దేశం వృథా నీటిని తిరిగి వినియోగించడమే. ప్రత్యేక పాత్రలో ఇసుక, కంకర, గులకరాళ్లు, బొగ్గు వాడకంతో వాన నీరు వృథా పోకుండా అందులోకి మళ్లించి శుభ్రమైన నీటిని తొట్టెల్లోకి మళ్లించి వినియోగించుకోవడం.

– సీహెచ్ శ్రావణి, జి.రత్నకుమారి, జెడ్పీ పాఠశాల నందివాడ, గ్రూప్ కేటగిరీలో జిల్లా మూడో స్థానం

పరిసరాల్లోనే విజ్ఞానం



మన పరిసరాల్లోనే బోలెడు విజ్ఞానం దాగి ఉంది. సమస్య ఎదురైనప్పుడు వాటిని పరిష్కరించుకోవడం తెలిస్తే చాలు. ఉపాధ్యాయులు, విద్యార్థుల్లో అవగాహన, ఆలోచనలు పెంచాలి. అతి తక్కువ ఖర్చుతో నమూనాల రూపకల్పన జరుగుతుంది.

– మహమ్మద్ జాకీర్ అహ్మద్, సైన్సు అధికారి, కృష్ణా జిల్లా

ప్రతిభ వెలుగు చూడాలి



ఆలోచనలకు పదును పెడితే ప్రతిభ వెలుగు చూస్తుంది. సైన్సు ఇతర అంశాలపై ఆసక్తికరంగా బోధన విద్యార్థుల్లో దాగి ఉన్న సృజన వెలుగులోకి రావాలంటే ఆలోచనలకు పదును పెట్టాలి. ప్రతి నిత్యం తరగతి గదుల్లో ఆసక్తికర అంశాలను నేర్పుతూ సైన్సు, ఇతర పాఠ్యాంశాల బోధన సాగేలా చర్యలు తీసుకుంటున్నాం. ఇప్పటికే ఉపాధ్యాయులకు పలుమార్లు సమగ్రశిక్ష ద్వారా శిక్షణ ఇప్పించాం. టోఫెల్, ఇతర విద్యా విషయక కార్యక్రమాలు విద్యార్థుల ప్రతిభకు దోహదపడుతున్నాయి. రానున్న రోజుల్లో నాణ్యతాయుతంగా వైజ్ఞానిక నమూనాలు వెలుగుచూస్తామనే నమ్మకం ఉంది.

– తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణా

వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి



ప్లాస్టిక్, రబ్బర్, వ్యర్థాలతో విద్యుత్ ఉత్పత్తి చేయటం ఈ పరికరం ఉద్దేశం. వ్యర్థాలను వినియోగించి పర్యావరణాన్ని కాపాడుకోవచ్చు. విద్యుత్ అవసరాలను తీర్చుకోవచ్చు. –ఎన్.వసంతసాయి, కె.భార్గవరామ్, ఏఎన్ఎంపీఎల్ స్కూల్, గుడివాడ, గ్రూప్ కేటగిరీలో జిల్లా ద్వితీయ స్థానం

రేడియో ఫ్రీక్వెన్సీ సిస్టంతో విద్యార్థుల సమాచారం



రేడియో ఫ్రీక్వెన్సీ ఐడెంటిఫికేషన్ ద్వారా పాఠశాలల్లో విద్యార్థుల హాజరు, వారి భద్రత, వివిధ పథకాల లబ్ధిని ఒకే డ్యాష్ బోర్డులో నిక్షిప్తం చేయటం. పాఠశాల గేటు వద్ద ఏర్పాటుచేసిన రీడర్ వద్ద విద్యార్థుల గుర్తింపు కార్డు ఉంచితే పిల్లలు పాఠశాలలోకి రావడానికి, హాజరు నమోదవుతుంది. పరీక్షల్లో సాధించిన ప్రగతి, విద్యార్థులపై పర్యవేక్షణ పెరుగుతుంది.

–ఆర్‌డీ చంద్రశేఖర్, ఎస్ఎంకే జెడ్పీ స్కూల్, మొవ్వ, జిల్లా ప్రథమస్థానం

సెన్సర్‌తో ఇళ్లు, ఆఫీసులు భద్రం



అగ్ని ప్రమాదాల నుంచి ఇళ్లు, ఆఫీసులను ఎలా రక్షించుకోవాలో వివరించేదే ఈ ప్రాజెక్టు. ఇంటికి, ఆఫీసుకు సెన్సర్ అమర్చారు. పొగ చూరుకున్న వెంటనే సెన్సర్ పనిచేసి వాటర్‌ట్యాంకుకు సంకేతం వెళ్లి మోటరు ఆన్ అయ్యి, ఇల్లు, ఆఫీసులపై అమర్చిన స్ప్రింక్లర్లు పని చేసి నీటిని చల్లుతాయి. బజరు మోగడంతో పరిసరాల్లో వారు అప్రమత్తమవుతారు.

–ఎం.శ్యాంకుమార్, సైన్సు ఉపాధ్యాయుడు, కపిలేశ్వరపురం పాఠశాల, జిల్లా ప్రథమ స్థానం

పర్యావరణ పరిరక్షణకు... కాగిత కప్పులు



వ్యవసాయ వ్యర్థాలు, కాగితాలను, చిన్న ముక్కలుగా చేసి, 3 శాతం సోడియం హైడ్రాక్సైడ్‌తో ఉడికించి, ఆ మిశ్రమాన్ని మెత్తగా రుబ్బి పేపరు కప్పులు, ప్లేట్స్ తయారు చేసుకోవచ్చు. పర్యావరణ కాలుష్యం నివారించడానికి ఇదొక మార్గం.

– కె.యుక్తామణి, జెడ్పీ పాఠశాల, తెన్నేరు, జిల్లా ద్వితీయ స్థానం

రేపు తుమ్మలపల్లిలో సాంస్కృతిక కళా వైభవం



కృష్ణలంక(విజయవాడతూర్పు): అంతరించిపోతున్న భారతీయ సంప్రదాయ కళలను పరిరక్షించేందుకు అమెరికా తెలుగు సంఘం (ఆటా) ఆధ్వర్యంలో ఈ నెల 28న తుమ్మలపల్లి కళాక్షేత్రంలో సాంస్కృతిక కళా వైభవం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సంస్థ ఇంటర్నేషనల్ కో ఆర్డినేటర్, మీడియా కన్వీనర్ భాను ప్రకాష్ స్వర్గం తెలిపారు. గవర్నర్‌పేటలోని బాలోత్సవ భవన్‌లో మంగళవారం జరిగిన విలేకరుల సమావేశంలో కళా వైభవం పోస్టర్‌ను ఆవిష్కరించారు. అనంతరం భానుప్రకాష్ మాట్లాడుతూ.. గురువారం సాయంత్రం నాలుగు నుంచి ఎనిమిది గంటల వరకు సాంస్కృతిక కళా వైభవం కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహిస్తామని తెలిపారు. కూచిపూడి, భరతనాట్యం, జన పదనృత్య ప్రదర్శనలు ఉంటాయని వివరించారు. ముఖ్య అతిథులుగా మంత్రులు జోగి రమేష్, కారుమూరి నాగేశ్వరరావు, ఎమ్మెల్యేలు మల్లాది విష్ణు, వెలంపల్లి శ్రీనివాసరావు, పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. ఆటా విజయవాడ నిర్వాహకుడు నరసింహారావు, ఎ.శేషుబాబు, బుద్ధ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

యార్డుకు 52,752 బస్తాల మిర్చి

కొరిటెపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు మంగళవారం 52,752 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 49,854 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.22,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 23,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.11,500 నుంచి రూ.20,500 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.9,000 నుంచి 22,200 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.5,000 నుంచి రూ.14,000 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో 23,405 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఇన్‌చార్జి కార్యదర్శి శ్రీనివాసరావు తెలిపారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి



గాంధీనగర్(విజయవాడసెంట్రల్): ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి జనవరి మూడో తేదీ వరకు నిర్వహించనున్న 2023 నవంబర్ సెషన్ డిపార్ట్‌మెంటల్ పరీక్షలు, జనవరి నాలుగో తేదీన జరిగే ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల అధ్యాపకుల నియామక పరీక్షకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ పరిపాలన అధికారి ఇంతి యాజ్ బాషా తెలిపారు. కలెక్టరేట్‌లో పరీక్షల నిర్వహణపై ఏపీపీఎస్సీ, రెవెన్యూ, పోలీస్, వైద్య ఆరోగ్యం, విద్యుత్ తదితర శాఖల అధికారులతో ఆయన మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంతియాజ్ బాషా మాట్లాడుతూ.. డిపార్ట్‌మెంటల్ పరీక్షలకు 3,084 మంది, పాలిటెక్నిక్ అధ్యాపక పరీక్షలకు నలుగురు హాజర వుతారని తెలిపారు. విజయవాడ కొత్తపేట రాఘవరెడ్డి వీధిలో పొట్టి శ్రీరాములు చలవాది మల్లికార్జునరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ, కంద్రికలోని అయాన్ డిజిటల్ జోన్‌లో షిఫ్టుల వారీగా ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. పరీక్షల కోఆర్డినేటింగ్ అధికారిగా డీఆర్వో వ్యవహరిస్తారని, పర్యవేక్షణ అధికారులను నియమించామని తెలిపారు. పోలీస్ బందోబస్తు, వైద్య శిబిరం, నిరంతర విద్యుత్ సరఫరా తదితరాలకు సంబంధించి ఏర్పాట్లు చేయాలని ఆయా శాఖల అధికారులకు ఏఓ సూచించారు. సమావేశంలో ఏపీపీఎస్సీ ఏఎస్ఓ ప్రమీల, ఎస్ఓ కె.భాస్కరరావు, లైజన్ ఆఫీసర్లు పి.శ్రీనివాసరావు, రాజరాజేశ్వరి, చీఫ్ సూపరింటెండెంట్ పి.లోకేష్, ఏసీపీ సీఎస్‌బీ బి.పార్థసారథి, ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జి.మాధవినాయుడు, జేఈఈ కె.కె.నాగేంద్ర పాల్గొన్నారు.

వైభవంగా ఆర్ద్రోత్సవాలు ప్రారంభం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): నటరాజ స్వామి ఆర్ద్రోత్సవాలు ఇంద్రకీలాద్రిపై మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు ఈ ఉత్సవాలు జరుగుతాయి. తొలి రోజైన మంగళవారం శివకామ సుందరీ సమేత నటరాజ స్వామి వార్లకు అర్చకులు మంగళ స్నానాలు నిర్వహించారు. అమ్మవారి దేవస్థానం ప్రాంగణంలోని నటరాజ స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఉత్సవాల సందర్భంగా ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు స్వామికి పట్టువస్త్రాలను సమర్పించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన గణపతి పూజలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా శివకామ సుందరీ సమేత నటరాజ స్వామి ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకాలు, మంగళ స్నానాలు నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్లను వధూవరులుగా అలంకరించారు. సాయంత్రం నాలుగు గంటలకు అంకురార్పణ, మంటపారాధన, అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణ, బలిహరణవంటి వైదిక కార్యక్రమాలను ఆలయ అర్చకులు నిర్వహించారు. బుధవారం రాత్రి ఎనిమిది గంటలకు స్వామి దివ్య లీలా కల్యాణోత్సవాన్ని కనుల పండువగా జరిపిస్తామని ఈఓ తెలిపారు.

వైభవంగా గిరి ప్రదక్షిణ

మార్గశిర పౌర్ణమిని పురస్కరించుకుని శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల గిరి ప్రదక్షిణ మంగళవారం వైభవంగా సాగింది. ఇంద్రకీలాద్రి ఘాట్‌రోడ్డులోని కామధేను అమ్మవారి ఆలయం వద్ద శ్రీ గంగ, పార్వతి సమేత మల్లేశ్వర స్వామి వార్ల ఉత్సవ మూర్తులకు ఆలయ అర్చకులు పూజలు నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అమ్మవారి నామస్మరణ మధ్య ఊరేగింపును ఆలయ చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావు ప్రారంభించారు. ఘాట్ రోడ్డు నుంచి ప్రారంభమైన ఊరేగింపు కుమ్మరిపాలెం, నాలుగు స్తంభాల సెంటర్, సితార, కబేళ, పాలప్రాజెక్టు, చిట్టినగర్, కొత్తపేట, బ్రాహ్మణ వీధి మీదగా కనకదుర్గనగర్‌కు చేరింది. దారి పొడవునా అమ్మవారి ప్రచార రథానికి, ఉత్సవ మూర్తులు కొలువై ఉన్న పల్లకీకి భక్తులు అడుగడునా హారతులిచ్చి స్వాగతం పలికారు. గిరి ప్రదక్షిణను ఆలయ స్థానాచార్య శివప్రసాద్ శర్మ పర్యవేక్షించగా, ఆలయ పాలక మండలి సభ్యులు బచ్చు మాధవీకృష్ణ, చింకా శ్రీనివాసులు, ఈఈలు కోటేశ్వరరావు, ఎల్.రమాదేవి, ఏఈఓలు, సూపరింటెండెంట్లు, ఆలయ అధికారులు, సిబ్బంది కుటుంబ సమేతంగా పాల్గొన్నారు.



గిరి ప్రదక్షిణలో పాల్గొన్న ఆలయ చైర్మన్ రాంబాబు, ఈఓ రామారావు తదితరులు



శివకామ సుందరీ, నటరాజస్వామి ఉత్సవ మూర్తులకు మంగళస్నానాలు చేస్తున్న అర్చకులు

దుర్గగుడి క్షేత్రపాలకుడికి బంగారు తొడుగు

- అపరాజిత అమ్మవారికి వెండి తొడుగు
- భక్తుల కోసం రెండు వాహనాలు
- టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదుగా అందజేత

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రి క్షేత్రపాలకుడు ఆంజనేయ స్వామికి బంగారం, వెండి తొడుగులు, అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని రావిచెట్టు కింద కొలువై ఉన్న అపరాజిత అమ్మవారికి వెండి తొడుగును దుర్గగుడికి అందజేసినట్లు టీటీడీ మాజీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి తెలిపారు. ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను సుబ్బారెడ్డి దంపతులు మంగళవారం దర్శించుకున్నారు. వారికి దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఇతర అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకున్న అనంతరం వీరాంజనేయ స్వామికి భకులు తయారు చేయించిన బంగారం, వెండి తొడుగులు, అపరాజిత అమ్మవారికి వెండి తొడుగు, ఇతర పూజ సామగ్రిని దుర్గగుడి చైర్మన్ రాంబాబు, ఈఓ కె.ఎస్.రామారావుకు పంపిణీచేశారు. ఈ సందర్భంగా సుబ్బారెడ్డికి అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టు వస్త్రాలు అందజేశారు. అనంతరం సుబ్బారెడ్డి ఆలయ ప్రాంగణంలో మీడియాతో మాట్లాడారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారిని దర్శించుకోవడమే కాకుండా క్షేత్రపాలకుడైన అభయాంజనేయ స్వామికి వెండి, బంగారపు తొడుగులు, అమ్మవారి విగ్రహానికి వెండి తొడుగును సమర్పించామని తెలిపారు. భక్తులను కొండపైకి చేరవేసేందుకు తిరుపతికి చెందిన భక్తుడు నగరం అమర్ సహకారంతో రూ.15 లక్షలతో రెండు వాహనాలను దుర్గగుడికి అందజేశామని తెలిపారు. రాష్ట్ర ప్రజలందరికీ అమ్మవారి కరుణా కటాక్షాలు ఉండాలని కోరుకున్నానని, వచ్చే ఎన్నికల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ అధికారంలోకి రావాలని అమ్మవారిని వేడుకున్నానని తెలిపారు.

తొడుగులు, పూజాసామగ్రి సమర్పణ

తూర్పు గోదావరి జిల్లా పెరవలి మండలం కండవల్లి గ్రామానికి చెందిన భూపతి రాజు వరాహ వెంకట సూర్య నారాయణరాజు, హైమావతి సూర్యకుమారి దంపతులు దేవస్థానానికి బంగారు, వెండి తొడుగులతో పాటు దేవస్థానానికి మకర తోరణం, మందిరం, వెండి పూజాసామగ్రిని సమర్పించారు. పూజా సామగ్రిని వై.వి.సుబ్బారెడ్డి చేతుల మీదగా దేవస్థానానికి అప్పగించారు. కార్యక్రమంలో ఆలయ పాలక మండలి సభ్యులు కట్టా సత్తెయ్య, ఆలయ ప్రత్యేక ఆహ్వానితులు జక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, సివిల్ సప్లయీస్ డైరెక్టర్ సత్యనారాయణ రాజు, దుర్గగుడి అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వైవీ సుబ్బారెడ్డి చేతుల మీదుగా బంగారు, వెండి తొడుగులు అందజేస్తున్న దాతలు



దాతలు అందజేసిన వాహనాలను ప్రారంభిస్తున్న వైవీ సుబ్బారెడ్డి

30 నుంచి టెన్త్ విద్యార్థులకు సైక్లిక్ టెస్ట్‌లు

గుడివాడ టౌన్: పదో తరగతి పరీక్షల్లో నూరుశాతం ఉత్తీర్ణతే లక్ష్యంగా విద్యార్థులకు కృష్ణా డీఈఓ తాహెరా సుల్తానా నేతృత్వంలో సైక్లిక్ టెస్ట్‌లు నిర్వహిస్తున్నామని డిస్ట్రిక్ట్ కామన్ ఎగ్జామినేషన్ బోర్డు సెక్రటరీ షేక్ జానీ సాహెబ్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30వ తేదీ నుంచి జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మోడల్ ఉన్నత పాఠశాలల్లో ఈ పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు.

త్రోబాల్ రాష్ట్ర జట్ల ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: జాతీయ 33వ జూనియర్ బాలబాలిక పోటీలకు ప్రాతినిధ్యం వహించే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్లను విజయవాడలో ఎంపిక చేసినట్లు ఆంధ్రప్రదేశ్ త్రోబాల్ అసోసియేషన్ కార్యదర్శి ఇ.సులోచన మంగళవారం తెలిపారు. బాలికల జట్టుకు పి.సౌమ్యఅన్నపూర్ణదేవి (కెప్టెన్), బి.దుర్గాభవాని, కె.సాయిదుర్గ, పి.జోషిత, కె.అంజలిప్రియ, సి.ఇందు, సి.గౌరి, ఎస్.నందిని, వి.మోక్షిత, పి.రజియాఅంజుమ్, జి.అంజలిదేవి, వి.చరణ్య, పి.వెంకటకావ్య, టి.సుకీర్తి, బాలుర జట్టుకు జె.రవివర్మ(కెప్టెన్), జి.నాగమురళి, ఎ.సందీప్, టి.రత్నకుమార్, బి.రవితేజ, పి.యశ్వంత్, టి.నరసింహా, జె.ప్రబోధ్‌కుమార్, బి.సాయిగణేష్, డి.తన్మయి, జె.జగదీష్, షేక్ వెంకటఖాసీం, పి.జగన్, ఐ.ఆనంద్ ఎంపికైనట్లు చెప్పారు. ఇందిరాగాంధీ మునిసిపల్ స్టేడియంలో ఈ జట్లకు జెర్సీలు మంగళవారం అందజేసినట్లు తెలిపారు. ఈ నెల 27 నుంచి 30వ తేదీ వరకు తమిళనాడులోని కోయంబత్తూరులో జరిగే జాతీయ పోటీల్లో ఈ జట్లు పాల్గొంటాయని పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి స్విమ్మింగ్ పోటీల్లో నాగేంద్రరావుకు పతకాలు

తాడేపల్లి రూరల్: మంగళగిరి పట్టణానికి చెందిన చేనేత వస్త్ర వ్యాపారవేత్త కాంద్రు శివనాగేంద్ర రావు ఈనెల 24న కర్నూలు డీఎస్ఏ స్విమ్మింగ్ పూల్‌లో ఆంధ్రప్రదేశ్ మాస్టర్ స్విమ్మింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరవ స్టేట్ మాస్టర్స్ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్- 2023 రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. నాలుగు రకాల పోటీల్లో మెడల్స్ సాధించారు. 60-64 వయస్సు గ్రూప్ (మెన్స్)లో ఐఎం 200 మీటర్ల విభాగంలో గోల్డ్, 50 మీటర్ల బట్టర్‌ఫ్లై స్విమ్మింగ్ పోటీల్లో గోల్డ్ మెడల్, 100 మీటర్ల బట్టర్‌ఫ్లై విభాగంలో సిల్వర్ మెడల్, 100 మీటర్ల ఫ్రీ స్టైల్ విభాగంలో బ్రాంజ్ మెడల్ సాధించారు. ఈ సందర్భంగా శివనాగేంద్రరావును పలువురు నగర ప్రముఖులు, వస్త్ర వ్యాపారులు మంగళవారం అభినందించారు.

ఫిబ్రవరి నాటికి బెల్ కంపెనీని ప్రారంభిస్తాం

నెమ్మలూరు(పామర్రు): భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెల్(బెల్) కంపెనీని ఫిబ్రవరి నాటికి ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి తెలిపారు. మండలంలోని నెమ్మలూరు గ్రామ పరిధిలో రూ.350 కోట్లతో నిర్మిస్తున్న బెల్ కంపెనీని ఆమె మంగళవారం పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. రాష్ట్రంలో కేంద్రం చేపట్టిన పలు నిర్మాణాలను పరిశీలించేందుకు ఈ పర్యటనకు వచ్చానన్నారు. ప్రస్తుతం నిర్మాణం పనులు చివరి దశలో ఉన్నాయని అన్నారు. తొలుత అడ్డాడ గ్రామంలోని ఓ ప్రైవేటు స్కూల్‌లో నిర్వహించిన వీరబాల దివస్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ శ్రీ రాజాబాబు, నాయకుడు వెంకటేశ్వరరావు, బెల్ కంపెనీ అధికారులు పాల్గొన్నారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

మధురానగర్(విజయవాడసెంట్రల్): సహజీవనం చేస్తున్న మహిళ ఆత్మహత్య చేసుకుని చనిపోయిందన్న బాధ భరించలేని యువకుడు బలవన్మరణానికి పాల్పడిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బుడమేరు మధ్య కట్టకు చెందిన మోపిదేవి రాజేష్ (26) ఆటోడ్రైవర్‌గా జీవిస్తున్నాడు. వైఎస్సార్ కాలనీకి చెందిన తరణి అనంత నాగలక్ష్మితో ఎనిమిదేళ్లుగా సహజీవనం చేస్తున్నాడు. అక్టోబర్ 29వ తేదీన ఆమె ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆ ఘటనపై టూటౌన్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి రాజేష్‌ను రిమాండ్‌కు తరలించారు. ఈ నెల ఏడో తేదీన బెయిల్‌పై బయటకు వచ్చిన రాజేష్ తనకు నాగలక్ష్మి గుర్తుకొస్తోందని, ఆమెను మర్చిపోలేకపోతున్నానని స్నేహితులు, బంధువులకు చెప్పుకొని బాధపడుతున్నాడు. ఈ నెల 25వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటకు భోజనం చేసిన తరువాత తండ్రి ఏడుకొండలు పనికి వెళ్లగా రాజేష్ ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. సాయంత్రం నాలుగు గంటలకు ఏడుకొండలు ఇంటికి తిరిగి వచ్చేసరికి రాజేష్ ఉరివేసుకుని ఆత్మహత్యచేసుకున్నాడు. రాజేష్ తల్లి మోపిదేవి నాగమణి ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆస్పత్రికి తరలించారు.

పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య

నందిగామ: పురుగు మందు తాగి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మంగళవారం నందిగామ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. ఎస్ఐ దుర్గామహేశ్వరరావు కథనం మేరకు.. నందిగామ మండలం పల్లగిరి గ్రామానికి చెందిన కటారపు ఝాన్సీ (35), అనిల్ భార్యాభర్తలు. అనిల్ గతంలో మద్యం తాగేవాడు. కొంతకాలం మానేశాడు. తిరిగి మద్యం తాగుతుండటంతో మనస్తాపం చెందిన ఝాన్సీ పురుగు మందు తాగింది. ఆమెను గమనించిన కుటుంబ సభ్యులు నందిగామ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అయితే ఆమె అప్పటికే మృతి చెందిందని వైద్యులు నిర్ధారించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం

రామవరప్పాడు(గన్నవరం): అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన విజయవాడ రూరల్ మండలం రామవరప్పాడులో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. రామవరప్పాడు పేరంటాలమ్మ ఆలయ ప్రాంతంలో నివసిస్తున్న తుమ్మల ప్రసాద్ (29) డిగ్రీ చదివి ప్రయివేట్ ఉద్యోగం చేస్తున్నాడు. ఇటీవల దీపావళికి టపాసుల వ్యాపారంచేసి రూ.1.5 లక్షలు నష్టపోయాడు. ఈ నేపథ్యంలో ప్రసాద్ తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌లోని తమ కుమార్తె వద్దకు వెళ్లారు. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో ప్రసాద్ ఇంటికి అతని స్నేహితులు వెళ్లి తలుపు తట్టగా స్పందన లేదు. అనుమానం వచ్చి కిటికీలో నుంచి చూడగా ఫ్యానుకు ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించాడు. దీంతో పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ప్రసాద్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి పెదనాన్న మల్లేశ్వరరావు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్రైమ్ కార్నర్

ప్రమాదంలో ఇద్దరు యువకుల దుర్మరణం



అఖిల్ (ఫైల్)



దిలీప్ (ఫైల్)

విస్సన్నపేట(తిరువూరు): బైక్ అదుపుతప్పి రోడ్డు పక్కనున్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టిన ఘటనలో ఇద్దరు యువకులు మృతిచెందారు. ఈ ప్రమాదం మంగళవారం తెల్లవారుజామున జరిగింది. ఎస్ఐ సత్యనారాయణ కథనం మేరకు.. మండలంలోని కలగర గ్రామానికి చెందిన సీహెచ్. అఖిల్ (20), వాసం దిలీప్(27) ద్విచక్రవాహనంపై సోమవారం క్రిస్మస్ వేడుకలకోసం వేమిరెడ్డిపల్లి వెళ్లారు. వేడుకలు ముగిశాక స్వగ్రామానికి బయలుదేరారు. రాత్రి 2.30 గంటల సమయంలో కొర్లమండ పంచాయతీ మోతేరావుపేట సబ్‌స్టేషన్ సమీపంలో వారు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి రోడ్డుపక్కనున్న హెచ్చరిక బోర్డును ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో అఖిల్, దిలీప్ తీవ్రంగా గాయపడ్డారు. అఖిల్ సంఘటనా స్థలంలోనే మృతి చెందాడు. దిలీప్‌ను తొలుత తిరువూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించడంతో దిలీప్ ఆస్పత్రిలో మృతిచెందాడు. ప్రమాదంపై కేసు నమోదుచేసి, దర్యాప్తు చేపట్టామని ఎస్ఐ సత్యనారాయణ తెలిపారు. ఇద్దరు యువకులు ప్రమాదంలో మృతి చెందడంతో గ్రామంలో కలగర గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

కారు ఢీకొని వృద్ధుడి మృతి

పామర్రు: కారు ఢీకొని వృద్ధుడు మృతిచెందిన ఘటన మండలంలోని కనుమూరు గ్రామంలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన మజ్జి సూర్యనారాయణ(62) గ్రామ పరిధిలో మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిని దాటుతుండగా ఓ కారు వేగంగా వచ్చి ఆయన్ను ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన అతను ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ప్రమాదానికి కారణమైన కారు స్వాధీనం చేసుకుని, డ్రైవర్ చుండూరి వెంకట దినేష్‌ను అదుపులోకి తీసుకున్నామని పేర్కొన్నారు. బాపట్ల జిల్లా చీరాలకు చెందిన దినేష్ కారులో కుటుంబ సభ్యులతో కలిసి మచిలీపట్నం వచ్చి, విజయవాడ వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.



సూర్యనారాయణ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

రోడ్డు ప్రమాదంలో కార్మికురాలి దుర్మరణం

రామవరప్పాడు(గన్నవరం): ద్విచక్రవాహనం ఢీకొట్టిన ఘటనలో ఓ పారిశుద్ధ్య కార్మికురాలు దుర్మరణం చెందిన ఘటన విజయవాడరూరల్ మండలం గూడవల్లి జాతీయ రహదారిపై మంగళవారం జరిగింది.

పోలీసుల కథనం మేరకు.. కంకిపాడుకు చెందిన బడుగు విజయలక్ష్మి (43) రెండు నెలల నుంచి జాతీయ రహదారి డివైడర్‌పై మొక్కలు నాటే పనులకు వస్తోంది. మంగళవారం ఉదయం తొమ్మిది గంటల సమయంలో గూడవల్లి వద్ద జాతీయ రహదారిపై నిలబడి డివైడర్‌పై మొక్కలు నాటుతున్న విజయలక్ష్మికి విజయవాడ నుంచి గన్నవరం వైపు వెళ్తున్న ద్విచక్రవాహనం ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తీవ్రంగా గాయపడటంతో చిన్నఅవుటపల్లిలోని పిన్నమనేని సిద్ధార్థ వైద్యశాలకు తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో 11 గంటల సమయంలో మృతి చెందింది. మృతురాలి భర్త రంగారావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

కొడుకు మరణవార్త విని తల్లి మృతి



తిరుపతిరావు (ఫైల్)



తిరుపతమ్మ (ఫైల్)

షేర్‌మహ్మద్‌పేట(జగ్గయ్యపేట): కొడుకు మరణవార్త తట్టుకోలేక తల్లి మృతి చెందిన ఘటన షేర్‌మహ్మద్‌పేట గ్రామంలోని మోడల్ కాలనీలో మంగళవారం రాత్రి జరిగింది. గ్రామానికి చెందిన నల్లగుంట రమేష్ ఆర్టీసీ డ్రైవర్‌గా పని చేస్తున్నారు. ఆయనకు భార్య తిరుపతమ్మ (47), కుమారుడు తిరుపతిరావు (18), ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కుమారుడు తిరుపతిరావు మూడు నెలల క్రితం కామెర్లబారిన పడి చికిత్స తీసుకున్నాడు. మూడు రోజుల క్రితం అనారోగ్యానికి గురయ్యాడు. విజయవాడలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో రెండురోజులుగా చికిత్స పొందుతున్నాడు. మంగళవారం సాయంత్రం ఐదు గంటల సమయంలో ఆరోగ్యం విషమించి తిరుపతిరావు మృతి చెందాడు. కొడుకు మరణవార్తను విన్న తల్లి తిరుపతమ్మ ఇంట్లో ఒక్కసారిగా కుప్పకూలింది. కుటుంబ సభ్యులు స్థానిక ఆస్పత్రికి తీసుకెళ్లేలోపు ప్రాణాలు విడిచింది. తల్లీకుమారుల మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బైక్‌లు చోరీ చేసే ఆరుగురు మైనర్ల అరెస్ట్

పటమట(విజయవాడతూర్పు): వ్యసనాలకు బానిసలైన ఆరుగురు మైనర్లను పటమట పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. పోలీసుల కథనం మేరకు.. పటమటలంక, రామలింగేశ్వర నగర్, అశోక్‌నగర్, మొగల్రాజపురానికి చెందిన ఆరుగురు మైనర్లు రోడ్డు వెంబడి పార్కింగ్ చేసిన ఖరీదైన ద్విచక్రవాహనాలను చాకచక్యంగా చోరీ చేసి వాటి రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లు, రంగులు మార్చి వినియోగించుకుంటున్నారు. ద్విచక్ర వాహనాల చోరీల ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించిన పటమట సీఐ కాశీవిశ్వనాథ్, క్రైం ఎస్ఐ పవన్‌కుమార్ పక్కా సమాచారంతో నిందితులను అదుపులోకి తీసుకున్నారు. నిందితులు పటమట నిర్మల కాన్వెంట్ రోడ్డులో ఓ వాహనాన్ని చోరీ చేస్తుండగా సీసీ ఫుటేజీలో నమోదైంది. దాని ఆధారంగా విచారణ చేపట్టి నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద రూ.8 లక్షల విలువైన ఆరు బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను జువైనల్ హోంనకు తరలించారు.



నిందితులు చోరీ చేసిన బైక్‌లు

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



లబ్బీపేట(విజయవాడతూర్పు): అనారోగ్యంతో బాధపడుతూ ఆరోగ్యశ్రీ పరిధిలోకి రాని వైద్య సేవలు పొందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి(సీఎంఆర్ఎఫ్) నుంచి పలువురికి నిధులు మంజూరయ్యాయి. గుణదలలోని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జి దేవినేని అవినాష్ కార్యాలయంలో రూ.3.55 లక్షల విలువైన చెక్కులను మంగళవారం లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మూడో డివిజన్‌కు చెందిన గంథం లోక్యకు రూ.90 వేలు, భీమాల కరుణాకర్‌కు రూ.1.30 లక్షలు, ఆరో డివిజన్‌కు చెందిన ఊడిక నాగేశ్వరరావుకు రూ.25 వేలు, పమిడిమర్రి వెంకటేశ్వరరావుకు రూ.1.10 లక్షలు చెక్కులను అందించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు భీమిశెట్టి ప్రవల్లిక, అమర్నాథ్, నాయకులు భీమిశెట్టి బాబు, రాజ్‌కమల్, పానుగుపాటి శ్రీనివాస్, శంకర్, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

కాపు నాయకులకు సన్మానం



కృష్ణలంక(విజయవాడతూర్పు): వివిధ రంగాల్లో విశేష సేవలకు గాను డాక్టరేట్ సాధించిన సాంఘిక, సామాజిక వేత్త డాక్టర్ కంది గంగాధర్‌రావును కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు ఘనంగా సత్కరించారు. తాడేపల్లిలోని కాపు కార్పొరేషన్ కార్యాలయంలో వంగవీటి మోహనరంగా వర్ధంతిని మంగళవారం ఘనంగా నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కాపు నాయకులు సీనియర్ అడ్వకేట్ చోడిశెట్టి మన్మథరావు, ఆచంట బాలాజీలను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు దామోదర్, బాబ్జి, టి.గణేష్, ఎల్.జగన్‌మోహన్‌రావు, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్‌లో సిద్ధార్థ మహిళా కాలేజీ జట్టు సత్తా



విజయవాడస్పోర్ట్స్: కృష్ణా యూనివర్సిటీ అంతర కళాశాలల మహిళల బ్యాడ్మింటన్ పోటీల్లో సత్తా చాటిన శ్రీ దుర్గామల్లేశ్వర సిద్ధార్థ మహిళా కాలేజీ క్రీడాకారులను ఆ కాలేజీ ప్రాంగణంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.కల్పన, డైరెక్టర్ డాక్టర్ టి.విజయలక్ష్మి, కన్వీనర్ లలితా ప్రసాద్ మంగళవారం అభినందించారు. ఉయ్యూరు ఏజీ, ఎస్‌జీ ఆర్ట్స్, సైన్స్ కాలేజీలో ఇటీవల జరిగిన పోటీల్లో తమ కాలేజీ జట్టు రాణించి ప్రథమ స్థానం సాధించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా కాలేజీ క్రీడాకారిణులు ఎ.శ్రీరాజ్ఞి, కె.ఉమామహేశ్వరి సౌత్ జోన్ అంతర విశ్వవిద్యాలయాల పోటీలకు ప్రాతినిధ్యం వహించే కృష్ణా యూనివర్సిటీ జట్టులో చోటు దక్కించుకున్నారని చెప్పారు. జట్టుకు శిక్ష ఇచ్చిన కోచ్ పి.భాస్కర్‌ను వారు అభినందించారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



విజయవాడకల్చరల్: రమణా కల్చరల్ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదికపై ధనుర్మాసం సందర్భంగా సినీ సంగీత విభావరి, వంగవీటి మోహన రంగా వర్ధంతి సందర్భంగా పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న తూర్పు కాపు రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు గడి ఝాన్సీ మాట్లాడుతూ వంగవీటి రంగా ప్రజల కోసం పనిచేశారన్నారు. మోహన రంగా సామాజిక సేవలు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. రమణా కల్చరల్ ఆర్ట్స్ వ్యవస్థాపకుడు మాంతి రమణ మాట్లాడుతూ.. సంస్థ ద్వారా పేద కళాకారులకు సేవ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో విశ్రాంత పోలీస్ అధికారి డేవిడ్‌రాజు, గాయకుడు రమాశంకర్ పాల్గొన్నారు. పేదలకు వస్త్రదానం చేశారు. సినీ సంగీత విభావరిలో గాయనీ గాయకులు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

తల్లి అదృశ్యంపై ఫిర్యాదు

మధురానగర్(విజయవాడసెంట్రల్): తల్లి అదృశ్యంపై ఆమె కుమారుడు ఇచ్చిన ఫిర్యాదుతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం రామకృష్ణాపురం బుద్ధంరాజు వీధికి చెందిన వల్లె అభిషేక్, తల్లి సంధ్య(50) తండ్రి రామకృష్ణ, భార్య, కుమారుడితో నివసిస్తున్నారు. అభిషేక్ భార్య రెండు నెలల గర్భిణి. ఈ విషయాన్ని సోమవారం ఉదయం 9.30 గంటల ప్రాంతంలో అభిషేక్ తల్లి సంధ్యకు చెప్పారు. కోడలు తన మాట వినటం లేదంటూ సంధ్య పెద్దగా కేకలు వేసింది. అనంతరం ఎవరికీ చెప్పకుండా సంధ్య ఇంట్లోంచి వెళ్లిపోయారు. నగరంలో వెతికినప్పటికీ ఫలితం లేకపోవటంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేశారు.

క్రీడాకారులను ప్రోత్సహించేందుకే ఆడుదాం ఆంధ్రా

అట్టహాసంగా క్రీడా పోటీల ప్రారంభం



క్రీడా పోటీలు ప్రారంభిస్తున్న డాక్టర్ రత్నావళి, కార్పొరేటర్ రామిరెడ్డి

గుణదల(విజయవాడతూర్పు): క్రీడాకారులను వెలుగులోకి తెచ్చి వారిని ప్రోత్సహించే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని వైఎస్సార్ సీపీ తూర్పు ఇన్చార్జి దేవినేని అవినాష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రీడాకారులకు గుర్తింపు లభిస్తోందన్నారు. మంగళవారం నుంచి క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయన్నారు. దీనిలో భాగంగా క్రీడాకారులకు ఖోఖో, వాలీబాల్, క్రికెట్ వంటి క్రీడల్లో పోటీలు నిర్వహిస్తున్నామని చెప్పారు. తూర్పు నియోజకవర్గంలో ఈ కార్యక్రమానికి మంచి స్పందన లభించిందన్నారు. యువకులు పెద్ద సంఖ్యలో తమ పేర్లు నమోదు చేయించుకున్నారన్నారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఎంతో మంది క్రీడాకారులకు ఆడుదాం ఆంధ్రా మంచి వేదిక కానుందని తెలిపారు. 45 రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమంలో క్రీడాకారులంతా ఉత్సాహంగా పాల్గొని గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. క్రీడా రంగంలో రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలబెట్టేందుకు సీఎం వైఎస్ జగన్ చేస్తున్న కృషి అభినందనీయమని కొనియాడారు.

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్రా పోటీలు

లబ్బీపేట(విజయవాడతూర్పు): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలు మంగళవారం ఉత్సాహమైన వాతావరణంలో ప్రారంభమయ్యాయి. తూర్పు నియోజకవర్గంలోని 17వ డివిజన్‌కు సంబంధించి బ్యాడ్మింటన్ పోటీలు ఎంజీ రోడ్డులోని దండమూడి రాజగోపాల్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించారు. ఈ పోటీల్లో నాలుగు టీమ్‌లు తలపడగా, హోరాహోరీగా మ్యాచ్‌లు సాగాయి. ఈ పోటల్లో ఆ డివిజన్ కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి, కుందూరు వెంకటేశ్వరరెడ్డి టీమ్ విజేతగా నిలిచింది. ఈ సందర్భంగా రామిరెడ్డి మాట్లాడుతూ సామాన్యులకు సైతం క్రీడల పట్ల ఆసక్తి పెంచడంతో పాటు క్రీడల్లో నైపుణ్యం కలిగిన వారికి గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సీఎంఓహెచ్ డాక్టర్ రత్నావళి, డాక్టర్ ఇక్బాల్, పలువురు అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వీఎం రంగా సేవలు చిరస్మరణీయం



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, నాయకులు



రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ



రంగా విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆళ్ల చెల్లారావు తదితరులు

కృష్ణలంక(విజయవాడతూర్పు): పేద వర్గాల అభ్యున్నతికి దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహనరంగా అందించిన సేవలు చిరస్మరణీయమని కాపు కార్పొరేషన్ చైర్మన్, 20వ డివిజన్ కార్పొరేటర్ అడపా శేషు అన్నారు. కృష్ణలంక, 20వ డివిజన్‌లో పలు చోట్ల రంగా వర్ధంతిని మంగళవారం నిర్వహించారు. నల్లగేటు డౌన్‌లో వైఎస్సార్ సీపీ డివిజన్ కార్యాలయం వద్ద రంగా చిత్రపటానికి, నెహ్రూనగర్ డొంకరోడ్డు, ద్వారకానగర్‌లోని రంగా విగ్రహాలకు ఆయన పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అడపా శేషు మాట్లాడుతూ కార్మిక నాయకుడిగా, కార్పొరేటర్‌గా, ఎమ్మెల్యేగా పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజల అభ్యున్నతికి రంగా విశేష కృషి చేశారన్నారు. ఆయన ఆశయాలను నేటి యువత స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. అనంతరం నిర్మలా శిశుభవన్‌లో అనాథ పిల్లలకు పండ్లు పంపిణీ చేశారు. వైఎస్సార్ సీపీ నాయకులు, రంగా అభిమానులు నిమ్మల జ్యోతిక, బాషా, కొప్పుల మల్లి, తాటిశెట్టి గణేష్, ఎం.నాగేశ్వరరావు, దుర్గాప్రసాద్, సతీష్, శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

నల్లగేట్ సెంటర్‌లో..

కృష్ణలంక(విజయవాడతూర్పు): దివంగత నేత వీఎం రంగా వర్ధంతిని కృష్ణలంకలోని నల్లగేట్ సెంటర్‌లో మంగళవారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీసీఎంఎస్ చైర్‌పర్సన్ పడమట స్నిగ్ధ పాల్గొని రంగా చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ బడుగు, బలహీన వర్గాలకు రంగా అండగా నిలిచారని కొనియాడారు. కార్యక్రమంలో కొప్పుల వెంకట్, రాధా–రంగా మిత్రమండలి ప్రతినిధులు పాల్గొన్నారు.

15వ డివిజన్‌లో..

పటమట(విజయవాడతూర్పు): బడుగు వర్గాల జీవితాల్లో వెలుగులు నింపిన మహనీయుడు వంగవీటి మోహనరంగా అని పలువురు నాయకులు పేర్కొన్నారు. 15వ డివిజన్ రామలింగేశ్వరనగర్‌లో స్క్రూ బ్రిడ్జి వద్ద మంగళవారం వీఎం రంగా వర్ధంతిని నిర్వహించారు. స్థానికంగా ఉన్న రంగా పార్కులోని విగ్రహానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. రంగా జీవితమంతా పేద, బడుగు వర్గాల సంక్షేమం కోసమే పనిచేశారని, నేటి తరానికి ఆయన స్ఫూర్తి దాత అన్నారు. కార్యక్రమంలో మాజీ డిప్యూటీ మేయర్ ఆళ్ల చెల్లారావు, భుజంగరావు, కొండ మేస్త్రి, ఈశ్వర్ రావు, నారాయణ, చిన్న, నాయుడు, అబ్బు నరసింహారావు, రెహమాన్, శ్రీను, రంగా అభిమానులు పాల్గొన్నారు.

దాసాంజనేయస్వామివారిని దర్శించుకున్న స్పీకర్ తమ్మినేని



స్వామి వారిని దర్శించుకుంటున్న స్పీకర్ తమ్మినేని సీతారాం దంపతులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మాచవరం దాసాంజనేయస్వామివారిని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం మంగళవారం దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి నాగినేని భవాని, ధర్మకర్తల మండలి చైర్మన్ కనపర్తి కొండలరావు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్పీకర్ తమ్మినేని సీతారాంకు స్వాగతం పలికారు. అనంతరం స్వామివారి శేషవస్త్రం చిత్రపటంతో సత్కరించారు. మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు, కూచిపూడి నృత్యాలు ఆద్యంతం భక్తులను ఆకట్టుకున్నాయి.

ఘనంగా దత్త జయంతి వేడుకలు



మధురానగర్‌లో కలశ పూజ నిర్వహిస్తున్న భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): ముత్యాలంపాడు శ్రీషిర్డీ సాయిబాబా మందిరంలో మంగళవారం ఆలయ కమిటీ ఆధ్వర్యాన దత్త జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. దత్త జయంతి పురస్కరించుకుని బాబా వారికి విశేషంగా మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, దత్త హోమం జరిగింది. శ్రీ శివజ్ఞాన పీఠంలో మంగళవారం మార్గశిర పౌర్ణమి, దత్త జయంతి పురస్కరించుకుని దత్తాత్రేయస్వామి వారికి విశేషంగా అభిషేకం, నాగ పడకల పూజను పీఠాధిపతి శివచార్యులు నిర్వహించారు. శివ ముక్కోటి అక్షీశ్వర మహాదేవునికి స్వర్ణ పుష్పాభిషేకం చేశారు. ధర్మాధికారి పేర్ల శ్యాం ప్రసాద్, గుండు దిలీప్, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు. మధురానగర్ శ్రీ భగవాన్ షిర్డీ సాయిబాబా మందిరంలో 108 కలశములతో విశేషంగా దత్తాత్రేయస్వామివారికి అభిషేకం, పూజలు నిర్వహించారు. మందిర కమిటీ గౌరవాధ్యక్షులు పిల్లి లక్ష్మీతులసి, పీవీఎల్ఎన్ రాజు, మందిర అధ్యక్షుడు వైవీ శివాజీ, జీ హేమ శివసత్యప్రసాద్, కోనేరు మంజుల రాణి పర్యవేక్షించారు. పసుపుతోట శ్రీదత్తసాయి మందిరంలో మందిర వ్యవస్థాపకుడు తంగెళ్లమూడి వీరమోహనరావు దత్తాత్రేయునికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ భగత్‌సింగ్ పార్క్ సమీపంలోని శ్రీ సద్గురు సంస్థాన్‌లో శ్రీదత్తాత్రేయ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. బొమ్మదేవర శ్రీనివాస్, జొన్నవిత్తుల రామకృష్ణ, సీహెచ్ వెంకట రమణ మూర్తి దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమాలను సంస్థాన్ అధ్యక్షుడు పి.రామారావు, అరుణ, సరస్వతమ్మ, లక్ష్మి పర్యవేక్షించారు. ఆయా ఆలయాల్లో మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ జరిగింది.

అభినయ కళా సరస్వతి సినీ నటి సావిత్రి



శ్రీసత్యకు పురస్కారం అందజేస్తున్న బలరామకృష్ణ మూర్తి, విజయలక్ష్మి, ఉమాబలరాం

విజయవాడకల్చరల్: అభినయ కళా సరస్వతి మహానటి సావిత్రి అని ఆర్టిస్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి అన్నారు. మహానటి సావిత్రి సాహిత్య సాంస్కృతిక కళాపీఠం సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో మంగళవారం సావిత్రి వర్ధంతి, మహానటి సావిత్రి సంఘటనా సామ్రాట్ పురస్కార కార్యక్రమాన్ని నిర్వహించారు. బలరామకృష్ణ మూర్తి మాట్లాడుతూ బహుముఖ ప్రతిభాశాలి సావిత్రిగా అభివర్ణించారు. కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి మాట్లాడుతూ సావిత్రి ఆశయ సాధన కోసం సంస్థ కృషి చేస్తోందన్నారు. ప్రతి ఏటా సావిత్రి జయంతి సందర్భంగా ప్రతిభా పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు తెలిపారు. 2023వ సంవత్సరానికి గానూ ఈవెంట్ అధినేత శ్రీ సత్యకు మహానటి సావిత్రి సంఘటనా ఈవెంట్ సామ్రాట్ పురస్కారాన్ని ప్రదానం చేశారు. జ్యోతిష్య శాస్త్రవేత్త ప్రసూనా రామన్, రంగస్థల నటుడు కొప్పుల ఆనంద్, రమణ, చావా నరసింహారావు పాల్గొన్నారు. సినీ సంగీత విభావరి కార్యక్రమంలో భాగంగా సుధాశ్రీనివాస్, శ్రీసత్య రూపశ్రీ, సునీల్ తదితరులు పలు తెలుగు, హిందీ చిత్రగీతాలను ఆలపించారు.

సంపు పనులు త్వరగా పూర్తి చేయండి



సంపు పనులను పరిశీలిస్తున్న వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే విష్ణు

పటమట(విజయవాడతూర్పు): సత్యనారాయణపురం జీవీఆర్ నగర్‌లో అమృత్ పథకంలో నిర్మిస్తున్న సంపు పనులు ఆలస్యం కావడంపై వీఎంసీ కమిషనర్ స్వప్నిల్‌దినకర్ పుండ్కర్ కాంట్రాక్ట్ ఏజెన్సీకి పెనాల్టీ విధించాలని వీఎంసీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీనివాస్‌కు ఆదేశించారు. నగర పర్యటనలో భాగంగా ఆయన మంగళవారం సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణుతో కలిసి నిర్మాణం జరుగుతున్న సంపు ప్రాంతాన్ని సందర్శించి జరుగుతున్న పనులపై ఆరా తీశారు. నెల రోజుల్లో సంపు నిర్మాణ పనులన్నీ పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. రెండోసారి ఇచ్చిన గడువు లోపు నిర్మాణ పనులు పూర్తి చేయకుంటే మళ్లీ పెనాల్టీ విధిస్తామని కాంట్రాక్ట్ ఏజెన్సీని హెచ్చరించారు. స్థానికంగా వెడల్పు చేసిన రోడ్డు వెంబడి, వాంబే కాలనీ మెయిన్ రోడ్డు వద్ద, రైల్వే కాంపౌండ్‌ను ఆనుకుని ఉన్న ఖాళీ స్థలంలో వాకింగ్ ట్రాక్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మల్లాది విష్ణు కమిషనర్‌కు సూచించారు. ట్రాక్ నిర్మాణ పనులు ప్రారంభానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో స్థానిక కార్పొరేటర్లు మూర్తి, జానారెడ్డి తదితరులు పాల్గొన్నారు

దేవీనగర్‌లో చోరీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఇంటి తలుపులు పగుల కొట్టి చోరీ చేసిన ఘటన అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దేవీనగర్‌లో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దేవీనగర్ ఒకటో లైనులో నందివాడ వెంకట శ్రీదేవి దంపతులు నివసిస్తున్నారు. శ్రీదేవీ భర్త పోస్ట్ ఆఫీస్‌లో పోస్టు మాస్టర్‌గా పనిచేస్తున్నారు. వీరు ఈనెల 23వ తేదీ రాత్రి 9 గంటలకు ఇంటికి తాళం వేసి పుట్టపర్తి గుడికి వెళ్లారు. 25వ తేదీ సోమవారం ఉదయం 11.30 గంటలకు ఇంటి పక్క వారు ఫోన్ చేసి మీ ఇంటి తలుపులు తెరచి ఉన్నాయని చెప్పారు. దీంతో మంగళవారం ఉదయం 8 గంటలకు ఇంటికి చేరుకుని వచ్చి చూసేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉన్నాయి. బీరువాలోని రూ.24 వేలు, బెడ్‌రూమ్‌లో రూ.12 వేలు, అర కాసు బంగారు బుట్టలు, 17 తులాల వెండి పట్టీలు మాయం అయ్యాయి. దీంతో అజిత్‌సింగ్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. సమాచారం అందుకున్న సీఐ గురుప్రకాష్ సిబ్బందితో కలిసి ఘటనాస్థలికి చేరుకుని వివరాలు సేకరించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కార్పొరేటర్ జానారెడ్డి బాధితులను మంగళవారం కలిసి పరామర్శించారు.

చురుగ్గా షాదీఖానా నిర్మాణ పనులు

- ప్రస్తుతం ఫౌండేషన్ పనులు సాగుతున్న వైనం
- రూ.2 కోట్లతో నిర్మాణం చేపట్టిన రాష్ట్ర ప్రభుత్వం



కొనసాగుతున్న షాదీఖానా నిర్మాణ పనులు

లబ్బీపేట(విజయవాడతూర్పు): వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంలో ఏదైనా చెప్పారంటే.. దానిని చేసి చూపిస్తూ ఆ పనిపై ఉన్న చిత్తశుద్ధిని నిరూపిస్తున్నారు. ఇలా తూర్పు నియోజకవర్గంలో ఎన్నో పనులు చేయగా, వాటిలో ఒకటి లబ్బీపేటలోని షాదీఖానా నిర్మాణం. దశాబ్దాలుగా ఈ ప్రాంతంలో షాదీఖానా నిర్మాణం చేయాలని ముస్లింలు కోరుతున్నారు. వారి ఆశలు ఇప్పటికి నెరవేరాయి. గత మున్సిపల్ ఎన్నికల సమయంలో లబ్బీపేట ప్రాంతానికి ప్రచారం కోసం వచ్చినప్పుడు పలువురు ఈ సమస్యను దేవినేని అవినాష్ దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి వివరించారు. ఆఘమేఘాలపై అనుమతులు లభించి ఎట్టకేలకు నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి.

మోసం చేసిన గద్దె..

లబ్బీపేటలో షాదీఖానా విషయంలో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ గత ప్రభుత్వంలో అదిగో ఇదిగో అని చెబుతూ మోసం చేశారని పలువురు ముస్లింలు అంటున్నారు. పదిరోజులకోసారి వచ్చి కొలతలు వేయడం, ఇరిగేషన్ నుంచి అనుమతులు, ఆర్అండ్‌బీ నుంచి అనుమతులు అంటూ కాలయాపన చేశాడంటున్నారు. అంతేకాకుండా ఎలాంటి అనుమతులు లేకుండా శంకుస్థాపన చేస్తానంటూ ఫొటోలు దిగుతూ ప్రచారం చేసుకున్నాడని విమర్శిస్తున్నారు. నియోజకవర్గంలోని 30 వేల మంది ముస్లింలను నయవంచన చేశారంటున్నారు.

సకల సదుపాయాలతో..

ప్రభుత్వం నుంచి అన్ని అనుమతులు రావడంతో నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. నగరపాలక సంస్థ నుంచి రూ.2 కోట్లు మంజూరు కావడంతో తొలుత రెండు అంతస్తుల్లో నిర్మాణం చేపట్టనున్నారు. ఒక్కో అంతస్తు 3 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో నిర్మిస్తున్నారు. ఇది పూర్తి అయితే చిన్న మధ్యతరగతి ముస్లిం కుటుంబాలు వేడుకలు చేసుకునేందుకు అనువుగా ఉంటుంది. అంతేకాకుండా బందరు కాల్వ ఒడ్డున ఉండటంతో పార్కింగ్‌కు కూడా ఎలాంటి అసౌకర్యం ఉండదని చెబుతున్నారు. సకల సదుపాయాలతో నిర్మాణం జరుగనుంది.

వేగంగా పనులు పూర్తిచేస్తాం..



షాదీఖానా నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. రెండు, మూడు నెలల్లో రెండు అంతస్తులు స్లాబ్ వేసే పనులు పూర్తి చేసే లక్ష్యంతో పనులు వేగంగా జరుగుతున్నాయి. ఈ ప్రాంతంలో షాదీఖానా నిర్మాణం చేయాలనేది ఎప్పటి నుంచి ప్రజల ఆకాంక్ష. వారి ఆశలను సీఎం వైఎస్ జగన్ నెరవేరుస్తున్నారు. గతంలో నాయకులు మాటలు చెప్పి, మోసం చేశారే కానీ పనులు చేయలేదు. కానీ నేడు ప్రతి పనిని చేతలతో చేసి చూపిస్తున్నారు. త్వరలో భవనాన్ని అందుబాటులోకి తెస్తాం.

– ఎండీ రెహానా నాహీద్, 19వ డివిజన్ కార్పొరేటర్

● వైభవంగా కలశ జ్యోతుల మహోత్సవం







ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మకు భవానీలు, భవానీ భక్తులు మంగళవారం సాయంత్రం కలశ జ్యోతులను సమర్పించారు. సత్యనారాయణపురంలోని శివరామకృష్ణ క్షేత్రం నుంచి ఇంద్రకీలాద్రి వరకు నిర్వహించిన కలశ జ్యోతుల మహోత్సవంలో పెద్ద సంఖ్యలో భవానీలు పాల్గొన్నారు. నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి విచ్చేసిన భక్తులు అమ్మ వారి నామస్మరణచేస్తూ కలశ జ్యోతులతో ఊరేగింపులో పాల్గొన్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ



సూర్యతేజేస్‌కు సత్కారం



మధురానగర్(విజయవాడసెంట్రల్): ఇటీవల తెలంగాణ రాష్ట్రంలో జరిగిన ర్యాపిడ్ రేటింగ్ చెస్ టోర్నమెంట్‌లో ఫిడే రేటింగ్ సాధించిన మీసాల సూర్యతేజేస్‌ను మంగళవారం రామకృష్ణ చెస్ అకాడమీలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కోచ్ అవ్వారు రామకృష్ణ మాట్లాడుతూ తేజేస్ భవిష్యత్తులో మరింత ఉత్తమ ప్రదర్శనతో మెరుగైన ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. తేజేస్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు.


ఆడుదాం ఆంధ్రా పోటీల ప్రారంభోత్సవం సందర్భంగా క్రికెట్ ఆడుతున్న సీఎం వైఎస్ జగన్


క్రీడాకారులతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి. చిత్రంలో మంత్రి ఆర్కే రోజా, అంతర్జాతీయ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్, శాప్ చైర్మన్ బైరెడ్డి తదితరులు


క్రీడాకారులకు కిట్లను అందజేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మంత్రి ఆర్కే రోజా, బైరెడ్డి సిద్ధార్థరెడ్డి

మెగా టోర్నీ మొదలైంది

▶ మొదటి పేజీ తరువాయి

ఎంత మేలు జరుగుతుంది? ప్రతి ఒక్కరికీ అవి ఎంత అవసరం? అనే విషయాలను తెలియజేసేందుకు ఇది ఒక అవగాహన కార్యక్రమంలా ఉపయోగపడుతుంది. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం వల్ల బీపీ కంట్రోల్‌లో ఉంచుకోగలుగుతాం. టైప్ 2 డయాబెటీస్‌ని నిరోధించడంలో క్రీడలు చురుకైన పాత్ర పోషిస్తాయి.

జబ్బుల బారిన పడకుండా..

మన ప్రభుత్వం ప్రజారోగ్య సంరక్షణకు అత్యంత ప్రాధాన్యమిస్తోంది. వైఎస్సార్ విలేజ్ క్లినిక్స్, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ ద్వారా గ్రామ స్థాయిలో ప్రివెంటివ్ కేర్‌పై దేశం మొత్తం గర్వపడేలా మన అడుగులు పడుతున్నాయి. ఇందులో భాగంగా మనిషికి వ్యాయామం ఎంత అవసరం అనే విషయాన్ని గ్రామ స్థాయిలోకి తీసుకెళ్లే గొప్ప కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. బీపీ ఎక్కువైతే గుండెకు సంబంధించిన అనేక వ్యాధులు వస్తాయి. షుగర్ ఎక్కువైతే కిడ్నీ, నరాల జబ్బుల బారిన పడే ప్రమాదం ఉంది. అందువల్ల వీటిని కంట్రోల్‌లో ఉంచాలన్నా, రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నా గ్రామ స్థాయి నుంచి వ్యాయామం, క్రీడలు ఎంతో అవసరమని ప్రభుత్వం గట్టిగా భావిస్తోంది. అందుకే ఈ గొప్ప కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం.

మెంటార్లుగా పీవీ సింధు, శ్రీకాంత్

ఈ క్రీడోత్సవాలు సచివాలయం స్థాయి నుంచి మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు జరుగుతాయి. వివిధ స్థాయిల్లో ఆణిముత్యాలను గుర్తించేందుకు ప్రొఫెషనల్ లీగ్ టీమ్స్ రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేస్తాయి. ప్రతిభ కలిగిన యువ క్రీడాకారులను ఆణిముత్యాలుగా మలిచే కార్యక్రమంలో భాగస్వాములు అయ్యేందుకు టీమ్‌లు ముందుకొచ్చాయి. క్రికెట్‌కు సంబంధించి చెన్నై సూపర్ కింగ్స్, ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ముందుకు వచ్చాయి. వీరంతా నియోజకవర్గ స్థాయి నుంచి మన ఆటలను తిలకిస్తారు. ఆణిముత్యాలను వెతికి వారికి మెరుగులు దిద్ది జాతీయ, అంతర్జాతీయ స్థాయిలోకి తీసుకెళ్లేందుకు ఈ టీమ్స్ తోడుగా ఉంటాయి. బ్యాడ్మింటన్‌కు సంబంధించి కిడాంబి శ్రీకాంత్, పీవీ సింధు ఇందులో భాగస్వాములు అవుతున్నారు. అంతర్జాతీయ క్రీడాకారులను ప్రోత్సహించడంలో భాగంగా వారిలో ఒకరికి విశాఖపట్నంలో, మరొకరికి తిరుపతిలో స్థలం ఇచ్చాం. బ్యాడ్మింటన్ అకాడమీలు స్థాపించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని రకాలుగా వారికి పూర్తిగా సహకరిస్తుంది. శ్రీకాంత్, సింధు మెంటార్లుగా వ్యవహరిస్తూ ప్రతిభ ప్రదర్శించే మన పిల్లలకు తోడుగా నిలుస్తారు. ఇక వాలీబాల్‌కు సంబంధించి ప్రైమ్ వాలీబాల్, కబడ్డీకి సంబంధించి ప్రో కబడ్డీ ఆర్గనైజర్లు ముందుకు వచ్చారు. వారంతా రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పనిచేస్తూ టాలెంట్ హంట్‌లో పాలు పంచుకుంటారు.

పాల్గొన్న మంత్రులు, ప్రజా ప్రతినిధులు

ఈ కార్యక్రమంలో మంత్రులు ఆర్కే రోజా, అంబటి రాంబాబు, విడదల రజని, మేరుగ నాగార్జున, శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్దార్థరెడ్డి, రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, ఎమ్మెల్సీలు తలశిల రఘురామ్, లేళ్ల అప్పిరెడ్డి, మర్రి రాజశేఖర్, కల్పలతారెడ్డి, ఎమ్మెల్యేలు మహ్మద్ ముస్తఫా, మద్దాళి గిరి, మేకతోటి సుచరిత, అన్నాబత్తుని శివకుమార్, కిలారు రోశయ్య, పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఇక ఏటా ఆటలు..

ఆడుదాం ఆంధ్రా టోర్నీని ప్రతి సంవత్సరం నిర్వహిస్తాం. గ్రామస్థాయి నుంచి మొదలై మండల, నియోజకవర్గ, జిల్లా, రాష్ట్ర స్థాయి వరకు పోటీలు జరుగుతాయి. ఏటా ఈ కార్యక్రమం జరుగుతున్నప్పుడు గ్రామాల్లో ఆరోగ్యపరమైన అవగాహన కల్పిస్తూ టాలెంట్ హంట్ కొనసాగిస్తాం. తద్వారా మరిన్ని ఆణిముత్యాలు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో రాణించే అవకాశం ఉంటుంది. సచివాలయ స్థాయి, మండల స్థాయి నుంచి గెలిచిన వారికి నియోజకవర్గ స్థాయిలో ఆడేందుకు ప్రొఫెషనల్ కిట్లు పంపిణీ జరుగుతుంది. ఏటా కిట్లు ఇస్తూ మన పిల్లలను ప్రోత్సహించే కార్యక్రమాన్ని నిర్వహిస్తాం.

రాబోయే రోజుల్లో స్కూల్ స్థాయి నుంచి..

రాష్ట్రవ్యాప్తంగా సచివాలయ స్థాయి నుంచి ప్రారంభిస్తే దాదాపు 34.19 లక్షల మంది క్రీడాకారులు ఆడుదాం ఆంధ్రా కోసం రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. 88.66 లక్షల మంది ప్రేక్షకులుగా ఎంకరేజ్ చేయడానికి ముందుకు వచ్చారు. మొత్తం 1.22 కోట్ల మందికిపైగా రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా యువ క్రీడాకారులకు మంచి జరగాలని మనసారా కోరుకుంటున్నాను. 15,000 సచివాలయాల పరిధిలో ఇప్పటికే 9,000 ప్లే గ్రౌండ్లు గుర్తించి పోటీలకు సిద్ధం చేశాం. ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీ గ్రౌండ్స్, యూనివర్సిటీ గ్రౌండ్స్, మున్సిపల్ స్టేడియాలు, జిల్లా స్పోర్ట్స్ కాంప్లెక్స్ అన్నింటినీ గుర్తించి అభివృద్ధి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో పాఠశాల స్థాయి నుంచి ప్రోత్సహించే కార్యక్రమం జరుగుతుంది. మీ అన్నగా అందరికీ ఆల్ ద వెరీ బెస్ట్ విషెస్ తెలియజేస్తున్నా. దేవుడి చల్లని దీవెనలు రాష్ట్రానికి, మన ప్రభుత్వానికి, నా తమ్ముళ్లందరికీ ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నా.


ఆడుదాం ఆంధ్రా పోటీలను ప్రారంభించి షటిల్ ఆడుతున్న సీఎం జగన్


విజయవాడలో క్రీడా జ్యోతితో ఎమ్మెల్యే విష్ణు, ఆర్చరీ క్రీడాకారిణి సురేఖ, కలెక్టర్ ఢిల్లీ రావు


ఒంగోలులో జాతీయ జెండాతో 2 కిలోమీటర్ల మేర భారీ ర్యాలీ చేపట్టిన విద్యార్థులు


అనంతపురం జిల్లా కేంద్రంలో హోరాహోరీగా సాగుతున్న క్రికెట్ మ్యాచ్


విజయనగరం మండలం సారికలో కబడ్డీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

సంబరంలా.. ఆడుదాం ఆంధ్రా పోటీలు

- రాష్ట్రవ్యాప్తంగా అంబరాన్నంటిన క్రీడాకారుల ఉత్సాహం
- తొలిరోజు 6,174 గ్రామ, వార్డు సచివాలయాల పరిధిలో పోటీలు
- ఐదు క్రీడాంశాల్లో 33,722 పోటీల నిర్వహణ
- తొలి రోజు 5 లక్షల మంది వీక్షకుల హాజరు
- 50 శాతం జిల్లాల్లో 100 శాతం పూర్తయిన జట్ల కూర్పు
- మిగిలిన జిల్లాల్లో 99 శాతం పూర్తి

సాక్షి, నెట్‌వర్క్: మట్టిలో మాణిక్యాల్లాంటి క్రీడాకారులను వెలుగులోకి తీసుకురావడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన ఆడుదాం ఆంధ్రా పోటీలు తొలిరోజు అంబరాన్ని అంటే సంబరంతో మొదలయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా క్రీడాకారులు పెద్ద ఎత్తున ఈ పోటీల్లో పాల్గొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మంగళవారం గుంటూరులోని నల్లపాడు లయోలా పబ్లిక్ స్కూల్లో 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. తొలిరోజు 15 వేల గ్రామ/వార్డు సచివాలయాలకు గాను 6,174 చోట్ల షెడ్యూల్ ప్రకారం పోటీలను నిర్వహించారు. ఆయా జిల్లాల్లో మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు, అధికారులు ఈ పోటీలను ప్రారంభించారు. తొలి రోజు ఐదు క్రీడాంశాల్లో కలిపి మొత్తం 33,722 పోటీలు జరిగాయి. సాంప్రదాయ క్రీడాంశాలైన యోగా, మారథాన్ పోటీలు విశేషంగా ఆకట్టుకున్నాయి. 26 జిల్లాల్లోనూ 5 లక్షలకుపైగా ప్రేక్షకులు నేరుగా ఆడుదాం ఆంధ్రా పోటీలను వీక్షించినట్టు సమాచారం. దాదాపు 50 శాతం జిల్లాల్లో 100 శాతం, మిగిలిన జిల్లాల్లో 99 శాతం వరకు జట్ల కూర్పు పూర్తయింది. జనవరి 9లోగా గ్రామ/వార్డు సచివాలయ స్థాయిలో పోటీలను పూర్తి చేసేలా రోజూ ప్రణాళిక ప్రకారం అధికార యంత్రాంగం పని చేస్తోంది. తుది నివేదిక ప్రకారం ఆడుదాం ఆంధ్రాకు 37.23 లక్షల మంది క్రీడాకారులు నమోదు చేసుకున్నారు. ఇందులో 23.48 లక్షల మంది పురుషులు, 13.75 లక్షల మంది మహిళలు ఉండటం విశేషం. వలంటీర్ల ద్వారా మాన్యువల్ స్కోరింగ్‌తో పాటు పారదర్శకత కోసం క్రిక్ క్లబ్ యాప్ ద్వారా ఆన్‌లైన్ స్కోర్లు నమోదు చేస్తున్నారు. ఇప్పటికే 1.50 లక్షల మంది శిక్షణ పొందిన వలంటీర్లకు క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, ఖోఖో, కబడ్డీ క్రీడల స్కోరింగ్‌కు ప్రత్యేక లాగిన్లు అందించారు. సచివాలయ స్థాయి పోటీల్లో విజేతలకు అందించేందుకు వీలుగా టీషర్టులు, టోపీలను వేగంగా సరఫరా చేస్తున్నారు. 17.10 లక్షల జతలకు గాను 8 లక్షలకు పైగా ఇప్పటికే జిల్లాలకు చేరాయి.

కోస్తా.. వెల్లివిరిసిన ఆనందం..

తూర్పు గోదావరి జిల్లా కొవ్వూరులో హోం మంత్రి తానేటి వనిత చేతుల మీదుగా పోటీలు ప్రారంభమయ్యాయి. రాజమహేంద్రవరంలో పోటీలను కలెక్టర్ డాక్టర్ కె.మాధవీలత, ఎంపీ భరత్‌రామ్ ప్రారంభించారు. జిల్లావ్యాప్తంగా 511 సచివాలయాల్లో పోటీలు నిర్వహిస్తున్నామని కలెక్టర్ తెలిపారు. కాకినాడ జిల్లాలో ఆటల పోటీలకు 90 వేల మంది పురుషులు, 40 వేల మంది మహిళలు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని కలెక్టర్ కృతికా శుక్లా తెలిపారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1,16,171 మంది క్రీడాకారులు పేర్లు నమోదు చేయించుకున్నారు. రామచంద్రాపురంలో మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ పోటీలను ప్రారంభించారు.

ఉత్తరాంధ్రలో ఉరిమిన ఉత్సాహం..

శ్రీకాకుళం జిల్లా వ్యాప్తంగా అన్ని సచివాలయాల పరిధిలో ఆడుదాం ఆంధ్రా పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా వివిధ క్రీడాంశాల్లో 11,500 జట్లు నమోదు చేసుకోగా.. 670 క్రీడా మైదానాలు సిద్ధం చేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 976 సచివాలయాల పరిధిలో 485 మైదానాల్లో ఐదు క్రీడాంశాల్లో ఆటల పోటీలు జరిగాయి. మొత్తం 2.07 లక్షల మంది క్రీడాకారులు పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. విజయనగరంలో కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి.. ఆటల పోటీలకు బ్రాండ్ అంబాసిడర్లుగా నియమితులైన కామన్‌వెల్త్ వెయిట్‌లిఫ్టింగ్ పతక విజేత మత్స్య సంతోషి, జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ క్రీడాకారిణి శ్రీలక్ష్మి, స్కేటింగ్ క్రీడాకారుడు సాయితేజలను ఘనంగా సత్కరించారు. విశాఖపట్నంలోని మధురవాడ చంద్రంపాలెంలో జిల్లా కలెక్టర్ మల్లికార్జున, అనకాపల్లి జిల్లాలోని దేవరాపల్లిలో ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు, అనకాపల్లిలో మంత్రి గుడివాడ అమర్‌నాథ్, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి పోటీలకు శ్రీకారం చుట్టారు. అనకాపల్లి జిల్లావ్యాప్తంగా 14,098 టీములు, అందులో 1.31 లక్షల మంది క్రీడాకారులు పోటీ పడుతున్నారు.

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ప్రజాప్రతినిధులు హాజరై పోటీలకు శ్రీకారం చుట్టారు. భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, తణుకులో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, ఏలూరు, భీమవరంలో కలెక్టర్లు వె.ప్రసన్న వెంకటేష్, పి.ప్రశాంతిలు ఆటల పోటీలను ప్రారంభించారు. ఏలూరు జిల్లాలో 1.43 లక్షల మంది, పశ్చిమగోదావరి జిల్లాలో 1.71 లక్షల మంది క్రీడల్లో పాల్గొనటానికి పేర్లు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఏలూరు జిల్లాలో 5 ప్రధాన క్రీడలకు సంబంధించి 14,354 టీమ్‌లను సిద్ధం చేసి 7,198 మ్యాచ్‌లు ఏర్పాటు చేస్తున్నారు. ఎన్టీఆర్ జిల్లాలో విజయవాడలో కలెక్టర్ ఢిల్లీరావు, ఎమ్మెల్యే మల్లాది విష్ణు, మునిసిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ప్రముఖ ఆర్చరీ క్రీడాకారిణి వెన్నం జ్యోతి సురేఖ తదితరులు పాల్గొని పోటీలను ప్రారంభించారు. జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో దాదాపు 1.17 లక్షల మంది క్రీడాకారులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ విభాగాల్లో 11 వేలకు పైగా జట్లు ఆడనున్నాయి. కృష్ణా జిల్లాలో వివిధ క్రీడల్లో 1.12 లక్షల మంది పేర్లు నమోదు చేసుకున్నారు. పురుషుల్లో 7 వేల జట్లు, మహిళల్లో 4వేల జట్లు ఉన్నాయి. పోటీల్లో భాగంగా ప్రకాశం జిల్లా ఒంగోలులో జాతీయ పతాకంతో 2 కిలోమీటర్ల మేర విద్యార్థులు భారీ ర్యాలీ నిర్వహించారు. 3,280 అడుగుల పొడవున రూపొందించిన జాతీయ జెండాతో క్రీడాకారులు గాంధీనగర్ నుంచి చీమకుర్తిలోని ప్రభుత్వ హైస్కూలు క్రీడా ప్రాంగణం వరకు ర్యాలీ చేపట్టారు. దర్శిలో జాతీయ పతాకంతో రెవెన్యూ కార్యాలయం నుంచి జూనియర్ కళాశాల గ్రౌండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో అన్ని నియోజకవర్గాల్లో ఉత్సాహభరిత వాతావరణంలో పోటీలు జరిగాయి.

రాయలసీమ.. ఆటాడుకుందాం రా..

ఉమ్మడి కర్నూలు జిల్లా వ్యాప్తంగా పోటీలు ఘనంగా ప్రారంభమయ్యాయి. కర్నూలు జిల్లాలో 1,89,929 మంది, నంద్యాల జిల్లాలో 1.25 లక్షల మంది క్రీడాకారులు పోటీలకు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. వైఎస్సార్ జిల్లాలో 645, అన్నమయ్య జిల్లాలో 501 సచివాలయాల పరిధిలో గ్రామ/వార్డు సచివాలయ స్థాయి క్రీడాపోటీలు ప్రారంభమయ్యాయి. ఆయా నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, అధికారులు పోటీలకు శ్రీకారం చుట్టారు. మొదటి రోజు చిత్తూరు జిల్లాలోని 31 మండలాల్లో 515 క్రీడామైదానాల్లో పోటీలు జరిగాయి. తిరుపతి జిల్లాలో పలు సచివాలయాల పరిధిలో క్రీడాకారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పోటీలు సందడిగా ప్రారంభమయ్యాయి. అనంతపురం, రాయదుర్గం, శింగనమల, గుంతకల్లు, తాడిపత్రి, రాప్తాడు, కళ్యాణదుర్గం నియోజకవర్గాల్లోనూ పోటీలు జరిగాయి. శ్రీసత్యసాయి జిల్లాలో కదిరి, మడకశిర, పెనుకొండ, పుట్టపర్తి, హిందూపురం నియోజకవర్గాల్లో క్రీడాకారులు వివిధ క్రీడాంశాల్లో పోటీ పడ్డారు.


వేడుకగా 'ఆట'

- జెండా ఆవిష్కరించి ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్
- కొద్దిసేపు బ్యాటింగ్
- క్రీడాకారులకు కిట్లు పంపిణీ

సాక్షి ప్రతినిధి, గుంటూరు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన దేశంలోనే అతి పెద్ద మెగా టోర్నీ 'ఆడుదాం ఆంధ్రా' గుంటూరు శివారు నల్లపాడులోని లయోలా పబ్లిక్ స్కూల్‌లో మంగళవారం వైభవంగా ప్రారంభమైంది. జెండాను ఆవిష్కరించి పోటీలను లాంఛనంగా ప్రారంభించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి క్రీడోత్సవాల ప్రారంభ సూచకంగా గాల్లోకి బెలూన్లను ఎగురవేశారు. అనంతరం బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సీహెచ్ రమాదేవికి క్రీడల టార్చ్ అందచేశారు. కిడాంబి శ్రీకాంత్‌తో కలసి క్రీడాజ్యోతిని వెలిగించారు. అనంతరం సీఎం జగన్ స్వయంగా మైదానాల వద్దకు వెళ్లి ఖోఖో, క్రికెట్, వాలీబాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. అక్కడ సీఎం జగన్ కొద్దిసేపు బ్యాటింగ్ చేశారు. శాప్ చైర్మన్ బైరెడ్డి సిద్ధార్థరెడ్డి బౌలింగ్ చేయగా మంత్రి రోజా వికెట్ కీపింగ్ చేశారు. సీఎం జగన్ మంచి షాట్లు బాది అందరినీ ఉత్సాహపరిచారు. మంత్రి రోజాకు క్రికెట్ మెళకువలు సూచించారు. అంతకు ముందు పలు క్రీడలకు సంబంధించిన కిట్లను క్రీడాకారులకు అందచేశారు. క్రికెట్ కిట్‌లు, వాలీబాల్, బ్యాడ్మింటన్ కిట్లు అందించారు. రాష్ట్రవ్యాప్తంగా 5.09లక్షల స్పోర్ట్స్ కిట్స్ అందిస్తున్నట్లు తెలిపారు. ఆటల పోటీల నిబంధనలను గౌరవిస్తూ నిజమైన క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తామంటూ ఈ సందర్భంగా క్రీడాకారులతో సీఎం జగన్ ప్రతిజ్ఞ చేయించారు.

జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేయడమే లక్ష్యం

మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు



తణుకు అర్బన్: గ్రామీణ యువతను జాతీయ స్థాయి క్రీడాకారులుగా తయారు చేయడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆడుదాం ఆంధ్రా కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు చెప్పారు. పశ్చిమ గోదావరి జిల్లా తణుకులోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు వివిధ అంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. 47 రోజుల పాటు ఐదు దశల్లో ఈ పోటీలు జరుగుతాయన్నారు. విజేతలకు కోట్ల రూపాయల బహుమతులు ఇవ్వనున్నారని వివరించారు. ఇప్పటికే జగనన్న తీసుకువచ్చిన చదువుల విప్లవంతో ఏపీ విద్యావిధానంపై అమెరికాలో ఇటీవల నిర్వహించిన సెనేట్‌లో సైతం ప్రభుత్వ పాఠశాలల విద్యార్థినులు సత్తా చాటారని చెప్పారు. క్రీడలను కూడా అదే స్థాయిలోకి తీసుకువెళ్లే విధంగా సీఎం వైఎస్ జగన్ కృషి చేస్తున్నట్లు తెలిపారు.

ఓటీపీ దొంగలు వస్తున్నారు జాగ్రత్త

రాష్ట్రంలో ఓటీపీ దొంగలు తిరుగుతున్నారు.. ప్రజలు జాగ్రత్తగా ఉండాలని మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు హెచ్చరించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు అడిగే హక్కు అన్ని పార్టీలకూ ఉంటుందని, కానీ టీడీపీ వారు ప్రజల నుంచి ఓటీపీలు డిమాండ్ చేయడం ఎంతవరకు సబబని ప్రశ్నించారు. సైబర్ నేరాలు పెరుగుతున్న నేటి రోజుల్లో టీడీపీ ఓటీపీ వ్యవహారాన్ని తెర మీదకు తెచ్చిందన్నారు. ఓటీపీ చెబితే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత మీకు లబ్ధి చేకూరుతుందంటూ ప్రజలను మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని మండిపడ్డారు. వన్ టైమ్ పాస్‌వర్డ్(ఓటీపీ) చెప్పడం వల్ల కొన్ని పరిస్థితుల్లో ప్రజల ఓటు గల్లంతయ్యే ప్రమాదముంటుందని, వారి మొబైల్స్‌లో ఉన్న వ్యక్తిగత సమాచారాన్ని దొంగిలించే ప్రమాదముందని, ఇప్పటికే పోలీసులు సైతం మైకు ద్వారా ప్రచారం చేస్తున్నారని వివరించారు.

క్లుప్తంగా...

జగనన్నతోనే నా ప్రయాణం
వైఎస్సార్‌సీపీ గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా రాంబాబు



గిద్దలూరు రూరల్‌ : ముఖ్యమంత్రి జగనన్నతోనే నా ప్రయాణం కొనసాగుతుందని ఎమ్మెల్యే అన్నా రాంబాబు మంగళవారం ఒక ప్రకటనలో స్పష్టంచేశారు. తాను టీడీపీలోకి వెళ్తున్నానని సోషల్‌ మీడియాలో వస్తున్న ప్రచారాన్ని ఆయన ఖండించారు. రాష్ట్రంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానన్నారు. తాను, తన వర్గం ఎప్పటికీ వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతామని ఆయన స్పష్టంచేశారు. ఇటీవల ఆరోగ్యం బాగోలేక ఆపరేషన్‌ చేయించుకోవడంతో నియోజకవర్గంలోని కొన్ని కార్యక్రమాలకు హాజరుకాలేకపోతున్నానని, త్వరలోనే తిరిగి పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటానని ఆయన చెప్పారు. కొందరు తనపై బురదజల్లడమే పనిగా పెట్టుకున్నారని, అలాంటి చిల్లర రాజకీయాలు మానుకోవాలని అన్నా రాంబాబు హితవు పలికారు.

కారుమంచిలో బీజేపీ ఎంపీకి నిరసన సెగ
ప్రత్యేక హోదాపై గ్రామస్తుల నిలదీత

శావల్యాపురం: పల్నాడు జిల్లా శావల్యాపురం మండలం కారుమంచి గ్రామంలో బీజేపీ రాజ్యసభ సభ్యుడు అజయ్‌ ప్రతాప్‌సింగ్‌కు నిరసన సెగ తగిలింది. వికసిత్‌ భారత్‌ సంకల్ప యాత్ర కార్యక్రమంలో భాగంగా కేంద్ర పథకాలపై బీజేపీ నాయకులు, మండల స్థాయి అధికారులు గ్రామస్తులతో మంగళవారం అవగాహన సదస్సు నిర్వహించారు. దీనికి వచ్చిన ఎంపీ అజయ్‌ ప్రతాప్‌సింగ్‌ మాట్లాడుతూ..విశ్వకర్మ యోజన పథకంలో చేతివృత్తులు చేసుకునే వారందరికీ కేంద్రం తక్కువ వడ్డీకు రుణాలు మంజూరు చేస్తోందని, అర్హత కలిగిన వారందరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కేంద్ర పథకాల గురించి, బీజేపీ పాలనపై మాట్లాడుతుండగా ప్రధాని మోదీ 2014లో అధికారంలోకి రాగానే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామని ప్రకటించి 10 ఏళ్లు గడుస్తున్నా నేటి వరకు దాన్ని నెరవేర్చలేదని, నల్లధనాన్ని బయటకు తీసి పేదల బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని ఇచ్చిన హామీ ఏమైందని గ్రామస్తులు ఎంపీని నిలదీశారు. దీంతో కంగుతున్న ఎంపీతో పాటు బీజేపీ నేతలు ఏం చెప్పాలో తెలియక అక్కడి నుంచి వెళ్లిపోయారు. సర్పంచ్‌ మల్లావరపు విశ్రాంతం తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో అంటరానితనాన్ని ప్రోత్సహిస్తోన్న టీడీపీ
డిప్యూటీ సీఎం నారాయణస్వామి మండిపాటు



తిరుపతి ఎడ్యుకేషన్‌: దళితులంటే చంద్రబాబుకు ముందు నుంచే చిన్నచూపు అని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కే నారాయణస్వామి విమర్శించారు. తిరుపతిలోని ఎస్వీజేఎస్‌ఎం నగర పాలక ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఆడుదాం ఆంధ్ర ప్రారంభోత్సవంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ..దళితులంటే చంద్రబాబుకు గిట్టదని, ఇప్పటికీ గ్రామాల్లో అంటరానితనాన్ని టీడీపీ ప్రోత్సహిస్తోందని దుయ్యబట్టారు. చంద్రబాబు లాంటి అవినీతి వ్యక్తిని తాను ఇదివరకు చూడలేదని చెప్పారు. 14 ఏళ్ల పాలనలో బాబు అభివృద్ధి చేసిందేమీ లేదన్నారు. తన పాలనలో తానేమి చేసింది ప్రజలకు చెప్పుకోలేని దుస్థితిలో చంద్రబాబు ఉన్నారని ఎద్దేవా చేశారు. అధికారం చేజిక్కించుకోవడానికి చంద్రబాబు ఎంతకైనా దిగజారుతాడని, ప్రశాంత్‌కిశోర్, పవన్‌ కల్యాణ్‌లను పలుమార్లు విమర్శించిన చంద్రబాబు నేడు వారిని దగ్గరకు చేర్చుకోవడమే ఇందుకు నిదర్శనమని తెలిపారు. ఎలాగైనా పొత్తులతో అధికారం చేజిక్కించుకోవాలని చూస్తున్న చంద్రబాబుకు ప్రజలే తగిన బుద్ధి చెబుతారని తెలిపారు.

చంద్రబాబుకు క్యారెక్టర్‌ లేదు: ఎంపీ భరత్‌



రాజమహేంద్రవరం రూరల్‌: ఈ ప్రపంచంలో క్యారెక్టర్‌ లేని రాజకీయ నాయకుడు ఎవరైనా ఉన్నారా అంటే అది చంద్రబాబేనని ఎంపీ భరత్‌రామ్‌ విమర్శించారు. అధికారం, పదవులతో అలజడులు సృష్టించడమే అజెండాగా పెట్టుకుని రాష్ట్రాన్ని సర్వ నాశనం చేసేందుకు కంకణం కట్టుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక వీఎల్‌ పురం మార్గాని ఎస్టేట్స్‌ ప్రాంగణంలో మంగళవారం ఆయన మాట్లాడారు. గతంలో సెఫాలజిస్ట్‌ ప్రశాంత్‌ కిశోర్‌ (పీకే)ను చంద్రబాబు ఇష్టానుసారంగా దూషించి నేడు ఆయన్ను పక్కన కూర్చోబెట్టుకోవడం చూస్తే.. చంద్రబాబు క్యారెక్టర్‌ ఏంటో అర్థం అవుతుందన్నారు. చంద్రబాబు, లోకేశ్, పవన్‌కళ్యాణ్‌ తెలంగాణాలో నివాసముంటూ మన రాష్ట్రంలో కుళ్లు రాజకీయాలు చేస్తున్నారని, తెలంగాణలో టీడీపీ, జనసేన పార్టీలను ఎందుకు తరిమి తరిమి కొట్టారో ప్రజలే గ్రహించారన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మేనిఫెస్టోను పవిత్ర గ్రంథంగా భావించి అమలు చేశారని వివరించారు. చంద్రబాబు అధికారంలోకి వస్తే ప్రస్తుత సంక్షేమ పథకాలన్నీ ఎత్తేస్తారని ప్రజలకు తెలుసునన్నారు. రుడా చైర్మన్‌ రౌతు సూర్యప్రకాశరావు, అర్బన్, రూరల్‌ కోఆర్డినేటర్లు డాక్టర్‌ గూడూరి శ్రీనివాస్, చందన నాగేశ్వర్, రాష్ట్ర తెలికుల, గాండ్ల కార్పొరేషన్‌ చైర్మన్‌ సంకిన భవానీప్రియ, పార్టీ నాయకులు నక్కా శ్రీనగేష్, పోలు విజయలక్ష్మి, మజ్జి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

వాస్తవాలు దాచిపెట్టి ట్యాబ్‌లపై విష ప్రచారం

ఆన్‌లైన్‌లో ధర కంటే ఎక్కువకు కొన్నారంటూ దుష్ప్రచారం

రెండేళ్లలో ట్యాబ్‌ల కొనుగోలుకు చేసిన ఖర్చు రూ.1,305.74 కోట్లు

- కానీ.. రూ.2,500 కోట్ల అక్రమాలు అంటూ తప్పుడు ప్రచారం
- ఆరోపణలను ఖండించిన పాఠశాల విద్యాశాఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రభుత్వం నాలుగున్నర ఏళ్లల్లో విద్యాశాఖలో ఎన్నో సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ పాఠశాలలను సమూలంగా మార్చిందని.. వాస్తవాలు తెలుసుకోకుండా కొందరు పేద విద్యార్థులకు జరుగుతున్న మేలుపై తప్పుడు ప్రచారం జరుగుతోందని పాఠశాల విద్యాశాఖ ఓ ప్రకటనలో పేర్కొంది. ఇటీవల ప్రభుత్వ పాఠశాలల్లోని 8వ తరగతి విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్స్‌ ఆన్‌లైన్‌లో తక్కువ ధర లభిస్తున్నా.. అధిక ధరకు కొనుగోలు చేశారంటూ కొందరు చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం వాస్తవం లేదని తెలిపింది. ట్యాబ్‌ కొనుగోలులో రూ.1,200 కోట్లు అవినీతి జరిగిందనడం పూర్తిగా అబద్ధమని పేర్కొంది. ట్యాబ్‌ స్పెసిఫికేషన్, వారంటీ తెలియకుండా ఆన్‌లైన్‌ ధర రూ.11,999 ఉందని.. బల్క్‌లో కొంటే రూ.9 వేలకే వస్తున్నట్టు పేర్కొంటూ.. ఈ ట్యాబ్స్‌ను రూ.14,250కు కొనుగోలు చేయడంలో అక్రమాలకు పాల్పడ్డారనడం పూర్తిగా అవాస్తవమని ఖండించింది.



పాఠశాల విద్యాశాఖ ఇంకా ఏం తెలిపిందంటే..

- వాస్తవానికి ఆయా కంపెనీలు పాత స్టాక్‌ను క్లియర్‌ చేసుకునేందుకు ఆన్‌లైన్‌లో తక్కువ ధరకు పెడుతుంటాయని, పైగా మనం కోరుకున్న స్పెసిఫికేషన్స్‌ అందులో ఉండవు. కానీ.. ప్రభుత్వం కొనుగోలు చేసిన ట్యాబ్స్‌కు నిర్ణీత ప్రత్యేకతలు పేర్కొని, ఆ తరహా ట్యాబ్స్‌ మాత్రమే తీసుకుంది.
- విద్యార్థులకు ప్రధానంగా శాంసంగ్‌ ఏ7 లైట్‌ ట్యాబ్‌లు ఇవ్వగా.. దాని బ్యాటరీతో సహా 3 ఏళ్ల వారంటీ, మూడేళ్ల పాటు మొబైల్‌ డివైజ్‌ మేనేజ్‌మెంట్‌ (ఎండీఎం), ఓటీజీ కేబుల్, ట్యాబ్‌కు రక్షణగా ఫ్లిప్‌ కవర్‌ ఉంటాయి.
- 256 జీబీ మెమరీ కార్డు గల ట్యాబ్‌ ధర మార్కెట్‌లోగాని, ఆన్‌లైన్‌లోగాని రూ.17,500 పైనే ఉంది. కానీ.. ప్రభుత్వం టెండర్‌ ద్వారా రూ.14,250 అంటే ఆన్‌లైన్‌ ధర కంటే చాలా తక్కువకు తీసుకుంది. ఆయా కంపెనీలు ఓటీజీ కేబుల్, డ్యూయల్‌ లేయర్‌ ట్యాబ్‌ ప్రొటెక్టెడ్‌ రగ్గడ్‌ కేస్, ట్యాంపర్డ్‌ స్క్రీన్‌ గార్డ్, ఫ్లాష్‌ ఎడ్యుకేషన్‌ కంటెంట్‌తో 256 జీబీ యూ3 మెమరీ కార్డు, 3 సంవత్సరాల వారంటీతో అందించాయి.
- ఆన్‌లైన్‌లో కొనుగోలు చేసిన వస్తువులకు వారంటీగాని, సాఫ్ట్‌వేర్‌ సమస్యలకు కొనుగోలుదారే అదనంగా చెల్లించాలి. కానీ.. విద్యార్థులు ట్యాబ్‌లో ఏదైనా సమస్య తలెత్తితే గ్రామ/వార్డు సెక్రటేరియట్‌లో ఇచ్చి కంపెనీ సేవలకు ఉచితంగా పొందవచ్చు.

గతేడాది ట్యాబ్స్‌ కొనుగోలుపైనా ఆరోపణ

- గత సంవత్సరం ఏసర్‌ ట్యాబ్‌ ధర రూ.14 వేలు ఉంటే, దాన్ని ప్రభుత్వం రూ.17,500కి కొనుగోలు చేసిందని, దాంతో రూ.2,500 కోట్ల స్కామ్‌ జరిగిందని ఆరోపించారు.
- వాస్తవానికి గతేడాది ప్రభుత్వం ఏసర్‌ ట్యాబ్‌లను కొనుగోలు చేయనేలేదు. ఈ ఏడాది మాత్రమే 1.35 లక్షల ఏసర్‌ ట్యాబ్‌లను కొనుగోలు చేసింది. ఒక్కో ఏసర్‌ ట్యాబ్‌ను రూ.14,200కు ఓటీజీ కేబుల్, డ్యూయల్‌ లేయర్‌ ట్యాబ్‌ ప్రొటెక్టెడ్‌ రగ్గడ్‌ కేస్, ట్యాంపర్డ్‌ స్క్రీన్‌ గార్డ్, ఫ్లాష్‌ ఎడ్యుకేషన్‌ కంటెంట్‌తో గల 256 జీబీ యూ3 మెమరీ కార్డు, 3 సంవత్సరాల వారంటీ ఈ ధరలోనే ఉన్నాయి. అన్ని యాక్సెసరీస్‌కు మూడేళ్ల గ్యారెంటీ కూడా ఉంది.
- పైగా ట్యాబ్‌ కొనుగోలు టెండర్‌ జ్యుడీషియల్‌ ప్రివ్యూకు వెళ్లిన తర్వాత, ప్రజల నుంచి అభిప్రాయాలు తీసుకున్న తర్వాతే టెండర్లు పిలిచారు. రెండేళ్లలో ప్రభుత్వం 9,52,925 ట్యాబుల కొనుగోలుకు వెచ్చించిన మొత్తం రూ.1,305.74 కోట్లు అయితే.. రూ.2,500 కోట్ల అక్రమాలకు ఎలా ఆస్కారముంటుందని పాఠశాల విద్యాశాఖ ప్రశ్నించింది.

ప్రభుత్వం సానుకూలంగా ఉంది.. సమ్మె విరమించండి

- అంగన్‌వాడీల 11 డిమాండ్లలో ప్రభుత్వం పది పరిష్కరించింది
- వేతనాల పెంపు ఒక్కటే మిగిలి ఉంది
- సంక్రాంతి తర్వాత దానిపైనా సానుకూల నిర్ణయం
- అంగన్‌వాడీ యూనియన్‌ నేతలతో ప్రభుత్వ బృందం
- చర్చల్లో మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల, సీఎస్‌ జవహర్‌రెడ్డి తదితరులు



అంగన్‌వాడీ నేతలతో చర్చిస్తున్న ప్రభుత్వ బృందం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అంగన్‌వాడీల పట్ల ప్రభుత్వం సానుకూలంగా ఉందని, సమ్మె విరమించి బాలింతలు, తల్లులు, పిల్లలకు సేవలందించాలని ప్రభుత్వ బృందం విజ్ఞప్తి చేసింది. అంగన్‌వాడీల సంఘాల నేతలతో మంత్రి బొత్స సత్యనారాయణ, ప్రభుత్వ సలహాదారు(ప్రజా వ్యవహారాలు) సజ్జల రామకృష్ణారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి (సీఎస్‌) కేఎస్‌ జవహర్‌రెడ్డితో కూడిన అధికారుల బృందం మంగళవారం రాష్ట్ర సచివాలయంలో మరోమారు చర్చించింది. ఈ చర్చల్లో మంత్రి బొత్స, ప్రభుత్వ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి, సీఎస్‌ జవహర్‌రెడ్డి మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమ్మె కారణంగా బాలింతలు, తల్లులు ఇబ్బంది పడుతున్నారని, అర్థం చేసుకుని సమ్మె విరమించి సహకరించాలని అన్నారు. జనవరి 5 నుండి అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు టేక్‌ హోం రేషన్‌ కిట్లు, ఇతర సరుకులు పంపిణీ చేయాల్సి ఉన్నందున సంక్రాంతి వరకూ సమ్మెను వాయిదా వేయాలని విజ్ఞప్తి చేశారు. సంక్రాంతి తర్వాత మరలా కూర్చుని చర్చించుకుని సమస్యలను పరిష్కరించుకుందామని కోరారు. అంగన్‌వాడీల 11 డిమాండ్లలో ఒక్కటి తప్ప 10 డిమాండ్లు ప్రభుత్వం ఆమోదించిందని వివరించారు. వాటిని అమలు చేస్తూ జీవోలు కూడా జారీ చేశారని గుర్తు చేశారు. పదవీ విరమణ వయస్సు 60 నుండి 62 ఏళ్ళకు, పదోన్నతి వయస్సు 45 నుండి 50 ఏళ్ళకు పెంపు, టీఏ, డీఏలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చే సేవా ప్రయోజనం రూ.50 వేల నుంచి రూ. లక్షకు పెంపు, సహాయకులకు ఇచ్చే సేవా ప్రయోజనాన్ని రూ.20 వేల నుండి రూ.40 వేలకు పెంచడం వంటి వాటికి సంబంధించిన జీవోలు ప్రభుత్వం ఇచ్చిందని వివరించారు. మిగిలిన వాటిపై కూడా రెండు, మూడు రోజుల్లో జీవోలు జారీ చేస్తుందని తెలిపారు. గౌరవ వేతనం పెంపు అంశం ఒక్కటే మిగిలి ఉందని, దీనిపై సంక్రాంతి తర్వాత చర్చించి, సానుకూల నిర్ణయం తీసుకుందామని చెప్పారు. తమది మహిళా పక్షపాత ప్రభుత్వమని, వేతనాల పెంపునకు కొంత సమయం కావాలని అడిగారు. అంగన్‌వాడీల గ్రాట్యుటీ అంశం తమ పరిధిలో లేదని, దీనికి సంబంధించి కేంద్రానికి లేఖ రాస్తామని చెప్పారు. తాము బెదిరించడం లేదని, సమ్మె విరమించాలని కోరుతున్నామని మంత్రి బొత్స వివరించారు. ఈ సమావేశంలో ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎస్‌ఎస్‌ రావత్, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి (హెచ్‌ఆర్‌) చిరంజీవి చౌదరి, మహిళా, శిశు సంక్షేమ శాఖ ముఖ్య కార్యదర్శి జి.జయలక్ష్మి, డైరెక్టర్‌ విజయ కృష్ణన్‌ తదితరులు పాల్గొన్నారు.

కాగా, వేతనాలు పెంచకపోతే ఆందోళన విరమించేది లేదని అంగన్‌వాడీ యూనియన్‌ నేతలు ప్రకటించారు. చర్చల్లో అంగన్‌వాడీ కార్యకర్తలు, సహాయకుల యూనియన్‌ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.సుబ్బరావమ్మ, రాష్ట్ర అధ్యక్షురాలు జి.బేబీరాణి, ఉపాధ్యక్షురాలు సుప్రజ, అంగన్‌వాడీ హెల్పర్ల సంఘం ఉపాధ్యక్షురాలు రమాదేవి, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షురాలు గంగావతి, ఉపాధ్యక్షురాలు జి.భారతి, కార్యదర్శి వీఆర్‌.జ్యోతి, ఏఐటీయూసీ వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ కె.ప్రేమ, ఉపాధ్యక్షురాలు ఫ్లారెన్స్, ప్రధాన కార్యదర్శి జె.లలిత తదితరులు పాల్గొన్నారు.

రామోజీ ఇవేం 'బురద' రాతలు

- ఆడుదాం ఆంధ్రాపై ఈనాడు విషపురాతలు
- ప్రకాశం జిల్లా మద్దిపాడు గ్రౌండ్‌లో బురద ఎక్కువగా ఉన్నట్లు ఫొటో
- బాగున్న మైదానాన్ని చూపించకుండా వక్రరాతలు
- అదే మైదానంలో షటిల్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్‌ పోటీలు



మద్దిపాడు హైస్కూల్‌ గ్రౌండ్‌లో షటిల్‌ ఆడుతున్న క్రీడాకారులు

మద్దిపాడు: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై రామోజీరావు బురద జల్లేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నారు. ప్రకాశం జిల్లా మద్దిపాడులో కడియాల యానాదయ్య ఉన్నత పాఠశాల గ్రౌండ్‌ బురదమయమైందని, ఇక్కడ పోటీలు నిర్వహించడానికి కుదరదని ఈనాడు అసత్య కథనం వండివార్చింది. వాస్తవానికి ఈ పాఠశాల ఆటస్థలం బాగు చేయించేందుకు పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు పెద్దిరెడ్డి కోటిరెడ్డి ఇటీవల ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసరెడ్డి, బాపట్ల ఎంపీ నందిగం సురేష్‌లు ఎంపీ నిధుల నుంచి చెరో రూ. 5 లక్షలు మంజూరు చేశారు. గ్రౌండ్‌ను పూర్తిగా లెవెల్‌ చేసేందుకు పంచాయతీ అనుమతుల కోసం అర్జీ ఇచ్చారు. సగానికి పైగా గ్రౌండ్‌ను మెరక చేశారు. ఇటీవల వచ్చిన తుపాను కారణంగా కొంతమేర పనులు జరగలేదు. మైదానంలో ఓ పక్క మాత్రమే బురద ప్రాంతం ఉండగా.. దానిని ఈనాడు బూతద్దంలో చూపడానికి ప్రయత్నించింది. ఆడుదాం ఆంధ్రాలో భాగంగా ఇదే మైదానంలో కబడ్డీ, ఖోఖో, షటిల్, వాలీబాల్‌ నిర్వహిస్తున్నారు. అయితే క్రికెట్‌ను సమీపంలోని కారుమూడి వారిపాలెం(గుండ్లాపల్లి) హైస్కూలులో ఆడడానికి అధికారులు ఏర్పాట్లు చేశారు. ఇదే మైదానంలో ఆరు సచివాలయం పరిధిలోని టీంలు ఆడుతాయి. మిగిలిన 12 సచివాలయాల పరిధిలోని క్రికెట్‌ టీంలు ఆడేందుకు ఇనమనమెళ్లూరు, తెల్లబాడు హైస్కూళ్లలో క్రీడా మైదానాలను కేటాయించారు. వాస్తవాలు ఇలా ఉంటే.. పచ్చ పత్రిక వక్రీకరించి రాయడం చూసి స్థానికులు ఛీకొడుతున్నారు. అబద్ధాల రాతలు మంచిది కాదని, నిజాలు తెలుసుకుని రాస్తే బాగుంటుందని పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు, అధికారులు పేర్కొంటున్నారు.

సీఎం ఏ నిర్ణయం తీసుకున్నా శిరసావహిస్తా

- పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో నిజంలేదు
- ప్రత్తిపాడు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌



ప్రత్తిపాడు రూరల్‌ : తాను పార్టీ మారుతున్నట్లు వస్తున్న వార్తల్లో ఏమాత్రం వాస్తవంలేదని కాకినాడ జిల్లా ప్రత్తిపాడు ఎమ్మెల్యే పర్వత పూర్ణచంద్రప్రసాద్‌ స్పష్టంచేశారు. తాను చివరివరకు వైఎస్సార్‌సీపీలోనే కొనసాగుతానన్నారు. ప్రత్తిపాడు మండలం ఒమ్మంగిలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. తనపై వస్తున్న అసత్య వార్తలను ఎమ్మెల్యే ఖండించారు. నియోజకవర్గం ఎమ్మెల్యే టికెట్‌ విషయంలో ముఖ్యమంత్రి వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి ఏ నిర్ణయం తీసుకున్నా పార్టీకి కట్టుబడి ఉంటానన్నారు. తాను తెలుగుదేశం వైపు చూస్తున్నట్లు వచ్చిన వార్తలు ఆశ్చర్యానికి గురిచేశాయని.. తనకు పార్టీ మారే ఉద్దేశంలేదన్నారు. ఎప్పటికీ సీఎం జగన్‌ నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీలోనే జీవితాంతం కొనసాగుతానని ఆయన స్పష్టంచేశారు. తమ అధినేత సీఎం వైఎస్‌ జగన్‌మోహన్‌రెడ్డి అంతిమంగా ఏ నిర్ణయం తీసుకున్నా కట్టుబడి పనిచేస్తానన్నారు. అవాస్తవాలను వార్తలుగా చిత్రీకరించడం తగదన్నారు. సమావేశంలో జెడ్పీటీసీ బెహరా రాజరాజేశ్వరి దొరబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్‌ వీరబాబు, పార్టీ జేసీఎస్‌ మండల ఇన్‌చార్జ్‌ చినబాబు, సొసైటీ చైర్మన్లు గొంతిన సురేష్, గంగారావు, అన్నవరం ట్రస్టు బోర్డు సభ్యుడు దోశే చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నిర్ణయానికి కట్టుబడి పనిచేస్తా

- రాజకీయ నిర్ణయాలను సామాజికవర్గాలకు ముడిపెట్టడం తగదు
- రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు



మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

రేపల్లె రూరల్‌ : రాజకీయపరమైన నిర్ణయాలను సామాజికవర్గాలకు ముడిపెట్టడం సరైన విధానం కాదని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. బాపట్ల జిల్లా రేపల్లెలోని తన క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 40 ఏళ్ల నుంచి ఒక నిబద్ధత కలిగిన వ్యక్తిగా రాజకీయాలు చేస్తున్నానని చెప్పారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో ఉన్న మత్స్యకార సామాజికవర్గం వారు తనను ఒక పెద్దగా భావిస్తారన్నారు. రాజకీయ సమీకరణాల నేపథ్యంలో తనకు సీటు కేటాయించకపోవడంతో ఆ సామాజికవర్గం పెద్దలు కొంతమేర అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. దీనిపై ఇటీవల విజయవాడలో సమావేశం నిర్వహించి తనకు సీటు కేటాయించాలని పార్టీ పెద్దలను కోరినట్లు చెప్పారు. అయితే, రాజకీయపరమైన నిర్ణయాలకు సామాజికవర్గాల నిర్ణయాలకు సంబంధం లేదన్నారు. అసంతృప్తిగా ఉన్న సామాజికవర్గానికి చెందిన నేతలతో తాను చర్చిస్తానని మోపిదేవి చెప్పారు. అధిష్టాన నిర్ణయాన్ని ప్రతి ఒక్కరూ గౌరవించాలన్నారు. 2019 ఎన్నికల్లో తాను ఓడిపోయినా, జగనన్న తనను గౌరవించి ఎమ్మెల్సీ కోటాలో మంత్రి పదవి ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఆ తర్వాత రాజ్యసభకు పంపి తనపై అభిమానాన్ని చాటుకున్నారన్నారు. తనకు అధిష్టానానికి మధ్య దూరాన్ని పెంచేందుకు ఎల్లో పత్రికలు పడరాని పాట్లు పడుతున్నాయన్నారు. ఇటీవల చెరుకుపల్లిలో జరిగిన ఓ కార్యక్రమంలో తన ప్రసంగాన్ని ఎల్లో మీడియా వక్రీకరించి దుష్ప్రచారం చేస్తోందన్నారు. రానున్న ఎన్నికల్లో పార్టీ నిర్ణయించిన డాక్టర్‌ ఈవూరి గణేష్‌ విజయానికి శక్తివంచన లేకుండా కృషిచేస్తామని మోపిదేవి స్పష్టంచేశారు. ఈ సమావేశంలో బవుడా చైర్మన్‌ దేవినేని మల్లికార్జునరావు, మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ కట్టా మంగ పాల్గొన్నారు.

హన్నన్నా.. పెన్నాలో ఇన్ని నీళ్లా?

75 శాతం ఆధారంగా పెన్నాలో 210.12 టీఎంసీల నీటి లభ్యత

- వరద జలాలతో కలిపి 389.16 టీఎంసీల ప్రవాహం
- కేంద్ర జల సంఘం తాజా అధ్యయనంలో వెల్లడి
- 1993 అధ్యయనం ప్రకారం వరద జలాలతో కలిపి 223.18 టీఎంసీల ప్రవాహం
- 1944–45 నుంచి 1984–85 వరకు వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా 1993లో అధ్యయనం
- తాజాగా 1985 నుంచి 2015 మధ్య వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా అధ్యయనం
- వర్షపాతం పెరగడం వల్లే నీటి లభ్యత పెరిగిందంటూ సీడబ్ల్యూసీ విశ్లేషణ
- 30 ఏళ్ల ఆధారంగా నీటి లభ్యతపై అధ్యయనం శాస్త్రీయం కాదంటున్న నిపుణులు
- కనీసం 50 ఏళ్ల ప్రవాహాలపై అధ్యయనం చేయాలని స్పష్టీకరణ



సాక్షి, అమరావతి: పెన్నా నదిలో 75 శాతం లభ్యత ఆధారంగా ఏటా 210.12 టీఎంసీల నీటి ప్రవాహం ఉందని కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) తాజాగా తేల్చింది. 1985 నుంచి 2015 వరకు పెన్నా నదీ పరీవాహక ప్రాంతం (బేసిన్‌)లో వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యతపై సీడబ్ల్యూసీ అధ్యయనం చేసింది. ఏటా పెన్నా బేసిన్‌లో కురిసే వర్షపాతం పరిమాణం 1412.58 టీఎంసీలని లెక్కగట్టింది. వరద జలాలతో కలుపుకొంటే ఏటా 389.16 టీఎంసీల ప్రవాహం ఉంటుందని తేల్చింది. కానీ.. పెన్నాలో ఆ స్థాయిలో నీటి లభ్యత లేదని సాగునీటి రంగ నిపుణులు తేల్చి చెబుతున్నారు. బేసిన్‌లో 30 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యతను లెక్కగట్టడం శాస్త్రీయం కాదని చెబుతున్నారు. వందేళ్లు లేదా కనీసం 50 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా చేసే అధ్యయనానికే శాస్త్రీయత ఉంటుందని స్పష్టం చేస్తున్నారు.

అప్పటికి, ఇప్పటికి ఇదీ తేడా..

పెన్నాలో నీటి లభ్యతపై 1993లో సీడబ్ల్యూసీ తొలిసారి అధ్యయనం చేసింది. 1944–45 సంవత్సరం నుంచి 1983–84 వరకు బేసిన్‌లో 40 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా అప్పట్లో నీటి లభ్యత లెక్కగట్టింది. వరద జలాలతో కలుపుకొంటే పెన్నాలో 223.18 టీఎంసీల లభ్యత ఉంటుందని తేల్చింది. పెన్నా బేసిన్‌ 55,213 చదరపు కిలోమీటర్లుగా పేర్కొంది. తాజాగా సీడబ్ల్యూసీ పెన్నా బేసిన్‌లో 1985–2015 మధ్య అంటే 30 ఏళ్లలో కురిసిన వర్షపాతం, ప్రవాహాల ఆధారంగా నీటి లభ్యత లెక్కగట్టింది. వరద జలాలతో కలిపితే 389.16 టీఎంసీల ప్రవాహం ఉంటుందని తేల్చింది. 75 శాతం లభ్యత ఆధారంగా చూస్తే నదిలో 210.12 టీఎంసీలు ఉంటుందని తేల్చింది. కానీ.. బేసిన్‌ మాత్రం 54,905 చదరపు కిలోమీటర్లకు తగ్గినట్లు గుర్తించింది. అంటే.. 1993తో పోల్చితే బేసిన్‌ విస్తీర్ణం 308 చదరపు కిలోమీటర్లు తగ్గింది. పెన్నా బేసిన్‌లో 1944–84తో పోల్చితే 1985–2015 మధ్య వర్షపాతం అధికంగా ఉండటంవల్లే నీటి లభ్యత పెరిగిందని సీడబ్ల్యూసీ పేర్కొంది. దీన్ని సాగునీటి రంగ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. కేవలం 30 ఏళ్ల వర్షపాతం, ప్రవాహాలను ఆధారంగా తీసుకోవడాన్ని తప్పుపడుతున్నారు. అధ్యయనం పరిధిని తగ్గించుకోవడం వల్లే నీటి లభ్యత పెరిగిందని, ఇది అశాస్త్రీయమని స్పష్టం చేస్తున్నారు.

పెన్నా బేసిన్‌ ఇదీ..

కర్ణాటకలో వర్షాభాయ ప్రాంతమైన చిక్‌బళ్లాపూర్‌ జిల్లా నంది కొండల్లోని చెన్నకేశవ పర్వత శ్రేణుల్లో పుట్టే పెన్నా నది.. రాష్ట్రంలో వర్షాభావ ప్రాంతాలైన శ్రీసత్యసాయి, అనంతపురం, వైఎస్సార్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాల మీదుగా 597 కిలోమీటర్లు ప్రవహించి.. ఊటుకూరు వద్ద బంగాళాఖాతంలో కలుస్తుంది. ఎడమ వైపు నుంచి జయమంగళి, కుందేరు, కుడి వైపు నుంచి సగిలేరు, చిత్రావతి, పాపాఘ్ని, చెయ్యేరు ఉప నదులు పెన్నాలో కలుస్తాయి. పెన్నా బేసిన్‌లో 400 800 మిల్లీమీటర్ల వర్షపాతం కురుస్తుంది. ఈ బేసిన్‌ విస్తీర్ణం 54,905 చదరపు కిలోమీటర్లని సీడబ్ల్యూసీ తాజాగా తేల్చింది. ఇది దేశ భౌగోళిక విస్తీర్ణంలో 1.67 శాతానికి సమానం.

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నాయీబ్రాహ్మణులకు మేలు




సమావేశంలో మాట్లాడుతున్న పుల్లయ్య

భవానీపురం(విజయవాడ పశ్చిమ): స్వాతంత్య్రం వచ్చిన తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా నాయీబ్రాహ్మణులకు మేలు జరిగిందంటే.. సీఎం వైఎస్‌ జగన్‌ నాయకత్వంలోని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలోనేనని ఏపీ నాయీబ్రాహ్మణ కార్పొరేషన్‌ చైర్మన్‌ తొండమల్ల పుల్లయ్య పేర్కొన్నారు. క్షౌరవృత్తిదారులకు ఉద్యోగ భద్రత కల్పించటం, రాష్ట్ర దేవదాయ శాఖ పరిధిలోని సుమారు 1,100 దేవాలయాల్లో ఆలయ పాలక మండలి సభ్యులుగా నియమించటమే అందుకు నిదర్శనమన్నారు. విజయవాడ రూరల్‌ మండలం గొల్లపూడిలోని బీసీ సంక్షేమ భవన్‌లోని ఆయన కార్యాలయంలో ఎండీ కృష్ణమోహన్‌ నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన బోర్డు సమావేశంలో పుల్లయ్య మాట్లాడారు. మునుపెన్నడూ లేని విధంగా నాయీబ్రాహ్మణులకు టీటీడీ దేవస్థానం సభ్యులుగా అవకాశం కల్పించటం అదృష్టంగా భావిస్తున్నామన్నారు. రాజకీయంగా, ఆర్థికంగా నాయీబ్రాహ్మణుల అభ్యున్నతికి తోడ్పడిన ఏకైక సీఎం వైఎస్‌ జగన్‌ అన్నారు. దేవాలయాల్లో ఉన్న నాదస్వర, డోలు ఉద్యోగాలను భర్తీ చేయాలని, టీటీడీ దేవస్థానంలో 12 ఏళ్లుగా పీస్‌ రేట్‌ బార్బర్లుగా పని చేస్తున్న సుమారు 800 మందిని శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో కార్పొరేషన్‌ డైరెక్టర్లు డి.లక్ష్మీనారాయణ, ఎం.శ్రీనివాసులు, పాల్గొన్నారు.

క్లుప్తంగా...

అది కోవిడ్ మరణం కాదు

- మల్టీ ఆర్గాన్స్ ఫెయిల్యూర్‌తోనే విశాఖలోని మహిళ మృతి
- కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ వెల్లడి



మహారాణిపేట (విశాఖ దక్షిణ): కేజీహెచ్‌లో చికిత్స పొందుతోన్న మహిళ మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే మరణించినట్లు ఆస్పత్రి వైద్యులు నిర్ధారించారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతోన్న విశాఖలోని కంచరపాలెంకి చెందిన మహిళ (51)ను ఈ నెల 22న ప్రభుత్వ ఛాతి ఆస్పత్రిలో ఆమె కుటుంబ సభ్యులు చేర్పించగా..ఆమె అక్యూట్ రెస్పిరేటరీ డిస్ట్రెస్ సిండ్రోమ్‌తో పాటు కిడ్నీ సమస్యలు, మల్టీ ఆర్గాన్ డిస్‌ఫంక్షన్ సిండ్రోమ్‌తో ఆమె బాధపడుతున్నట్లు వైద్యులు గుర్తించారు. సాధారణ తనిఖీలో భాగంగా ఆమెకు ఆర్టీపీసీఆర్ పరీక్ష చేయగా..పాజిటివ్ రావడంతో ఆమెను 24న ఛాతి ఆస్పత్రి నుంచి కేజీహెచ్ ఐసొలేషన్ వార్డుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ...ఆమె మంగళవారం మృతి చెందినట్లు కేజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్ తెలిపారు. ఆమె కోవిడ్ కారణంగా చనిపోలేదని, మల్టీ ఆర్గాన్ ఫెయిల్యూర్‌తోనే మరణించిందని స్పష్టం చేశారు. కోవిడ్ కోసం ఎలాంటి భయాందోళనలకు గురికావద్దని ప్రజలకు సూచించారు.

మహానందీశ్వరుడి సన్నిధిలో హైకోర్టు జడ్జి



జస్టిస్ నరేందర్‌కు జ్ఞాపికను అందిస్తున్న ఈవో

మహానంది: ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ జి.నరేందర్ మంగళవారం మహానందిలోని శ్రీ మహానందీశ్వర స్వామి, కామేశ్వరిదేవి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, వేద పండితులు స్వాగతం పలికారు. స్వామివారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చ పూజలు నిర్వహించారు. దర్శనం అనంతరం అలంకార మండపంలో స్వామి అమ్మవారి జ్ఞాపికను అందజేశారు. కర్నూలు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.


చంద్రబాబుకు ఓటమి భయం: మంత్రి పెద్దిరెడ్డి



సాక్షి, చిత్తూరు: చంద్రబాబుకు ఓటమి భయం పట్టుకుందని అందుకే తాము వదిలేసిన ప్రశాంత్ కిషోర్‌ను పట్టుకున్నారని, తాము వదిలేసిన ఎమ్మెల్యేలను కూడా టీడీపీలో చేర్చుకుంటున్నారని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎద్దేవా చేశారు. మంగళవారం ఆయన చిత్తూరులో మీడియాతో మాట్లాడారు. ప్రశాంత్ కిషోర్ పనితీరు బాగుంటే మేం ఎందుకు వదిలేస్తామని..ఆయన వల్ల ఏమాత్రం లాభం లేదనే వదిలేశామని చెప్పారు. ప్రస్తుత పరిస్థితుల్లో చంద్రబాబును ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరన్నారు. బాబు తప్పుడు ప్రచారానికి ఎల్లో మీడియా అండగా ఉండటం తప్ప ఆ ప్రభావం ప్రజల్లో ఏమాత్రం లేదని స్పష్టం చేశారు. రానున్న ఎన్నికల్లో గతంలో కంటే ఎక్కువ సీట్లు వైఎస్సార్‌సీపీకి వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్‌పై ప్రజలు సంపూర్ణ విశ్వాసంతో ఉన్నారని, ఎన్నికల హామీల్లో 99.5% నెరవేర్చిన ఏకైక సీఎం జగనే అని చెప్పారు. చంద్రబాబు, ఎల్లో మీడియా ఎన్ని కుయుక్తులు పన్నినా, వచ్చే ఎన్నికల్లో సీఎంగా మళ్లీ జగనే వస్తారని వ్యాఖ్యానించారు.

వచ్చే ఎన్నికల్లో బీసీలకు ప్రాధాన్యత ఇవ్వాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన



మాట్లాడుతున్న కేసన శంకరరావు

లబ్బీపేట (విజయవాడతూర్పు): జనాభాలో 52 శాతంగా ఉన్న బీసీలకు వచ్చే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు సముచిత స్థానం కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు విజ్ఞప్తి చేశారు. విజయవాడలోని తమ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మన దేశంలో రాజకీయ రిజర్వేషన్ చట్టాల్లో లోపాలు నేడు వెనుకబడిన కులాలకు శాపంగా మారాయని శంకరరావు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాధికారం అందుకోలేని జాతులు అంతరిస్తాయని చెప్పినట్లు, నేడు కొన్ని కులాలు దేశంలో అంతరించే పరిస్థితుల్లో ఉన్నాయని చెప్పారు. వెనుకబడిన కులాలకు రాజ్యాంగ రిజర్వేషన్లు కల్పించడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్య వైఖరి అనుసరిస్తున్నాయని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీసీలకు అత్యధిక సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బీసీలు సైతం బీసీ అభ్యర్థులను గెలిపించుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందన్నారు. ఈ సమావేశంలో ఆ సంఘ ప్రతినిధులు కొల్లూరు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఫ్యూచర్ స్కిల్స్’లో ఏపీకి అగ్రాసనం



ఇంటర్న్‌షిప్‌పై ఆసక్తి కనబరుస్తున్న విద్యార్థుల్లోనూ ఏపీదే అగ్రస్థానం

- స్పష్టం చేసిన ‘ఇండియా స్కిల్స్ రిపోర్టు–2024’
- విద్యలో దృఢ సంకల్పం, నైపుణ్యాల పెంపులో చిత్తశుద్ధితోనే సాధ్యమైందని ప్రశంస
- విద్యార్థులను ఏఐ సృష్టికర్తలుగా తీర్చిదిద్దాలన్న సీఎం జగన్ సంకల్పం సాకారం
- అత్యధిక న్యూమరికల్ స్కిల్స్ కనబరుస్తున్న సిటీల్లో విజయవాడ, గుంటూరు
- ఉద్యోగాల కల్పనలో గతేడాది కంటే పురోగతితో 3వ స్థానం
- బీఈ/బీటెక్ విద్యార్థులకు ఉద్యోగాలు కల్పిస్తున్న రాష్ట్రాల్లోనూ 2వ స్థానం
- నైపుణ్యాలు కలిగిన మహిళా వర్క్ ఫోర్స్‌లోనూ అ‘ద్వితీయ’ ప్రదర్శన

సాక్షి, అమరావతి: నైపుణ్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ యువతను ఉపాధి వైపు నడిపించడంలో మన రాష్ట్రం యావత్ దేశానికే ఆదర్శంగా నిలుస్తోంది. పరిశ్రమల నిర్దిష్ట అవసరాలకు తగ్గట్టుగా భవిష్యత్ నైపుణ్యాలు (ఫ్యూచర్ స్కిల్స్) కలిగిన మానవ వనరులను తయారు చేయడం, ఇంటర్న్‌షిప్ కోరుకుంటున్న విద్యార్థుల విషయంలో ఏపీ అగ్రశ్రేణిలో కొనసాగుతోంది. 21వ శతాబ్దపు విద్యార్థులను ‘కృత్రిమ మేధ’ (ఏఐ)సృష్టికర్తలుగా తీర్చిదిద్దాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంకల్పానికి ‘ఇండియా స్కిల్స్ రిపోర్టు–2024’ ఊతం ఇచ్చింది. ఈ క్రమంలోనే భవిష్యత్ నైపుణ్యాల కల్పనలో 76.15 శాతం స్కోర్‌తో ఆంధ్రప్రదేశ్ మొదటి స్థానంలో నిలవడం విశేషం. ఆ తర్వాతి స్థానాల్లో కర్ణాటక, మహారాష్ట్ర ఉన్నాయి. టాలెంట్ అసెస్‌మెంట్ ఏజెన్సీ ‘వీబాక్స్’ ఏటా ఆల్ ఇండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ), కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ), అసోసియేషన్ ఆఫ్ ఇండియన్ యూనివర్సిటీ (ఏఐయూ)తో కలిసి ‘ఇండియా స్కిల్స్ రిపోర్టు’ను విడుదల చేస్తోంది. భవిష్యత్‌లో పరిశ్రమల డిమాండ్లు, సాంకేతిక పురోగతులకు అనుగుణంగా శ్రామిక శక్తిని సిద్ధం చేయడంలో బలమైన ప్రాధాన్యతను ప్రదర్శిస్తోందని తాజా నివేదిక ప్రశంసించింది. ఇక నైపుణ్యాభివృద్ధిలో తీసుకొచ్చిన విప్లవాత్మక చర్యలతో ఆంగ్లం, న్యూమరికల్, క్రిటికల్ థింకింగ్, కంప్యూటర్ నైపుణ్యాల్లో అత్యుత్తమ ప్రదర్శన కనబరుస్తోంది. అత్యధిక న్యూమరికల్ స్కిల్స్ (సంఖ్యాపర నైపుణాలు) కనబరుస్తున్న సిటీల్లో బెంగళూరు తొలి స్థానంలో నిలవగా.. ఆ తర్వాత విజయవాడ, గుంటూరు ఉండటం విశేషం.

ఆంధ్రప్రదేశ్ అంతటా ఉద్యోగ అవకాశాల విస్తృతిలో సమతుల్యతను ప్రదర్శిస్తోందని నివేదిక కొనియాడింది. గతంతో పోలిస్తే ఉపాధి వనరులను మెరుగుపర్చుకుని ఏపీ అగ్రగామి రాష్ట్రాల్లో ఒకటిగా నిలిచింది. గతేడాది 65.58 శాతం స్కోరుతో 4వ స్థానంలో ఉండగా.. తాజాగా 72.38 శాతం స్కోరుతో 3వ స్థానానికి చేరుకుంది. హర్యానా (76.47శాతం), మహారాష్ట్ర (73.03 శాతం) తొలి రెండు స్థానాల్లో నిలిచాయి. రాష్ట్ర విభజన అనంతరం ఏపీలో మెట్రోస్థాయి నగరాలు లేనప్పటికీ ఇంతటి గణనీయమైన స్థాయిలో నిలవడం చిన్న విషయం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. వాస్తవానికి ప్రధాన మెట్రోపాలిటన్ నగరాలు లేకపోవడం,

ఉద్యోగాల కల్పనలోనూ మేటి

బెంగళూరు, హైదరాబాద్, చెన్నై, ముంబై, ఢిల్లీ వంటి పారిశ్రామిక కేంద్రాలతో పోటీపడీ మరి ఆంధ్రప్రదేశ్ అద్భుతమైన పనితీరుతో అత్యున్నతంగా నిలిచిందని నివేదిక ఊటంకించింది. సీఎం జగన్ దార్శనికతతో ఐటీ, ఇతర పరిశ్రమల రాకతో ఉద్యోగ, ఉపాధి కల్పనలో ఏపీ మెరుగైన ఫలితాలనే సాధించింది. ఇప్పుడు అన్ని వయస్కులకు ఉపాధి బాగుందని, ముఖ్యంగా 18–21 ఏళ్ల వయస్కుల్లో (73.10 శాతం స్కోరు) ఉద్యోగాల అందించడంలో నాల్గవ స్థానంలో ఉంది. మహిళలు, పురుషులకు ఉపాధి, ఉద్యోగాల కల్పిస్తున్న అంశంలోనూ ఏపీ 3వ స్థానంలో నిలిచింది.

దేశవ్యాప్తంగా ఎంబీఏలో ఎక్కువ ఉద్యోగ అవకాశాలు దక్కుతుంటే ఆ తర్వాత బీఈ/బీటెక్‌లో లభిస్తున్నాయి. ఈ లెక్కన బీఈ/బీటెక్ విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగాలు అందిస్తున్న రాష్ట్రాల జాబితాలో ఏపీ (73.32 శాతం స్కోరుతో) 2వ స్థానంలో నిలిచింది. మహారాష్ట్ర అగ్రస్థానాన్ని కైవసం చేసుకోగా.. కేరళ, కర్ణాటక మూడు నాలుగు స్థానాల్లో ఉన్నాయి. ఐటీలో 68.44 శాతం, కంప్యూటర్ సైన్స్‌లో 66 శాతం, ఆ తర్వాత ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విద్యార్థులకు ఎక్కువ ఉద్యోగాలు లభిస్తున్నాయి. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా గతేడాది సాంకేతిక విద్యార్థులకు ఏకంగా 1.20 లక్షలకు పైగా క్యాంపస్ ఉద్యోగాలు వచ్చాయి.

ఇంటర్న్‌షిప్‌లోనూ టాప్

విద్యార్థులకు పాఠ్యాంశాల విజ్ఞానంతో పాటు ప్రాక్టికల్ నాలెడ్జ్‌కు పెద్దపీట వేయాలన్న సీఎం వైఎస్ జగన్ నిర్ణయం సత్ఫలితాలను ఇస్తోంది. ఇందు కోసం అధికారంలోకి వచ్చిన వెంటనే ఉన్నత విద్యలో 10 నెలల ఇంటర్న్‌షిప్‌ను దేశంలోనే ప్రప్రథమంగా తీసుకొచ్చారు. విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించేలా ఓవైపు ఇంటర్న్‌షిప్.. మరోవైపు నైపుణ్య శిక్షణను ప్రభుత్వం తప్పనిసరి చేసింది. ఈ క్రమంలోనే ఇప్పటివరకు వర్చువల్, హ్యాండ్ ఎక్స్‌పీరియన్స్‌లో సుమారు 8 లక్షల మందికి షార్ట్‌టర్మ్, లాంగ్ టెర్మ్ ఇంటర్న్‌షిప్ అవకాశాలను కల్పించింది. ఇండియా స్కిల్స్ రిపోర్టు ప్రకారం వరుసగా రెండో ఏడాది ఇంటర్న్‌షిప్‌కు ఆసక్తి వ్యక్తం చేస్తున్న విద్యార్థులు గల రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో నిలిచింది. గతేడాది 93.50 శాతం స్కోరు సాధిస్తే.. ఇప్పుడు 98.33 శాతాన్ని నమోదు చేసింది. ఆ తర్వాత 96.72 శాతంతో తెలంగాణ, 93.44 శాతంతో పంజాబ్, 92.44 శాతంతో హర్యానా ఉన్నాయి. వచ్చే జనవరిలో మరో 2.20 లక్షల మందికి ఇంటర్న్‌షిప్ 22 ఎడ్యుటెక్ సర్వీస్ ప్రొవైడర్ల ద్వారా స్టేట్, గ్లోబల్ ఇంటర్న్‌షిప్‌ను రాష్ట్ర ప్రభుత్వం అందించనుంది. ఇప్పటికే అంతర్జాతీయ ఎడ్యుటెక్ సర్వీస్ ప్రొవైడర్లతో పాటు 27 వేలకుపైగా సూక్ష్మ, చిన్న, మధ్యతరహా, భారీ పరిశ్రమలను కళాశాలలకు అనుసంధానం చేసి వర్చువల్, హ్యాండ్స్ ఎక్స్‌పీరియన్స్ ఇచ్చేలా ఇంటర్న్‌షిప్ అవకాశాన్ని కల్పించింది.

గొప్ప టాలెంట్ రిజర్వాయర్!

దేశంలో పరిశ్రమలకు తగిన నైపుణ్యాలు కలిగిన మానవ వనరులను సరఫరా చేయడంలో ఆంధ్రప్రదేశ్‌ను ‘టాలెంట్ రిజర్వాయర్’గా నివేదిక అభివర్ణించింది. విద్యార్థులకు మెరుగైన విద్య విషయంలో దృఢమైన నిబద్ధత, విభిన్న నైపుణ్యాల సాధికారత కల్పనలో చిత్తశుద్ధిని లేకుండా ఇతంటి వృద్ధి సాధ్యపడదని పేర్కొంది. భవిష్యత్ పారిశ్రామిక అవసరాల్లో ఏపీ కీలకంగా మారుతుందని, కంపెనీలకు స్వర్గధామంగా ఉంటోందని కొనియాడింది. ఉద్యోగాల్లో రూ.2.60 లక్షలు, అంతకంటే ఎక్కువ వేతనాన్ని కోరుకునే తొలి ఐదు రాష్ట్రాల జాబితాలో కేరళ, మహారాష్ట్ర తర్వాత ఆంధ్రప్రదేశ్ చోటు దక్కించుకుంది. ముఖ్యంగా బీఈ/బీటెక్ విద్యార్థుల్లో నైపుణ్యాలు గణనీయంగా మెరుగుపడినట్టు చెప్పింది. ఏపీలో అర్బన్, సెమీ అర్బన్ ప్రాంతాలే ఎక్కువ. కానీ, నైపుణ్యం కలిగిన ఉద్యోగానికి సిద్ధంగా ఉన్న మహిళా వర్క్‌ఫోర్స్‌లో మెట్రోపాలిటన్ సిటీలను కూడా వెనక్కినెట్టింది. 39.96 శాతం స్కోర్‌తో హర్యానా తర్వాత రెండో స్థానంలో నిలుస్తోంది. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

సీఎం దార్శనికతకు నిదర్శనం



భవిష్యత్ ప్రపంచం కృత్రిమ మేధపై ఆధారపడుతుంది. అలాంటి తరుణంలో మన విద్యార్థుల్లో ఫ్యూచర్ స్కిల్స్ అభివృద్ధి చేయాలి. ప్రపంచంలోనే ఏపీ విద్యార్థులను అగ్రస్థానంలో నిలపాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ సంకల్పించారు. అందుకే విద్యార్థులకు నైపుణ్యాభివృద్ధితో పాటు ఉద్యోగ అవకాశాలను పెంపొందించే దిశగా చర్యలు చేపట్టారు. వాటిని ఫలితాల ప్రతిరూపం తాజా ఇండియా స్కిల్స్ నివేదిక ద్వారా వెల్లడైంది. దేశంలోనే ‘ఫ్యూచర్ స్కిల్స్ రెడీస్’లో మనం టాప్‌గా నిలవడం సంతోషంగా ఉంది. ఏఐలో పరిపూర్ణ విజ్ఞానవంతులుగా మన విద్యార్థులను తీర్చిదిద్దుతున్నాం. ఇప్పటికే ఎల్ఎంఎస్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నాం. పరిశ్రమల భాగస్వామ్యంతో రిసోర్స్ సెంటర్లు, ఇన్నోవేటివ్ ల్యాబ్స్‌ను పెడతాం.

– కె.హేమచంద్రారెడ్డి, చైర్మన్, ఉన్నత విద్యామండలి

‘వ్యూహం’పై స్టే ఇవ్వలేం

తెలంగాణ హైకోర్టు స్పష్టీకరణ



సాక్షి, హైదరాబాద్: ప్రముఖ సినీ దర్శకుడు రాంగోపాల్ వర్మ దర్శకత్వం వహించిన ‘వ్యూహం’ చిత్రం విడుదలపై స్టే ఇచ్చేందుకు హైకోర్టు నిరాకరించింది. సెన్సార్‌బోర్డు వాదనలు విన్న తర్వాత ఆ అంశాన్ని పరిశీలిస్తామని స్పష్టం చేసింది. తదుపరి విచారణను ఈ నెల 28వ తేదీకి వాయిదా వేసింది. ‘వ్యూహం’ చిత్రానికి సెన్సార్ బోర్డు ఇచ్చిన సర్టిఫికెట్‌ను రద్దు చేసి, విడుదలను ఆపాలని కోరుతూ తెలుగుదేశం పార్టీ తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ సూరేపల్లి నందా ధర్మాసనం మంగళవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున న్యాయవాది మురళీధర్‌రావు, అనధికారిక ప్రతివాదుల తరఫున సీనియర్ న్యాయవాది ఎస్.నిరంజన్‌రెడ్డి హాజరయ్యారు. సెన్సార్ బోర్డు తరఫున వాదనలు వినిపించేందుకు డిప్యూటీ సొలిసిటర్ జనరల్ వస్తారని, రెండు రోజుల సమయం కావాలని మరో న్యాయవాది కోరడంతో.. ధర్మాసనం విచారణను ఈ నెల 28కి వాయిదా వేసింది.

అయేషా కేసు దర్యాప్తును వేగవంతం చేయండి

- హైకోర్టులో ఆమె తల్లిదండ్రుల పిటిషన్
- కౌంటర్ దాఖలు చేయాలని సీబీఐకి కోర్టు ఆదేశం
- తదుపరి విచారణ వచ్చే నెల 23కి వాయిదా

సాక్షి, అమరావతి: తమ కుమార్తె అయేషా మీరా హత్య కేసు దర్యాప్తును వేగవంతం చేసేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు శంషాద్ బేగం, సయ్యద్ ఇక్బాల్ బాషా హైకోర్టును ఆశ్రయించారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. ఈ వ్యాజ్యంలో ప్రతివాదులుగా ఉన్న కేంద్ర హోంశాఖ కార్యదర్శి, సీబీఐ అదనపు ఎస్పీ తదితరులకు నోటీసులు జారీ చేశారు. పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించారు. తదుపరి విచారణను జనవరి 23కి వాయిదా వేశారు. ఇదే అంశంతో ముడిపడి ఉన్న మరో వ్యాజ్యంతో ఈ వ్యాజ్యాన్ని జత చేయాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు. అయేషా తల్లిదండ్రుల తరఫు న్యాయవాది పిచ్చుకా శ్రీనివాసులు వాదనలు వినిపిస్తూ.. దర్యాప్తు మొదలుపెట్టి ఐదేళ్లయినా ఇప్పటివరకు పూర్తి కాలేదన్నారు. సీబీఐ తరఫున జూపూడి యజ్ఞదత్ వాదనలు వినిపిస్తూ.. అయేషా హత్య కేసులో మొదట నిందితుడిగా చేర్చిన పిడతల సత్యంబాబును ఉమ్మడి హైకోర్టు నిర్దోషిగా ప్రకటించిందన్నారు. ఆ తర్వాత సీబీఐ విచారణ మొదలు పెట్టిందని తెలిపారు. తనకు నోటీసులు ఇవ్వడాన్ని సవాల్ చేస్తూ సత్యంబాబు ఇటీవల హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారని వివరించారు. వాదనలు విన్న న్యాయమూర్తి పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని సీబీఐని ఆదేశిస్తూ విచారణను వాయిదా వేశారు.

‘థర్మల్’ వెలుగులు

- భవిష్యత్ అవసరాల కోసం పునరుత్పాదక ఇంధనంతో పాటు థర్మల్ విద్యుత్‌కూ ప్రాధాన్యమిస్తున్న ఏపీ
- ఇటీవలే ఎన్టీటీపీఎస్‌లో 800 మెగావాట్ల సూపర్ క్రిటికల్ థర్మల్ యూనిట్ ప్రారంభించిన ప్రభుత్వం
- దేశవ్యాప్తంగా బొగ్గు ఆధారిత విద్యుత్ ప్లాంట్ల నిర్మాణానికి కేంద్రం నిర్ణయం
- వచ్చే ఏడాది 17 గిగావాట్ల నిర్మాణం ప్రారంభం.. త్వరలో మరో 33 గిగావాట్లకు ప్రణాళిక
- రాష్ట్రంలో ఇప్పటికే 6,610 మెగావాట్లకు పెరిగిన ‘థర్మల్’ సామర్థ్యం



సాక్షి, అమరావతి: దేశంలో కర్బన ఉద్గారాలను 2070 నాటికి సున్నా స్థాయికి తీసుకురావాలనే లక్ష్యంలో భాగంగా రానున్న కాలంలో పునరుత్పాదక విద్యుత్ వినియోగాన్ని పెంచుకుని.. థర్మల్ విద్యుత్‌ను తగ్గించుకోవాలని కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ కొన్ని నెలల క్రితం అన్ని రాష్ట్రాలకూ ఆదేశాలిచ్చింది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ జెన్‌కో) థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో రిజర్వు షట్ డౌన్ (ఉత్పత్తి తగ్గింపు)పై విధివిధానాలను రాష్ట్ర విద్యుత్ నియంత్రణ మండలి (ఏపీఈఆర్‌సీ) కూడా ప్రకటించింది. పూర్తిగా మూసేయాల్సిన అవసరం లేదని, గ్రిడ్‌కు ప్రమాదం వాటిల్లే పరిస్థితి వస్తే అప్పుడు థర్మల్ యూనిట్లు షట్‌డౌన్ చేయవచ్చని ఏపీ ఈఆర్‌సీ స్పష్టం చేసింది. వాతావరణ మార్పులు, ప్రకృతి వైపరీత్యాల కారణంగా అకస్మాత్తుగా విద్యుత్ డిమాండ్ పడిపోయినప్పుడు కూడా ఉత్పత్తి తగ్గించవచ్చని పేర్కొంది. తక్కువ ధరకు విద్యుత్ అందించే ఉత్పత్తి సంస్థలకు మొదట ప్రాధాన్యం ఇచ్చేలా కొన్ని యూనిట్లను రిజర్వు షట్ డౌన్ చేసే వెసులుబాటు కల్పించింది. దీంతో రాష్ట్రంలో థర్మల్ విద్యుత్ సామర్థ్యాన్ని అత్యవసరంగా తగ్గించాల్సిన ఆవశ్యకత రాలేదు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రభుత్వం తాజాగా ఇబ్రహీంపట్నంలోని నార్ల తాతారావు థర్మల్ పవర్ స్టేషన్ (ఎన్టీటీపీఎస్)లో 800 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం గల సూపర్ క్రిటికల్ థర్మల్ యూనిట్ ఈ నెల 20న వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించింది.

2024లో 17 థర్మల్ ప్లాంట్లు

భవిష్యత్‌లో పెరగనున్న విద్యుత్ డిమాండ్‌ను తట్టుకోవాలంటే పునరుత్పాదక ఇంధనంతో పాటు శిలాజ ఇంధన ఉత్పత్తిపైనా దృష్టి సారించాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తాజాగా గుర్తించాయి. ఈ విషయంలో ఆంధ్రప్రదేశ్ ఒకడుగు ముందే ఉంది. ఇప్పటికే సోలార్, విండ్, హైడల్ కలిపి ఉండే పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్లాంట్లకు శ్రీకారం చుట్టింది. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్ సమ్మిట్‌లో రూ.9.57 లక్షల కోట్ల విలువైన ఇంధన ఒప్పందాలు కుదుర్చుకుంది. ఇంధన రంగంలో ఏపీ చర్యలను ఇప్పటికే అనేక పర్యాయాలు ప్రశంసించిన కేంద్రం రాష్ట్రం బాటలోనే నిర్ణయాలు తీసుకుంటోంది. దేశవ్యాప్తంగా భారీగా బొగ్గు ఆధారిత ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని కేంద్రం భావిస్తోంది. 2024లో దేశంలో రోజువారీ విద్యుత్ డిమాండ్ 256 గిగావాట్లకంటే ఎక్కువ ఉంటుందని సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) నివేదిక అంచనా వేసింది. 2031–32కి ఇది 366.39 గిగావాట్లకు పెరుగుతుందని చెప్పింది. 2041–42కి 574.68 గిగావాట్లకు పెరగొచ్చనే అంచనాతో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం పెంపు అనివార్యమైంది. దీంతో 2024లో 17 గిగావాట్ల సామర్థ్యం గల థర్మల్ ప్లాంట్ల నిర్మాణాన్ని ప్రారంభించాలని, తర్వాత మరో 33 గిగావాట్ల ప్లాంట్ల నిర్మాణం చేపట్టాలని ప్రణాళిక రూపొందించింది. ఇలా దాదాపు రూ.7.28 లక్షల కోట్ల పెట్టుబడితో 91 థర్మల్ ప్లాంట్లు స్థాపించాలని యోచిస్తున్నట్టు కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

దేశంలోనే ఆదర్శంగా ఏపీ

ఏపీ గ్రిడ్ డిమాండ్ గతేడాది రోజుకు 190 మిలియన్ యూనిట్ల నుంచి 200 మిలియన్ యూనిట్లు ఉండగా.. ఈ ఏడాది 220 నుంచి 245 మిలియన్ యూనిట్లు రికార్డయ్యింది. అయినప్పటికీ విద్యుత్ కొరత లేకుండా సరఫరా చేయడంలో థర్మల్ కేంద్రాలు కీలక భూమిక పోషించాయి. ఎన్టీటీపీఎస్ ఆపరేషన్, మెయింటెనెన్స్ యూనిట్ల లభ్యత శాతం 2022–23 ఆర్థిక సంవత్సరంలో 69.90 శాతం ఉంటే.. ఈ ఏడాదిలో 75.83 శాతానికి పెరిగింది. అలాగే గతేడాది ఎన్టీటీపీఎస్ స్టేజ్–4 యూనిట్ హీట్ రేట్ 2,517 కిలో వాట్ అవర్ నుంచి 2,436 తగ్గింది. అదేవిధంగా 2022–23లో ఎంవీఆర్ ఆర్టీపీపీ స్టేషన్ యూనిట్ల లభ్యత 67.85 శాతం నుంచి 75.68 శాతానికి మెరుగుపడింది. అంతేకాకుండా ఈ ఆర్థిక సంవత్సరంలో దేశంలోనే అత్యుత్తమ థర్మల్ ప్లాంట్‌గా ఆర్టీపీపీ గుర్తింపు పొందింది. ఆంధ్రప్రదేశ్ పవర్ జనరేషన్ కార్పొరేషన్ (ఏపీ జెన్‌కో) తన అనుబంధ సంస్థ ఆంధ్రప్రదేశ్ పవర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీ పీడీసీఎల్)తో కలిసి థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్వహిస్తోంది. వీటిలో సామర్థ్యాన్ని మించి దాదాపు 10 మెగావాట్ల అధిక విద్యుత్ ఉత్పత్తి అవుతోంది. రాష్ట్ర గ్రిడ్ అవసరాలను సాధ్యమైనంత ఎక్కువగా తీర్చాలనే లక్ష్యంతో ఏపీ జెన్‌కో విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుతూ వస్తోంది. అందులో భాగంగానే కృష్ణపట్నంలోని దామోదరం సంజీవయ్య థర్మల్ విద్యుత్ కేంద్రంలో ఈ ఏడాది మార్చి 10న 800 మెగావాట్ల యూనిట్ వాణిజ్య ఉత్పత్తి ప్రారంభమైంది. తాజాగా ఎన్టీటీపీఎస్‌లో 8వ యూనిట్ సీవోడీతో జెన్‌కో థర్మల్ విద్యుత్ ఉత్పాదన సామర్థ్యం 5,810 మెగావాట్ల నుంచి 6,610 మెగావాట్లకు పెరిగింది.

ఇక పాకెట్‌లోనే డేటా వ్యాలెట్!

- వ్యాలెట్‌లో క్రెడిట్ కార్డు తరహాలో భారీ డేటా బ్యాంకు
- 150 ఏళ్ల పాటు భద్రం.. వైరస్‌ల బెడదా ఉండదు
- ఫలిస్తున్న ఫ్రాన్స్ స్టార్టప్ కంపెనీ బయోమెమురీ ప్రయోగాలు
- ఎప్పుడు కావాలంటే అప్పుడు బ్యాకప్ పొందే వీలు
- సైబర్ దాడులు జరిగినా సమాచారం చెక్కు చెదరదు
- వెయ్యి డాలర్ల ధరకే అందుబాటులోకి తెచ్చేందుకు ప్రయత్నాలు

కేజీ రాఘవేంద్రారెడ్డి
(సాక్షి ప్రతినిధి, విశాఖపట్నం)

- ప్రతి వ్యక్తి సగటున రోజుకు 3.5 గిగాబైట్స్ (జీబీ)ని వినియోగిస్తున్నట్టు గణాంకాలు చెబుతున్నాయి.
- 2021 నాటి గణాంకాల ప్రకారం.. రోజూ 2.5 క్విన్ టిలియన్ (18 జీరోలు) డేటా ఉత్పత్తి అవుతోంది.

..ఇలా ప్రస్తుత టెక్నాలజీ ప్రపంచంలో నిత్యం డేటా వినియోగం అంతకంతకూ పెరుగుతోంది. మనకు ఏ సమాచారం కావాలన్నా ఇంటర్నెట్‌పైనే ఆధారపడుతున్నాం. దాని నుంచి పొందిన డేటాను భద్రపర్చడం, అవసరమైనప్పుడు తిరిగి అందుబాటులోకి తేవడం కష్టంగా మారుతోంది. మూడు దశాబ్దాల క్రితం మెమొరీ స్టోరేజ్.. ఫ్లాపీతో మొదలైంది. ఆ తర్వాత సీడీ, డీవీడీ, మెమొరీ కార్డు, పెన్ డ్రైవ్ ఇలా విభిన్న రూపాలను సంతరించుకుంది. ఈ కోవలో ఇప్పుడు డేటా సెంటర్లు అందుబాటులోకి వచ్చాయి. అయితే వీటికి కూడా భారీ స్థలం, వ్యయం, అధిక విద్యుత్ వినియోగం అవసరమవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఫ్రాన్స్‌కు చెందిన బయోమెమొరీ అనే ఒక స్టార్టప్ సంస్థ.. డీఎన్ఏ డిజిటల్ డేటా స్టోరేజీ విధానంపై పలు పరిశోధనలు చేసింది. మన ప్యాకెట్‌లో పట్టే వ్యాలెట్ సైజులో ఉంచుకునే క్రెడిట్ కార్డు తరహాలో డేటా సెంటర్ల ఏర్పాటుకు సిద్ధమవుతోంది.

వ్యాలెట్ సైజులోనే..

ఇకపై సొంత డేటా, కంపెనీ డేటా.. ఇలా ఏదైనా ఇక ఏ డేటా సెంటర్ నుంచో బ్యాకప్ తీసుకోవాల్సిన అవసరం లేదు. మీ కంపెనీ సీఈవో మీరే అయితే.. సంస్థకు సంబంధించిన మొత్తం సమాచారం మీ జేబులో ఉంచుకునే రోజులు రాబోతున్నాయి. కొత్త తరహా డేటా సెంటర్లను అభివృద్ధి చేసే ప్రక్రియపై బయో మెమొరీ స్టార్టప్ సంస్థ ప్రయోగాలు దాదాపు సఫలీకృతమయ్యాయి. సుమారు వెయ్యి డాలర్ల ధరకే ఈ డీఎన్ఏ డేటా స్టోరేజీని అందుబాటులోకి తెచ్చేందుకు ఆ సంస్థ ప్రయత్నిస్తోంది.

150 ఏళ్లపాటు సురక్షితం..

కేవలం డేటా స్టోరేజీ విషయంలోనే కాకుండా.. భద్రంగా దాచుకునేందుకు కూడా ఈ డీఎన్ఏ డేటా ఉపయుక్తం కానుంది. వాస్తవానికి హార్డ్ డిస్క్‌లకు 5 ఏళ్లు, ఫ్లాష్ డ్రైవ్స్‌కు 10 ఏళ్ల మన్నిక ఉంటుంది. ఇందుకు భిన్నంగా వ్యాలెట్ సైజులో ఉండే డేటా బ్యాంకు 150 ఏళ్ల పాటు భద్రంగా ఉంటుంది. అంతేకాకుండా వైరస్‌ల బెడద కూడా ఉండదు. అంతేకాకుండా ఎప్పుడు కావాలంటే అప్పుడు డేటాను బ్యాకప్ చేసుకోవచ్చు. ఇతరులెవరూ దీన్ని యాక్సిస్ చేయలేరు. ప్రకృతి వైపరీత్యాలు, సైబర్ దాడులు జరిగినప్పుడు కూడా సమాచారం చెక్కుచెదరకుండా ఉండేలా రూపుదిద్దుకుంటోంది. ఎంత పెద్ద డేటానైనా కేవలం నానో సెకన్లలోనే చెక్ చేసుకునే సదుపాయం కూడా ఈ డీఎన్ఏ డేటా బ్యాంకుల ద్వారా అందుబాటులోకి రానుంది.



డేటా సెంటర్ల కేంద్రంగా.. విశాఖ

ఇంటర్నెట్‌ద్వారా సమాచార సేవలు నిరంతరాయంగా అందాలంటే డేటా సెంటర్లే కీలకం. అటువంటి డేటా సెంటర్లు ఆంధ్రప్రదేశ్‌లో ముఖ్యంగా విశాఖపట్నంలోనూ ఏర్పాటు కానున్నాయి. ఇప్పటికే నిక్సీ ఓ డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు ముందుకు రాగా.. రూ.21,844 కోట్ల పెట్టుబడితో దిగ్గజ సంస్థ ఆదానీ సైతం డేటా సెంటర్ ఏర్పాటు చేసేందుకు సిద్ధమైంది. ఓవైపు.. డేటా సెంటర్ల ఏర్పాటులో ఆయా దేశాలు పోటీపడుతుండగా.. బయోమెమొరీ స్టార్టప్ సంస్థ చేస్తున్న ప్రయోగాలతో వ్యాలెట్ రూపంలో డేటా బ్యాంక్ మార్కెట్‌లోకి వస్తే సమాచార సాంకేతిక రంగంలో విప్లవాత్మక మార్పులు ఖాయమంటున్నారు.

భారత్‌లో భారీ డేటా సెంటర్లు..

ప్రస్తుతం హైపర్ స్కేల్ డేటా సెంటర్స్ ఆపరేషన్స్ జరుగుతున్న దేశాల్లో 44 శాతంతో యూఎస్ మొదటి స్థానాన్ని ఆక్రమించగా.. చైనా 8 శాతం, జపాన్, యూకే 6 శాతం చొప్పున, ఆస్ట్రేలియా, జర్మనీ 5 శాతం చొప్పున తర్వాత స్థానాల్లో ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెరుగుతున్న డేటా వినియోగానికి అనుగుణంగా భారత్‌లోనూ అడుగులు పడుతున్నాయి. మొత్తం డేటా ట్రాఫిక్ 2025 నాటికి నెలకు 7 ఎక్సాబైట్స్ నుంచి 21 ఎక్సాబైట్స్‌కు పెరుగుతుందని ఒక అంచనా. డేటా వ్యాపారం 2022లో 4.9 బిలియన్ డాలర్లుండగా.. 2027 నాటికి ఇది 10.09 బిలియన్ డాలర్లకు చేరుకుంటుందని నిపుణులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్‌లో అతిపెద్ద డేటా సెంటర్ ఏర్పాటుకు మైక్రోసాఫ్ట్ ముందుకొచ్చింది. 25 ఎకరాల స్థలంలో మహారాష్ట్రలోని పూణె సమీపంలోని పింప్రీలో దీన్ని ఏర్పాటు చేయనుంది. దీంతో పాటు అమెజాన్, గూగుల్ సైతం డేటా సెంటర్ల ఏర్పాటుకు మొగ్గ చూపుతున్నాయి.

సరిహద్దు భద్రతలో అశ్వదళాల పాత్ర కీలకం

తెలంగాణ

- బీఎస్ఎఫ్ అదనపు డీజీ అనురాగ్ గార్గ్
- 42వ ఆల్ ఇండియా పోలీస్ ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్ ప్రారంభం

సాక్షి, హైదరాబాద్: దేశ సరిహద్దు భద్రతా విధుల్లో అశ్వదళాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని బీఎస్ఎఫ్ రాయ్‌పూర్ స్పెషల్ ఆపరేషన్స్ కమాండెంట్, అడిషనల్ డీజీ అనురాగ్ గార్గ్ అన్నారు. తాను బీఎస్ఎఫ్ ఐజీగా పశ్చిమ బెంగాల్‌లో పనిచేసినప్పుడు బంగ్లాదేశ్‌తో సరిహద్దు వెంబడి భద్రతా విధుల కోసం గుర్రాలను తొలిసారి గస్తీ విధుల్లో పెట్టినట్లు చెప్పారు. పోలీస్ అధికారుల్లో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించేందుకు గుర్రపు స్వారీ ఉపయోగపడుతుందన్నారు. సర్దార్ వల్లభ్‌భాయ్ జాతీయ పోలీసు అకాడమీలో 42వ ఆల్ ఇండియా ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్, మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్ 2023–24 మంగళవారం ఘనంగా ప్రారంభమైంది. ఆల్ ఇండియా పోలీస్ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మీట్‌ను అనురాగ్ గార్గ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుర్రపు స్వారీతో ఒక జంతువును ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నా కంట్రోల్ చేయడం పోలీస్ అధికారులు నేర్చుకుంటారని, ఇది శాంతిభద్రతల నిర్వహణలో పరిస్థితులను చక్కబెట్టేలా ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని అభిప్రాయపడ్డారు. ఈ పోటీల్లో వివిధ రాష్ట్రాల పోలీసుశాఖల నుంచి 14 మంది మహిళా పోలీస్ అధికారులు సైతం పాల్గొనడం సంతోషంగా ఉందన్నారు. జాతీయ పోలీసు అకాడమీలో జనవరి 5 వరకు నిర్వహించనున్న 42వ ఆల్ ఇండియా ఈక్వెస్ట్రియన్ చాంపియన్‌షిప్, మౌంటెడ్ పోలీస్ డ్యూటీ మీట్–2023–24లో 22 గుర్రపు స్వారీ బృందాలతో కలిపి మొత్తం 610 మంది అభ్యర్థులు పాల్గొంటున్నారని జాయింట్ డైరెక్టర్ ఎస్.మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

సాక్షి ఫ్యామిలీ
విజయవాడ
బుధవారం ॥ 27-12-2023



చిట్టి శ్రీదేవి

బొమ్మల లోకం

పిల్లలకు బొమ్మలంటే ప్రాణం...
బొమ్మ లేకపోతే అన్నం తినరు.
అమ్మ తనను జోకొడుతుంటే...
పిల్లలు తమ బొమ్మను నిద్రపుచ్చుతారు.
ఇష్టంగా ఆడుకున్న బొమ్మను ఎప్పటికీ మర్చిపోరు.
ఆ బొమ్మ పిల్లలను ఆడించి అలరించి ఊరుకోదు.
వారి వ్యక్తిత్వ వికాసంలోనూ ప్రభావం చూపిస్తుంది.
అందుకే... బొమ్మ మంచిని నేర్పించేదై ఉండాలి.

ప్రతి బాల్యం బొమ్మలతో కలసి సాగుతుంది. అమ్మాయిలైతే బొమ్మల్లో సహోదరులను చూసుకుంటారు. తమను తాము ఆ బొమ్మలో ప్రతిక్షేపించుకుంటారు. తాము చేసే పనులను ఆ బొమ్మ చేత కూడా చేయిస్తారు. ఉన్నట్లుండి అమ్మ పాత్రలోకి మారిపోయి ఆ బొమ్మకు స్నానం చేయిస్తారు. దుస్తులు వేసి, పౌడర్ అద్దుతారు, తల దువ్వి, బొట్టు కూడా పెడతారు. ఒక్క మాటలో చెప్పాలంటే బొమ్మలతో బంధాన్ని అల్లుకుంటారు. బొమ్మకు ప్రతిరూపంగా తమను తాము మలుచుకునే ప్రయత్నం జరిగిపోతుంది. పిల్లలకు తెలియకుండానే వాళ్ల మెదడు ఓ సందేశాన్ని గ్రహించి ఉంటుంది. అది మంచి కావచ్చు, హానికారక ప్రభావమూ కావచ్చు. మరి అలాంటప్పుడు పిల్లలు ఆడుకునే బొమ్మలు ఎలా ఉండాలి? చక్కటి సందేశాన్నివ్వాలి. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడానికి దోహదం చేయాలి. అలాంటి ప్రయత్నమే చేస్తున్నారు హైదరాబాద్‌కి చెందిన చిట్టి శ్రీదేవి. బొమ్మలను ఇష్టపడే శ్రీదేవి బొమ్మలతో అందమైన వ్యాపకాన్ని కల్పించుకున్నారు. ఆ వివరాలను సాక్షితో పంచుకున్నారామె.

■ బొమ్మలంటే ఇష్టం

‘‘నేను పుట్టింది గుంటూరులోని అమ్మమ్మ గారింట్లో. బాల్యం, చదువు అంతా హైదరాబాద్‌లోనే. ఎంబీఏ హెచ్‌ఆర్ చేశాను. పెళ్లితో ఉమ్మడి కుటుంబంలో అడుగుపెట్టాను. మా వారు మద్రాస్ ఐఐటీ నుంచి సాఫ్ట్‌వేర్ ఇంజనీరింగ్ చేశారు. ఆ ఇంటికి నేను ఐదవ కోడలిని. అందరం ఒకే ఇంట్లో ఉండేవాళ్లం. ఆ ఇంటి కోడలి ఉద్యోగంలో ఇమిడిపోయాను. మా అబ్బాయి పుట్టిన తర్వాత మా వారి ఉద్యోగరీత్యా యూఎస్‌లో రెండేళ్లకు పైగా ఉన్నాం. ఇండియాకి వచ్చిన తర్వాత మళ్లీ అదే రొటీన్. మా నాన్న నాతో... ‘చదువుకుని కూడా ఉద్యోగం చేయలేకపోతున్నానని బెంగ పెట్టుకోవద్దు. నిన్ను నువ్వు నీకిష్టమైన వ్యాపకంలో నిమగ్నం చేసుకో’ అనేవారు. ఆ మాటల ప్రభావమే కావచ్చు... మా ఆడపడుచు బొటీక్‌లో మూటలు కట్టి పక్కన పెట్టిన స్క్రాప్‌ను చూసినప్పుడు నాకో ఐడియా వచ్చింది. పైగా నాకు చిన్నప్పటి నుంచి బొమ్మలంటే చాలా ఇష్టం. దాంతో బొటీక్‌లో మిగిలిన క్లాత్ ముక్కలతో బొమ్మలు, బొమ్మలకు ఫ్రాకులు... ఇలా రకరకాల ప్రయోగాలు చేశాను. పదిహేనేళ్ల కిందట మొదలైన ఈ వ్యాపకం ఈ రోజు నాకు ‘డాల్స్ శ్రీదేవి’ అనే గుర్తింపు తెచ్చిపెట్టింది. గతంలో హాబీగా చేస్తూ వచ్చిన వ్యాపకానికి 2020 నుంచి పూర్తి స్థాయిలో అంకితమయ్యాను. మా అత్తగారు కాలం చేయడం, మా అబ్బాయి ఇంజినీరింగ్‌కి బిట్స్ పిలానీకి వెళ్లడంతో నా డైలీ రొటీన్‌లో ఒక్కసారిగా విపరీతమైన ఖాళీ ఏర్పడింది. ఓ వారం రోజులపాటు చెన్నైలో డాల్ మేకింగ్ కోర్సు చేశాను. పిల్లలను మంచి పౌరులుగా తీర్చిదిద్దడంలో బొమ్మల ప్రభావం ఎంతగా ఉంటుందో సందేశాత్మకంగా వివరించే ప్రయత్నం చేశాను. సంక్రాంతి బొమ్మల కొలువు కూడా ఒక థీమ్‌తో ఏర్పాటు చేస్తుంటాను. బాలవికాస్, సభలు, స్కూళ్లలో ప్రదర్శిస్తూ ఏడాదిలో 365 రోజులూ పని చేయాలనేది నా కోరిక.

■ ఇండియన్ డాల్

గడచిన పాతికేళ్లుగా మనదేశంలో బార్బీ డాల్స్ ట్రెండ్ నడిచింది. మనదేశంలో పిల్లలు బార్బీ బొమ్మలో కొత్తదనాన్ని ఆస్వాదించారు. కానీ ఆ పిల్లలు టీనేజ్‌లోకి వచ్చిన తర్వాత ఐదారేళ్లకు మన ఊహకు అందని ఓ వాస్తవం బయటపడింది. మన పిల్లలు బార్బీ డాల్ సిండ్రోమ్ బారిన పడిన విషయాన్ని డాక్టర్లు, పిల్లల మనస్తత్వ విశ్లేషకులు సమష్టిగా చేసిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. బార్బీ డాల్‌లా సన్నగా ఉండాలని కోరుకుంటున్నారు మన అమ్మాయిలు. అంత సన్నగా ఉండడం కోసం ఆహారాన్ని తగ్గించేస్తున్నారు. దాంతో పోషకాహార లోపం బారిన పడుతున్నారు. ఇవన్నీ ఒకదానికొకటి అనుబంధ పరిణామాలు. మన వాతావరణం, మన ఆహారం, మన జన్యువుల ఆధారంగా మన దేహ నిర్మాణం జరుగుతుందనే వాస్తవాన్ని పిల్లలకు అర్థం అయ్యేటట్లు చెప్పడానికి మేధావుల నుంచి న్యూట్రిషనిస్టుల వరకు ప్రతి ఒక్కరూ ఒక ఉద్యమంలా ప్రసంగాలు, కథనాల ద్వారా తెలియచేశారు. భారతీయత నేపథ్యంతో కూడిన బొమ్మలతో ఆడుకుంటే పిల్లల మెదడు కూడా మనదైన సహజ దేహాకృతిని స్వాగతించడానికి సిద్ధంగా ఉంటుంది. అలాగే మనం పిల్లలకు సత్ప్రవర్తన, జాతీయత భావం, క్రమశిక్షణ, ధర్మనిరతి వంటివన్నీ కథల ద్వారా వివరిస్తుంటాం. అలాంటి ఇతివృత్తాలతో బొమ్మలను చేస్తున్నాను. అంటే కథలకు బొమ్మల రూపం ఇస్తున్నాన్నమాట. కశ్మీర్ నుంచి కేరళ వరకు ప్రతి రాష్ట్రానికి దాని కంటూ ప్రత్యేకమైన ఆహార్యం ఉంది. ఆ ఆహార్యంతో కూడిన జంట బొమ్మలను చేస్తున్నాను. బొమ్మలతో చెప్పిన విషయం పిల్లలకు బాగా గుర్తుంటుంది. బొమ్మ రూపం చిన్ని మనసుల్లో ముద్రించుకుంటుంది. ఆ బొమ్మ ప్రభావం జీవితకాలమంతా ఉంటుంది’’ అన్నారు చిట్టి శ్రీదేవి.

– వాకా మంజులారెడ్డి,
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

■ ఎన్ని మంచి పుస్తకాలు చదివారు?
■ ఎన్ని మంచి సినిమాలు చూశారు?
■ ఎంతమంది మంచి మిత్రులను పొందారు?
■ ఎన్ని అనుబంధాలను కాపాడుకోగలిగారు?
■ ఎన్ని కొత్త ప్రాంతాలు తిరిగారు?
■ కుటుంబ సభ్యుల మధ్య ఎంత సాన్నిహిత్యం పెంచారు?
■ ఎంత పొదుపు చేశారు?
■ ఆరోగ్యం కోసం ఎంత శ్రద్ధ పెట్టారు?

2023కు వీడ్కోలు

ఇవన్నీ ప్రశ్నలే.
పునరావలోకనం చేసుకోవాలి.
కొత్త సంవత్సరం కొత్త ఉత్సాహంతో మొదలెట్టాలి.
జీవితం ఒక్కటే. సాధించాల్సినవి లక్ష.
స్త్రీగా జన్మించినందుకు రోజులు ఎలా గడిచిపోయాయో అనుకోకూడదు.
ఎంత బాగా గడిచాయో అనుకోవాలి.
అందుకు తరచి చూసుకుని స్వీయ అంచనా వేసుకోవడమే మార్గం.

ఈ సంవత్సరం ఏం చేశారు?



‘ఏం చేస్తున్నావమ్మా?’ అని పిల్లలు అడిగి ‘అన్నం పెట్టు’ అంటారు. ‘ఏం చేస్తున్నావోయ్’ అని భర్త అడిగి, ‘నా వైట్‌షర్ట్ ఎక్కడా?’ అని ప్రశ్నిస్తాడు. అత్తగారు, మామగారు ‘ఏం చేస్తున్నావమ్మా’ అని కేకేసి ఇంకేదో చెప్తారు. వీళ్లంతా ఏ పనీ చెప్పకపోయినా ఇంట్లో గృహిణిగా ఉన్నందుకు తప్పక చేయాల్సిన పనులు ఉంటాయి.

ఈ పనుల్లోనే జీవితం గడిచిపోవాలా? ఈ పనుల మధ్యలో స్త్రీలు తమకంటూ ఒక జీవితాన్ని నిర్మించుకోలేరా?

2023 మరో రెండు మూడు రోజుల్లో వీడ్కోలు తీసుకుంటుంది. కొత్త సంవత్సరం వస్తుంది. గృహిణిగా/ ఉద్యోగం చేస్తూ ఇల్లు చూసుకునే గృహిణిగా ఈ సంవత్సరమంతా ఎలా గడిచిందో బేరీజు వేసుకున్నారా?

■ ఎన్ని పుస్తకాలు చదివారు?

స్త్రీకి మెదడు ఉంటుంది... దానికి వ్యాయామం ముఖ్యం అన్నాడు రచయిత చలం. ఆ వ్యాయామం పుస్తకాలు చదివితే వస్తుంది. సాహిత్యానుభవం వల్ల మస్తిష్కం విశాలం అవుతుంది. జీవన అవగాహన పెరుగుతుంది. జీవితాన్ని ఆస్వాదించడమూ తెలుస్తుంది. స్త్రీలు పుస్తకం చదివితే ఇంటికి వెలుగు. ప్రతిఏటా ఎన్నో మంచి పుస్తకాలు వస్తాయి. పుస్తక ప్రదర్శనలు జరుగుతాయి. అమేజాన్ నుంచి తెప్పించుకోవచ్చు. ఆడియో యాప్స్ కూడా ఉన్నాయి. పుస్తకాలు చదవకుండానే 2023ను మీరు వృథా చేసి ఉంటే మీరు మీ బౌద్ధిక వ్యాయామాన్ని వృథా చేసినట్టు. లేదా కొన్ని పుస్తకాలైనా చదివి ఉంటే వాటిని లిస్ట్ చేసి మీ స్నేహితులకు పంపి ఇన్‌స్పైర్ చేయండి. ఈ సంవత్సరం మరిన్ని చదవాలని లక్ష్యం పెట్టుకోండి.

■ మంచి సినిమాలు చూశారా?

సినిమాలంటే కాలక్షేపపు సినిమాలు కాదు. హాలీవుడ్‌లో, హిందీలో, భారతీయ భాషల్లో అర్థవంతమైన సినిమాలు వస్తున్నాయి. స్త్రీ దృష్టికోణం నుంచి ఎన్నో కథలు చెప్తున్నారు. ఓటిటిలలో కూడా చాలా సినిమాలు వస్తున్నాయి. వీటిలో కొన్నయినా మీరు ఎంచుకుని చూశారా? పోనీ... పాత క్లాసిక్స్... మీరు ఎప్పటినుంచో చూడాలనుకున్నవి... ఎవరూ మధ్యలో డిస్ట్రబ్ చేయని విధంగా చూశారా? సంతోషించారా?

■ ఎంతమంది మిత్రులను పొందారు?

ఇవాళ మనిషికి పెద్ద ఓదార్పు స్నేహమే. వైవాహిక జీవితంలో పడ్డాక పాత స్నేహాలు కొనసాగితే అదృష్టమే. స్కూల్, కాలేజీ నాటి స్నేహితులు మాట్లాడుతూ ఉంటే ఆ స్నేహాన్ని ఈ సంవత్సరం ఎంతమేరకు నిలబెట్టుకున్నారు. లేదా ఇంటి ఇరుగు పొరుగున, పని చేసే చోట ఎన్ని మంచి స్నేహాలు చేయగలిగారు. ఇవాళ రేపు మనుషుల పట్ల నెగెటివిటి పెరిగింది. కాని లోపాలు ఎంచటం తక్కువ... స్నేహాన్ని కొనసాగించడం తక్కువ కొనసాగించారా? బాగా చికాకుగా, డల్‌గా ఉన్నప్పుడు మీరు కాల్ చేసి మాట్లాడే స్నేహితుల సంఖ్య ఈ సంవత్సరం పెరిగిందా? తగ్గిందా?

■ ఎన్ని అనుబంధాలను కాపాడుకోగలిగారు?

బంధువులను దూరం చేసుకోవడం, బంధువులకు దూరం కావడం ఈ కాలపు గడుసుదనంగా మారింది. బంధువులకు ఎంత దూరంగా ఉంటే అంత మంచిది అనే పోకడ ఇప్పుడు సర్వసామాన్యం అయ్యింది. కాని బంధుత్వాలు లేకనే జీవనం సాగగలదా? ఎన్ని లోపాలు ఉన్నా మంచికీ చెడ్డకీ ఆధారపడాల్సింది బంధువులే కదా? ఈ బాంధవ్యాలను, అనుబంధాలను డ్యామేజీ చేశారా? లేదా బలపరుచుకున్నారా? ఏదైనా నష్టం జరిగి ఉంటే 2024లో ఆ నష్టాన్ని నివారించే ప్రయత్నం ఎందుకు జరగకూడదు?

■ ఎన్ని కొత్త ప్రాంతాలు తిరిగారు?

సంవత్సరమంతా ఇంటి నాలుగ్గోడలు, ఆఫీసు ప్రాంగణంలోనే గడిచిపోయిందా? ఏ కొత్త ప్రాంతాన్ని చూడలేదా? కొత్తనేలను తాకి కొత్తగాలిని పీలిస్తేనే సంతోషం. సంవత్సరంలో కనీసం 2 కొత్త ప్రాంతాలు చూడగలగాలి. 2023లో చూడకపోతే 2024లో కదలండి.

■ కుటుంబ సభ్యుల మధ్య సాన్నిహిత్యం:

కుటుంబం జీవన సర్వస్వం. ఒకే కుటుంబమే అయినా కుటుంబ సభ్యుల మధ్య స్పర్థలు, అభ్యంతరాలు, నిర్లక్ష్యం, నిర్బాధ్యత వస్తాయి ఒక్కోసారి. కడుపున పుట్టిన వాళ్ల మధ్య ప్రేమను కల్పించారా? తల్లిదండ్రులుగా మీరు మీ పిల్లల మధ్య అడ్డుగోడలు లేకుండా ఉన్నారా? మీ మనసులో ఉన్నదంతా వారికి చెప్పగలరా? వారి మనసులో ఉన్నది చెప్పే వీలు ఇచ్చారా? 2024లో ఈ ప్రశ్నలకు జవాబు వెతకండి.

■ ఎంత పొదుపు చేశారు?


పిల్లల కోసమే ప్రతి పైసా ఖర్చు పెట్టడం ఇన్నాళ్లు చేశారా? 2023లో కూడా అదే చేశారా? తల్లిగా మీ ఆర్థిక భద్రత ఎంత? మీ పేరున స్థిరచరాస్తులు, రొక్కం ఏ మేరకు ఉంది. మీ కోసం మీరు ఎంత పొదుపు చేసుకున్నారు? ఒకరిపై ఆధారపడలేని స్థితిలో ఉండాలనుకోవడం లేదా? కొత్త సంవత్సరం వస్తున్నది మీ స్వయంసమృద్ధికే.

■ ఆరోగ్యం పై ఎంత శ్రద్ధ పెట్టారు?

ఆరోగ్యం సంగతి తర్వాత చూసుకుందాం అని ఇంకా ఎన్నేళ్లు అనుకుంటారు. ఈ సంవత్సరం హెల్త్ ఇన్సూరెన్స్‌లు చేయించుకోండి. మంచి ఆహారానికి బడ్జెట్ కేటాయించుకోండి. జిమ్‌లో చేరండి. వాకింగ్ చేయండి. యోగా క్లాసులకెళ్లండి. మీ ఆరోగ్యం కోసం మీరు కొంత ఖర్చు పెట్టుకోవడాన్ని హక్కుగా పొందండి. 2024లో కచ్చితంగా మీరు సంపూర్ణ ఆరోగ్యం కోసం నడుం బిగించండి.


కాలం వచ్చేది మన కోసం. మనం ఇతరుల కోసం ఎంత జీవించినా మన కోసం కూడా జీవించాలి. కొత్త సంవత్సరంలో మీ కోసం కూడా మీరు జీవించండి.

● ముగ్గు-ముచ్చట




పావని ఆర్
గుర్రంగూడ
హైదరాబాద్

18 చుక్కలు
2 వరుసలు
అటు ఇటు
వదిలి
2 వరకు



15 చుక్కలు
8 వచ్చేవరకు
మధ్యచుక్క

ఉషా కుమారి
మిరియప్పల్లి,
శ్రీకాకుళం మండలం



22 చుక్కలు
10 వరసలు
10 వరకు

కె.లక్ష్మి,
రామనగర్,
విజయవాడ



ముగ్గులకు ఆహ్వానం

ముగ్గులు పంపవలసిన చిరునామా: ముగ్గు-ముచ్చట,
సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నెం.1,
బంజారాహిల్స్, హైదరాబాద్-34.
ఈ మెయిల్: muggulu.sakshi@gmail.com

యూత్ పల్స్

AI LOVE YOU
ఆసక్తి... అధ్యయనం... నైపుణ్యం

‘నేటి ఆసక్తి రేపటి నైపుణ్యం’ అంటారు. కాలేజి చదువుతో సంబంధం లేకుండానే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ)కి సంబంధించిన ప్రాథమిక విషయాలను తెలుసుకోవడానికి ఆసక్తి ప్రదర్శిస్తోంది యువతరం. గూగుల్, మైక్రోసాఫ్ట్, అమెజాన్... మొదలైన దిగ్గజ సంస్థలు అందించే షార్ట్ టైమ్ ఉచిత కోర్సులలో ప్రావీణ్యం సంపాదించి తొలి అడుగు వేస్తున్నారు....



సంప్రదాయ హద్దులను చెరిపేస్తూ, ఆలోచనలను పునర్నిర్వచిస్తూ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రెవెల్యూషనరీ ఫోర్స్‌గా ఎదుగుతోంది. విద్యారంగానికి సంబంధించి ‘ఏఐ’ అనేది గేమ్-చేంజర్ అయింది. ఎడ్యుకేషనల్ యాక్టివిటీస్‌లో ఆటలను పోలిన ఎలిమెంట్స్‌ను పొందుపరిచి, నేర్చుకునే విధానాన్ని ఆసక్తికరం చేసే ‘గేమిఫికేషన్’ ప్రక్రియ ఊపందుకుంటుంది.

తాము ఏ కోర్సు చదువుతున్నాం అనేదానితో సంబంధం లేకుండా ‘ఏఐ’కి సంబంధించిన ప్రాథమిక విషయాలపై ఆసక్తి చూపుతున్న వారికి దిగ్గజ సంస్థల ఏఐ ఉచిత కోర్సులు వరంగా మారాయి.

2025 నాటికి 20 లక్షల మందికి ఏఐ స్కిల్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా నిర్ణయించుకుంది అమెజాన్. దీనికి ‘ఏఐ రెడీ’ అని పేరు పెట్టారు. నెక్స్-జెన్ ఏఐ టెక్నాలజీని పరిచయం చేసే కార్యక్రమం ఇది. ఫౌండేషనల్ ఏఐ కాన్సెప్ట్స్, ప్రాక్టికల్ అప్లికేషన్ డెవలప్‌మెంట్‌కు సంబంధించి అమెజాన్ వెబ్ సర్వీసెస్ (ఏడబ్ల్యూఎస్) ఎనిమిది ఉచిత ఆన్‌లైన్ కోర్సులను ఆఫర్ చేస్తుంది.

ఏఐకి పెరుగుతున్న డిమాండ్‌ను దృష్టిలో పెట్టుకొని సాంకేతిక దిగ్గజం గూగుల్ పదిహేను భాషల్లో అందుబాటులో ఉండే ఉచిత ‘ఏఐ సర్టిఫికేషన్’ కోర్సులకు రూపకల్పన చేసింది. ఏఐకి సంబంధించిన ప్రాథమిక విషయాలను అవగాహన పరిచే లక్ష్యంతో దీన్ని రూపొందించారు. బిగినర్స్‌కు ఇది బాగా ఉపయోగపడుతుంది. లెసన్స్‌ను ఆరు మాడ్యూల్స్‌గా విభజించారు. వాటిజ్ ఏఐ; ఏఐ ప్రాబ్లం సాల్వింగ్, రియల్ వరల్డ్ ఏఐ, మెషిన్ లెర్నింగ్, న్యూట్రల్ నెట్‌వర్క్స్, ఇంప్లికేషన్స్‌లాంటి ఆరు చాప్టర్‌లు ఉంటాయి. రకరకాల ఎక్సర్‌సైజ్‌లు ఉండే ఈ ఉచిత కోర్సులలో స్టూడెంట్స్ 50 శాతం ఎక్సర్‌సైజ్‌లను కరెక్ట్‌గా చేయాల్సి ఉంటుంది.

‘రెస్పాన్సిబుల్ ఏఐ’ అనే కోర్స్‌ను కూడా రూపొందించింది గూగుల్. ఏఐ ఎక్స్‌పర్ట్ డాక్టర్ ఆండ్రూ ఎన్‌జీ దీన్ని రూపొందించారు. జనరేటివ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సామర్థ్యం రోజువారీ పనుల్లో ఎలా సహాయ పడుతుంది, ఏఐ ఆధునాతన ఉపయోగాలు ఏమిటి... మొదలైనవి ఇందులో ఉంటాయి.

‘ఏఐ’కి సంబంధించి ప్రాథమిక విషయాలను అవగాహన పరిచే కోర్సును రూపొందించింది మైక్రోసాఫ్ట్. 24 లెసన్స్‌కు సంబంధించి పన్నెండు వారాల కరికులమ్ ఇది. జెనరేటివ్ ఇంటెలిజెన్స్ పరిచయం, అది పని చేసే విధానం, కంటెంట్‌ను క్రియేట్ చేసే పద్ధతులు, వివిధ రకాల మోడల్స్...మొదలైనవి దీనిలో ఉన్నాయి. ఈ కోర్సును ప్రముఖ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఎక్స్‌పర్ట్ పినార్ సెనార్ రూపొందించారు... యువతరం ఆసక్తి చూపుతున్న ఎన్నో కోర్సులలో ఇవి కొన్ని మాత్రమే.

‘నేటి ఆసక్తి... రేపటి నైపుణ్యం’ అనే మాట అక్షరాలా నిజమని ప్రాంజలి సక్సెస్ స్టోరీ చెప్పకనే చెబుతుంది.

పదహారు సంవత్సరాల వయసులో ఏఐ స్టార్టప్ ‘డెల్వ్.ఏఐ’ ఫౌండర్‌గా ప్రపంచ దృష్టిని ఆకర్షించింది ప్రాంజలి అవస్తీ. ఏడు సంవత్సరాల వయసులో కోడింగ్‌పై ఆసక్తి మొదలైంది. తండ్రి సహాయంతో రకరకాల సాంకేతిక విషయాలపై అవగాహన పెంచుకుంది. మన దేశంలో పుట్టిన ప్రాంజలి పదిసంవత్సరాల వయసులో తల్లిదండ్రులతోపాటు అమెరికాకు వెళ్లింది. హైస్కూల్ రోజుల్లో చాలెంజింగ్ కంప్యూటర్ సైన్స్ ప్రాజెక్ట్‌లపై పనిచేసేది. చిన్నప్పటి నుంచి సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌ల గురించి తెలుసుకోవడం అంటే ఇష్టం. వారి స్ఫూర్తితో సక్సెస్‌ఫుల్ ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది ప్రాంజలి అవస్తీ.

ఇంపోస్టర్ సిండ్రోమ్ నుంచి బయటపడాలి



సెల్ఫ్-ఇంప్రూమెంట్ అనేది మనలో ఆత్మవిశ్వాసాన్ని పెంచుతుంది. మరో వైపు నిర్మాణాత్మక విమర్శలను ఆహ్వానించాలి. వాటిద్వారా తప్పులు సరిదిద్దుకోవాలి. బిజినెస్ ప్రారంభించిన కొత్తలో ప్రతి చిన్న విజయాన్ని సెలబ్రేట్ చేసుకోవాలి. ఆ ఉత్సాహం మనకు ఎంతో శక్తిని ఇస్తుంది. కంఫర్ట్ జోన్ నుంచి బయటికి రావడానికి ఎప్పుడూ భయపడవద్దు. రకరకాల రంగాలలో విజేతలైన ఎంతోమందిని కలుసుకొని మాట్లాడాను. వారు ఎన్నో సవాళ్లు ఎదుర్కొని నిలదొక్కుకున్నారు. ఇంపోస్టర్ సిండ్రోమ్(సెల్ఫ్-డౌట్)తో సతమతమయ్యేవారికి నేను చెప్పేది ఏమిటంటే మనపై మనకు నమ్మకం ఉండాలి. లేకపోతే మనలోని నైపుణ్యం, ప్రతిభ వృథా అవుతాయి.

– ప్రాంజలి అవస్తీ, డెల్వ్.ఏఐ, ఫౌండర్

ఏఐ ఇన్నోవేటర్



శ్రేయా ఫ్రాన్సిస్

ఏఐ పరిశోధనలలో చిన్న వయసులోనే అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చుకుంది కేరళకు చెందిన శ్రేయా ఫ్రాన్సిస్. తాజాగా ఇంటర్నేషనల్ ఏఐ సమ్మిట్‌కు సంబంధించిన ‘ఏఐకానిక్స్ సొల్యూషన్స్ ఇంప్లిమెంటర్ ఆఫ్ ది ఇయర్’ అవార్డ్ గెలుచుకుంది. ఏఐ అండ్ రోబోటిక్స్‌కు సంబంధించి ఎన్నో ప్రాజెక్ట్‌లకు నాయకత్వం వహించింది. ఏఐ టాపిక్‌కు సంబంధించి ఎన్నో అంతర్జాతీయ సమావేశాల్లో కీలక ఉపన్యాసం ఇచ్చింది. ప్రతిష్ఠాత్మకమైన మైక్రోసాఫ్ట్ రిసెర్చ్ డైవర్సిటీ అవార్డ్‌ను రెండుసార్లు గెలుచుకుంది.



టాప్ సీడ్ జోడీకి రష్మిక ద్వయం షాక్

అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) మహిళల టోర్నీలో హైదరాబాద్ ప్లేయర్ శ్రీవల్లి రష్మిక డబుల్స్ విభాగంలో క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించింది. నవీ ముంబైలో జరుగుతున్న ఈ టోర్నీలో మంగళవారం జరిగిన డబుల్స్ తొలి రౌండ్‌లో రష్మిక-వైదేహి (భారత్) ద్వయం 7-6 (7/5), 6-2తో టాప్ సీడ్ జిబెక్ కులమ్‌బయేవా (కజకిస్తాన్)-జస్టినా మికుల్‌స్కయిట్ (లిథువేనియా) జోడీని బోల్తా కొట్టించింది. మరో తొలి రౌండ్ మ్యాచ్‌లో సహజ యామలపల్లి-వైష్ణవి (భారత్) జంట 1-6, 6-2, 12-14తో అకీకో ఒమాయి (జపాన్)-జీట్రయిస్ గుమల్యా (ఇండోనేసియా) ద్వయం చేతిలో పోరాడి ఓడిపోయింది.

సుమిత్ నగాల్‌కు ఏఐటీఏ షాక్



ఆస్ట్రేలియన్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీ కోసం అందుబాటులో ఉన్న వైల్డ్ కార్డు ఎంట్రీ కోసం భారత నంబర్‌వన్ సుమిత్ నగాల్ పేరును పంపించడం లేదని అఖిల భారత టెన్నిస్ సంఘం (ఏఐటీఏ) స్పష్టం చేసింది. ఫిబ్రవరిలో పాకిస్తాన్‌తో జరిగే డేవిస్‌కప్ మ్యాచ్‌లో ఆడేందుకు సుమిత్ నిరాకరించినందుకు ఈ నిర్ణయం తీసుకున్నామని ఏఐటీఏ సెక్రటరీ జనరల్ అనిల్ ధూపర్ తెలిపారు. దాంతో సుమిత్ ఆస్ట్రేలియన్ ఓపెన్ క్వాలిఫయింగ్ టోర్నీలో ఆడాల్సి ఉంటుంది.

రాహుల్ పోరాటం

'బాక్సింగ్ డే' టెస్టు సవాళ్లతో మొదలైంది. బంతి ఒక బుల్లెట్‌గా బ్యాటర్లను అదేపనిగా ఢీకొట్టింది. పేసర్లు గర్జిస్తుంటే... ప్రధాన బ్యాటర్లు సైతం చేతులెత్తేశారు. అడుగడుగునా కఠిన సవాళ్లు ఎదురవుతున్న సెంచూరియన్ పిచ్‌పై మిడిలార్డర్‌లో బ్యాటింగ్‌కు దిగిన కేఎల్ రాహుల్ అసాధారణ పోరాటం చేశాడు. అజేయ అర్ధ సెంచరీతో భారత్ ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు.

- భారత్ 208/8
- దక్షిణాఫ్రికాతో తొలి టెస్టు
- ఐదు వికెట్లతో హడలెత్తించిన రబడ

సెంచూరియన్: సఫారీ పేస్ దళానికి భారత బ్యాటింగ్ బలగమంతా వణికితే ఒకే ఒక్కడు కేఎల్ రాహుల్ మాత్రం పెను సవాలుకు తన బ్యాటింగ్ సత్తాతో ఎదురు నిలిచాడు. తొలిటెస్టులో ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ వర్షం కారణంగా ఆట నిలిచి సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 59 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 208 పరుగులు చేసింది. కేఎల్ రాహుల్ (105 బంతుల్లో 70 బ్యాటింగ్; 10 ఫోర్లు, 2 సిక్స్‌లు) భారత్ మొదటిరోజే ఆలౌట్ కాకుండా అడ్డుపడ్డాడు. అజేయ అర్ధసెంచరీతో ఇన్నింగ్స్‌ను ఆదుకున్నాడు. రబడ ఐదు వికెట్లతో (5/44) చెలరేగాడు. ఈ మ్యాచ్ ద్వారా భారత యువ సీమర్ ప్రసిధ్ కృష్ణ టెస్టుల్లో అరంగేట్రం చేశాడు.

రోహిత్ 5, గిల్ 2

టాస్ నెగ్గిన ఆతిథ్య దక్షిణాఫ్రికా జట్టు ఫీల్డింగ్ ఎంచుకుంది. సీమర్లు తమ కెప్టెన్ నిర్ణయం సరైందనిపించడానికి ఎంతో సేపు పట్టలేదు. కెప్టెన్ రోహిత్ శర్మ (5)ను రబడ అవుట్ చేయగా, కాసేపటికే బర్గర్ వరుస ఓవర్లలో యశస్వి జైస్వాల్ (17), శుబ్‌మన్ గిల్ (2)లను పెవిలియన్ చేర్చాడు. 24 పరుగులకే టీమిండియా విలువైన వికెట్లు కూలాయి. ఈ దశలో అనుభవజ్ఞుడైన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి (64 బంతుల్లో 38; 5 ఫోర్లు), శ్రేయస్ అయ్యర్ (50 బంతుల్లో 31; 3 ఫోర్లు, 1 సిక్స్) ఇన్నింగ్స్‌ను కనిపెట్టుకున్నారు. తొలిసెషన్‌లో మరో వికెట్ పడకుండా జాగ్రత్తగా ఆడుకున్నారు. భారత్ 91/3 స్కోరు వద్ద లంచ్ బ్రేక్‌కు వెళ్లింది.



రాహుల్



రబడ

రబడ దెబ్బకు మళ్లీ...

అదేంటో ఏమో మ్యాచ్ మొదలైనపుడు కష్టాల్లో పడ్డట్లే... రెండో సెషన్ మొదలైనపుడు కూడా భారత్ పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. కలిసొచ్చిన పిచ్... పనికొచ్చిన ఎక్స్‌ట్రా బౌన్స్‌తో వైవిధ్యమైన బంతులు వేసిన రబడ మ్యాచ్‌ను దక్షిణాఫ్రికా నియంత్రణలోకి తెచ్చాడు. సెషన్ ఆరంభమైన ఓవర్లోనే అయ్యర్, జట్టు స్కోరు వంద పూర్తయ్యాక కోహ్లి, అశ్విన్ (8)లను రబడ పెవిలియన్ చేర్చాడు. ఓ దశలో 121/6 స్కోరు వద్ద భారత్ ఆలౌట్‌కు దాదాపు చేరువైంది. ఎందుకంటే ఒక్క రాహుల్ మినహా ప్రధాన బ్యాటర్లెవరూ మిగల్లేదు!

వీరోచిత పోరాటం

కష్టమైన పిచ్... నిప్పులు చెరుగుతున్న బౌలర్లు... భారత్‌కు అన్నీ కష్టాలే! ఇలాంటి పరిస్థితిలో రాహుల్ అద్వితీయ పోరాటం చేశాడు. కీలక బ్యాటర్లెవరూ లేకపోయినా... టెయిలెండర్ శార్దుల్ ఠాకూర్ (33 బంతుల్లో 24; 3 ఫోర్లు)తో రెండో సెషన్‌ను నడిపించాడు. అయితే వేగంగా ఆడే క్రమంలో శార్దుల్ వికెట్‌ను పారేసుకున్నాడు. బుమ్రా క్రీజులోకి రాగా... టీమిండియా 176/7 వద్ద టీ బ్రేక్‌కు వెళ్లింది. విరామనంతరం రాహుల్ అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే కాసేపటికే బుమ్రా (1)ను జాన్సెన్ బౌల్డ్ చేశాడు. సిరాజ్ (0 బ్యాటింగ్) క్రీజులోకి రాగా... రాహుల్ కష్టపడి జట్టు స్కోరును 200 దాటించాడు. బ్యాడ్‌లైట్, వర్షం వల్ల ఫైనల్ సెషన్ ఎక్కువసేపు సాగలేదు. 208/8 స్కోరు వద్ద వాన రావడంతో తొలిరోజు ఆట అక్కడితోనే ఆగిపోయింది. మ్యాచ్ ఆరంభం కూడా ఆలస్యం కావడంతో మొదటి రోజు కేవలం 59 ఓవర్ల ఆటే సాధ్యమైంది.

స్కోరు వివరాలు

భారత్ తొలి ఇన్నింగ్స్: యశస్వి (సి) వెరిన్ (బి) బర్గర్ 17; రోహిత్ (సి) బర్గర్ (బి) రబడ 5; గిల్ (సి) వెరిన్ (బి) బర్గర్ 2; కోహ్లి (సి) వెరిన్ (బి) రబడ 38; అయ్యర్ (బి) రబడ 31; రాహుల్ (బ్యాటింగ్) 70; అశ్విన్ (సి) సబ్-ముల్డర్ (బి) రబడ 8; శార్దుల్ (సి) ఎల్గర్ (బి) రబడ 24; బుమ్రా (బి) జాన్సెన్ 1; సిరాజ్ (బ్యాటింగ్) 0; ఎక్స్‌ట్రాలు 12; **మొత్తం (59 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి) 208.** **వికెట్ల పతనం:** 1-13, 2-23, 3-24, 4-92, 5-107, 6-121, 7-164, 8-191. **బౌలింగ్:** రబడ 17-3-44-5, మార్కో జాన్సెన్ 15-1-52-1, బర్గర్ 15-4-50-2, కొయెట్జీ 12-1-53-0.

'ఖేల్‌రత్న... అర్జున' వెనక్కి...

భారత మహిళా స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగాట్ ప్రకటన



న్యూఢిల్లీ: ఇప్పుడు వినేశ్ ఫొగాట్ వంతు వచ్చింది. ఈ స్టార్ రెజ్లర్ కూడా తన ఘనతలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఇచ్చిన అవార్డులను వెనక్కివ్వాలని నిర్ణయించుకుంది. రోడ్డెక్కి పోరాడినా... క్రీడాశాఖ నుంచి స్పష్టమైన హామీ లభించినా... మళ్లీ రెజ్లర్లకు అన్యాయమే జరిగిందని వాపోయింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ పురస్కారాలను అట్టిపెట్టుకోవడంలో అర్థమేలేదని వినేశ్ తెలిపింది. సోషల్ మీడియా 'ఎక్స్' వేదికగా తన ఆవేదనను ప్రధానికి లేఖ ద్వారా తెలియజేసింది. 'ఇంత జరిగాక ఇక నా జీవితంలో ఈ రెండు అవార్డులకు విలువే లేదు. ఎందుకంటే ఏ మహిళ అయినా ఆత్మగౌరవాన్నే కోరుకుంటుంది. నేనూ అంతే... నా జీవితానికి ఆ అవార్డులు ఇకపై భారం కాకూడదనే ఉద్దేశంతోనే నాకు మీరిచ్చిన అవార్డుల్ని వెనక్కి ఇస్తున్నాను ప్రధాని సార్' అని ఆమె 'ఎక్స్'లో లేఖను పోస్ట్ చేసింది. మహిళా సాధికారత, సమ సమానత్వం అనే ప్రకటనలకే ప్రభుత్వం పరిమితమని తీవ్రంగా ఆక్షేపించింది. మేటి రెజ్లర్ ఫొగాట్ ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రెండు కాంస్య పతకాలు సాధించింది. మూడు (2014, 2018, 2022) కామన్వెల్త్ క్రీడల్లోనూ చాంపియన్‌గా నిలిచింది. ఆసియా క్రీడల్లో స్వర్ణం (2018), కాంస్యం (2014) చేజిక్కించుకుంది. కుస్తీలో ఆమె పతకాల పట్టును గుర్తించిన కేంద్ర ప్రభుత్వం 2016లో అర్జున, 2020లో 'మేజర్ ధ్యాన్‌చంద్ ఖేల్‌రత్న' అవార్డులతో సత్కరించింది. భారత రెజ్లింగ్ సమాఖ్య (డబ్ల్యూఎఫ్ఐ)కు ఇటీవల జరిగిన ఎన్నికల్లో లైంగిక ఆరోపణల కేసులో నిందితుడైన వివాదాస్పద మాజీ అధ్యక్షుడు బ్రిజ్‌భూషణ్ వర్గమే గెలిచింది. ఆయన విధేయుడు సంజయ్ సింగ్ అధ్యక్షుడిగా ఎన్నికవడంతో సాక్షి మలిక్ ఉన్న పళంగా రిటైర్మెంట్ ప్రకటించింది. రెజ్లర్ బజరంగ్ పూనియా, బధిర రెజ్లర్ వీరేందర్ సింగ్ 'పద్మశ్రీ' పురస్కారాలను వెనక్కి ఇచ్చారు. అయితే కేంద్ర క్రీడాశాఖ నియమావళిని అతిక్రమించడంతో డబ్ల్యూఎఫ్ఐని సస్పెండ్ చేసింది.

పుణేరి పల్టన్ జోరు



చెన్నై: ప్రొ కబడ్డీ లీగ్ పదో సీజన్‌లో పుణేరి పల్టన్ తమ జోరు కొనసాగిస్తోంది. పట్నా పైరేట్స్‌తో మంగళవారం జరిగిన మ్యాచ్‌లో పుణేరి పల్టన్ 46-28తో ఘనవిజయం సాధించింది. పంకజ్ మొహితె 11 పాయింట్లు, మోహిత్ గోయట్ 9 పాయింట్లు సాధించి పుణేరి జట్టు గెలుపులో ముఖ్యపాత్ర పోషించారు. అస్లమ్ ముస్తఫా, మొహమ్మద్ రజా ఆరు పాయింట్ల చొప్పున స్కోరు చేశారు. ఈ లీగ్‌లో పుణేరి జట్టుకిది ఆరో విజయం కావడం విశేషం. ఈ గెలుపుతో పుణేరి పాయింట్ల పట్టికలో మళ్లీ ఒంటరిగా అగ్రస్థానంలోకి దూసుకొచ్చింది. నేడు జరిగే మ్యాచ్‌ల్లో జైపూర్ పింక్ పాంథర్స్‌తో దబంగ్ ఢిల్లీ; తమిళ్ తలైవాస్‌తో గుజరాత్ జెయింట్స్ తలపడతాయి.

పాయింట్ల పట్టిక PKL

జట్టు	ఆ	గె	ఓ	టై	పా
పుణేరి పల్టన్	7	6	1	0	31
హరియాణా స్టీలర్స్	7	5	2	0	26
జైపూర్ పింక్ పాంథర్స్	7	4	2	1	25
గుజరాత్ జెయింట్స్	7	4	3	0	23
బెంగాల్ వారియర్స్	8	3	3	2	22
యు ముంబా	6	4	2	0	21
బెంగళూరు బుల్స్	8	3	5	0	19
దబంగ్ ఢిల్లీ	6	3	3	0	17
పట్నా పైరేట్స్	7	3	4	0	17
యూపీ యోధాస్	7	2	4	1	15
తమిళ్ తలైవాస్	7	2	5	0	11
తెలుగు టైటాన్స్	7	1	6	0	8

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు

అజేయంగా అర్జున్



సమర్‌కండ్ (ఉజ్బెకిస్తాన్): ప్రపంచ ర్యాపిడ్ చెస్ చాంపియన్‌షిప్ ఓపెన్ విభాగంలో తొలి రోజు ఐదు రౌండ్‌లు ముగిశాక తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ మరో నలుగురితో కలిసి 4.5 పాయింట్లతో ఉమ్మడిగా అగ్రస్థానంలో ఉన్నాడు. మంగళవారం జరిగిన ఐదు గేముల్లో అర్జున్... జాగ్నిసెవ్, బొచరోవ్, మత్లకోవ్ (రష్యా), దనెశ్వర్ (ఇరాన్)లపై గెలిచి చిగయెవ్ (స్పెయిన్)తో 'డ్రా' చేసుకున్నాడు. కార్ల్‌సన్ (నార్వే), చెపరినోవ్ (బల్గేరియా), యు యాంగి (చైనా), విదిత్ (భారత్) కూడా 4.5 పాయింట్లతో అగ్రస్థానంలో ఉన్నారు. మహిళల విభాగంలో నాలుగో రౌండ్ తర్వాత భారత గ్రాండ్‌మాస్టర్లు వైశాలి 3.5 పాయింట్లతో ఆరో ర్యాంక్‌లో... కోనేరు హంపి 3 పాయింట్లతో 15వ ర్యాంక్‌లో ఉన్నారు. భారత్‌కే చెందిన పద్మిని రౌత్ 3 పాయింట్లతో 19వ స్థానంలో... ద్రోణవల్లి హారిక, నూతక్కి ప్రియాంక, సాహితి వర్షిణి, వేల్పుల సరయు 2 పాయింట్లతో వరుసగా 48వ, 61వ, 68వ, 69వ స్థానాల్లో ఉన్నారు.

ఆస్ట్రేలియా 187/3



లబుషేన్

మెల్‌బోర్న్: పాకిస్తాన్ జట్టుతో మంగళవారం మొదలైన 'బాక్సింగ్ డే' టెస్టులో ఆస్ట్రేలియా తొలి రోజు ఆట ముగిసే సమయానికి 66 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 187 పరుగులు చేసింది. టీ విరామానికి 37 నిమిషాల ముందు వర్షం రావడంతో ఆటకు మూడు గంటలపాటు అంతరాయం ఏర్పడింది. దాంతో తొలి రోజు 66 ఓవర్లు మాత్రమే సాధ్యమయ్యాయి. ఆసీస్ ఓపెనర్లు డేవిడ్ వార్నర్ (38; 3 ఫోర్లు), ఉస్మాన్ ఖ్వాజా (42; 5 ఫోర్లు) తొలి వికెట్‌కు 90 పరుగులు జోడించారు. స్టీవ్ స్మిత్ (26; 2 ఫోర్లు) తక్కువ స్కోరుకే వెనుదిరిగాడు. ఆట ముగిసే సమయానికి లబుషేన్ (44 బ్యాటింగ్; 3 ఫోర్లు), ట్రావిస్ హెడ్ (9 బ్యాటింగ్; 1 ఫోర్) క్రీజులో ఉన్నారు. పాక్ బౌలర్లు హసన్ అలీ, ఆమెర్ జమాల్, ఆగా సల్మాన్ ఒక్కోవికెట్ తీశారు.

సినిమా

ఈగల్‌లో నన్ను కొత్తగా చూస్తారు

\- రవితేజ



● టీజీ విశ్వప్రసాద్, శ్రీలీల, రవితేజ, కావ్యా థాపర్, విద్య, కార్తీక్

రవితేజ హీరోగా కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'ఈగల్'. ఈ చిత్రంలో అనుపమా పరమేశ్వరన్, కావ్యా థాపర్ హీరోయిన్లు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన ఈ చిత్రం జనవరి 13న విడుదల కానుంది. అలాగే రవితేజ, శ్రీలీల జంటగా నక్కిన త్రినాథ రావు దర్శకత్వంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ నిర్మించిన హిట్ ఫిల్మ్ 'ధమాకా' విడుదలై ఏడాది పూర్తయింది. ఈ సందర్భంగా 'ఈగల్ X ధమాకా' సెలబ్రేషన్స్‌ను నిర్వహించారు మేకర్స్. ఈ వేడుకలో రవితేజ మాట్లాడుతూ– ''ధమాకా' విడుదలై ఏడాది పూర్తయిందంటే నమ్మబుద్ధి కావడం లేదు. నిన్నో మొన్నో రిలీజైనట్లుగా అనిపిస్తోంది. ఈ సినిమాతో హీరోయిన్‌గా శ్రీలీల, మ్యూజిక్ డైరెక్టర్‌గా భీమ్స్‌కు మంచి పేరు వస్తుందని ముందే చెప్పాను. అది నిజమైంది. 'ధమాకా' యూనిట్ సభ్యులందరికీ పేరు పేరునా ధన్యవాదాలు. ఇక 'ఈగల్' విషయానికొస్తే... ఈ చిత్రంలో కొత్త రవితేజను చూస్తారు. కార్తీక్ ఘట్టమనేనికి దర్శకుడిగా మంచి భవిష్యత్ ఉందని నా నమ్మకం. నిర్మాత విశ్వగారితో నా జర్నీ కొనసాగుతుంది'' అన్నారు. ''అన్ని కమర్షియల్ అంశాలు ఉన్న మంచి చిత్రం 'ఈగల్'. థియేటర్స్‌లో చూడండి'' అన్నారు కార్తీక్ ఘట్టమనేని. ''గత ఏడాదిని బ్లాక్‌బస్టర్‌తో ఎండ్ చేశాం. వచ్చే ఏడాదిని బ్లాక్‌బస్టర్‌తో ఆరంభిస్తాం'' అన్నారు టీజీ విశ్వప్రసాద్. అవసరాల శ్రీనివాస్, హైపర్ ఆది తదితరులు మాట్లాడారు.

నేను చేయనని చెప్పినా వినలేదు

\- శ్రియా రెడ్డి



''సలార్' గురించి ప్రశాంత్ నీల్ చెప్పినప్పుడు చేయనని చెప్పాను. ఆ టైమ్‌లో నేను సినిమాలు చేయకూడదనుకున్నాను. అయితే ప్రశాంత్ మాత్రం పట్టు వదల్లేదు. పూర్తి కథ విని నిర్ణయం తీసుకోమన్నారు. హీరో ఎవరైనా పర్లేదు.. నా పాత్రకి ప్రాధాన్యం ఉండాలని చెప్పాను. 'నీ పాత్ర చాలా బాగుంటుంది.. నన్ను నమ్ము' అన్నారు. అలా 'సలార్'లో రాధా రమ పాత్ర చేశాను'' అని నటి శ్రియా రెడ్డి అన్నారు. ప్రభాస్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వం వహించిన చిత్రం 'సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్'. శ్రుతీహాసన్, పృథ్వీరాజ్ సుకుమారన్, జగపతిబాబు, శ్రియా రెడ్డి కీలక పాత్రల్లో నటించారు. విజయ్ కిరగందూర్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 22న రిలీజ్ అయింది. ఈ చిత్రంలో రాధా రమ పాత్ర చేసిన శ్రియా రెడ్డి మాట్లాడుతూ–''నేను నటించిన 'పొగరు' సినిమా చూసి ప్రశాంత్ నీల్‌గారు 'సలార్'లో రాధా రమ పాత్రకు ఎంపిక చేసుకున్నారు. నిజానికి 'సలార్' ఒరిజినల్ స్క్రిప్ట్‌లో నా పాత్ర లేదు. అయితే ప్రశాంత్‌గారు లేడీ విలన్ ఉంటే బావుంటుందని యాడ్ చేశారు. 'సలార్' రిలీజ్ తర్వాత ఇండస్ట్రీ నుంచి చాలామంది ఫోన్ చేసి, రాధా రమ పాత్ర బాగుందని అభినందించారు. తొలి భాగం కంటే రెండో భాగంలో ఎక్కువగా కనిపిస్తాను. 'సలార్: పార్ట్ 1 సీజ్ ఫైర్'లో మేం అసలు కథేంటి అనే విషయాన్ని ఎస్టాబ్లిష్ చేయటానికి ప్రయత్నించాం. రెండో భాగం నెక్ట్స్ రేంజ్‌లో ఉంటుంది. ప్రస్తుతం 'సలార్' రెండో భాగం, ఓజీ' సినిమాల్లో నటిస్తున్నాను'' అన్నారు.

ఈ హిట్‌తో ఈ ఏడాదికి వీడ్కోలు

\- కల్యాణ్ రామ్



''నటుడిగా ఇరవై ఏళ్ల ప్రయాణంలో (మొదటి చిత్రం 'తొలి చూపులోనే' - 2003) చాలా సంతోషంగా ఉన్నాను. ఈ వృత్తిలో చాలా నేర్చుకున్నాను.. వేరే వృత్తిలో అయితే ఇంత నేర్చుకోలేకపోయేవాడినేమో? సినిమాల వల్ల ఎంతోమందితో మాట్లాడటం, పని చేయడం వల్ల ఎన్నో విషయాలు తెలుసుకున్నాను. వ్యక్తిగతంగా ఓ మంచి తండ్రిగా, భర్తగా పరిణితి చెందాను'' అని హీరో కల్యాణ్ రామ్ అన్నారు. అభిషేక్ పిక్చర్స్ పై అభిషేక్ నామా స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'డెవిల్'. కల్యాణ్ రామ్ హీరోగా, సంయుక్తా మీనన్, మాళవికా నాయర్ హీరోయిన్లుగా నటించిన ఈ సినిమా ఈ నెల 29న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా కల్యాణ్ రామ్ చెప్పిన విశేషాలు.

● 2021లో 'బింబిసార' షూటింగ్ టైమ్‌లో రచయిత శ్రీకాంత్ విస్సా నాకు 'డెవిల్' కథ చెప్పారు. 1940 బ్యాక్‌డ్రాప్‌తో సాగే ఈ కథలో హీరో క్యారెక్టర్ కొత్తగా అనిపించింది. నన్ను దృష్టిలో పెట్టుకునే కథ రాశారా? అని అడిగాను. ''నేను 'డెవిల్'ని కథగానే రాశాను. అభిషేక్ నామాగారు మీకు చెప్పమన్నారు. మీరు కమర్షియల్ హీరో కదా.. ఇలాంటి కథ ఒప్పుకుంటారా?'' అని శ్రీకాంత్ విస్సా అన్నారు. హీరో క్యారెక్టర్, బ్యాక్‌డ్రాప్ అలాగే ఉంచి, కమర్షియల్ పంథాలో స్క్రిప్ట్‌లో మార్పులు చేయమన్నాను. శ్రీకాంత్ రెండు, మూడు నెలలు సమయం తీసుకుని మార్పులు చేర్పులు చేయడంతో సినిమా ప్రారంభించాం.

● ప్రేక్షకులకు కొత్త తరహా చిత్రాలు అందించేందుకు ప్రయత్నిస్తుంటాను. అయితే ఒక్కోసారి వాణిజ్య అంశాలు మిస్ అవుతుంటాను. నా గత చిత్రం 'అమిగోస్'కి మరికొన్ని కమర్షియల్ ఎలిమెంట్స్ యాడ్ చేయాలనే ఆలోచన నాకు ఆ రోజు రాలేదు. డైరెక్టర్‌తో మాట్లాడి ఆ పని చేసుండాల్సింది.. ఆ తప్పు నాదే. అందువల్ల మిస్‌ఫైర్ అయిందనుకుంటున్నాను. కానీ, 'డెవిల్'లో వాణిజ్య అంశాలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నాను. ఇన్వెస్టిగేటివ్ మూవీలో కమర్షియల్ ఎలిమెంట్స్ మిక్స్ అవడం నాకు కొత్తగా అనిపించింది. సినిమా చూశాక ప్రేక్షకులు కూడా అదే అనుభూతి చెందుతారు. 'డెవిల్' హిట్‌తో 2023కి వీడ్కోలు పలుకుతామనే నమ్మకం ఉంది.

● 'డెవిల్'లో నా క్యారెక్టర్‌లో గ్రే షేడ్స్ ఉండవు. ప్రతి విషయాన్ని వివరంగా చూపిస్తున్నాం. ఈ చిత్రాన్ని అభిషేక్ నామాగారు అద్భుతంగా తీశారు. నా అంచనాలకు మించి సౌందర్ రాజన్ గారు విజువల్స్ ఇచ్చారు. కాస్ట్యూమ్ డిజైనర్ రాజేశ్‌తో 2017 నుంచి వర్క్ చేస్తున్నాను. 'డెవిల్'లో నా పాత్ర కోసం దాదాపు 90 కాస్ట్యూమ్స్‌ని వాడాం. నా పాత్రకి భారతీయతను ఆపాదించే ప్రయత్నం చేశారాయన. 'అర్జున్ రెడ్డి' సినిమాకు హర్షవర్ధన్ రామేశ్వర్ మంచి నేపథ్య సంగీతం అందించారు. 'బింబిసార'కి కీరవాణిగారిలా 'డెవిల్' విషయంలో హర్షవర్ధన్ న్యాయం చేస్తాడా? అనుకున్నాను. అయితే సినిమా చూసిన తర్వాత సంతోషంగా అనిపించింది. 'బింబిసార' హిట్ తర్వాత సంయుక్తా మీనన్‌తో మళ్లీ నటించాను. హీరోకు సమానంగా తన పాత్రకి ప్రాధాన్యత ఉంటుంది. మాళవిక పాత్ర కూడా చక్కగా ఉంటుంది. ప్రతి పాత్రకు ప్రాధాన్యం ఉంటుంది.

● నేను ఒకే సమయంలో రెండు పడవల ప్రయాణం (నటుడు-నిర్మాత) చేయాలనుకోను. నటనకు ఎంత కష్టపడాలో.. నిర్మాణంలో అంతకు మించి కష్టపడాలి. 'ఓం' సినిమా విషయంలో నాకు ఆ విషయం అర్థమైంది. అప్పటి నుంచి మా బ్యానర్‌లో చేసే సినిమాలకు సంబంధించిన సినిమాల కథ మాత్రమే నేను వింటాను. మిగిలిన విషయాలన్నీ మా హరిగారు చూసుకుంటారు.

● 'డెవిల్' సినిమా సీక్వెల్‌కి 50 శాతం స్క్రిప్ట్ వర్క్ పూర్తయింది. 'డెవిల్' కి వచ్చే స్పందన బట్టి సీక్వెల్ చేయాలా? వద్దా అనేది ప్రకటిస్తాం. తమ్ముడి (ఎన్టీఆర్) 'దేవర' సినిమా 85 శాతం షూటింగ్ పూర్తయింది. మేం చేసే సినిమాల ఔట్‌పుట్ గొప్పగా ఉండాలనుకుంటాం.. అందుకే జాగ్రత్తలు తీసుకుని చేస్తాం. నేను, తారక్ 'దేవర' విషయంలో క్లియర్‌గా ఉన్నాం. మేం సంతృప్తి చెందిన వెంటనే సినిమా గురించి అప్‌డేట్ ఇస్తాం. అంతేకానీ అప్‌డేట్ ఇవ్వాలనే ఒత్తిడితో పని చేయలేం కదా?

బోల్డ్ అనడంకంటే బ్యూటిఫుల్ అనాలి


\- మానసా చౌదరి



''బబుల్‌గమ్' సినిమా కథ చాలా రియలిస్టిక్‌గా ఉంటుంది. ప్రేమ, గౌరవం నేపథ్యంలో ఉంటుంది. యువతరానికే కాదు.. కుటుంబ ప్రేక్షకులకూ మా సినిమా నచ్చుతుంది'' అని హీరోయిన్ మానసా చౌదరి అన్నారు. రోషన్ కనకాల, మానసా చౌదరి జంటగా రవికాంత్ పేరేపు దర్శకత్వం వహించిన చిత్రం 'బబుల్‌గమ్'. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 29న విడుదల కానుంది. ఈ సందర్భంగా మానసా చౌదరి మాట్లాడుతూ– ''నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో పుట్టి, చెన్నైలో పెరిగాను. నాన్న వ్యాపారం చేస్తారు. మాకు సినిమా నేపథ్యం లేదు. సినిమాల్లోకి వెళ్తానంటే నా ఫ్యామిలీ సపోర్ట్ చేసింది. చదువు పూర్తయ్యాక మోడలింగ్ ఆరంభించాను. గతంలో 'ఎమోజీ' అనే వెబ్ సిరీస్ చేశాను. హీరోయిన్‌గా 'బబుల్‌గమ్' నా తొలి సినిమా. ఇందులో జాన్వీ పాత్రలో ఫ్యాషన్ డిజైనర్‌గా కనిపిస్తాను. 2023లో 22 ఏళ్ల వయసు ఉన్నవాళ్లు ఎలా ఉంటారో ఈ సినిమా కథ అలాగే ఉంటుంది. ఇందులో ఉండే సన్నివేశాలను బోల్డ్ అనడం కంటే రవికాంత్‌గారు చాలా బ్యూటిఫుల్‌గా చూపించారని చెప్పాలి. ఆయన తీసిన 'క్షణం' సినిమా నా ఫేవరెట్. రోషన్‌కి, నాకు ఇది తొలి సినిమా. ఈ సినిమాతో తను నేర్చుకోవడంతో పాటు నాకు కూడా చాలా విషయాలు నేర్పించాడు. సుమగారు మా సినిమా చూసి, చాలా బాగా చేశావని అన్నారు. నాకు అన్ని జోనర్స్ ఇష్టం. మంచి కథలు, పాత్రలు చేయాలని ఉంది. ప్రస్తుతం తెలుగు, తమిళ్‌లో కొన్ని కథలు చర్చల దశలో ఉన్నాయి'' అన్నారు.

రీల్స్

సముద్రంలో తండేల్



● నాగచైతన్య

నాగచైతన్య, సాయిపల్లవి జంటగా చందు మొండేటి దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'తండేల్'. అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు నిర్మిస్తున్న ఈ సినిమా షూటింగ్ కర్ణాటకలోని ఉడిపిలో ప్రారంభమైంది. ఈ షెడ్యూల్‌లో ముఖ్య సన్నివేశాలతో పాటు యాక్షన్ సీక్వెన్స్‌ను చిత్రీకరించనున్నారు. ప్రస్తుతం సముద్రం మధ్యలో అడ్రినలిన్ పంపింగ్ సీక్వెన్స్‌ను చిత్రీకరిస్తున్నారు. ''వాస్తవ ఘటనల ఆధారంగా రూపొందుతున్న ఈ చిత్రంలో నాగచైతన్య కొత్తగా కనిపిస్తారు. పూర్తిగా భిన్నమైన నేపథ్యంలో సాగే ప్రేమకథ ఇది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీ ప్రసాద్.

ఊహల్లోని ప్రేమ



● నందు, అవికా గోర్

నందు, అవికా గోర్ జంటగా ప్రణవ స్వరూప్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'అగ్లీ స్టోరీ'. బెక్కం వేణుగోపాల్, సీహెచ్ సుభాషిణి, కొండా లక్ష్మణ్ నిర్మించిన ఈ సినిమా నిర్మాణానంతర పనులు జరుగుతున్నాయి. ప్రణవ స్వరూప్ మాట్లాడుతూ– ''ఊహల్లోని ప్రేమ నిజ జీవితంలో ఉండదనే కాన్సెప్ట్‌తో 'అగ్లీ స్టోరీ' రూపొందింది. నన్ను, కథను నమ్మి ఈ సినిమా నిర్మించిన వేణుగోపాల్, సుభాషిణి, లక్ష్మణ్‌గార్లకు థ్యాంక్స్. యువతని ఆకట్టుకునే డైలాగులు ఈ మూవీలో ఉన్నాయి. త్వరలో సినిమాను విడుదల చేయనున్నాం'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: శ్రవణ్ భరద్వాజ్, కెమెరా: శ్రీ సాయికుమార్ దారా, సహనిర్మాతలు: రాజ్, అశ్వనీ శ్రీకృష్ణ.

మల్లిగాడు వస్తున్నాడు



● సుహాస్

థియేటర్స్‌లో అంబాజీపేట మ్యారేజి బ్యాండు మోత మోగనుంది. సుహాస్, శివానీ నాగరం లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం 'అంబాజీపేట మ్యారేజి బ్యాండు'. దుశ్యంత్ కటికినేని దర్శకత్వంలో దర్శకుడు వెంకటేశ్ మహా మహాయన మోషన్ పిక్చర్స్, ధీరజ్ మొగిలినేని ఎంటర్‌టైన్‌మెంట్స్ ఈ సినిమాను నిర్మించాయి. ఇందులో మ్యారేజ్ బ్యాండు లీడర్ మల్లి పాత్రలో సుహాస్ నటించారు. ఫిబ్రవరి 2న ఈ చిత్రం రిలీజ్ కానుంది. ''వైవిధ్యమైన కథాకథనాలతో ఈ చిత్రాన్ని రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: శేఖర్ చంద్ర.

ఓ ప్రేమకథ



● దియా, కిశోర్

కేఎస్‌డీ కిశోర్, దియా సితెపల్లి జంటగా రూపొందిన చిత్రం 'ప్రేమకథ'. శివశక్తి రెడ్డి .డి దర్శకత్వంలో విజయ్ మట్టపల్లి, సుశీల్ వాజపిల్లి, శింగనమల కల్యాణ్ నిర్మించిన ఈ చిత్రం జనవరి 5న విడుదల కానుంది. ''ఇప్పటికే విడుదల చేసిన 'ప్రేమకథ' సినిమా ట్రైలర్, 'ఎవడు మనోడు..' లిరికల్ సాంగ్‌కు మంచి స్పందన లభిస్తోంది. విభిన్నమైన ప్రేమకథతో నేటి తరం ప్రేక్షకులకు నచ్చేలా రూపొందించాం'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: రథన్, సహనిర్మాత: ఉపేందర్ గౌడ్ ఎర్ర.

సాక్షి బిజినెస్
బుధవారం
27-12-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	230	71,337
నిఫ్టీ ▲	92	21,441

విదేశీ సూచీలు (సోమ రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	15,054	▲	61
డోజోన్స్	37,489	▲	103
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,698	▲	3
డాక్స్	16,706	▲	19
షాంఘై	2,890	▼	20
నికాయ్	33,305	▲	53

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	63,057
బంగారం (99.5 స్వచ్ఛత)	62,805
వెండి (కిలో)	74,750

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	82.77	83.79
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	104.49	107.06
€	యూరో	ఒకటి	90.66	93.04
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	57.84	59.17
AUS$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	55.78	57.73
S$	సింగపూర్ డాలర్	ఒకటి	62.02	63.51
SAR	సౌదీ రియాల్	పదింటికి	21.23	22.85
UAE D	యూఏఈ దిర్హామ్	పదింటికి	21.75	23.55
¥	చైనా యువాన్	పదింటికి	10.52	12.60

మెటల్, ఇంధన షేర్లలో కొనుగోళ్లు

- సెన్సెక్స్ లాభం 230 పాయింట్లు
- 21,450 పాయింట్ల చేరువలో నిఫ్టీ
- కొనసాగిన శాంటాక్లాజ్ లాభాలు



ముంబై: మెటల్, ఇంధన, యుటిలిటీ, విద్యుత్ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో స్టాక్ సూచీలు మంగళవారం లాభాలతో ముగిశాయి. సెన్సెక్స్ 230 పాయింట్లు పెరిగి 71,337 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 92 పాయింట్లు బలపడి 21,441 వద్ద నిలిచింది. ఇరు సూచీలకిది మూడోరోజూ లాభాల ముగింపు. వరుస సెలవుల తర్వాత ఉదయం దేశీయ మార్కెట్ ఫ్లాట్‌గా మొదలయ్యాయి. అయితే ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు క్రమంగా లాభాల దిశగా కదిలాయి. ఒక దశలో సెన్సెక్స్ 364 పాయింట్లు పెరిగి 71,471 వద్ద, నిఫ్టీ 128 పాయింట్లు బలపడి 71,471 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని తాకాయి. ఐటీ, టెక్, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు అమ్మకాల ఒత్తిడికి లోనయ్యాయి. బీఎస్‌ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు అరశాతం చొప్పున రాణించాయి. బాక్సింగ్ డే సందర్భంగా యూరప్ మార్కెట్లు పనిచేయలేదు. అమెరికా సూచీలు స్వల్ప లాభాల్లో ట్రేడవుతున్నాయి. విదేశీ ఇన్వెస్టర్లు రూ.1,636 కోట్ల షేర్లను విక్రయించారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.1,464 కోట్ల షేర్లను కొన్నారు. అధిక వెయిటేజీ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ (0.75%), రిలయన్స్ (0.50%), కోటక్ బ్యాంక్ (1.35%) షేర్లు రాణించి సూచీలకు దన్నుగా నిలిచాయి.

మోటిసన్స్ లిస్టింగ్ భళా


మోటిసన్స్ జ్యువెలరీ లిస్టింగ్ రోజునే ఇన్వెస్టర్లకు లాభాలను పంచింది. ఇష్యూ ధర రూ. 55తో పోలిస్తే బీఎస్‌ఈలో ఏకంగా 89 శాతం ప్రీమియంతో రూ. 104 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 98 శాతంపైగా దూసుకెళ్లి గరిష్ఠంగా రూ. 109ను అధిగమించింది. చివరికి 84 శాతం లాభంతో రూ. 101 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 98 శాతం జంప్‌చేసి రూ. 109 వద్ద లిస్టయ్యింది. ఆపై దాదాపు రూ. 110 వద్ద గరిష్టానికి చేరింది. చివరికి 88 శాతంపైగా వృద్ధితో రూ. 104 వద్ద స్థిరపడింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 996 కోట్లుగా నమోదైంది. ఐపీవో ద్వారా కంపెనీ రూ. 151 కోట్లు సమకూర్చుకున్న విషయం విదితమే.

జీఆర్‌టీ జ్యువెలర్స్ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్'

హైదరాబాద్: పండుగ సీజన్‌ను మరింత ఉత్సాహపరిచేందుకు జీఆర్‌టీ జ్యువెలర్స్ 'షాప్ అండ్ విన్ ఫెస్టివల్' ప్రకటించింది. ఇందులో భాగంగా రూ.5000 విలువైన ప్రతి కొనుగోలు పై కస్టమర్లు లక్కీ డ్రా కూపన్ పొందుతారు. దీని ద్వారా మహీంద్రా ఎక్స్‌యూవీ 300 డబ్ల్యూ4(24 విజేతలు), రూ.2 లక్షల డైమండ్ నెక్లెస్ సెట్‌లు(47 విజేతలు), టీవీఎస్ జూపిటర్ 125(47 విజేతలు), 10 గ్రాముల బంగారు నాణేలు(236 విజేతలు), 100 గ్రాముల వెండి నాణేలు(708 విజేతలు) వంటి బహుమతులు గెలుచుకోవచ్చు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, కర్ణాటక జీఆర్‌టీ షోరూంల్లో ఇప్పటికే ప్రారంభమైన ఈ కాంటెస్ట్ జనవరి 31 వరకు ఉంటుంది. అలాగే బంగారు ఆభరణాల వేస్టేజ్ పై 20%, డైమెండ్స్, అన్‌కట్ డైమండ్స్ విలువపై 25% తగ్గింపు, వెండి వస్తువుల వేస్టేజీ 25% తగ్గింపు, వెండి ఆభరణాలపై ఎంఆర్‌పీపై 10% తగ్గింపు వంటి ప్రత్యేక ఆఫర్లు పొందవచ్చని సంస్థ ప్రకటనలో పేర్కొంది.

గ్రీన్ ఎనర్జీపై అదానీ దృష్టి

రూ. 9,350 కోట్ల పెట్టుబడులు



న్యూఢిల్లీ: ప్రయివేట్ రంగ దిగ్గజం అదానీ గ్రూప్ పర్యావరణహిత(గ్రీన్) ఇంధనం(ఎనర్జీ)కి మరింత ప్రాధాన్యత ఇస్తోంది. 2030కల్లా 45 గిగావాట్ల లక్ష్యాన్ని సాధించాలని ఆశిస్తోంది. ఇందుకు అనుగుణంగా అదానీ కుటుంబం రూ. 9,350 కోట్లు ఇన్వెస్ట్ చేసేందుకు సిద్ధపడుతోంది. గ్రూప్ కంపెనీ అదానీ గ్రీన్ ఎనర్జీ లిమిటెడ్(ఏజీఈఎల్) ప్రమోటర్ కుటుంబీకులతోపాటు ఆర్డార్ ఇన్వెస్ట్‌మెంట్, హోల్డింగ్ లిమిటెడ్, అదానీ ప్రాపర్టీస్ ప్రయివేట్ లిమిటెడ్‌కు మొత్తం 6.31 కోట్ల వారంట్లను జారీ చేయనుంది. ఒక్కో వారంట్‌ను రూ. 1,480.75 ధరలో కేటాయించేందుకు కంపెనీ బోర్డు తాజాగా గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. నిధులను రుణ చెల్లింపులు, పెట్టుబడి వ్యయాలకు వినియోగించనున్నట్లు అదానీ గ్రీన్ పేర్కొంది. తాజా పెట్టుబడుల కారణంగా కంపెనీలో ప్రమోటర్ గ్రూప్ సంస్థలకు 3.83 శాతం వాటా లభించనుంది. వచ్చే ఏడాది 1.2 బిలియన్ డాలర్ల విలువైన బాండ్ల గడువు తీరనుంది. ఇప్పటికే వీటి చెల్లింపులు లేదా రీఫైనాన్సింగ్‌కు కంపెనీ ప్రణాళికలు వేసింది. 19.8 గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకి అదానీ గ్రీన్ ఇప్పటికే ఒప్పందాన్ని పీపీఏ కుదుర్చుకుంది.

ప్రమోటర్ పెట్టుబడుల వార్తలతో అదానీ గ్రీన్ షేరు బీఎస్‌ఈలో 4.3 శాతం ఎగసి రూ. 1,600 వద్ద ముగిసింది.

స్కోప్ నుంచి వీసీ ఫండ్



రూ. 373 కోట్ల నిధికి సై

న్యూఢిల్లీ: స్టార్టప్ ఎకోసిస్టమ్‌కు ఇన్వైట్ ఓన్లీ నెట్‌వర్కింగ్ ప్లాట్‌ఫామ్‌గా వ్యవహరించే స్కోప్ వెంచర్ క్యాపిటల్(వీసీ) ఫండ్‌కు తెరతీసింది. 4.5 కోట్ల డాలర్ల(రూ. 373 కోట్లు) నిధితో ఫండ్‌ను ప్రారంభించింది. తద్వారా వేగంగా వృద్ధి చెందుతున్న ఫిన్‌టెక్, గేమింగ్ రంగాలలో నూతన ఆవిష్కరణలకు మద్దతుగా ఆర్థిక మద్దతును సమకూర్చనుంది.

ఇన్నోవా క్యాప్‌టాబ్ ఐపీవో సక్సెస్

చివరి రోజుకల్లా 55 రెట్లు అధిక స్పందన

ఫార్మాస్యూటికల్ కంపెనీ ఇన్నోవా క్యాప్‌టాబ్ పబ్లిక్ ఇష్యూ విజయవంతమైంది. ఇన్వెస్టర్లు క్యూ కట్టడంతో చివరి రోజు మంగళవారానికల్లా(26) 55 రెట్లుపైగా సబ్‌స్క్రయిబ్ అయ్యింది. కంపెనీ 90.78 లక్షల షేర్లను విక్రయానికి ఉంచగా.. 50.16 కోట్లకుపైగా షేర్ల కోసం దరఖాస్తులు వచ్చాయి. అర్హతగల సంస్థాగత కొనుగోలుదారుల(క్విబ్) విభాగంలో 117 రెట్లు, సంస్థాగతేతర ఇన్వెస్టర్ల నుంచి 65 రెట్లు అధికంగా బిడ్స్ దాఖలయ్యాయి. ఈ బాటలో రిటైల్ ఇన్వెస్టర్లు సైతం 17 రెట్లు అధికంగా దరఖాస్తు చేశారు. వెరసి షేరుకి రూ. 426–448 ధరలో చేపట్టిన ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 570 కోట్లు సమకూర్చుకుంది ఈక్విటీ జారీ నిధులలో రూ. 144 కోట్లు రుణ చెల్లింపులకు, రూ. 24 కోట్లు అనుబంధ సంస్థ యూఎంఎల్‌లో పెట్టుబడులకు, మరో రూ. 72 కోట్లు వర్కింగ్ క్యాపిటల్, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది.

సూరజ్ ఎస్టేట్ డీలా..

సూరజ్ ఎస్టేట్ డెవలపర్స్ లిస్టింగ్ రోజు ఇన్వెస్టర్లకు నిరాశను మిగిల్చింది. ఇష్యూ ధర రూ. 360తో పోలిస్తే బీఎస్‌ఈలో 4.5 శాతం తక్కువగా రూ. 344 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 10 శాతంవరకూ పతనమై రూ. 324 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 7 శాతంపైగా నష్టంతో రూ. 334 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 6 శాతం డిస్కౌంట్‌తో రూ. 340 వద్ద లిస్టయ్యింది. తదుపరి 10 శాతం పడిపోయి రూ. 324 వద్ద కనిష్టాన్ని చవిచూసింది. చివరికి 7 శాతం క్షీణతతో రూ. 335 వద్ద స్థిరపడింది.

ముత్తూట్ మైక్రోఫిన్ నేలచూపు

లిస్టింగ్ రోజు 9 శాతం క్షీణత

ఇటీవలే పబ్లిక్ ఇష్యూకి వచ్చిన ముత్తూట్ పాపచన్ గ్రూప్ అనుబంధ సంస్థ ముత్తూట్ మైక్రోఫిన్ లిమిటెడ్ లిస్టింగ్‌లో ఇన్వెస్టర్లను నిరాశ పరచింది. ఇష్యూ ధర రూ. 291తో పోలిస్తే బీఎస్‌ఈలో 4.5 శాతం తక్కువగా రూ. 278 వద్ద ట్రేడింగ్ ప్రారంభమైంది. ఆపై ఒక దశలో 9 శాతంవరకూ పతనమై రూ. 265 వద్ద కనిష్టాన్ని తాకింది. చివరికి 8.5 శాతం నష్టంతో రూ. 266 వద్ద ముగిసింది. ఎన్‌ఎస్‌ఈలోనూ 5.4 శాతం డిస్కౌంట్‌తో రూ. 275 వద్ద లిస్టయ్యింది. చివరికి 8.6 శాతం క్షీణతతో రూ. 266 వద్ద నిలిచింది. దీంతో కంపెనీ మార్కెట్ క్యాపిటలైజేషన్ దాదాపు రూ. 4,539 కోట్లుగా నమోదైంది. 11 రెట్లుపైగా స్పందన లభించిన ఐపీవో ద్వారా కంపెనీ రూ. 960 కోట్లు సమకూర్చుకున్న సంగతి తెలిసిందే. ముత్తూట్ ఫిన్‌కార్ప్ ప్రమోట్ చేసిన కంపెనీ ప్రధానంగా మైక్రోఫైనాన్స్ సర్వీసులు అందిస్తోంది.

బీమా ప్రీమియం చెల్లించేందుకు రుణాలు

- 10 లక్షల మంది లక్ష్యం
- ఫిన్‌టెక్ స్టార్టప్ ఫిన్‌కేస్ ప్రకటన



న్యూఢిల్లీ: ఫిన్‌టెక్ స్టార్టప్ 'ఫిన్‌కేస్' బీమా ప్రీమియం చెల్లింపుల కోసం రుణ సాయాన్ని అందిస్తోంది. 2025 మార్చి నాటికి ఇలా 10 లక్షల మంది హెల్త్ ఇన్సూరెన్స్ కొనుగోలుదారులకు రుణ సాయాన్ని సమకూర్చాలనే లక్ష్యాన్ని పెట్టుకున్నట్టు తెలిపింది. హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను గడువులోపు చెల్లించడం తప్పనిసరి. పైగా హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను నెలవారీ లేదా త్రైమాసిక వాయిదాల్లో చెల్లించే అవకాశం ఉండదు. ఏడాదికి ఒకే ప్రీమియంగా చెల్లించాల్సి ఉంటుంది. అంత ప్రీమియం ఒకేసారి చెల్లించడం చాలా మందికి భారంగా అనిపిస్తుంది. అలాంటి వారికి ఈ సంస్థ రుణ సదుపాయాన్ని అందిస్తోంది. అలాగే, ఆర్థిక ఆస్తులపైనా రుణాలను సమకూరుస్తుంటుంది. ఫిన్‌కేస్ అందించే రుణంతో హెల్త్ ఇన్సూరెన్స్ ప్రీమియంను చెల్లించి.. ఆ తర్వాత నెలవారీ ఈఎంఐ రూపంలో తిరిగి చెల్లిస్తే సరిపోతుంది. డిజిటల్ ఇన్సూరెన్స్‌లో వెటరన్ అయిన అలోక్ భట్నాగర్‌ను ఆపరేషన్స్ హెడ్‌గా నియమించుకుంది. కాగా, దేశంలో 51.4 కోట్ల మంది హెల్త్ ఇన్సూరెన్స్ రక్షణలో ఉన్నట్టు ఫిన్‌కేస్ తెలిపింది. ఇందులో కేవలం 10 కోట్లు మాత్రమే రిటైల్ హెల్త్ పాలసీలని (సొంతంగా తీసుకున్నవి) పేర్కొంది.

జైడస్ హెల్త్‌కేర్‌కు రూ.284 కోట్ల పన్ను డిమాండ్

న్యూఢిల్లీ: జైడస్ లైఫ్ సైన్సెస్ అనుబంధ సంస్థ జైడస్ హెల్త్‌కేర్ లిమిటెడ్‌కు ఆదాయపన్ను శాఖ నుంచి రూ.284.58 కోట్ల మేర నోటీసు జారీ అయింది. ఐటీ చట్టంలోని సెక్షన్ 143(1) కింద జారీ అయిన ఈ డిమాండ్ నోటీసు, 2023–24 అసెస్‌మెంట్ సంవత్సరానికి చెందినదని సంస్థ ఎక్స్ఛేంజీలకు తెలిపింది. రిటర్నుల్లో స్పష్టమైన తప్పుల కారణంగానే ఇది చోటు చేసుకుందని, తప్పొప్పులను సరిదిద్దిన అనంతరం మొత్తం పన్ను డిమాండ్ తొలగిపోతుందని భావిస్తున్నట్టు పేర్కొంది.

పన్ను చెల్లింపుదారులకు ఐటీ శాఖ సూచనలు

కాగా, పన్ను చెల్లింపుదారులు దాఖలు చేసిన రిటర్నుల్లోని సమాచారం, రిపోర్టింగ్ ఎంటిటీల (బ్యాంక్‌లు, ఎన్‌బీఎఫ్‌సీలు, బ్రోకరేజీలు తదితర) నుంచి అందిన సమాచారం మధ్య పోలిక లేని కేసుల్లో.. వారికి సూచనలు పంపినట్టు ఐటీ శాఖ ప్రకటించింది. టీడీఎస్/టీసీఎస్‌కు, దాఖలు చేసిన ఐటీఆర్‌లోని సమాచారం మధ్య వ్యత్యాసం ఉన్న వారికి కూడా సూచనలు పంపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

27-12-2023	
విశాఖ	625–00
చిత్తూరు	633–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	620–00
విజయవాడ	620–00
రిటైల్ ధర (డజను)	72.00
26-12-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	604–00
రిటైల్ ధర	6.65

భవిత

జాబ్ పాయింట్

ఏపీపీఎస్సీలో 99 పాలిటెక్నిక్ లెక్చరర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ).. ఏపీ టెక్నికల్ ఎడ్యుకేషన్ సర్వీస్‌కు సంబంధించి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలల్లో(ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్) లెక్చరర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 99
» **సబ్జెక్టుల వారీగా ఖాళీలు:** ఆర్కిటెక్చరల్ ఇంజనీరింగ్–01, ఆటో మొబైల్ ఇంజనీరింగ్–08, బయో మెడికల్ ఇంజనీరింగ్–02, కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్–12, సిరామిక్ టెక్నాలజీ–01, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–04, కెమిస్ట్రీ–08, సివిల్ ఇంజనీరింగ్–15, కంప్యూటర్ ఇంజనీరింగ్–08, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్–10, ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్–02, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్‌స్ట్రుమెంటేషన్ ఇంజనీరింగ్–01, ఇంగ్లిష్–04, గార్మెంట్ టెక్నాలజీ–01, జియాలజీ–01, మ్యాథమేటిక్స్–04, మెకానికల్ ఇంజనీరింగ్–06, మెటలర్జికల్ ఇంజనీరింగ్–01, మైనింగ్ ఇంజనీరింగ్–04, ఫార్మసీ–03, టెక్స్‌టైల్ టెక్నాలజీ–03.
» **అర్హత:** సంబంధిత బ్రాంచ్‌లో ప్రథమ శ్రేణిలో బీఈ/బీటెక్, బీఫార్మసీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి. కమర్షియల్ అండ్ కంప్యూటర్ ప్రాక్టీస్ విభాగానికి పీజీతోపాటు ఇంగ్లిష్ టైప్‌రైటింగ్ హయ్యర్‌గ్రేడ్, షార్ట్‌హ్యాండ్ హయ్యర్ గ్రేడ్ ఉత్తీర్ణులై ఉండాలి. » **వయసు:** 01.07.2023 నాటికి 18 నుంచి 42 ఏళ్ల మధ్య ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.56,100 నుంచి 98,400.
» **ఎంపిక విధానం:** కంప్యూటర్ ఆధారిత పరీక్ష మెరిట్, మౌఖిక పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 29.01.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.02.2024.
» **రాతపరీక్ష తేది:** ఏప్రిల్/మే 2024.
» **వెబ్‌సైట్:** psc.ap.gov.in

ఏపీ దేవదాయ శాఖలో 70 ఏఈఈ, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎండోమెంట్స్ డిపార్ట్‌మెంట్.. ఒప్పంద ప్రాతిపదికన ఏఈఈ, టెక్నికల్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన హిందూ మతస్థులు మాత్రమే దరఖాస్తుకు అర్హులు.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 70
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(సివిల్)–35, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఎలక్ట్రికల్)–05, టెక్నికల్ అసిస్టెంట్(సివిల్)–30.
» **అర్హత:** టెక్నికల్ అసిస్టెంట్ పోస్టులకు ఎల్‌సీఈ డిప్లొమా, ఏఈఈ పోస్టులకు బీఈ, బీటెక్(సివిల్/ఎలక్ట్రికల్) ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు. ఎస్సీ,ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు ఐదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు ఏఈఈకి రూ.35,000, టీఏకు రూ.25,000తో పాటు అదనపు అలవెన్సు చెల్లిస్తారు.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ, సర్టిఫికేట్ వెరిఫికేషన్, మెడికల్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** వెబ్‌సైట్‌లో సూచించిన దరఖాస్తు నమూనా పూర్తిచేసి, సంబంధిత ధ్రువపత్రాల నకళ్లను ది కన్వీనర్, రిక్రూట్‌మెంట్ సర్వీస్, పవర్ అండ్ ఎనర్జీ డివిజన్ ఇంజనీరింగ్ కాలేజ్ ఆఫ్ ఇండియా, గచ్చిబౌలి, హైదరాబాద్ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.01.2024.
» **వెబ్‌సైట్:** www.escihyd.org

గుంటూరు జీజీహెచ్‌లో 94 పారా మెడికల్ పోస్టులు

గుంటూరులోని హెల్త్ మెడికల్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ ప్రభుత్వాసుపత్రుల్లో కాంట్రాక్ట్/ఔట్ సోర్సింగ్ ప్రాతిపదికన పారా మెడికల్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 94
» **ఖాళీలున్న వైద్య సంస్థలు:** గుంటూరులోని జీఎంసీ, జీజీహెచ్, ప్రిన్సిపల్ కాలేజ్ ఆఫ్ నర్సింగ్.
» **అర్హత:** పోస్టును అనుసరించి ఏడో తరగతి, పదో తరగతి, ఐటీఐ, ఇంటర్, డిప్లొమా, డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. **వయసు:** 42 ఏళ్లు మించకూడదు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ప్రిన్సిపాల్ కార్యాలయం, ప్రభుత్వ వైద్య కళాశాల, గుంటూరు చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 30.12.2023.
» **వెబ్‌సైట్:** guntur.ap.gov.in

సీసీఎంబీ, హైదరాబాద్‌లో 40 టెక్నీషియన్ పోస్టులు

హైదరాబాద్‌లోని సీఎస్ఐఆర్–సెంటర్ ఫర్ సెల్యులార్ అండ్ మాలిక్యులర్ బయాలజీ(సీసీఎంబీ).. టెక్నీషియన్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 40
» **అర్హత:** ఎస్ఎస్‌సీ/పదో తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 28 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు రూ.36,425.
» **ఎంపిక విధానం:** ట్రేడ్ టెస్ట్,రాతపరీక్ష ఆధారంగా
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 20.01.2024.
» **వెబ్‌సైట్:** https://www.ccmb.res.in

పదితోనే నేవీ కొలువు

» మొత్తం 910 పోస్ట్‌లకు నోటిఫికేషన్
» అర్హత: పది, ఐటీఐ, బీఎస్సీ, డిప్లొమా
» ఐఎన్‌సెట్ ద్వారా ఎంపిక ప్రక్రియ
» గ్రూప్-బి, గ్రూప్-సి నాన్ గెజిటెడ్ హోదాలు

ఇండియన్ నేవీ 910 ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. వీటిని సొంతం చేసుకుంటే..గ్రూప్-బి, గ్రూప్-సి నాన్ గెజిటెడ్ హోదాల్లో.. పే లెవల్ 1, 6తో.. ప్రారంభ వేతనం లభిస్తుంది! ఆయా పోస్టులను అనుసరించి పదో తరగతి, ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ అర్హతలుండాలి. నేవీ నిర్వహించే.. ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్ (ఐఎన్‌సీఈటీ)లో ప్రతిభ ఆధారంగా ఎంపిక ప్రక్రియ చేపడతారు. ఈ నేపథ్యంలో.. ఐఎన్‌సీఈటీ ద్వారా భర్తీ చేయనున్న నేవీ ఉద్యోగాలు, అర్హతలు, పరీక్ష విధానం, సిలబస్ అంశాలు, ప్రిపరేషన్ తదితర వివరాలు..

ఇండియన్ నేవీ నిర్వహించే ఐఎన్‌సీఈటీ పరీక్ష ద్వారా.. నేవీకి సంబంధించిన కార్యాలయాల సిబ్బందితోపాటు క్షేత్ర స్థాయిలో విధులు నిర్వర్తించే పోస్ట్‌లను కూడా భర్తీ చేస్తారు. తాజా నోటిఫికేషన్‌లో పోస్ట్‌లను నాన్–మినిస్టీరియల్, ఇండస్ట్రియల్ అనే పేరుతో రెండు కేటగిరీలుగా పేర్కొన్నారు.

మొత్తం 910 పోస్ట్‌లు

నాన్ మినిస్టీరియల్, ఇండస్ట్రియల్ కేటగిరీలలో మొత్తం 910 పోస్ట్‌లు అందుబాటులో ఉన్నాయి. ఇందులో గ్రూప్ బీలో చార్జ్‌మెన్ వర్క్‌షాప్ 22 పోస్టులు, చార్జ్‌మెన్ 20 పోస్టులు, సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ 258 పోస్టులు; అదేవిధంగా గ్రూప్ ట్రేడ్స్‌మెన్ మెట్ 610 పోస్టులు ఉన్నాయి.

విద్యార్హత


ఆయా పోస్ట్‌లను అనుసరించి పదో తరగతి, సంబంధిత విభాగంలో ఐటీఐ, డిప్లొమా, బీఎస్సీ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

వయసు

ఆయా పోస్ట్‌లను అనుసరించి 18–25 ఏళ్లు, 18–27 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు అయిదేళ్లు, ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు చొప్పున గరిష్ఠ వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

గ్రూప్-బి, గ్రూప్-సి కొలువులు

- కొలువులన్నీ గ్రూప్–బి, గ్రూప్–సి నాన్ గెజిటెడ్ హోదాలో ఉంటాయి. ట్రేడ్స్‌మెన్ మెట్ మినహా మిగిలిన పోస్ట్‌లను నాన్ మినిస్టీరియల్ విభాగంలో గ్రూప్–బి నాన్ గెజిటెడ్ పోస్ట్‌లుగా పేర్కొన్నారు. ఈ పోస్ట్‌లకు ప్రారంభ వేతన శ్రేణి రూ.35,400 –రూ.1,12,400 (పే లెవల్–6)గా నిర్ధారించారు.
- ట్రేడ్స్‌మెన్ మెట్ పోస్ట్‌లను గ్రూప్–సి నాన్ గెజిటెడ్ పోస్ట్‌లుగా పేర్కొన్నారు. ఈ పోస్టులకు ప్రారంభ వేతన శ్రేణి రూ.18,000–రూ.56,900 (పే లెవల్–1).



విధులు ఇవే

- **ఛార్జ్‌మెన్(అమ్యూనిషన్ వర్క్‌షాప్, ఫ్యాక్టరీ):** అమ్యూనిషన్ వర్క్‌షాప్‌లో సిబ్బంది పనితీరును పర్యవేక్షించడం, స్టోర్స్, టూల్స్‌కు సంబంధించి నిర్వహణ, వార్షిక తనిఖీలు నిర్వహించడం వంటి విధులు ఉంటాయి.
- **సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్:** తమకు కేటాయించిన విభాగంలో నౌక నమూనా/ప్రణాళిక/ ఎలివేషన్, ఫ్రేమ్ స్ట్రక్చర్ వంటి వాటిని ఆటోక్యాడ్ వినియోగించి రూపొందించడం, అదే విధంగా టెక్నికల్ డేటా సేకరణతోపాటు నౌకల వ్యవస్థలు, అమరికలకు సంబంధించి స్కెమాటిక్/స్కెచ్/ఫ్లో డయాగ్రమ్స్‌లను రూపొందించాల్సి ఉంటుంది.
- **సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్ కార్టోగ్రఫీ:** ఈ విభాగంలో చేరిన వారు మ్యాపింగ్ ప్రక్రియను పూర్తి చేయడం, దీనికి సంబంధించి డాక్యుమెంటేషన్ విధులు నిర్వర్తించడం, శాటిలైట్ చిత్రాలను డౌన్‌లోడ్ చేసి, వాటిని నిక్షిప్తం చేయడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **సీనియర్ డ్రాఫ్ట్స్‌మెన్(ఆర్మమెంట్):** ఈ విభాగంలో నియమితులైన వారు డ్రాయింగ్స్ గీయడానికి అవసరమైన సాంకేతిక డేటాను సేకరించడం, డ్రాయింగ్స్/ స్పెసిఫికేషన్స్‌ను నిరంతరం పర్యవేక్షించడం వంటి విధులు నిర్వర్తించాల్సి ఉంటుంది.
- **ట్రేడ్స్‌మెన్ మెట్:** వర్క్‌షాప్, షిప్స్/సబ్ మెరైన్స్‌లో ప్రొడక్షన్, నిర్వహణ విభాగాల్లో పని చేయాల్సి ఉంటుంది. అదే విధంగా తమకు కేటాయించిన సెక్షన్/యూనిట్ దైనందిన కార్యకలాపాల నిర్వహణ, ఇతర క్లరికల్ విధులు(లెటర్స్, ఫ్యాక్స్ తీసుకోవడం/పంపడం), డిస్పాచ్ సెక్షన్ విధులు వంటివి నిర్వర్తించాల్సి ఉంటుంది.

100 మార్కులకు ఐఎన్‌సెట్

ఇండియన్ నేవీ సివిలియన్ ఎంట్రన్స్ టెస్ట్‌ను నాలుగు విభాగాల్లో 100మార్కులకు నిర్వహిస్తారు. జనరల్ ఇంటెలిజెన్స్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో విభాగం నుంచి 25 ప్రశ్నలు చొప్పున మొత్తం వంద ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున 100 మార్కులకు పరీక్ష నిర్వహిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం గంటన్నర. పరీక్ష పూర్తిగా కంప్యూటర్ బేస్డ్ టెస్ట్‌గా ఉంటుంది.

మెరిట్ జాబితా ఇలా

రాత పరీక్షలో సాధించిన మార్కులు,అందుబాటులో ఉన్న పోస్ట్‌లు, రిజర్వేషన్ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని.. మెరిట్ జాబితా రూపొందిస్తారు. ఈ జాబితాలో నిలిచిన వారికి తదుపరి దశలో డాక్యుమెంట్ వెరిఫికేషన్ పేరిట సర్టిఫికెట్లను పరిశీలిస్తారు.అదే సమయంలో వైద్య పరీక్షలు కూడా నిర్వహిస్తారు. నేవీ ప్రమాణాలకు సరితూగేలా ఉన్న వారికి నియామకాలు ఖరారు చేస్తారు.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** డిసెంబర్ 31, 2023
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://incet.cbtexam.in/login/user

పరీక్షలో రాణించేలా

ఇండియన్ నేవీలో కీలక పోస్ట్‌ల భర్తీకి నిర్వహించే ఐఎన్‌సీఈటీలో మంచి మార్కులు సాధించేందుకు విభాగాల వారీగా దృష్టి పెట్టాల్సిన అంశాలు..

జనరల్ ఇంటెలిజెన్స్

వెర్బల్, నాన్ వెర్బల్ రీజనింగ్ నుంచి ప్రశ్నలు అడిగే విభాగం ఇది. ఇందులో రాణించాలంటే.. సిరీస్(నంబర్/ఆల్ఫా న్యుమరిక్) విభాగం, అనాలజీస్, ఆడ్ మెన్ ఔట్, సిలాజిజమ్, మ్యాట్రిక్స్, డైరెక్షన్, వర్డ్ ఫార్మేషన్, బ్లడ్ రిలేషన్స్, నాన్ వెర్బల్ (వాటర్ ఇమేజ్, మిర్రర్ ఇమేజ్), కోడింగ్–డీకోడింగ్ అంశాలపై పట్టు సాధించాలి.

జనరల్ అవేర్‌నెస్

జనరల్ అవేర్‌నెస్‌లో జాతీయ, అంతర్జాతీయ సమకాలీన అంశాలు మొదలు జనరల్ సైన్స్, ఎకానమిక్స్, హిస్టరీ, జాగ్రఫీ, పాలిటీ విభాగాలపై దృష్టి పెట్టాలి. హిస్టరీకి సంబంధించి ఆధునిక భారత దేశ చరిత్ర, స్వాతంత్ర్యోద్యమ ఘట్టాలపై ప్రత్యేక దృష్టితో చదవాలి. జాగ్రఫీలో సహజ వనరులు, నదులు, పర్వతాలు వంటి వాటి గురించి తెలుసుకోవాలి. ఎకనామిక్స్‌కు సంబంధించి ఇటీవల కాలంలో ఆర్థిక వాణిజ్య రంగాల్లో ఏర్పడిన కీలక పరిణామాలపై దృష్టి పెట్టాలి. అంతేకాకుండా ఆయా విభాగాలకు సంబంధించి ముఖ్యమైన పద జాలంపైనా పట్టు సాధించడం ఎంతో మేలు చేస్తుంది. కరెంట్ అఫైర్స్‌ను కూడా కీలకంగా భావించాలి. ముఖ్యంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకున్న సమకాలీన అంశాలను చదవాలి. స్టాక్ జీకే కోసం చరిత్రలో ముఖ్యమైన వ్యక్తులు, తేదీలు, సదస్సులు, సమావేశాలు వాటి తీర్మానాలు, అవార్డులు–విజేతలు వంటి సమాచారాన్ని ఔపోసన పట్టాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో అర్థగణిత అంశాలైన సింపుల్ ఇంట్రెస్ట్, కంపౌండ్ ఇంట్రెస్ట్, లాభ నష్టాలు, శాతాలపై ప్రశ్నలు ప్రాక్టీస్ చేయాలి. అదే విధంగా త్రికోణమితి, ఆల్జీబ్రా, జామెట్రీ, డేటా ఇంటర్‌ప్రిటేషన్, టైం అండ్ వర్క్, టైం అండ్ డిస్టెన్స్‌లకు సంబంధించిన ప్రశ్నలను కూడా సాధన చేయాలి.

ఇంగ్లిష్ లాంగ్వేజ్

ఈ విభాగంలో రాణించాలంటే.. బేసిక్ గ్రామర్ పై పట్టు సాధించాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, ఇడియమ్స్ అండ్ ఫ్రేజెస్, సెంటెన్స్ ఇంప్రూవ్‌మెంట్,యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్, స్పెల్లింగ్స్, స్పాటింగ్ ద ఎర్రర్స్ వంటి అంశాలపై పట్టు సాధించాలి.

క్లుప్తంగా...

తీరంలో గంగమ్మకు ప్రత్యేక పూజలు



క్షీరాభిషేకం చేస్తున్న కేంద్ర, రాష్ట్ర మంత్రులు పరుషోత్తం రూపాలా, సీదిరి అప్పలరాజు

ఎంవీపీకాలనీ(విశాఖ తూర్పు): సునామీ వచ్చి మంగళవారం నాటికి 19 ఏళ్ల పూర్తయ్యాయి..మరోసారి అలాంటి విపత్తు రాకుండా కరుణించాలని కోరుతూ మత్స్యకారులు గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెదజాలరిపేట తీరంలో జరిగిన ఈ కార్యక్రమానికి కేంద్ర మత్స్యశాఖ మంత్రి పరుషోత్తం రూపాలా, రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు హాజరయ్యారు. మహిళలు కలశాలతో ఊరేగింపుగా తీరానికి చేరుకున్నారు. తీరంలోని గంగమ్మదేవి ఆలయంలో పూజలు జరిపారు. అనంతరం సముద్రుడికి క్షీరాభిషేకం చేశారు. తమను చల్లగా చూడాలని ప్రార్థించారు.

5న టెక్నికల్ అసిస్టెంట్ల సర్టిఫికెట్ల పరిశీలన

సాక్షి, అమరావతి: ఏపీ గ్రౌండ్ వాటర్ సర్వీస్‌లో టెక్నికల్ అసిస్టెంట్ (జియో ఫిజిక్స్) పోస్టుల ఫలితాలను వెబ్‌సైట్‌లో ఉంచినట్టు ఏపీపీఎస్సీ ఓ ప్రకటనలో తెలిపింది. వచ్చే నెల 5వ తేదీన అభ్యర్థుల ఒరిజినల్ ధ్రువపత్రాల పరిశీలన ఉంటుందని, వారంతా విజయవాడలోని సర్వీస్ కమిషన్ కార్యాలయంలో హాజరు కావాలని పేర్కొంది.

‘మహిళా టీచర్స్ డేను పునరుద్ధరించండి’

సాక్షి, అమరావతి: చదువుల తల్లి సావిత్రి బాయి పూలే జయంతిని పురస్కరించుకుని ఏటా జనవరి 3న మహిళా టీచర్స్ డేగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించి, ఉపాధ్యాయినులను సత్కరించడం ఆనవాయితీగా వస్తోందని బహుజన్ టీచర్స్ అసోసియేషన్(బీటీఏ) ఓ ప్రకటనలో పేర్కొంది. కోవిడ్ కారణంగా నిలిపివేసిన మహిళా టీచర్ల సత్కారం తిరిగి పునరుద్ధరించాలని పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శిని కోరినట్టు బీటీఏ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మనోజ్ కుమార్, రమేష్ తెలిపారు. వచ్చే బుధవారం మహిళా టీచర్స్ డేను అన్ని జిల్లాల్లోను నిర్వహించాలని కోరినట్టు వారు పేర్కొన్నారు.

ఏసీబీకి చిక్కిన విద్యుత్ శాఖ ఏఈ



ఏసీబీకి పట్టుబడిన ఏఈ సురేష్‌కుమార్

విశాఖ సిటీ: విద్యుత్ మీటర్ల మంజూరుకు లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖ సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్‌ను అవినీతి నిరోధక శాఖ అధికారులు మంగళవారం వలపన్ని పట్టుకున్నారు. వివరాల్లోకి వెళితే.. అక్కయ్యపాలెం ప్రాంతానికి చెందిన నరవ సూర్యప్రకాష్, అతని ముగ్గురు సోదరులకు సంబంధించిన నాలుగు ఫ్లాట్లకు విద్యుత్ మీటర్ల జారీకోసం దరఖాస్తు చేసుకున్నారు. అయితే ఏపీఈపీడీసీఎల్ దొండపర్తి సెక్షన్ అసిస్టెంట్ ఇంజనీర్ బి.సురేష్‌కుమార్ ఇందుకోసం రూ.80 వేలు లంచం డిమాండ్ చేశాడు. దీంతో సూర్యప్రకాష్ ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. మంగళవారం డీఆర్ఎం ఆఫీస్ ప్రవేశ ద్వారం వద్ద బాధితుడి నుంచి రూ.60 వేలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిని అవినీతి నిరోధక శాఖ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నారు.

ఆ సెక్షన్లను రద్దు చేయండి

హైకోర్టులో భూ యాజమాన్య హక్కు చట్టంపై పిల్

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ భూ యాజమాన్య హక్కుల చట్టంలోని కొన్ని సెక్షన్లను రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. పౌరుల ఆస్తి హక్కుకు భంగం కలిగించేలా ఆ సెక్షన్లు ఉన్నాయని, వీటివల్ల వివాదాలు మరింత పెరిగే ప్రమాదం ఉందని కర్నూలు జిల్లా కోర్టు న్యాయవాదుల సంఘం ప్రధాన కార్యదర్శి ఏవీ చక్రపాణి ఈ వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. ఇందులో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, న్యాయ శాఖ కార్యదర్శిని ప్రతివాదులుగా పేర్కొన్నారు. ఈ వ్యాజ్యంపై హైకోర్టు వచ్చే వారం విచారణ జరపనుంది. రాజ్యాంగంలోని పలు అధికరణలకు, వారసత్వ చట్ట నిబంధనలకు విరుద్ధంగా భూ యాజమాన్య హక్కుల చట్ట నిబంధనలున్నాయని పిటిషనర్ తన వ్యాజ్యంలో పేర్కొన్నారు. ప్రస్తుతం ఆస్తి వివాదాలను సివిల్ కోర్టులు విచారిస్తున్నాయని, తాజా చట్టం వల్ల ఇకపై ఆస్తి వివాదాలను రెవెన్యూ అధికారులే తేలుస్తారని అభ్యంతరం వ్యక్తం చేశారు. ఇది కోర్టులకున్న అధికారాలను లాగేసుకోవడమే అవుతుందన్నారు. అందువల్ల ఈ వ్యవహారంలో జోక్యం చేసుకుని, చట్ట విరుద్ధంగా ఉన్న సెక్షన్లను రద్దు చేయాలని హైకోర్టును అభ్యర్థించారు.

స్మార్ట్ మీటర్లతో విద్యుత్ నష్టాలకు చెక్

కేంద్ర విద్యుత్ శాఖ వెల్లడి

- వ్యవసాయానికి స్మార్ట్.. గృహాలకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు
- స్మార్ట్ మీటర్లతో ఆటోమెటిక్ ఎనర్జీ అకౌంటింగ్ ఆడిటింగ్
- విద్యుత్ సరఫరా వ్యయం గణనీయంగా తగ్గే అవకాశం
- సరఫరా, నిర్వహణ, ఆపరేషన్ బాధ్యత సర్వీస్ ప్రొవైడర్లదే..
- ‘ఆర్డీఎస్ఎస్’ ద్వారా మీటరుకు రూ.1,350 వరకు గ్రాంట్
- ఈ పథకానికి ఎంపికైన రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థలు





సాక్షి, అమరావతి: స్మార్ట్ మీటర్ల వల్ల విద్యుత్ నష్టాలను అరికట్టవచ్చని.. సరఫరా వ్యయాన్ని తగ్గించవచ్చని కేంద్ర విద్యుత్ శాఖ తాజాగా వెల్లడించింది. ఈ మీటర్లను పెట్టడం వల్ల ఎనర్జీ ఆడిటింగ్, అకౌంటింగ్‌కు అవకాశం ఉంటుందని తెలిపింది. అందుకే వ్యవసాయ, వాణిజ్య, గృహ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని రాష్ట్రాలకు సూచించినట్లు కేంద్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

2025 మార్చి నాటికి దేశమంతటా..

కేంద్ర విద్యుత్ శాఖ ప్రతిపాదిత పంపిణీ వ్యవస్థ పునరుద్ధీకరణ పథకం(ఆర్డీఎస్ఎస్)లో భాగంగా విద్యుత్ స్మార్ట్‌మీటర్ల బిగింపు ప్రక్రియ దేశంలోని అనేక రాష్ట్రాలతో పాటు ఏపీలోనూ జరుగుతోంది. ఇప్పుడు ఉన్న దాదాపు 1.80 కోట్ల మంది (వ్యవసాయేతర) వినియోగదారులలో నెలకు 200 యూనిట్ల వరకు వినియోగించేవారిని మినహాయించి మిగిలిన వారికి స్మార్ట్ మీటర్లు బిగించాలని డిస్కంలు ప్రతిపాదించాయి. అలాగే ‘ఆర్డీఎస్ఎస్’లో భాగంగా 2025 మార్చి నాటికి దేశమంతటా అన్ని రాష్ట్రాలూ స్మార్ట్ విద్యుత్ మీటర్లు పెట్టాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు 2019లోనే సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ ఒక రెగ్యులేషన్ ఇచ్చింది. దాని ప్రకారం ఏపీలో 18.56 లక్షల వ్యవసాయ సర్వీసులకు స్మార్ట్ మీటర్లు అమర్చాలని ప్రభుత్వం 2020వ సంవత్సరంలో ఆదేశాలిచ్చింది. ఇప్పటికే దేశవ్యాప్తంగా తొమ్మిది రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో స్మార్ట్ మీటర్ల ప్రక్రియ 50 శాతం నుంచి 100 శాతం వరకు పూర్తయ్యింది. అయితే స్మార్ట్ మీటర్లపై అనేక అపోహలు, విమర్శలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో కేంద్రం తాజాగా వివరణ ఇచ్చింది.

రైతులపై పైసా కూడా భారం పడదు..

ప్రస్తుతం రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి ఇచ్చే విద్యుత్‌ను కచ్చితత్వంతో లెక్కించలేకపోవడం వల్ల ఇంధన ఆడిట్ కష్టమవుతోంది. వ్యవసాయ రంగంలో ఉచిత విద్యుత్ పథకం ద్వారా ఎంత వినియోగం జరుగుతుందో తెలుసుకోవడానికి, లబ్ధిదారులకు నగదు బదిలీ కింద ప్రతి నెలా సబ్సిడీ రూపంలో ఎంత మొత్తం చెల్లించాలనే సమాచారం కోసం.. వ్యవసాయ కనెక్షన్లకు బిగించే స్మార్ట్ మీటర్లు ఉపయోగపడతాయి. అలాగే విద్యుత్ ప్రమాదాల నుంచి రైతులను రక్షించేందుకు అలైడ్ మెటీరియల్‌ను ఉచితంగా అందిస్తారు. ఈ ఖర్చు మొత్తం రాష్ట్ర ప్రభుత్వమే భరిస్తుంది. వినియోగదారులపై గానీ, విద్యుత్ సంస్థలపై గానీ ఒక్క పైసా కూడా భారం పడదు. ‘ఆర్డీఎస్ఎస్’కు ఏపీ డిస్కంలు ఎంపికైనట్టు కేంద్రం ప్రకటించింది. తద్వారా మీటరుకు రూ.1,350 వరకు గ్రాంట్ పొందే అవకాశం ఏర్పడింది. స్మార్ట్ మీటర్ల సరఫరా, నిర్వహణ, ఆపరేషన్ బాధ్యత మొత్తం సర్వీస్ ప్రొవైడర్లదేనని కేంద్రం వివరించింది.

స్మార్ట్‌మీటర్లతో ఉపయోగాలు..

మన రాష్ట్రంలో ప్రభుత్వ కార్యాలయాలు, వాణిజ్య భవనాలు, పరిశ్రమలతో పాటు విద్యుత్ పంపిణీ ట్రాన్స్‌ఫార్మర్లకు, 11కేవీ ఫీడర్లకు అన్నింటికీ కలిపి 42 లక్షల స్మార్ట్ మీటర్లను బిగించేందుకు డిస్కంలు చర్యలు చేపట్టాయి. గృహాలకు స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్లు పెట్టడం వల్ల సమయానుసార(టైం ఆఫ్ డే) టారిఫ్ విధానంలో పాల్గొనే అవకాశం వస్తుంది. విద్యుత్ కొనుగోలు ధరలు తక్కువగా ఉండే సమయంలో వారి వినియోగాన్ని పెంచుకుని టారిఫ్ లాభం పొందే అవకాశం ఉంది. అలాగే బిల్లును ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చు. ఆ బిల్లు మొత్తాన్ని ఒకేసారి కాకుండా అవసరాలకు అనుగుణంగా చెల్లించవచ్చు. విద్యుత్ సరఫరా చేసే సమయం, విద్యుత్ నాణ్యత తెలుసుకోవచ్చు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టవచ్చు. ఈ మీటర్ల పెట్టుబడిలో దాదాపు 40 శాతం వరకు రాయితీ లభిస్తుంది.

రైతులకు అభ్యంతరం లేదు



స్మార్ట్ మీటర్లు పెట్టడం వల్ల వ్యవసాయ బోరు పనితీరు మెరుగుపడుతుంది. మోటార్ కాలిపోకుండా ఉంటుంది. ఇప్పటికంటే మెరుగైన విద్యుత్ వస్తుందని విద్యుత్ శాఖ సిబ్బంది మాకు వివరించారు. దీంతో మీటర్ పెట్టడానికి మా లాంటి రైతులందరూ ముందుకు వస్తున్నారు. మీటర్‌తో పాటు రక్షణ పరికరాలు అందించడం బాగుంది. మాకు 8 బోర్లు ఉన్నాయి. స్మార్ట్ మీటర్ వల్ల ఏ సర్వీసునూ తొలగించలేదు.

– బొల్లారెడ్డి రామకృష్ణారెడ్డి, రైతు, వీరంపాలెం, పశ్చిమగోదావరి జిల్లా

ఎన్నికల నిర్వహణకు సిద్ధం

డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి



పల్నాడు ఎస్పీ కార్యాలయంలో మాట్లాడుతున్న డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి

సాక్షి, నరసరావుపేట: సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు పోలీసుశాఖ సిద్ధంగా ఉందని డీజీపీ కె.వి.రాజేంద్రనాథ్‌రెడ్డి చెప్పారు. సాధారణ తనిఖీల్లో భాగంగా ఆయన మంగళవారం రాత్రి పల్నాడు జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసులు సమర్థంగా పనిచేయటం వలన నేరాలు గణనీయంగా తగ్గాయన్నారు. ప్రభుత్వం నుంచి పూర్తిసహకారం లభించటం, పోలీసింగ్‌లో వినూత్న ఒరవడిని సృష్టించటం వల్లనే ఇది సాధ్యమైందన్నారు. పల్నాడు జిల్లాలో ఈ ఏడాది నేరాలు బాగా తగ్గాయని, జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొందని చెప్పారు. ఫ్యాక్షన్, రాజకీయ హత్యలు లేవని, వ్యక్తిగత కక్షలతోనే హత్యలు జరుగుతున్నాయని తెలిపారు. రాజకీయ కక్షలతో కేసులు బనాయించటం లేదన్నారు. రాజకీయ లబ్ధికోసమే కొంతమంది అసత్య ప్రచారం చేస్తున్నారని ఆయన పేర్కొన్నారు. ఆయన వెంట గుంటూరు రేంజ్ ఐజీ పాలరాజు, పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి ఉన్నారు.

14 ఫిషింగ్ హార్బర్ల ఆధునికీకరణ

- ఏపీ, గుజరాత్, తమిళనాడులో రూ.1,970 కోట్లతో పనులు నిర్వహణ
- కేంద్ర మత్స్య శాఖ మంత్రి పరుషోత్తం రూపాల వెల్లడి



మాట్లాడుతున్న పరుషోత్తం రూపాల, చిత్రంలో ఆడారి అనంద్‌కుమార్

మహారాణిపేట (విశాఖ దక్షిణ)/సాక్షి, విశాఖపట్నం / : దేశంలోని 3 రాష్ట్రాల్లో 14 ఫిషింగ్ హార్బర్ల ఆధునికీకరణ, పలు సదుపాయాల కల్పన కోసం కృషి చేస్తున్నట్లు కేంద్ర మత్స్య శాఖ మంత్రి పరుషోత్తం రూపాల చెప్పారు. మంగళవారం విశాఖలోని హోటల్ గ్రీన్ పార్కులో నేషనల్ ఫిషరీస్ డెవలప్‌మెంట్ బోర్డు (ఎన్ఎఫ్ఎబీ) 10వ వార్షిక సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ..ఏపీ, గుజరాత్, తమిళనాడు రాష్ట్రాల్లో రూ.1,970 కోట్లతో ఆధునికీకరణ పనులు వేగంగా జరుగుతున్నట్లు చెప్పారు. ఈ నిధులను ఫిషరీస్,ఆక్వా కల్చర్ మౌలిక సదుపాయాల డెవలప్‌మెంట్ ఫండ్ కింద ఖర్చు చేస్తున్నట్లు తెలిపారు. ఆక్వా రంగానికి బీమా కేటాయింపు పెంచాలని, సంప్రదాయక బోట్ల స్థానంలో మెకనైజ్డ్ బోట్ల మంజూరుకు మత్స్యకారులు ఒత్తిడి తెస్తున్నట్లు ఏపీ ప్రభుత్వం కేంద్రానికి నివేదిక అందించిందని చెప్పారు. నిధులు మంజూరు విషయంలో కేంద్రం సిద్ధంగానే ఉందన్నారు. ఇటీవల విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో జరిగిన బోట్ల దగ్ధం విషయంలో ప్రభుత్వం చొరవ చూపించిందని రాష్ట్ర మత్స్య శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు తెలిపారు. గతంలో మరెన్నడూ లేని విధంగా మత్స్యకారుల సంక్షేమం నిమిత్తం భారీ పరిహారం అందజేసినట్లు చెప్పారు.

క్యాన్సర్ విభాగానికి శంకుస్థాపన..

విశాఖ షీలానగర్‌లో విశాఖ డైరీ ట్రస్ట్ ఆసుపత్రిలో క్యాన్సర్ విభాగానికి పరుషోత్తం రూపాల శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. డెయిరీ రంగంలో పాడి రైతులకు వినూత్న సేవలందిస్తూ అగ్రగామి జాబితాలో విశాఖ డెయిరీ నిలిచిందని కొనియాడారు. విశాఖ డెయిరీలో ఆడారి తులసీరావు విగ్రహాన్ని మంత్రి గుడివాడ అమర్‌నాథ్, ఎంపీలు సత్యవతి, జీవీఎల్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైఎస్సార్‌సీపీ పశ్చిమ నియోజకవర్గ సమన్వయకర్త, డెయిరీ చైర్మన్ ఆడారి ఆనంద్‌కుమార్‌లతో కలిసి ఆవిష్కరించారు. డెయిరీలో ఉత్పత్తి యూనిట్లను పరిశీలించారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై జాతీయ సదస్సు

పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ సూర్యకుమారి



మాట్లాడుతున్న సూర్యకుమారి

తిరుపతి అర్బన్: సుస్థిర అభివృద్ధి లక్ష్యాలపై తిరుపతిలో జరిగే జాతీయ సదస్సును విజయవంతం చేయాలని పంచాయతీరాజ్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్ రాష్ట్ర కమిషనర్ సూర్యకుమారి ఆదేశించారు. మంగళవారం ఆమె కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డితో కలసి అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల జాతీయ సదస్సు జనవరి 18 నుంచి 20వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఏపీ ప్రభుత్వం అనేక కార్యక్రమాలను సుస్థిర అభివృద్ధి లకోష్యల దిశగా అమలు చేస్తుందని వెల్లడించారు. అందుకు తగ్గట్లు ఇతర రాష్ట్రాల వారికి తెలియజేసేలా క్షేత్రస్థాయి ఏర్పాట్లు ఉండాలని చెప్పారు. కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి మాట్లాడుతూ జాతీయ స్థాయి సదస్సు నిర్వహణకు అన్ని రాష్ట్రాల నుంచి 1,000 మందికి పైగా ప్రతినిధులు రానున్నారని తెలిపారు. కేంద్ర, రాష్ట్ర మంత్రులు హాజరు కానున్నారని వెల్లడించారు. లైజన్ ఆఫీసర్ల నియామకం చేపట్టాలని డీఆర్వో పెంచల కిషోర్‌కు సూచించారు. సుస్థిర అభివృద్ధికి సంబంధించి భాగస్వామ్య శాఖలు అయిన ఆరోగ్యశాఖ, ఐసీడీఎస్, విద్యాశాఖ, పంచాయతీరాజ్, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, డీఆర్‌డీఏ శాఖలు తమ ప్రగతిని చూపే విధంగా స్టాల్స్ ఏర్పాటు, క్షేత్రస్థాయి పరిశీలనకు సహకరించాలని చెప్పారు.

రైతు శాస్త్రవేత్త విజయకుమార్‌కు ‘సృష్టి సమ్మాన్’

- చిరుధాన్యాల సాగు వ్యాప్తికి విశేష కృషి చేస్తున్నందుకు గుర్తింపు
- ‘సాత్విక్ సంప్రదాయ ఆహారోత్సవం-2023’లో పురస్కారం ప్రదానం

సాక్షి సాగుబడి, హైదరాబాద్: చిరుధాన్య పంటల జీవ వైవిధ్యానికి విశేష కృషి చేస్తున్న వైఎస్సార్ జిల్లాకు చెందిన ప్రముఖ సేంద్రియ రైతు శాస్త్రవేత్త కొమ్మూరి విజయకుమార్ (60)ను ప్రతిష్టాత్మక ‘సృష్టి సమ్మాన్’ పురస్కారం వరించింది. అహ్మదాబాద్‌లోని భగవత్ విద్యాపీఠ్‌లో జరుగుతున్న ‘సాత్విక్ సంప్రదాయ ఆహారోత్సవం-2023’లో భాగంగా సోమవారం గుజరాత్ మాజీ ప్రధాన కార్యదర్శి పి.కె. లహరి, ఐఐఎం అహ్మదాబాద్ డైరెక్టర్ భరత్ భాస్కర్, అహ్మదాబాద్ ఐఐఎం మాజీ ప్రొఫెసర్ అనిల్ కె. గుప్తా చేతుల మీదుగా విజయకుమార్ జీవవైవిధ్యం విభాగంలో ఈ పురస్కారాన్ని అందుకున్నారు. ప్రొ.అనిల్ కె గుప్తా నెలకొల్పిన సొసైటీ ఫర్ రీసెర్చ్ అండ్ ఇనీషియేటివ్స్ ఫర్ సస్టయినబుల్ టెక్నాలజీస్ అండ్ ఇన్‌స్టిట్యూషన్స్ (సృష్టి) సంస్థ 1995 నుంచి ఏటా గ్రామీణ రైతు శాస్త్రవేత్తలు, జీవవైవిధ్యం, పర్యావరణ పరిరక్షణకు విశేష కృషి చేస్తున్న వ్యక్తులు, సంస్థలకు జాతీయ స్థాయిలో సృష్టి సమ్మాన్ పురస్కారాలు ప్రదానం చేస్తోంది.

సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగుకు కృషి...

వైఎస్సార్ కడప జిల్లాలోని ఈవీ పల్లె గ్రామంలో పుట్టిన కొమ్మూరి విజయకుమార్ వర్షాధార భూముల్లో సేంద్రియ పద్ధతుల్లో చిరుధాన్యాల సాగును పునరుద్ధరణకు కృషి చేస్తున్నారు. చిరుధాన్యాల విత్తనాలను ఇతర రాష్ట్రాలకు చెందిన వేలాది మంది రైతులకు ఉచితంగా పంపిణీ చేయడం ద్వారా తిరిగి చిరుధాన్యాల సంప్రదాయ సేంద్రియ సాగు వ్యాప్తికి కృషి చేశారు. స్థానికంగా లభించే అనేక మొక్కల వినూత్న కషాయాలను రూపొందించి రైతులకు అందిస్తూ సేంద్రియ వ్యవసాయంలో పంటలను ఆశించే చీడపీడల నియంత్రణకు విజయకుమార్ కృషి చేస్తున్నారు. ఆయన కృషిపై గత దశాబ్దకాలంగా అనేక కథనాలను ‘సాక్షి సాగుబడి’ అందించింది.

ప్రమాదాలకు బ్లాక్‘స్పాట్’



- హైవేలపై బ్లాక్ స్పాట్ ప్రాంతాల్లో అత్యధికంగా ప్రమాదాలు
- దేశంలో ఐదేళ్లలో 39,944 ప్రమాదాలు.. 18,476 మంది దుర్మరణం
- నివేదికలో వెల్లడించిన ఎన్‌హెచ్ఏఐ

సాక్షి, అమరావతి: వాహనాల్లో హైవేలపై రివ్వున దూసుకుపోవడం సరదాగానే ఉంటుంది కానీ, అదే హైవేలపై బ్లాక్‌స్పాట్లు (ప్రమాదకర ప్రదేశాలు) యమపాశాలుగా మారుతున్నాయి. దేశంలో అత్యధిక రోడ్డు ప్రమాదాలు హైవే బ్లాక్ స్పాట్ల వద్ద సంభవిస్తున్నాయి. దేశంలో హైవేలపై ఐదేళ్లలో బ్లాక్ స్పాట్ల వద్ద ఏకంగా 39,944 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఆ ప్రమాదాల్లో 18,476 మంది దుర్మరణం చెందారు. ప్రస్తుతం దేశంలో 5,803 బ్లాక్ స్పాట్లు ఉన్నాయని జాతీయ రహదారుల అభివృద్ధి సంస్థ (ఎన్‌హెచ్ఏఐ) నివేదికలో వెల్లడించింది. బ్లాక్ స్పాట్లను సరిచేయడానికి ప్రాధాన్యమిస్తున్నామని పేర్కొంది.

బ్లాక్ స్పాట్లను సరిదిద్దేందుకు ప్రాధాన్యం

జాతీయ రహదారులపై బ్లాక్‌స్పాట్ల ప్రమాదాలను నివారించేందుకు ఎన్‌హెచ్ఏఐ కార్యాచరణను వేగవంతం చేసింది. గుర్తించిన బ్లాక్ స్పాట్లను శాస్త్రీయంగా విశ్లేషించి తగిన చర్యలు చేపడుతోంది. అందుకోసం పోలీసులు, రవాణా శాఖల సమన్వయంతో జిల్లాస్థాయి కమిటీలను ఏర్పాటు చేసింది. బ్లాక్‌స్పాట్లుగా గుర్తించిన ప్రదేశాల్లో జాతీయ రహదారుల విస్తరణ, రోడ్లకు మరమ్మతులు, ప్రమాదకర మలుపుల సమీపంలో చెట్ల తొలగింపు, సైన్‌బోర్డుల ఏర్పాటు తదితర చర్యలు వేగవంతం చేస్తోంది. ఆ ప్రమాదాల్లో హైవే పెట్రోలింగ్‌ను కూడా పెంచింది. గత ఐదేళ్లలో దేశంలో మొత్తం 3,972 బ్లాక్ స్పాట్లను సరిచేశారు.

మొదటి స్థానంలో తమిళనాడు

బ్లాక్ స్పాట్లు, రోడ్డు ప్రమాదాలు, మృతుల సంఖ్యలో తమిళనాడు మొదటిస్థానంలో ఉంది. ఆ రాష్ట్రంలో అత్యధికంగా ఉన్న 748 బ్లాక్ స్పాట్ల వద్ద 6,230 రోడ్డు ప్రమాదాలు సంభవించాయి. ఆ ప్రమాదాల్లో 2,144 మంది దుర్మరణం చెందారు. 701 బ్లాక్ స్పాట్లతో రెండోస్థానంలో ఉన్న పశ్చిమ బెంగాల్లో 3,572 రోడ్డు ప్రమాదాల్లో 1,990 మంది ప్రాణాలు కోల్పోయారు. 551 బ్లాక్ స్పాట్లతో మూడోస్థానంలో ఉన్న కర్ణాటకలో 4,110 రోడ్డు ప్రమాదాలు సంభవించగా 1,694 మంది మృతి చెందారు. ఆ జాబితాలో తెలంగాణ నాలుగోస్థానంలో, ఆంధ్రప్రదేశ్ ఐదోస్థానంలో ఉన్నాయి. తెలంగాణలో 485 బ్లాక్ స్పాట్లలో సంభవించిన 3,965 రోడ్డు ప్రమాదాల్లో 1,672 మంది దుర్మరణం చెందారు. ఏపీలోని 466 బ్లాక్ స్పాట్లలో 2,202 రోడ్డు ప్రమాదాల్లో 1,273 మంది ప్రాణాలు విడిచారు.

బ్లాక్ స్పాట్ అంటే..

భారతీయ రోడ్ రవాణా మంత్రిత్వ శాఖ ప్రకారం.. ఏదైనా జాతీయ రహదారి 500 మీటర్ల పరిధిలో గడిచిన మూడేళ్లలో అత్యంత దారుణ ప్రమాదాలు 5 జరిగి దానిలో 10 మందికిపైగా మరణించినా లేదా తీవ్రంగా గాయపడినా దానిని బ్లాక్‌స్పాట్‌గా గుర్తిస్తారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP) and Printed at Jagati Publications Limited, Survey no 481 phase-2, Jawahar Auto Nagar, Vijaywada, NTR District - 520 007 (AP)., Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 0866-2547436 Fax: No. 0866-2547433. RNI Reg No. APTEL/2008/23794.